ఈనాడు

విజయవాడ 17-8-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 8
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 16+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



అలాస్కాలోని యాంకరేజ్‌లో జరిగిన చర్చల్లో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్, విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు

నేరుగా ఒప్పందమే ఉత్తమం

- రష్యా - ఉక్రెయిన్‌లు దానిపై దృష్టి నిలపాలి
- కాల్పుల విరమణతో ప్రయోజనం లేదు: ట్రంప్
- రేపు అగ్రరాజ్యాధిపతిని కలవనున్న జెలెన్‌స్కీ
- ఒప్పందం లేకుండానే ముగిసిన ట్రంప్-పుతిన్ భేటీ

వాషింగ్టన్, కీవ్: ఉక్రెయిన్, రష్యాలు నేరుగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే ఆ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చినా అది నిలబడే అవకాశాలు తక్కువేనన్నారు. మూడున్నరేళ్లకు పైగా సాగుతున్న యుద్ధాన్ని విరమింపజేసేందుకు అలాస్కా వేదికగా రష్యా అధినేత పుతిన్‌తో అగ్రరాజ్యాధిపతి శుక్రవారం రెండున్నర గంటలసేపు భేటీ అయినా ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఈ విషయంలో తాము విఫలమైనట్లు నేతలిద్దరూ అంగీకరించారు. చర్చలు మాత్రం సానుకూలంగా సాగినట్లు తెలిపారు. తదుపరి సమావేశం కోసం మాస్కోకు రావాలని ట్రంప్‌ను పుతిన్ ఆహ్వానించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం వాషింగ్టన్‌లో ట్రంప్‌తో భేటీ కానున్నారు. దానిలో ఏదైనా ముందడుగు (మిగతా 2లో)

ఇంజినీరింగ్‌లో నాలుగో వంతు సీట్లు ఖాళీ

- కన్వీనర్ కోటాలో మిగిలిపోయినవే 22.27%
- అర్హులు 1.28 లక్షలు.. సీట్లు 1.53 లక్షలు
- యాజమాన్య కోటా కలిపితే మరింత పెరగనున్న సంఖ్య

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్లు నాలుగో వంతు ఖాళీగా ఉండిపోనున్నాయి. కన్వీనర్ కోటాలో విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉండడంతో 34,298 సీట్లు మిగిలిపోయాయి. విశ్వవిద్యాలయాల్లోనూ 1,361 సీట్లు ఖాళీగా ఉన్నాయి. యాజమాన్య కోటా కలిపితే ఈ సంఖ్య మరింత భారీగా పెరుగుతుంది. ప్రభుత్వ కన్వీనర్ కోటా సీట్లకు సాంకేతిక విద్యా శాఖ రెండు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించింది. రెండు విడతలు పూర్తయిన తర్వాత చూస్తే.. ప్రైవేట్ కళాశాలల్లో ఏకంగా 31,811 సీట్లలో ఎవరూ చేరలేదు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనూ 1,126 సీట్లు మిగిలాయి. కౌన్సెలింగ్‌కు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉన్నాయి. ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన



విద్యార్థులు 1,84,248 మంది ఉండగా.. వీరిలో కన్వీనర్ కోటాలో చేరేందుకు రిజిస్టర్ చేసుకున్నవారు 1,29,012 మంది. వీరిలో అర్హత సాధించినవారు 1,28,712 మంది. కానీ ప్రైవేటు వర్సిటీలు, కళాశాలలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో కలిపి కన్వీనర్ కోటా కింద 1,53,964 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కౌన్సెలింగ్‌కు అర్హత సాధించిన వారందరికీ సీట్లు కేటాయించినా 25 వేలకు పైగా మిగిలే పరిస్థితి. కొంత మంది అభ్యర్థులు కోరుకున్న కళాశాలల్లో సీట్లు పొందకపోవడంతో మిగులు సంఖ్య మరింత పెరిగింది.

యాజమాన్య కోటా కలిపితే..

ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా 70% కాగా యాజమాన్య కోటా 30% ఉంటుంది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఇది 35%, 65%గా ఉంది. యాజమాన్య కోటా సీట్లలోనూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) మినహా మిగతా బ్రాంచిల్లో సీట్లు భారీగా మిగిలాయి. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సీట్లు, కొత్త కళాశాలల మంజూరుపై నిషేధం ఎత్తివేసింది. మౌలిక సదుపాయాలు చూపిస్తే సీట్లు మంజూరు చేస్తోంది.

- డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో వంద శాతం సీట్లను యాజమాన్యమే భర్తీ చేసుకుంటోంది. ఏఐసీటీఈ డీమ్డ్ టు బీ వర్సిటీలకు కొత్త అనుమతులు ఇస్తోంది. చాలామంది వీటిలోనూ ప్రవేశాలు పొందుతున్నారు. ఆయా వర్సిటీలు ప్రత్యేకంగా పరీక్షలు (మిగతా 2లో)

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలొచ్చే కోర్సుల్లోనే..

విద్యార్థులు ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటికి సంబంధించిన బ్రాంచిల్లోనే చేరుతున్నారు. ఎంతో కొంత కొలువులొచ్చే అవకాశం ఉండటంతో సాధారణ డిగ్రీల కంటే ఇంజినీరింగ్‌లోనే ఏటేటా ప్రవేశాలు పెరుగుతున్నాయి. 2021లో 80 వేల మంది ఇంజినీరింగ్‌లో చేరగా.. 2024కు వచ్చే సరికి ఈ సంఖ్య 1.16 లక్షలకు పెరిగింది. ఈ ఏడాది రెండు విడతల్లో కలిపి 1,19,666 మందికి సీట్లు కేటాయించారు.



వర్షాలు కురుస్తున్నాయ్..

కొన్ని చోట్లే!

పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు

పెరిగిన పొడి వాతావరణ రోజులు

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదైంది. కానీ కొన్ని ప్రాంతాల్లో వాన జాడ లేదు. తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, పశ్చిమగోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని కొన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. భారత వాతావరణ (మిగతా 2లో)

రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదు

- అది అధికార పరిధిలోకి చొరబడటమే
- కోర్టులు రాజ్యాంగాన్ని సవరించలేవు
- సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ

దిల్లీ: ఒక రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడానికి గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించడం రాజ్యాంగపరమైన గందరగోళానికి దారితీస్తుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అలా చేయడం ఒక ప్రభుత్వాంగం తనకు రాజ్యాంగం ఇవ్వని అధికారాన్ని అందిపుచ్చుకొని చలాయించినట్టవుతుందని పేర్కొంది. "రాజ్యవ్యవస్థలోని ఒక అంగం వైఫల్యం, నిష్క్రియ లేదా తప్పిదాన్ని సాకుగా చూపి మరో అంగం రాజ్యాంగం తనకు దఖలు పరచని అధికారాన్ని చలాయించడం సాధ్యం కాదు. ప్రజా ప్రయోజనం పేరుతోనో, వ్యవస్థాగత అసంతృప్తి పేరుతోనో, రాజ్యాంగ విలువల పేరుతోనో మన రాజ్య వ్యవస్థలోని ఒక అంగం మరో అంగానికి సంబంధించిన అధికారాలను కబళిస్తే అది రాజ్యాంగ పరమైన గందరగోళానికి దారి తీస్తుంది. మన రాజ్యాంగ నిర్మాతలు అలాంటి పరిస్థితిని ఊహించలేదు" అని కేంద్రం కోర్టుకు నివేదించింది. శాసనసభ నివేదించిన బిల్లుల్ని గవర్నర్ తొక్కి పెడుతున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలుచేసిన వ్యాజ్యానికి స్పందనగా దేశ అత్యున్నత న్యాయస్థానం గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు విధించడం రాజ్యాంగం ఏర్పాటుచేసిన సమతుల్యతకు, చట్టపాలనకు విఘాతం కలిగిస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరఫున కోర్టుకు విన్నవించారు.

"ఒక వ్యవస్థలో లోపాలేవైనా ఉన్నట్టు భావిస్తే రాజ్యాంగం అనుమతించిన యంత్రాంగం సాయంతో వాటిని పరిష్కరించాలి. ఎన్నికైన ప్రజా



ప్రతినిధుల జవాబుదారీ తనం, కార్యనిర్వాహక వర్గ బాధ్యతల నిర్వహణ, పై స్థాయి వ్యవస్థకు సమస్యల నివేదన, ప్రజాస్వామ్య విభాగాల మధ్య సంప్రదింపులు వంటివి సమస్యల పరిష్కారానికి ఉపయోగపడగల యంత్రాంగాలు" అని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 142వ అధికరణం తన ముందున్న అంశానికి సంబంధించి (మిగతా 2లో)

21న సీఎం దిల్లీ పర్యటన

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు ఈ నెల 21న దిల్లీ వెళ్లనున్నారు. అదే రోజు ఉదయం ఆయన అధ్యక్షతన సచివాలయంలో జరగనున్న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ముగిశాక దిల్లీకి బయల్దేరి వెళ్తారు. 22న పలువురు కేంద్ర మంత్రుల్ని కలిసి రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, నిధులు వంటి అంశాలపై చర్చిస్తారు. ఎకనమిక్ టైమ్స్ ఆధ్వర్యంలో జరిగే వరల్డ్ లీడర్స్ ఫోరం కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు రాత్రి అమరావతి చేరుకుంటారు. ఆదివారం రాత్రి విద్యా, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ దిల్లీ వెళ్లనున్నారు.

ప్రయాణించింది మహిళా లోకం..

ఉచిత బస్సు ప్రయాణానికి విశేష స్పందన లోపలి పేజీలో

శనివారం రాత్రి 9గంటల వరకు 11.47 లక్షల మంది వినియోగం

మొదటి రెండు రోజుల్లోనే మహిళలకు రూ.5 కోట్లకు పైగా ఆదా

ఇదీ సంగతి!



ఏంటా? ఇవి.. ఇంటి అవసరాల కోసం ప్రయాణం చేసిన ఫ్రీ టికెట్లు! ఈ సేవింగ్స్‌తో తర్వాత ఏదైనా నగ కొనుక్కుంటాను!

పాక్ ఉగ్ర సంస్థ సానుభూతిపరుడి అరెస్ట్

- జైషే మహమ్మద్ సహా పలు సంస్థలతో వాట్సప్ గ్రూపుల్లో సభ్యుడు
- ధర్మవరంలో కలకలం

ఈనాడు - పుట్టపర్తి, న్యూస్‌టుడే - ధర్మవరం: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో శనివారం ఉదయం కలకలం రేగింది. పాకిస్థాన్ ఉగ్రవాద సానుభూతిపరుణ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరంలోని లోనికోటకు చెందిన నూర్ మహమ్మద్ (40)కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం భార్యాబిడ్డలతో విడిపోయి తల్లి, చెల్లెలితో కలిసి నివసిస్తున్నాడు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వీధిలో ఉన్న సల్మాన్ బిర్యానీ, టీ హోటల్‌లో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అతని కదలికలపై అనుమానం వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఉగ్రవాదానికి ఆకర్షితుడై.. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థలకు చెందిన పలు వాట్సప్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. స్థానిక యువతను ఉగ్రవాదం



నూర్ మహమ్మద్

వైపు ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అతడి ఇంట్లో సోదాలు చేయగా ఉర్దూలో ఉన్న ఉగ్ర సాహిత్య పుస్తకాలు, రెండు సిమ్ కార్డులు, ఒక సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి.

నాలుగు రోజుల నుంచే?

నూర్ మహమ్మద్ కదలికలపై అనుమానం వచ్చిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), కౌంటర్ ఇంటెలిజెన్స్ (మిగతా 6లో)

రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదు

(మొదటి పేజీ తరువాయి)

పరిపూర్ణ న్యాయం అందించేందుకు కోర్టుకు అధికారం ఇస్తోంది. అయితే ఆ అధికరణం(గవర్నర్‌) "సమ్మతిని" సృష్టించే అధికారాన్ని కోర్టుకు ఇవ్వడం లేదు. కోర్టులు సమ్మతిని సృష్టిస్తే అది రాజ్యాంగ, శాసన వ్యవస్థలను తల కిందులు చేసినట్టవుతుంది అని కేంద్ర ప్రభుత్వం తరఫున సమర్పించిన నివే దనలో సొలిసిటర్‌ జనరల్‌ పేర్కొన్నారు.

న్యాయస్థానాల జోక్యం సరికాదు

"రాష్ట్రపతి, గవర్నర్లు రాజకీయంగా అత్యున్నత స్థాయిని కలిగి ఉన్నారు. ప్రజాస్వామ్య పరిపాలనలో అత్యున్నత విలువలకు వారు ప్రతినిధులు. వారికి సంబంధించినంత వరకూ ఏవైనా లోపాలు ఉంటే వాటిని రాజకీయ, రాజ్యాంగ పరమైన యంత్రాంగాల సాయంతో పరిష్కరించుకోవాలి. ప్రతి విషయంలోనూ న్యాయస్థానాల జోక్యం తప్పనిసరి కాదు" అని తుషార్‌ మెహతా కోర్టుకు వివరించారు. శాసనసభ ఆమోదించి గవర్నర్‌కు నివేదించిన బిల్లులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెల్లడించిన తీర్పును ఆయన సవాలు చేశారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్‌కు నివేదించడానికి సంబంధించి 200వ రాజ్యాంగ అధికరణం, బిల్లును రాష్ట్రపతి పరిశీలనకై రిజర్వు చేయడాన్ని నిర్దేశించే 201వ అధికరణం ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధించలేదని సొలిసిటర్‌ జనరల్‌ తెలిపారు. ఏదైనా నిర్ణయం తీసుకోడానికి నిర్దిష్ట గడువు ఉండాలని రాజ్యాంగం భావించినప్పుడు రాజ్యాంగం స్పష్టంగా ఆ గడువు ఎంతన్నది పేర్కొంటుంది. అలాంటి నిర్దిష్ట గడువేదీ విధించనప్పుడు అందుకు సంబంధించిన అధికారాల వినియోగంలో కొంత సడలింపు ధోరణి ప్రదర్శించాలన్నది రాజ్యాంగం అభిమతం. లేని గడువును విధించడం రాజ్యాంగాన్ని సవరించడమే అవుతుంది అని కేంద్రం స్పష్టంచేసింది.

శాసననిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ప్రభుత్వం సమతులంగా ముందుకు సాగడానికి ఉద్దేశించినవే అయినా అవి ఒకదాని అధికారాల్లోకి మరొకటి చొరబడలేవు. రాష్ట్రపతికి, గవర్నర్లకు ఉన్న అధికారాలు అలా చొరబాటుకు వీల్లేనివి అని ప్రభుత్వం తెలిపింది. రాజ్యాంగంలోని 200వ, 201వ అధికరణాల కింద రాష్ట్రపతికి, గవర్నర్లకు ఉన్న అధికారాలకు సంబంధించిన 14 ప్రశ్నల్ని రాష్ట్రపతి మే 13న సుప్రీంకోర్టుకు సమర్పించి వాటిపై కోర్టు నుంచి న్యాయసలహా కోరిన విషయం విదితమే. తమిళనాడు గవర్నర్‌ ఆర్‌.ఎన్‌. రవి ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన 10 బిల్లుల్ని తొక్కి పెట్టిన ఉదంతంపై దాఖలైన వ్యాజ్యానికి స్పందిస్తూ సుప్రీంకోర్టు ఆయా బిల్లులపై నిర్దిష్ట గడువు లోగా చర్యలు తీసుకోవాలని తీర్పు వెలువరించింది. రాష్ట్రపతికి, గవర్నర్లకు కోర్టు గడువు విధించవచ్చా అన్న అంశంపై రాష్ట్రపతి అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని కోరుతూ 14 ప్రశ్నలను నివేదించారు.

వైఎస్‌ భారతి కూడా ఉచితంగా ప్రయాణించొచ్చు: పీతల సుజాత

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్‌ సతీమణి భారతిరెడ్డి కూడా స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చని మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్‌ పీతల సుజాత తెలిపారు. కానీ ఆమెకు రాష్ట్రంలోని చిరునామాతో ఉన్న ఆధార్‌ కార్డో, గుర్తింపు కార్డో ఉండాలన్నారు. ఉచిత బస్సు పథకంపై విమర్శలు చేయడం వైకాపా నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని శనివారం మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో మండిపడ్డారు.

డీఏ బకాయిలపై న్యాయ పోరాటం: ఏపీ సీపీఎస్‌ఈఏ

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏ బకాయిలపై హైకోర్టును ఆశ్రయించినట్లు ఏపీ సీపీఎస్‌ఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్‌, కరిమి రాజేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఏడేళ్లుగా సీపీఎస్‌ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించడం లేదు. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదు. ఉద్యోగుల మేలు కోసం సీపీఎస్‌ఈఏ న్యాయ పోరాటానికి సిద్ధమైంది' అని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్‌లో నాలుగో వంతు సీట్లు ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించుకుంటున్నాయి. సీఎస్‌ఈ బ్రాంచికి డిమాండ్‌ ఉండడంతో ఇప్పుడు అన్ని విద్యా సంస్థల్లోనూ ఈ సీట్లే అధికంగా ఉన్నాయి.

- ఈఏపీసెట్‌లో టాప్‌ ర్యాంకులు సాధించిన విద్యార్థులు స్థానికంగా ప్రవేశాలు పొందడం లేదు. ఎన్‌ఐటీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీలు లేదా ఇతర రాష్ట్రాల్లోని పేరొందిన వర్సిటీలు, కళాశాలల్లో చేరుతున్నారు. ఈఏపీసెట్‌లో 200 లోపు ర్యాంకుల్లో ఇద్దరు, టాప్‌-500 ర్యాంకుల్లో 12 మంది మాత్రమే కౌన్సెలింగ్‌లో పాల్గొనడమే ఇందుకు నిదర్శనం.

సమగ్రశిక్షా అభియాన్‌ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఆర్ట్‌, క్రాఫ్ట్‌, పీఈటీల సమస్యలు పరిష్కరించాలని ఆర్ట్‌, వర్క్‌, హెల్త్‌, పీఈ పార్ట్‌టైమ్‌ కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్స్‌ సమాఖ్య గౌరవాధ్యక్షుడు దేవేంద్రరావు విజయవాడలో నిర్వహించిన సమావేశంలో కోరారు.

నేరుగా ఒప్పందమే ఉత్తమం

(మొదటి పేజీ తరువాయి)

పడుతుందా అనేది తేలాల్సి ఉంది. "ఒప్పందం చేసుకోవాలని జెలెన్‌స్కీకి సూచిస్తా. దానికి ఆయన నిరాకరించే అవకాశం ఉంది. రష్యా చాలా శక్తిమంతమైనది. పుతిన్‌-జెలెన్‌స్కీల సమావేశం సాధ్యమవుతుందని ఆశిస్తున్నా. అందులో నేను కూడా చేరే అవకాశం ఉంది" అని ట్రంప్‌ పేర్కొన్నారు.

అన్నీ సవ్యంగా సాగితే పుతిన్‌-జెలెన్‌స్కీ మధ్య భేటీ

చర్చలపై ట్రూత్‌ సోషల్‌ వేదికగా ట్రంప్‌ స్పందించారు. "అలాస్కాలో ఎంతో విజయవంతమైన రోజు. పుతిన్‌తో సమావేశం చాలా బాగా జరిగింది. జెలెన్‌స్కీ, నాటో సెక్రెటరీ జనరల్‌, ఇతర ఐరోపా నేతలతో వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడాను. నేరుగా శాంతి ఒప్పందానికి వెళ్లడం మేలనే నిర్ణయానికి వచ్చాం. అన్నీ సవ్యంగా సాగితే.. పుతిన్‌తో జెలెన్‌స్కీ సమావేశాన్ని షెడ్యూల్‌ చేస్తాం. తద్వారా లక్షలాది ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భేటీలో అనేకాంశాలు చర్చకు వచ్చాయని, ఎంతో పురోగతి ఉందని చెప్పారు. తుది ఒప్పందం మాత్రం కుదరలేదన్నారు. అలాస్కాలో సమావేశం అనంతరం విమానంలో తిరుగు ప్రయాణమవుతూ జెలెన్‌స్కీతో ట్రంప్‌ దాదాపు గంటన్నరసేపు ఫోన్లో మాట్లాడారు. ఈ విషయాన్ని ఎక్స్‌ వేదికగా జెలెన్‌స్కీ ప్రస్తావించారు. "సుదీర్ఘంగా, సమగ్రంగా చర్చించుకున్నాం. శాంతి ఒప్పందానికి సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని పునరుద్ఘాటించాం. ఐరోపాను కూడా భాగస్వామ్యం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాను" అని వెల్లడించారు. పుతిన్‌తో చర్చించిన ముఖ్య విషయాలను ట్రంప్‌ తనకు చెప్పారని తెలిపారు. త్రైపాక్షిక సమావేశం జరగాలన్న ప్రతిపాదనకు తాను మద్దతిస్తున్నట్లు చెప్పారు. పరిస్థితులను చక్కదిద్దే బలం అమెరికాకు ఉందన్నారు. విమాన ప్రయాణంలోనే నాటో నేతలతోనూ అమెరికా అధ్యక్షుడు ఫోన్లో మాట్లాడారు.

భేటీ నిర్మాణాత్మకం: పుతిన్‌

ట్రంప్‌తో భేటీ చాలా నిర్మాణాత్మకంగా జరిగిందని, ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు తాను చిత్తశుద్ధితో ఉన్నానని పుతిన్‌ పేర్కొన్నారు. వివాదానికి మూలాలు పెకలించేందుకు ఈ సమావేశం శ్రీకారం చుట్టిందన్నారు. 2022లో ట్రంప్‌ అధికారంలో ఉండి ఉంటే ఉక్రెయిన్‌తో రష్యాకు యుద్ధం వచ్చి ఉండేది కాదని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్‌ సమస్యను పరిష్కరించడానికే కాకుండా రష్యా-అమెరికా మధ్య వాణిజ్య తరహాలో, ఆచరణీయ సంబంధాల పునరుద్ధరణకు ఈ భేటీ దోహదపడుతుందని పేర్కొన్నారు. భేటీ ముగిశాక ఇరువురు నేతలు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడతారని భావించినా ఏ ప్రశ్నలకూ సమాధానాలు ఇవ్వకుండా వెళ్లిపోయారు. వాషింగ్టన్‌ చేరుకున్నాక విమానాశ్రయంలో ప్రశ్నలు సంధిస్తున్న విలేకరులతో మాట్లాడకుండానే ట్రంప్‌ వెళ్లిపోయారు. ఉక్రెయిన్‌ విషయంలో గట్టి ఒత్తిడి తెచ్చే బదులు అమెరికా ప్రయోజనాల పరిరక్షణపైనే ట్రంప్‌ ప్రధానంగా దృష్టి నిలిపారా అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

యుద్ధవిమాన మోహరింపు.. ఒకే వాహనంలో ప్రయాణం

ట్రంప్‌, పుతిన్‌ల సమావేశం సామరస్యపూర్వకంగా సాగింది. అలాస్కాలోని జాయింట్‌ బేస్‌ ఎల్మెండార్ఫ్‌-రిచర్డ్‌సన్‌ సైనిక స్థావరానికి తొలుత ట్రంప్‌ చేరుకున్నారు. కాసేపటి తర్వాత పుతిన్‌ రాగానే ట్రంప్‌ ఆత్మీయంగా స్వాగతం పలికారు. కరచాలనం చేసి చిరునవ్వుతో పలకరించారు. ఈ సందర్భంగా ట్రంప్‌ తమ సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. పోడియం వద్దకు వీరిద్దరూ వెళ్తుండగా.. పైనుంచి బీ-2 బాంబర్లు, ఎఫ్‌-22 వంటి యుద్ధవిమానాలు ప్రయాణించాయి. కాన్వాయ్‌ వెళ్లే మార్గంలోనూ యుద్ధ విమానాలను సిద్ధంగా ఉంచారు. వీరి భేటీ సందర్భంగా మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా పుతిన్‌ ఎక్కడికి వెళ్లినా తన సొంత వాహనాలను తీసుకెళ్తుంటారు. అలాస్కాకు కూడా మాస్కో నుంచి వాహనశ్రేణి చేరుకుంది. అయితే కాకుండా.. ట్రంప్‌తో కలిసి అమెరికా అధ్యక్షుడి 'బీస్ట్‌' వాహనంలో పుతిన్‌ ప్రయాణించడం ఆశ్చర్యపరిచింది. 10 నిమిషాల ఈ ప్రయాణంలో ట్రంప్‌ మాట్లాడుతుండగా పుతిన్‌ నవ్వుతూ కన్పించారు. రష్యా-అమెరికా సంబంధాలు చాలా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొన్నాయని చెప్పిన పుతిన్‌.. ప్రస్తుతం ఇరు దేశాలు నేరుగా సత్సంబంధాలు ఏర్పరచుకున్నాయని తెలిపారు. ట్రంప్‌ చొరవను ప్రశంసించారు. ఉక్రెయిన్‌కు భద్రత కల్పించాలన్న వాదనతో



అలాస్కాలోని యాంకరేజ్‌లో ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన చర్చల్లో పాల్గొనేందుకు బీ-2 బాంబర్‌ సమీపం నుంచి వెళ్తున్న పుతిన్‌, ట్రంప్‌

తాను ఏకీభవిస్తున్నట్లు చెప్పారు. జెలెన్‌స్కీతో భేటీ అయ్యేందుకు వ్యతిరేకం కాదని, కొన్ని షరతులకు మాత్రం తప్పనిసరిగా అంగీకరించాలన్నారు. పుతిన్‌ను పాశ్చాత్య దేశాలు దూరంగా పెట్టడానికి తాజా సమావేశం తెరదించిందని రష్యా వర్గాలు పేర్కొంటున్నాయి. ఎలాంటి బెదిరింపులు, హెచ్చరికలు లేకుండా ఈ భేటీ ముగిసిందని తెలిపాయి. చర్చల్లో ఇరు దేశాల విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రత సలహాదారులు పాల్గొన్నారు.

భారత్‌పై అదనపు సుంకాల భారం ఉండకపోవచ్చు

న్యూయార్క్‌: రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అదనంగా సెకండరీ టారిఫ్‌లను తాము విధించకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ సంకేతాలిచ్చారు. ఈ అంశంపై పునరాలోచన చేస్తానని వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కీలక భేటీ ముగిశాక విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ రోజు జరిగిన పరిణామాల తర్వాత.. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అదనపు సుంకాల గురించి ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని నేను అనుకోవడం లేదు. దీనిపై రెండు, మూడు వారాల్లో పునరాలోచన చేస్తా. ప్రస్తుతానికి సమావేశం సాఫీగా జరిగింది" అని ట్రంప్‌ వెల్లడించారు. పుతిన్‌తో భేటీకి ముందు కూడా ట్రంప్‌ దీని గురించి ప్రస్తావించారు. భారత్‌ను ఉద్దేశిస్తూ రష్యా తన చమురు క్లయింట్‌ను కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి భారత్‌, చైనా లాంటి దేశాలపై అదనపు టారిఫ్‌ల విధింపు ఉద్దేశం లేనట్లు. "ఒకవేళ అదనపు సుంకాలు విధించాల్సి వస్తే విధిస్తా. అయితే ఆ అవసరం రాకపోవచ్చు" అని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు కారణంతో ఇటీవల భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్‌ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీనిపై అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్‌ బెసెంట్‌ మాట్లాడుతూ.. పుతిన్‌తో భేటీ సవ్యంగా సాగకపోతే.. భారత్‌పై అదనపు సుంకాలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. మరోవైపు, ఉక్రెయిన్‌పై యుద్ధం ముగించకపోతే రష్యాపైనా 100శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్‌ గతంలో తెలిపారు. ఈ పరిణామాల వేళ పుతిన్‌తో భేటీ తర్వాత టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

వర్షాలు కురుస్తున్నాయ్‌.. కొన్ని చోట్లే!

(మొదటి పేజీ తరువాయి)

విభాగం (ఐఎండీ) గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో సగటు సాధారణ వర్షపాతం 298.8 మిల్లీమీటర్లు కాగా.. 4% ఎక్కువ (311.6 మి.మీ.) కురిసింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సొసైటీ వెబ్‌సైట్‌ ప్రకారం.. రాష్ట్రంలో సగటున 348 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా.. 317.1 మి.మీ. అంటే లోటు వర్షపాతం నమోదైంది.

ఎత్తయిన ప్రాంతాల్లోనే

భౌగోళికంగా రాష్ట్రం సబ్‌-హ్యూమిడ్‌ జోన్‌లో ఉంది. ఇక్కడ తరచూ వర్షాలు, పొడి వాతావరణం ఉంటుంది. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో తరచూ కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. మైదాన ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండగా.. ఎత్తయిన, కొండప్రాంతాల్లో పొడి వాతావరణం ఉంటోంది. అల్పపీడనాలు ఏర్పడినప్పుడు అక్కడ వర్షం కురిసినా.. ప్రవాహం లోతట్టు ప్రాంతాలకు వెళ్లిపోతుంది. గతంలో ఐఎండీ చేపట్టిన అధ్యయనం ప్రకారం.. నైరుతి సీజన్‌లో ఉమ్మడి కర్నూలు, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో పొడి వాతావరణం నెలకొనే రోజులు పెరుగుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో రాయలసీమలో వర్షం కురుస్తున్న రోజులు పెరుగుతుండగా.. కోస్తా జిల్లాల్లో తగ్గుతున్నాయి.

వచ్చే వారం సాధారణ స్థితికి

సెప్టెంబరులో రాయలసీమలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాబోయే రోజుల్లో అనంతపురం, వైఎస్సార్‌ కడప జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతం నెలకొనే పరిస్థితులున్నాయి. 'రుతుపవనాల సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతం సాధారణమే. వచ్చే వారంలో కురిసే వర్షాలతో ఉత్తర కోస్తా తదితర జిల్లాలు లోటు వర్షపాతం నుంచి సాధారణ స్థితికి వచ్చే అవకాశముంది. తమిళనాడు, దక్షిణ కోస్తా తీరంలో అల్పపీడనం ఏర్పడితేనే నెల్లూరులో వర్షాలు కురుస్తాయి' అని ఐఎండీ మాజీ డైరెక్టర్‌ జనరల్‌ డా.కేజే రమేశ్‌ వివరించారు.

పదో తరగతి పరీక్షలు తెలుగులో రాసుకునే అవకాశం

- మంత్రి లోకేశ్‌ హామీ ఇచ్చినట్లు ప్రకటించిన ఆపస్‌

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్‌ పరీక్షలను తెలుగు మాధ్యమంలోనూ రాసుకునే అవకాశం కల్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ హామీ ఇచ్చినట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్‌) ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కొనసాగించాలని మంత్రిని కోరగా.. కొన్ని పాఠశాలల్లోనైనా కొనసాగించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారని వెల్లడించింది. ఉండవల్లిలోని నివాసంలో శనివారం మంత్రి లోకేశ్‌ను ఆపస్‌ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌.బాలాజీ, జీవీ సత్యనారాయణ, కోశాధికారి సురేష్‌ కుమార్‌, ఉపాధ్యక్షులు సునీత కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెల ఒకటిన పాఠశాలల్లో నిర్వహించే 'మై స్కూల్‌.. మై ప్రైడ్‌' పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆపస్‌ ప్రతినిధులు తెలిపారు. డీఎస్సీ-2003 వారికి పాత పింఛను అమలును త్వరగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. "హైస్కూల్‌ ప్లస్‌లు కొనసాగిస్తామని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా త్వరలో పీజీటీల నియామకం చేపడతామని మంత్రి తెలిపారు. అంతర జిల్లా బదిలీలు త్వరలోనే చేపడతామన్నారు. డీఈవో పూల్‌లో ఉన్న పండితులు, పీఈటీల పదోన్నతుల విషయంలో ఉన్న ఇబ్బందులు తొలగిస్తామని, త్వరలో పదోన్నతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని కోరగా.. సెప్టెంబరు 5 తర్వాత నిర్వహిస్తామని మంత్రి తెలిపారు" అని పేర్కొన్నారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్‌ మాధవ్‌ చేస్తున్న 'సారథ్యం' పర్యటనలు రెండో విడత ఈనెల 18 నుంచి ప్రారంభమవుతాయని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీవారి దర్శనానికి దళారీ ఏల?

నకిలీ వెబ్‌సైట్లు, లింకులతో మోసగాళ్ల గాలం

చిక్కితే డబ్బులు పోయే, కేసులు మిగిలే..

ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌ బుకింగ్‌నే నమ్ముకోండి: తితిదే



పెద్దింటి ప్రభాకరాచార్యులు అనే వ్యక్తి వైష్ణవ యాత్రాస్‌ పేరుతో ఫేస్‌బుక్‌ పేజీ నడుపుతూ అందులోని సభ్యులకు శ్రీవారి అభిషేకం, ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్‌, రూ.300 టికెట్లు ఇప్పిస్తానని మోసగిస్తున్నాడు. ఈ విషయాన్ని తితిదే గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టింది.

తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి విజయ్‌ తన మిత్రుడి ద్వారా బాలాజీ అనే దళారీని సంప్రదించాడు. అతను అభిషేకం, తోమాల సేవల పేరిట నకిలీ టికెట్లు అంటగట్టి రూ.65 వేలు వసూలు చేశాడు. మోసపోయామని గుర్తించిన భక్తులు పోలీసులను ఆశ్రయించారు.

తిరుమల, న్యూస్‌టుడే

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవాలన్న భక్తులకు వివిధ రూపాల్లో దళారులు ఎర వేస్తున్నారు. నిలువునా మోసగిస్తున్నారు. కొందరు యాత్రికులు తితిదే నిర్దేశించిన పద్ధతుల్లో కాకుండా స్నేహితులు, బంధువులను సంప్రదించడం, వారు తమకెప్పుడో తెలిసిన వారిని వీరికి పరిచయం చేయడం, సదరు వ్యక్తులు దళారులుగా మారి భక్తులను దోచుకోవడం.. నిత్యకృత్యమైంది. కేటుగాళ్లు తితిదే ఉద్యోగులుగా, రాజకీయ నాయకులుగా, ప్రజాప్రతినిధుల పీఆర్వోలుగా నకిలీ ఐడీలు సృష్టించుకొని వాట్సప్‌, ఫేస్‌బుక్‌, ఇన్‌స్టాలో లింకులు పంపిస్తున్నారు. దర్శనం, ఆర్జిత సేవలు, కాటేజీల బుకింగ్‌కు సంప్రదించాలంటూ సూచిస్తున్నారు. నమ్మించి భారీగా సొమ్ము లాగేస్తున్నారు. ఆనక ఫోన్‌కూ దొరక్కుండా తప్పించుకుంటున్నారు. కొందరు నకిలీ టికెట్లు సృష్టించి, అంటగడుతున్నారు. వాటిని నమ్ముకొని తిరుమలకు వచ్చిన భక్తులు క్యూలైన్‌లోకి వెళ్లాక తనిఖీల్లో దొరికిపోతున్నారు. అటు డబ్బులు పోయి, ఇటు స్వామివారి దర్శనం లభించక, పోలీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తిరుమల సమాచారాన్ని గూగుల్‌లో సెర్చ్‌ చేసే వారికి బోలెడన్ని వెబ్‌సైట్లు కన్పిస్తాయి. తితిదే అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ సైట్లు సృష్టించిన సైబర్‌ మోసగాళ్లు వీరికి వల విసురుతున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో ఇటీవల 30కి పైగా నకిలీ వెబ్‌సైట్లను గుర్తించి, వాటిని గూగుల్‌ సెర్చ్‌ ఇంజిన్‌ నుంచి తొలగించారు. తిరుమలలోని ప్రధాన కాటేజీలు సప్తగిరి, ఎస్వీ, శంఖుమిట్ట, అన్నమయ్య గెస్ట్‌హౌస్‌ల పేర్లతో 32 ఫేక్‌ వెబ్‌సైట్లు ఉన్నట్లు గుర్తించి, 28 సైట్‌లను పూర్తిగా తొలగించారు. వీటిపై ఆయా వెబ్‌సైట్‌ డొమైన్స్‌ నిర్వాహకులకు లేఖలు రాశారు. వాటిలో గోడాడీ.కామ్‌, ఎల్‌ఎల్‌సీ, హోస్ట్‌ఇంజర్‌, హోస్ట్‌ఇంజర్‌ ఆపరేషన్స్‌, యూఏబీ, ఇన్‌2నెట్‌వర్క్‌ ఐఎన్‌సీ, ఓన్‌ వెబ్‌ సొల్యూషన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, పబ్లిక్‌ డొమైన్‌ రిజిస్ట్రీ వంటివి ఉన్నాయి. సైబర్‌ నేరాల కట్టడికి ప్రత్యేక బృందాలను నియమించారు. ఇక, తిరుమలలోని ప్రధాన కార్యాలయాలు, గదుల కేటాయింపు కేంద్రాల వద్ద దళారుల కార్యకలాపాలపై తితిదే విజిలెన్స్‌, పోలీసు విభాగాలు సంయుక్తంగా నిఘా పెట్టాయి. వీఐపీ బ్రేక్‌, ఆర్జిత సేవలకు వచ్చే భక్తుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నాయి.

అధికారిక సైట్‌లోనే బుక్‌ చేసుకోవాలి

–కేవీ మురళీకృష్ణ, సీవీఎస్‌వో, తితిదే

స్వామివారి దర్శనం, సేవలు, వసతి గదుల కోసం తితిదే మూణ్నెల్ల ముందుగానే ఆన్‌లైన్‌లో టికెట్లు జారీచేస్తుంది. ఆఫ్‌లైన్‌లోనూ తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో ఎస్‌ఎస్‌డీ, దివ్యదర్శన టోకెన్లు పొందొచ్చు. ఏ టికెట్‌ లేకపోయినా, నేరుగా సర్వదర్శనం క్యూలైన్‌లోకి ప్రవేశించవచ్చు. ఆన్‌లైన్‌లో అధికారిక వెబ్‌సైట్‌ https://www.tirumala.org ద్వారా మాత్రమే బుక్‌ చేసుకోవాలి. ఇతర సైట్‌లకు వెళ్లొద్దు. గూగుల్‌లో ఏదైనా గెస్ట్‌హౌస్‌ పేరిట వెబ్‌సైట్‌ ఉందీ అంటే, అది నకిలీగా గుర్తించాలి. వాట్సప్‌ కాల్‌ ద్వారా క్యూఆర్‌ కోడ్‌ పంపించి, పేమెంట్‌ చేయమంటే అంగీకరించొద్దు. దళారులను గుర్తిస్తే విజిలెన్స్‌ టోల్‌ఫ్రీ నంబర్‌ 18004254141, విజిలెన్స్‌ వింగ్‌ 0877-2263828కు, పోలీసు శాఖ డయల్‌ 100కు సమాచారమివ్వాలి. ఇప్పటికే మోసగాళ్లను గుర్తించి, జైళ్లకు పంపుతున్నాం.

ఉట్టిపడిన ఉత్సాహం



కృష్ణాష్టమి సందర్భంగా శనివారం మహారాష్ట్రలోని ఠాణెలో ఉట్టి కొట్టేందుకు పిరమిడ్‌ ఆకారంలో నిల్చున్న యువకులు

గ్రహం అనుగ్రహం

17–8–2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
నవమి: రా. 8-31 తదుపరి దశమి
కృత్తిక: ఉ. 6-46 రోహిణి తె. 5-45 తదుపరి మృగశిర
వర్జ్యం: రా. 9-45 నుంచి 11-15 వరకు
అమృత ఘడియలు: ఉ. 6-01 వరకు, తిరిగి రా. 2-15 నుంచి 3-44 వరకు
దుర్ముహూర్తం: సా. 4-41 నుంచి 5-31 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5.46; సూర్యాస్తమయం: సా.6.22

అంచనాలకు మించి జీఎస్టీ వసూళ్లు!

తొలి నాలుగు నెలల్లోనే 61% ● మొత్తం రెవెన్యూ రాబడి 49 వేల కోట్లు



లెక్కలు వెల్లడించిన కాగ్‌

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ వసూళ్లు అంచనాలకు మించి వస్తున్నాయి. 2025-26 ఏడాది మొత్తానికి రూ.27,477.15 కోట్లు జీఎస్టీ రూపంలో వస్తుందని రాష్ట్ర బడ్జెట్‌ అంచనా వేసింది. అలాంటిది తొలి నాలుగు నెలల్లోనే అందులో 61% వసూళ్లు వచ్చాయి. ఏప్రిల్‌, మే, జూన్‌, జులై నెలల్లోనే రూ.16,754 కోట్ల జీఎస్టీ రాబడి వచ్చింది. కంప్ట్రోలర్‌ అండ్‌ ఆడిటర్‌ జనరల్‌ (కాగ్‌) నాలుగు నెలల నివేదికను తాజాగా విడుదల చేసింది. ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.2,17,976.53 కోట్ల రెవెన్యూ వసూళ్లు అంచనా వేయగా నాలుగు నెలల్లో రూ.49,052 కోట్లు వచ్చాయి. అప్పులతో కూడా కలిపి మొత్తం నాలుగు నెలల్లో ఖజానాకు వచ్చినది సుమారు రూ.లక్ష కోట్లకు చేరింది.

110% మేర రెవెన్యూ లోటు

- రాష్ట్రంలో రెవెన్యూ లోటు తొలి నాలుగు నెలల్లోనే 110 శాతానికి చేరింది. రెవెన్యూ వసూళ్లు రూ.49,052.98 కోట్లు ఉండగా రెవెన్యూ ఖర్చు రూ.85,793.99 కోట్లుగా ఉంది. దీంతో రెవెన్యూ లోటు నాలుగు నెలలకు రూ.36,741.01 కోట్లుగా తేలింది. బడ్జెట్‌ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటును రూ.33,185.97 కోట్లుగా పేర్కొన్నారు.
- నాలుగు నెలల్లో రూ.49,198 కోట్ల మేర ప్రభుత్వం అప్పులు చేసింది.
- మూలధన వ్యయం కింద రూ.8,579.86 కోట్లు ఖర్చుచేశారు.
- నాలుగు నెలల్లో అప్పులపై వడ్డీలు, అప్పుల అసలు చెల్లింపు రూపంలోనే రూ.20వేల కోట్లు ఖర్చుచేయాల్సి వచ్చింది.

రెవెన్యూ రాబడి ఎక్కడి నుంచి ఎలా?

అంశం	అంచనా (ఏడాది మొత్తానికి)	వచ్చిన మొత్తం (4నెలలకు) (రూ.కోట్లలో)
జీఎస్టీ	27,477.15	16,754.91
స్టాంపులు రిజిస్ట్రేషన్ల రాబడి	13,150.44	3,587.56
భూమి శిస్తు	221.94	2.44
అమ్మకపు పన్ను	20,873.65	5,875.10
రాష్ట్ర ఎక్సైజ్‌ సుంకం	27,097.26	5,681.62
కేంద్ర పన్నుల్లో వాటాలు	40,807.28	11,357.81
ఇతర పన్నులు, సుంకాలు	36,945.37	1,791.56
మొత్తం పన్నుల రాబడి	1,66,573.09	45,051.00
పన్నేతర రాబడి	19,119.04	1,803.20
కేంద్ర సాయం	32,284.40	2,198.78
పన్నుల రాబడికి కింది రెండు కలిపితే మొత్తం రెవెన్యూ రాబడి...	2,17,976.53	49,052.98

వాతావరణం


ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తాడేపల్లిగూడెం	34.2	26.4
తిరుపతి	33.8	24.1
విశాఖపట్నం	33.6	26.6
రాజమహేంద్రవరం	33.5	25.0
ఒంగోలు	33.3	27.4
శ్రీకాకుళం	33.0	27.0
అనంతపురం	32.5	23.3
విజయనగరం	32.0	25.0
విజయవాడ	31.1	27.0

అక్షరానికి ఆసరా

అక్షరం అంటే గుండెగుడిలోని దీపానికి ఇంధనం. మనసు ఎదుగుదలకు ఎనలేని సాధనం. అక్షయమైన అక్షర సంపదతో కవులేం చేస్తారో కవి శివారెడ్డి చెప్పారు. 'గోడలకు నోరిస్తారు. చెట్లకు కళ్లిస్తారు. గాలికి గొంతిస్తారు. ప్రజలకు చేతులిస్తారు' అన్నారాయన- 'అజేయం' కవితలో. ఇది లౌకికం. 'అక్షరానికి లక్ష్యం- పారలౌకికం' అంది భారతీయ వాఙ్మయం. 'అవును! అక్షరాలా నిజం' అన్నారు జర్మన్ తత్త్వవేత్త జేడబ్ల్యూ గేథే. కాళిదాసు శాకుంతలాన్ని చదవడం పూర్తిచేస్తూనే- అలౌకిక పారవశ్యానికి లోనై పరమానందంతో నృత్యం చేశారాయన. తన దివ్యానుభూతిని 'విల్ ఇష్ డి బ్లుమెన్...' కవితలో చెబుతూ 'దేవ మానవ లోకాల మధ్య దూరాన్ని చెరిపేసి, రెంటినీ కలిపి ముడేసిన కావ్యం- శాకుంతలం' అని వర్ణించారు. 'ఏకః స్వాదు న భుంజీత...' రుచికరమైన ఆహారాన్ని ఒక్కడే కూర్చొని తినరాదంది శాస్త్రం. అందుకే 'వసంతంలో అరుదుగా పూసే కుసుమ పరిమళాన్ని, గ్రీష్మంలో పొదుపుగా కాసే ఫలమాధుర్యాన్ని ఒకేసారి ఆస్వాదించాలనుకుంటే శాకుంతలాన్ని చదువుకోండి' అని సలహా ఇచ్చారాయన.

వాక్యానికి పరమ ఆకర్షణ శక్తి, రక్తి ఎలా చేకూరుతాయన్న విషయమై గట్టి పరిశోధన చేసినవారిలో కొలంబియాకు చెందిన నికొలాస్ గోమెజ్ డావిలా అగ్రగణ్యులు. 'తన వాక్యాలను హింస పెట్టనివాడు- పాఠకులను హింస పెడతాడు. బాగా ఓపిక పట్టిన రచయిత చేతుల్లోకి పదాలు పావురాల గుంపుల్లా వచ్చి వాలిపోతాయి' అని గోమెజ్ సూచించారు. అదే పావురాల గుంపును 'సాయుధులైన సైనికులు' అన్నారు అద్దేపల్లి రామ్మోహనరావు. 'సమర యోగ్యత గల సైనికులను కవి మూడోకంటితో ఏరుకుని వాక్యాలను నిర్మిస్తాడు' అని చెప్పారు- 'ప్రాణప్రదం' కవితలో. ఈ కఠోర సాధననే 'కవితారూప తపస్సు'గా అభివర్ణించారు విశ్వనాథ. 'పదాలనేవి- పాఠకుల మనసులోకి రచయిత విసిరే గులకరాళ్లు. అవి పుట్టించే తరంగాల పరిధి ఎంతా... అనేది- ఆ కొలను వైశాల్యాన్ని బట్టి ఉంటుంది' అన్న గోమెజ్ వాక్యం సుప్రసిద్ధమైనది. దాన్నే 'వ్యాకోచ వచో విలాసం' అన్నాడు రాజశేఖర చరిత్రలో మాదయగారి మల్లన. అంటే పాఠకుడి అనుభవం, అధ్యయనం, అవగాహన, అంతర్మథనాల ఫలితంగా మానస సరోవరం ఎంతగా విస్తరిస్తే- గొప్ప పదం అంతగా వ్యాకోచిస్తుందని అర్థం. అదీ కవిత్వ సాధన, అధ్యయనాల లక్ష్యం!

కలాలతో కాలాన్ని వెలిగించిన కవుల కావ్యాలను అధ్యయనం చేస్తుంటే కలిగే ఆనందానుభూతి పరమాద్భుతమైనది. కావ్యానందాన్ని రుచి మరిగిన పాఠకుడు కవి కృష్ణశాస్త్రిలా 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అని మారాం చేస్తాడు. శ్రీశ్రీ మాదిరి 'దివ్యానందమయ ప్రపంచమిట మూర్తీభావముం దాల్చి నాకు అవ్యాజ ప్రణయాతిరేకమున తానై స్వాగతం బిచ్చెడిన్' అంటూ మురిసిపోతాడు. పుస్తకమంటే ఒక వస్తువిశేషం కానేకాదు- అది అక్షరదీప వికాసం. కవులు చేసే అక్షరయజ్ఞాలకు- రసజ్ఞుల ఎదల యాగ వాటికల్లోనే పూర్ణాహుతి. సరైన యజ్ఞ సంపూర్తి. ఆ యజ్ఞ ప్రసాదాన్ని 'పుస్తకభత్యం' రూపంలో ప్రభుత్వ ఉద్యోగులకు పంచాలని అస్సాం ప్రభుత్వం సంకల్పించింది. పఠనీయతను పెంపొందించే దిశగా- రచయితలకు పాతికవేల రూపాయల ఆర్థిక ప్రోత్సాహం, ఉద్యోగులందరికీ వెయ్యి రూపాయల పుస్తకభత్యం అందించాలని నిశ్చయించింది. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో కానుకలను పుస్తక రూపంలోనే అందిస్తామని ప్రకటించింది. శ్రేష్ఠులు దేన్ని ఆచరిస్తున్నారో- దాన్ని అనుకరించాలన్న గీతావాక్యాన్ని తక్కిన ప్రభుత్వాలు అనుసరిస్తాయని ఆశిద్దాం!



స్వరలయలు అమ్మానాన్నల్లాంటివి. ఆ రెండింటి కలయికే మధురమైన సంగీతం. దాన్ని ఇష్టంతో ప్రేమతో నేర్చుకోవాలి. కాస్త పేరు రాగానే... నాకు అంతా వచ్చు అనుకునేవారు కళాకారులుగా రాణించలేరు. ఎంచుకున్న రంగంలో పైకి రావాలనుకునేవారు ఎప్పటికీ నేర్చుకుంటూనే ఉండాలి.

– 'పద్మవిభూషణ్' పండిట్ జస్‌రాజ్

జీవితాన్ని అంగీకరిద్దాం!

పంచభూతాత్మకమైన ప్రకృతి మన చుట్టూ అల్లుకున్న ఆవరణ మాత్రమే కాదు, కనిపించని చైతన్యశక్తి. అది ఉన్నందువల్లే సకల చరాచరాలు జీవిస్తున్నాయి. జీవన గమనానికి ప్రకృతి దిశానిర్దేశమే ప్రామాణికం. దాని అడుగుజాడల్లో పయనించే పశుపక్ష్యాదులు ఆనందంగా ఉంటున్నాయి. కానీ, మనిషి మాత్రం భారంగా బతుకీడుస్తూ దుఃఖంతో ఉంటున్నాడు. అందుకు కారణం అతడు ప్రకృతి తాలూకు నియమనిబంధనలను నిర్లక్ష్యం చేయడం, గాలి వీచినట్లు నడవకపోవడం, ప్రవృత్తిధర్మాల్ని అసలే లెక్కచేయకపోవడం... ఇదంతా మనిషి అజ్ఞానానికి పర్యవసానం. అజ్ఞానం అహంకారానికి దారితీస్తుంది. అది జీవితం పట్ల అపసవ్య దృక్పథానికి కారణమవుతుంది.

పులిని క్రౌర్యానికి ప్రతీకగా, పిల్లిని పిరికితనానికి ఉపమానంగా భావిస్తుంటాం. ఈ పోలికలు మనిషి ఆలోచనలకే కానీ పులికి, పిల్లికి అవేమీ తెలియవు. అవి ఆ క్షణాల్లో ఎదురైన జీవితాన్ని యథాతథంగా స్వీకరిస్తాయి. సమయానుకూలంగా నడుచుకుంటాయి. అంతేగానీ పౌరుషానికి పోవు, ఎవరి మెప్పు పొందాలని అనుకోవు. ఒక వ్యక్తి పిల్లిని గదిలో బంధించి కర్రతో బాదుతున్నాడు. కాసేపటికి మూసిన గది తలుపులు గబాల్న తెరుచుకున్నాయి. పిల్లి ఎదురుతిరిగి దాడి చేయబోగా కర్ర పట్టుకున్న వ్యక్తి పరుగు లంకించుకున్నాడన్న మాట. సాధుజంతువుగా ఉండే పిల్లి ఆపద వస్తే పులిలా మారింది. మరోచోట... ఊళ్లోకి పులి వచ్చింది. జనం గుంపుగా కర్రలతో దాని దారికడ్డంగా నిలిచారు. అప్పుడా పులి రెండడుగులు వెనక్కి వేసి తోకముడిచి వచ్చిన దారిన వెళ్లిపోయింది. అంతటి పెద్దపులి తనను చూసి పిల్లిలా వెనుదిరిగిందని మనిషి బీరాలు పోతాడు. నిజానికి ఆ జంతువుకు అవేమీ పట్టవు. ప్రతి జీవి సాధ్యమైనంత వరకు తనకే ఆపద రాకుండా జీవించి ఉండాలని కోరుకుంటుంది. పరిస్థితిలో తనది పై చేయి కాగలదనుకుంటేనే, తప్పనిసరి అయితేనే మాత్రమే అది ప్రతిఘటిస్తుంది. ఆ అవకాశం లేదనుకుంటే నిశ్శబ్దంగా అక్కడినుంచి నిష్క్రమిస్తుంది. అంతేగానీ ఎవరో ఏమో అనుకుంటారని గొప్పలకు పోయి ప్రాణాలమీదకు తెచ్చుకోదు. వెనుకడుగు వెయ్యడాన్ని చిన్నతనమనుకోదు. అది వాటి సహజస్వభావమే కానీ రాజీపడటమో ఓటమిని అంగీకరించడమో కాదు. ఎక్కడ తగ్గాలో తెలియడం కూడా జీవితాన్ని ఆస్వాదించడమే. ఒక పెద్ద నది ప్రశాంతంగా ప్రవహిస్తోంది. ప్రయాణంలో పెద్ద కొండ అడ్డువచ్చింది. అప్పుడా నది పరుగు వేగం తగ్గింది, కాస్త వెనక్కి మళ్లింది. కాసేపటికి కొండ పక్కనుంచి కొత్తదారి చూసుకుని ప్రయాణం కొనసాగించింది. ఒక్కోసారి వెనక్కి తగ్గడం కూడా ప్రయాణంలో భాగమే.



అంతర్యామి

మిగిలిన రాళ్లకన్నా నాలుగు ఉలిదెబ్బలు ఎక్కువ తిన్నదే విగ్రహమై పూజలు దుకుంటుంది. పట్టాభిషిక్తుడు కావాల్సిన శ్రీరాముడు అరణ్యవాసాన్ని అంగీకరించి ఆదర్శపురుషుడిగా దేవుడై నిలిచాడు. లక్ష్యసాధనకు ముందుకు సాగుతున్నప్పుడు తగిలే ఎదురుదెబ్బలను విజయానికి మెట్లుగా భావించాలే తప్ప పరాజయాలుగా కాదు. ప్రకృతి నియమాలను అనుసరించి జీవితాన్ని అంగీకరించాలి. సందర్భానికి తగినట్లుగా స్పందించాలి.

– మునిమడుగుల రాజారావు

జాతి చరిత్రకు ఆనవాళ్లు

మన పూర్వీకుల కళాతృష్ణకు, ఆధ్యాత్మిక సౌరభానికి నిదర్శనాలు కుడ్య చిత్రాలు (మ్యూరల్ పెయింటింగ్స్). కొండ గుహలు, ప్రార్థనా మందిరాల గోడలు, పైకప్పులు, రాజప్రాసాదాలు తదితరాల్లో చిత్రితమైన ఈ బొమ్మలకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ప్రభుత్వాల అలక్ష్యం మూలంగా అరుదైన ఆ కళాసంపద శిథిలమవుతోంది. విదేశాల్లో ఇలాంటి వాటిని జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. మనదగ్గరా వాటిని పరిరక్షించి భావితరాలకు మన సాంస్కృతిక వైభవాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఉంది.

దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్, స్పెయిన్‌లోని అల్టమీరా, ఫ్రాన్స్‌లోని చావెట్ కేవ్, అర్జెంటీనాలోని కేవ్ ఆఫ్ హ్యాండ్స్, అఫ్గానిస్థాన్‌లోని బమియన్ గుహల్లో అద్భుతమైన కుడ్యచిత్రాలు కనిపిస్తాయి. అవి చాలా పురాతనమైనవి. ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారులు లియోనార్డో డావిన్సి, మైఖెలాంజిలోలు క్రీస్తు జీవితగాథల్ని మిలాన్, రోమ్ నగరాల్లోని చర్చి పైకప్పులు, గోడలపై వందల ఏళ్ల కిందటే చిత్రించారు. ఇండియా విషయానికొస్తే అజంతా, ఎల్లోరా, మధ్యభారత్‌లోని కైమూర్ కొండలు, ఉత్తర్ ప్రదేశ్‌లోని మీర్జాపుర్, ఛత్తీస్‌గఢ్‌లోని జోగిమరా, రాజస్థాన్‌లోని షెఖావతి ప్రాంతం, కర్ణాటకలోని బాదామి, తమిళనాడు పుదుక్కోట్టై సమీపంలో ఉన్న సిత్తన్నవాసల్ వంటి ఎన్నో చోట్ల అద్భుత కుడ్య చిత్రాలు దర్శనమిస్తాయి. తెలుగు రాష్ట్రాల పరంగా చూస్తే ఉండవల్లి, విజయవాడ గుహల్లో చక్కటి కుడ్యచిత్రాలు ఉన్నాయి. మెదక్ జిల్లాలోని ప్రాచీన దుర్గాలయం, కొలనుపాక సోమేశ్వరాలయం, పిల్లలమర్రి నామేశ్వరాలయం, రాచకొండ కోటలో కుడ్య చిత్రాలున్నట్లు బిర్లా ఆర్కియలాజికల్, కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ గుర్తించింది. 1984లో ప్రచురించిన 'ఇండియన్ మ్యూరల్ పెయింటింగ్స్'లో ఈ వివరాలను పొందుపరిచినా, ప్రభుత్వపరంగా రికార్డు చేయలేదు. కుడ్యచిత్రాలున్న కొండగుహలు తరవాతి కాలంలో చాలా చోట్ల ప్రార్థనాలయాలుగా రూపాంతరం చెందాయి.





సాంఘిక జీవనానికి దర్పణం

దక్షిణాదికి చెందిన ఆలయాల్లో కుడ్యచిత్రాలు ఎక్కువ కనిపిస్తాయి. ప్రధానంగా ఆలయ మండపాలు, అర్ధముఖ మండపాలు, కల్యాణ, నాట్య ప్రదేశాల్లో వాటిని ఎక్కువగా చిత్రించారు. పల్లవుల కాలంలో కాంచీపురం కైలాస దేవాలయం, తంజావూరు బృహదీశ్వరాలయం, పుదుక్కోట్టై సమీపంలోని నర్తనమలై విజయ చోళేశ్వరాలయం, కర్ణాటకలోని హంపి విరూపాక్షాలయ కల్యాణమండపం, ఆనెగొందిలోని హుచ్చప్పయ్య మఠం, కాంచీపురం వరదరాజపెరుమాళ్... ఇలా అనేక ప్రముఖ ఆలయాల గోడలు, పైకప్పులపై హిందూ సంస్కృతికి సంబంధించిన కుడ్యచిత్రాలు అందంగా దర్శనమిస్తాయి. తమిళనాడు తేని జిల్లాలో బోదినాయకనర్ సంస్థానాధీశులు తమ నేలమాళిగల్లోని గోడలపై కంబరామాయణం ఇతివృత్తంగా చిత్రాల్ని చిత్రింపజేశారు. తమిళనాడు మధుర మీనాక్షి ఆలయంలో 16, 17 శతాబ్దాల నాటి అనేక కుడ్యచిత్రాలు చూపరులను కట్టి పడేస్తాయి. శివలీలల్ని ఇక్కడ అద్భుతంగా చిత్రించారు. కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా ఆలయంలో హిందూ పురాణాలకు సంబంధించిన చిత్రాలు ఉన్నాయి. రాజా రవివర్మ వీటిని చూసి స్ఫూర్తి పొందినట్లు చెబుతారు. కొచ్చి రాజభవనం, తిరువాన్కూరు సంస్థానంలోనూ కుడ్యచిత్రాలు చిత్రితమయ్యాయి. ఇవి అప్పటి ప్రజల సాంఘిక జీవనాన్ని తెలియజేస్తాయి. ప్రకాశవంతమైన రంగులు, సూక్ష్మ అంశాలతో పలు ప్రాంతాల్లో చిత్రించిన కుడ్య చిత్రాలు అబ్బురపరుస్తాయి.

సూక్ష్మ రాతియుగపు వర్ణచిత్రాలు మహబూబ్‌నగర్ జిల్లా సంఘనోనిపల్లెలో వెలుగు చూశాయి. ఇక్కడ ఎర్ర రంగులో వివిధ జంతువులు, మనిషి బొమ్మలు వేశారు. కర్నూలు జిల్లా కేతవరం, ఖమ్మం జిల్లా రామచంద్రాపురం, మెదక్ జిల్లాలో పురాతన వర్ణచిత్రాలు బయటపడ్డాయి. చిత్తూరు జిల్లా సోంపల్లి, తాడిపత్రి, లేపాక్షి, తిరుపతి, ఆదోని, కాళహస్తి, ఉండవల్లి, మాచర్ల, విజయవాడ, శ్రీకూర్మం, కోయిలకుంట్ల, త్రిపురాంతకం, కొలనుపాక, పిల్లలమర్రి, రాచకొండ ప్రాంతాల్లో కుడ్యచిత్రాలు ఉన్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. వాస్తవంలో మాత్రం సోంపల్లి, తాడిపత్రి, లేపాక్షి, శ్రీకూర్మంలలో మాత్రమే వాటిని చూడగలం. సోంపల్లి, తాడిపత్రి చిత్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సోంపల్లి చెన్నకేశవస్వామి ఆలయం, తాడిపత్రి వేంకటేశ్వరాలయం, లేపాక్షికి చెందిన వీరభద్ర ఆలయాల్లో ఉన్న కుడ్యచిత్రాలు విజయనగర రాజుల కాలం నాటివి. ఆ ఆలయాల గోడలు, పైకప్పులపై రామాయణ గాథలు, విష్ణు అవతారాలు కనిపిస్తాయి. వాటిలో లేపాక్షి చిత్రాలు ప్రఖ్యాతి చెందాయి. శ్రీకూర్మం కుడ్యచిత్రాలు ప్రాచీనమైనవైనా, కొద్ది మందికే వాటి గురించి తెలుసు. ఎందువల్లనో వాటికి విస్తృత ప్రచారం లభించలేదు.

పుస్తక రూపంలో...


పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు రెండో అవతారం కూర్మం. అంటే తాబేలు. క్షీరసాగర మథన సమయంలో విష్ణుమూర్తి ఈ అవతారం దాల్చాడు. ఇండియాలో ఏకైక శ్రీకూర్మనాథస్వామి ఆలయం శ్రీకాకుళం జిల్లా గార మండలంలో ఉంది. ఈ ఆలయ నిర్మాణ కాలం కచ్చితంగా తెలియదు. రామానుజాచార్యులు ఈ గుడిని పునర్నిర్మించినట్లు ఆధారాలున్నాయి. ఆలయంలోని పలు ప్రాకారాల పైభాగాల్లో 42 కుడ్యచిత్రాలు ఉన్నాయి. భక్తులు ప్రత్యేకంగా చూస్తే తప్ప అవి కనిపించవు. వాటికి సంబంధించి సరైన ప్రచారం కూడా లేదు. భాగవతంలో వర్ణించిన గోపికా వస్త్రాపహరణం, గోవర్ధనపర్వతాన్ని కన్నయ్య ఎత్తడం, పూతన, కంస వధ, కాళీయమర్దనం, దశావతారాల చిత్రాలు ఇక్కడ చిత్రితమయ్యాయి. సున్నపు పూతలు, ధూపదీపాలవల్ల అవి రూపం కోల్పోయాయి. కాకినాడకు చెందిన ప్రముఖ చిత్రకారుడు మంచెం సుబ్రహ్మణ్యేశ్వరరావు ఇక్కడి కుడ్యచిత్రాలను ఫొటోలు తీసి, వాటిలో పూర్తిగా శిథిలమైన వాటిని వాష్ టెక్నిక్ పద్ధతిలో చిత్రించారు. ఆకృతులు, రేఖలు సరిగ్గా కనిపించని వాటికి, స్వేచ్ఛ తీసుకుని అదే శైలిలో కొన్ని చిత్రాల్ని గీశారు. మూడున్నరేళ్లు కష్టించి ఆ చిత్రాలన్నింటినీ పుస్తకరూపంలో తెచ్చారు. సోంపల్లి, తాడిపత్రి తదితర ప్రాంతాల్లోని కుడ్యచిత్రాల పునరుద్ధరణకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చారిత్రక, పురావస్తు పరిశోధకులు తెలంగాణలోని పురాతన ఆలయాల్లోని కుడ్య చిత్రాలను పరిశోధించి, వాటిని గ్రంథస్థం చేయాల్సిన అవసరం ఉంది.

– సుంకర చలపతిరావు

ఏపీ ప్రభుత్వ 'కళారత్న' పురస్కార గ్రహీత

ఏ దేశంలో పుడితే సహజంగానే ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. మరి విమానంలో జన్మిస్తే? వారికి తల్లిదండ్రుల దేశ పౌరసత్వమే లభిస్తుంది. కొన్ని దేశాలు తమ దేశంలో పుట్టిన పిల్లలకు పౌరసత్వం ఇస్తాయి. ఈ రెండూ వర్తించని సందర్భంలో విమానం ఏ దేశానిదో ఆ దేశపు పౌరసత్వం పిల్లలకు ఇవ్వాలన్నది రూలు. మరి మహాసముద్రం మధ్యలో ఓడలో పుట్టిన మనిషికి ఏ దేశ పౌరసత్వం లభిస్తుంది? అతడికి భూమ్మీద నివసించే అర్హత లేదా? ఈ ప్రశ్న లేవనెత్తుతూ

ఉన్నత స్థానాల్లో ఉంటే...



ఆర్థర్ హెయిలీ రాసిన 'ఇన్ హై ప్లేసెస్' నవల ఏకబిగిన చదివిస్తుంది. ఆ శీర్షికకు అర్థం అధికారంలో ఉన్న ప్రభావశీలురైన వ్యక్తులు అని. వారికీ ఓ అనాథకీ ఏంటి సంబంధం... అన్నదే కథాంశం. పరోక్ష యుద్ధాలు, అణ్వాయుధాలు, వలస, పౌరసత్వం, పదవీకాంక్ష, లంచగొండితనం, నైతిక విలువలు... ప్రపంచమంతటా ఎప్పుడూ చర్చనీయాంశాలే. వాటన్నింటినీ కలుపుతూ రచయిత ముప్పేటగా అల్లిన కథ పాఠకులకు పొలిటికల్ థ్రిల్లర్ సినిమా చూస్తున్న అనుభూతి కలిగిస్తుంది.

క్రిస్మస్‌కి ముందు రోజులు. కెనడా గవర్నర్ జనరల్ ఆనవాయితీ ప్రకారం విందు ఏర్పాటుచేశాడు. ప్రభుత్వ పెద్దలందరూ హాజరైన విందులో ఇమిగ్రేషన్ మంత్రి ప్రవర్తన వార్తలకెక్కుతుంది. మరోపక్క దేశ ప్రధాని అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరిపి విజయవంతంగా పర్యటన ముగించుకుని వస్తాడు. అదే సమయంలో తీరంలోని ప్రధాన రేవులో లంగరు వేసిన రవాణా ఓడలో ఇరవై మూడేళ్ల హెన్రీ ఉన్నాడు. పాస్‌పోర్ట్ లాంటి పత్రాలేవీ లేనందున ఏ దేశమూ అతణ్ని తమ భూభాగంలో అడుగుపెట్టనీయడం లేదు. దాంతో రెండేళ్లుగా అతడు ఓడలోనే తిరుగుతున్నాడు. కనీసం పండుగ సందర్భంగానైనా హెన్రీని కెనడాలోకి ప్రవేశించే అనుమతి ఇవ్వమని ఓడ కెప్టెన్ అడిగినా ఫలితం లేకపోయింది.

అసలీ హెన్రీ ఎవరూ అంటే- అతడో అనాథ. తండ్రెవరో తెలియదు. ఓడలోనే పుట్టాడు. తల్లి నైట్‌క్లబ్‌లో పాడుతూ అతణ్ని పెంచింది. హెన్రీకి అయిదారేళ్లున్నప్పుడే చనిపోయింది. దాంతో అనాథగా వీధుల్లో తిరుగుతూ దొంగతనాలు చేసి బతుకుతున్న హెన్రీ ఓసారి పోలీసులనుంచి తప్పించుకునే క్రమంలో ఓడ ఎక్కాడు. అంతే... మళ్లీ భూమిమీద కాలు పెట్టే అవకాశాన్ని కోల్పోయాడు. మొదట ఎక్కిన ఓడలో క్రూరుడైన కెప్టెన్ చేతిలో చాలా బాధలు పడ్డ హెన్రీ ఎలాగో తప్పించుకుని ఈ రవాణా ఓడలో చేరాడు. ఇక్కడి కెప్టెన్, సిబ్బంది చాలా మంచివారు. జీవితంలో మొదటిసారి ప్రేమ, ఆదరాలను చవిచూస్తాడు హెన్రీ. అతడి కథ అంతా పత్రికల్లో రావడంతో ప్రజల్లో సానుభూతి కలుగుతుంది. ఇంత పెద్ద భూభాగం మీద ఒక్క మనిషికి ఉండటానికి అనుమతి ఇవ్వలేమా అని ప్రభుత్వాన్ని నిలదీస్తారు. కోర్టులో కేసు విచారణ జరుగుతుంటుంది. శ్వేత జాతేతరులు తమ దేశంలోకి రావడం అసలిష్టం లేని ఇమిగ్రేషన్ మంత్రి ససేమిరా అంటాడు. ప్రధాని చాలా మంచివాడు కానీ మంత్రిని కాదని ఏమీ చేయలేడు. ఆ సమయంలో తెర వెనుక ఏం జరిగితే పరిస్థితులు సానుకూలంగా మారాయన్నది ఉత్కంఠ రేపుతుంది. హెన్రీ పాత్రను నేపథ్యంగా తీసుకుని రాజకీయాలూ అవినీతీ అక్రమాలపై అరవై ఏళ్ల క్రితం రచయిత లేవనెత్తిన చర్చలోని అంశాలు సమకాలీన పరిస్థితులకూ సరిగ్గా సరిపోతాయి.

– మిహిర

మంచీ చెడూ

పెట్రోల్, డీజిల్ వంటివే చాలా దేశాల ఇంధన అవసరాలు తీరుస్తున్నాయి. వాటి వ్యయభారాన్ని ప్రజలపై తగ్గించడానికి చాలా ప్రభుత్వాలు భారీగా రాయితీలు కల్పిస్తున్నాయి. చమురు సరఫరా ధరతో పోలిస్తే తక్కువ రేటుకు వినియోగదారులకు దాన్ని అందించడం వల్ల వారిపై అదనపు భారం తగ్గి ఆర్థిక కార్యకలాపాల్లో విరివిగా భాగమయ్యే అవకాశం ఉంటుంది. కానీ, శిలాజ ఇంధనాల వల్ల కర్బన ఉద్గారాలు మరింతగా వాతావరణంలోకి చేరతాయి. గడిచిన ఆరేళ్లలో ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల రాయితీలు...

(వేల కోట్ల డాలర్లలో)




2018	51
2019	42
2020	26
2021	59
2022	118
2023	61

(ఆధారం: ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదిక-2024)

నామం... ఎగనామం..!

'నీ నామమెంత రుచిరా....' అంటూ భక్తిపారవశ్యంతో ఆలపించాడు రామదాసు. 'ఎగనామమెంతో రుచిరా...' అంటూ రాజకీయ రాగాలు తీస్తుంటారు నాయకులూ వారి పాదదాసులు. ఎన్నికల హామీల నుంచి బ్యాంకు లోన్ల వరకు అన్నిటికీ ఎగనామాలు పెట్టడంలో సిద్ధహస్తులైన వారి వంకరటింకర బుద్ధులసలు వంకపెట్టలేనివి! హరి నామసంకీర్తనం చేస్తే పుణ్యమొస్తుందంటే- దాంతో మేమేం చేసుకుంటాం, మాకు పదవే కావాలనే నేతల మనోగతాలైతే మురికినీళ్లలో జాడించి ఆరేసిన మసిగుడ్డల వంటివి! అన్నట్టు ఆ పదవులను పట్టడానికి వారి దగ్గర ఓ చిట్కా ఉంది. అదేంటంటే, సందర్భం వచ్చినప్పుడే కాదు, లేని సందర్భాన్ని గాలిలోంచి సృష్టించుకునైనా అధినేతలకు భజన చేయడమే! ఆ పిచ్చి తంత్రం పరాకాష్ఠకు చేరితే ఎలా ఉంటుందో చూడాలంటే ఉత్తర్ ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ ఉత్తర కుమారుల ప్రగల్భాలను వినాలి!

రాష్ట్ర ప్రభుత్వం చదువులను సర్వనాశనం చేస్తోంది, మేమే సొంతంగా బడులు పెట్టి పిల్లలకు పాఠాలు చెబుతామని సమాజ్‌వాదీ పార్టీ పెద్ద అఖిలేష్ అరివీర భయంకర ప్రతిజ్ఞ చేశారు. ఎవరికి వారు పాఠశాలలు తెరవండని కార్యకర్తలకు పిలుపిచ్చారు. 'చిత్తం ప్రభూ' అంటూ ఆయనగారి అనుచరులు బడులు తెరిచేసి మాస్టార్ల అవతారమెత్తారు. ఎత్తి ఎలాంటి పాఠాలు చెబుతున్నారో వింటే- మన చెవులకు పట్టిన తుప్పు వదిలిపోవాల్సిందే. చదువులకు పట్టిన చెదల్ని చూసి బెదిరిపోవాల్సిందే! సమాజ్‌వాదీ పాఠశాలల్లో 'బుక్కు'పచ్చలారని పిల్లల చేత ఇంగ్లీషులో ఏ అంటే ఆపిల్ అనడం తక్కున మాన్పించేసి 'ఏ ఫర్ అఖిలేష్' అని కంఠంతో పాఠం చేయిస్తున్నారు. 'డీ ఫర్ డింపుల్' (శ్రీమతి అఖిలేష్ నామధేయమది!), 'ఎం ఫర్ ములాయం సింగ్' అంటూ సకుటుంబ నామస్మరణ కూడా చేయిస్తున్నారు. ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుని అనాదిగా పిల్లలతో నామ పారాయణం చేయించుకుంటున్న మహారాజు కూడా తన రోజుల్లో ఇంత పని చేయలేకపోయాడు! అశోకుడికి ఈ ఐడియా రాలేదేమో. చెప్పడానికి ఆయనకు సకల విషయాలు తెలిసిన సలహాదారులు లేరేమో! ఏం చేస్తాం పాపం అశోకుడు! (ఏ పాపం చేయక పోయినా అంతటి వాడిని ఇంత మాట అనక తప్పదు!)



కన్నబిడ్డలనే ప్రజలుగా భావించి పరిపాలించి నాన్ స్టాప్‌గా, నానా స్టాపులుగా స్కాములు చేసి జైళ్లకు వెళ్లి బెయిళ్ల మీద బయటికి వచ్చిన 'త్యాగ' మూర్తులు ఉన్న రోజులివి. ఇప్పుడు నాయకులు పేరు తెచ్చుకోవడం... అదే కొనుక్కోవడం పెద్ద కష్టం కాదు. కానీ, పత్రికలూ టీవీలూ సోషల్ మీడియా ఏవీ లేని ఆ సత్తెకాలంలో అశోకుడు అంత గొప్ప పనులు చేసి తిరుగులేని పేరు తెచ్చుకోవడం ఎంత వింత! అయినా పెద్ద పెద్ద పనులు చేసి పెద్ద పేరు సంపాదించుకోవడం ఏం గొప్ప! సహజమైన బొంగ్రతో కృత్రిమ బుర్రతో 'ట్రిక్'నాలజీకి జీ హుజూర్ అంటున్న అత్యాధునిక యుగంలో బటన్ నొక్కినంత తేలిగ్గా పేరు రావాలంటే ఎలా? అని సమాజ్‌వాదీ వీరులు ఆలోచించారు. అది గిట్టని కొంతమంది జనం ఎవరికీ తెలియని తమ పేర్లతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు విధివశాత్తు ఎఫ్ఐఆర్ బుక్ చేస్తే- అఖిలేష్ అమాంతం కోపం తెచ్చేసుకున్నారు. చదువులను చంపేస్తున్నారు బాబోయ్ అంటూ 'ఎక్స్'లో ఎక్కిళ్లు పడ్డారు. 'మా వంశవృక్షాన్ని తలచుకోవడమే పెద్ద ఎడ్యుకేషన్' అని అఖిలేశ గిరీశం అనుకుంటున్నారో ఏమో మరి!


అఖిలేష్ చిట్కా తమకు తెలియకపోవడం వల్ల తమ జట్కా వెనకబడిందని జగన్ జమానా నాయకులు మరొక రకంగా విచారిస్తున్నారు. అయితే వారి పాత స్కాములన్నీ ప్రతిరోజూ పత్రికల్లో, టీవీల్లో తాటికాయంత అక్షరాలతో ప్రత్యక్షమవుతున్నాయని, అలా వాళ్ల నామస్మరణ జరుగుతూనే ఉందని కొంతమంది ప్రత్యర్థులు వేలెత్తి చూపిస్తున్నారు. మంచో చెడ్డో జానేదోవ్, పేరు నలుగురి నోళ్లలో నానడానికి ఇది చాలదా అని క్యాలిక్యులేటర్ సాక్షిగా 'లెక్క'సక్కాలాడుతున్నారు. ఏది ఏమైనా రాజకీయాల్లో నాయకుల నామస్మరణలు పొలిటికల్ మార్కెట్ రేట్ ప్రకారం వెలకట్టగలిగినంతగా పెరిగిపోయాయి. అమాయకంగా నాయకులను అభిమానించే అనుచరులు కలికాలంలో కలికానికి కూడా కనిపించడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు 'ఆహా ఓహో! ఓ నేత నీ నామమెంత రుచిరా! ఎంత రుచిరా' అని నోరు నొప్పి పుట్టేట్టు పాడిన అనుచరులే ఆ నాయకుడి వల్ల రూపాయి రాలదనుకుంటే లెక్క పెట్టరు. 'అధికారంలోకి మళ్లీ వస్తాను. అప్పుడు అది చేస్తాను... ఇది చేస్తాను' అని నాయకుడు చెప్పినా నమ్మరు గాక నమ్మరు. 'అప్పుడు మీరే కదా నా నామస్మరణం చేసింది' అని నాయకుడు అన్నా తల పక్కకు తిప్పుకొంటారు. 'డోంట్ కేర్' అన్నట్టు చూస్తారు.

ఇటువంటివన్నీ తెలిసే 'అధికారాంతమునందు తెలియవలదా? ఆ అయ్య సౌభాగ్యముల్' అన్నాడో కవి. దీన్ని చెప్పిన కవి నామం తెలుసుకుని, రాజకీయ నాయకులు నిత్యం గుర్తు పెట్టుకోవాల్సిన విషయమిది.

– శంకర నారాయణ

పిల్ల బాతులు.. ఓ కుందేలు!

ఒక అడవి చివర పెద్ద జలపాతం ఉండేది. దాని పక్కనే ఉన్న సరస్సు దగ్గరికి ఎప్పుడూ ఒక బాతు తన పిల్లలతో వచ్చేది. తల్లి అందులోకి దిగి ఆహారం వెతుకుతుంటే పిల్లలు మాత్రం.. ఒడ్డునే నిలబడేవి. అక్కడి నుంచి తల్లి బాతు అందించిన ఆహారాన్ని తినేవి. ఒకరోజు తల్లి బాతు.. 'మీరు పెద్దవాళ్లు అవుతున్నారు. నాతో పాటు సరస్సులో దిగి ఆహారం సంపాదించుకోవడం నేర్చుకోండి' అంది. 'అమ్మా! అందులోకి దిగాలంటే నాకు చాలా భయం' అని సమాధానమిచ్చింది ఒక పిల్ల. 'నువ్వుండగా నేనెందుకు ఆహారం వెతుక్కోవాలమ్మా! ఎలాగో నువ్వు తెస్తున్నావు కదా! ఇక్కడే హాయిగా కూర్చుని తింటాను' అంది మరో పిల్ల. ఈ మాటలు విన్న తల్లి, పిల్లలు ఇలాగే ఉంటే చాలా కష్టం. ఎలాగైనా



హాయ్! బుజ్జీ!!

వాటిలో మార్పు తీసుకురావాలనుకుంది. వెంటనే వెళ్లి ఇదే విషయాన్ని కుందేలుతో చెప్పింది. దాంతో అది ఒక ఉపాయాన్ని చెప్పింది.

మరుసటిరోజు ఎప్పటిలాగానే పిల్లలను తీసుకుని సరస్సు దగ్గరికి వచ్చింది బాతు. అవి ఒడ్డు మీదే కూర్చుని తల్లి తెచ్చే ఆహారం కోసం ఎదురుచూస్తున్నాయి. కాసేపటికి ఒక్కసారిగా పొదల్లోంచి బయటికి దూకింది కుందేలు. అది చూసి ఏంటోనని బయపడి సరస్సులోకి దూకేశాయా బాతు పిల్లలు. ముందు కంగారుపడినా తరవాత హాయిగా నీటిలో ఈదాయి. కనిపించిన చిన్న చిన్న పురుగులను, చేప పిల్లలను నోటితో అందుకోసాగాయి. దూరం నుంచి వాటిని గమనిస్తున్న తల్లిబాతు చాలా సంతోషించింది. 'అమ్మా! ప్రతిరోజు నీతో పాటు మేము సరస్సులోకి దిగుతాము. మేమే నీకు ఆహారాన్ని వెతికి పెడతాం' అన్నాయి బాతు పిల్లలు. 'అందుకే ఇన్ని రోజుల నుంచి ఒక్కసారి లోపలికి దిగండి అని చెబుతున్నాను. ప్రయత్నమంటూ చేస్తే.. అది బాగుంటుందా? లేదా? అనేది తెలుస్తుంది' అంది తల్లిబాతు. 'ఇక నుంచి నువ్వు చెప్పినట్లే వింటాం అమ్మా!' అన్నాయా బాతు పిల్లలు.

– ముక్కామల జానకీరామ్

నేనెవర్ని?

1. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'ప్రకృతి'లో ఉంటాను కానీ 'వికృతి'లో లేను. 'యాత్ర'లో ఉంటాను కానీ 'మాత్ర'లో లేను. 'రణం'లో ఉంటాను కానీ 'రక్తం'లో లేను. నేనెవర్ని?
2. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'పని'లో ఉంటాను కానీ 'పత్రం'లో లేను. 'వాము'లో ఉంటాను కానీ 'పాము'లో లేను. 'అర'లో ఉంటాను కానీ 'అల్లం'లో లేను. 'వీణ'లో ఉంటాను కానీ 'వీర'లో లేను. నేనెవరినో తెలిసిందా?

జవాబులు: 1.ప్రయాణం 2.నివారణ

పోస్ట్‌మార్టంలో దొరికేస్తారు!

మాటలు కాదు, పోస్టులే పలుకుతాయి
మొహాలు కాదు.. అభిప్రాయాలే కనిపిస్తాయి
నేపథ్యం కాదు.. సోషల్ మీడియా చరిత్రే ప్రామాణికం!
వీసా దరఖాస్తు నుంచి.. ఉద్యోగ నియామకం వరకు..
'సోషల్ మీడియా వెట్టింగ్'..పెడుతోంది పెద్ద ఫిట్టింగ్!



● అమలాపురానికి చెందిన బీటెక్ విద్యార్థి శ్రీనివాస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో సెలక్ట్ అయ్యాడు. కానీ 6 నెలలైనా కాల్ లెటర్ రాలేదు. హెచ్‌ఆర్‌కు మెయిల్స్ పంపినా బదులు లేదు. కాలేజీ ప్లేస్‌మెంట్ సెల్‌ను నేరుగా అడగడంతో వారు అసలు విషయం చెప్పారు. సదరు విద్యార్థి కళాశాలలో ఉండగా ఓ సందర్భంలో కొన్ని వర్గాలను రెచ్చగొట్టేలా పోస్టులుచేశాడు. అలాంటి పోస్టులకు లైక్ చేశాడు. సోషల్ మీడియా స్క్రీనింగ్‌లో ఈ విషయం తమకు తెలిసిందని, అతడి సోషల్ బిహేవియర్ సరిగ్గా లేదని భావించి పక్కనపెట్టినట్లు హెచ్‌ఆర్ ప్రతినిధులు చెప్పారు. ఫలితంగా రూ.12 లక్షల ప్యాకేజీ శ్రీనివాస్ చేజారింది.

● హైదరాబాద్‌కు చెందిన సురేష్.. అమెరికాలో ఉద్యోగం చేయాలని కలలు కనేవాడు. అనుభవం లేకపోవడంతో ఫ్రెషర్‌గా అవకాశాలు వచ్చేవి కాదు. దీంతో ఫేక్ ఎక్స్‌పీరియన్స్ పెట్టి, ఉద్యోగం సంపాదించాడు. ఆఫర్ లెటర్ పట్టుకుని అమెరికాలో దిగాడో లేదో అక్కడి సిబ్బంది అతడిని వెంటనే భారత్‌కు డిపోర్ట్ చేసేశారు. ఇంతకీ అతడు చేసిన తప్పు ఏంటంటే.. ఓ స్నేహితుడితో వాట్సప్‌లో చాట్ చేస్తూ.. 'రిక్రూటర్‌ను బురిడీ కొట్టించా్రా.. పిచ్చోడు ఫేక్ ఎక్స్‌పీరియన్స్‌ను కనిపెట్టలేకపోయాడు. జాబ్ ఇచ్చేశాడు' అని అన్నాడు. అది ఎలా తెల్సిందో ఏమో.. సురేష్ లక్ష్యం నీరుగారిపోయింది.

● బెంగళూరుకు చెందిన అశుతోష్... ఉద్యోగంలో ఉన్నప్పుడు బాస్ మీద మీమ్స్ తయారుచేసి వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేసేవాడు. ఆ మెసేజ్‌లు విరివిగా ఫార్వర్డ్ అవుతూ చేరకూడని వ్యక్తికే చేరాయి. దీంతో కంపెనీ పాలసీ మేరకు అశుతోష్‌ను ఉద్యోగం లోంచి తీసేశారు.

కోపంలోనో, బాధలోనో మాట జారి ఎవరిని అయినా తిట్టినా.. తెగిడినా కొన్ని రోజులకు వారు మర్చిపోవచ్చు. మనకూ ఉద్వేగం తగ్గి మామూలుగా మారవచ్చు. దీనివల్ల భవిష్యత్తులో పెద్దగా నష్టపోయేదేమీ ఉండదు. ఇప్పటి డిజిటల్ యుగంలో వచ్చిన చిక్కల్లా సోషల్ మీడియాల్లో పెట్టే పోస్టులతోనే! వాటి ఆధారంగానే రిక్రూటర్‌లు అభ్యర్థి మానసిక స్థితిని అంచనా వేస్తుండటం ఇప్పటి ట్రెండ్. దీనిని 'సోషల్ మీడియా స్క్రీనింగ్ లేదా సోషల్ మీడియా వెట్టింగ్' అని పిలుస్తున్నారు. ఈ వెరిఫికేషన్‌లో అభ్యర్థి ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రాం తదితర మాధ్యమాల్లో చేసిన పోస్టులను నిశితంగా విశ్లేషిస్తున్నారు.

ఉద్యోగం నుంచి.. లోన్‌ల వరకు

● వీసాలు జారీ చేసే విదేశీ ఇమిగ్రేషన్ విభాగాలైతే వాట్సప్ చాట్‌లు, మెయిల్స్‌ను కూడా జల్లెడ పడుతున్నాయి.
● క్యాండిడేట్ మానసిక పరిపక్వత, ఇతరుల అభిప్రాయాలను ఎంత మేర గౌరవిస్తున్నారు, గొడవలు పెట్టుకునే వ్యక్తిత్వమా.. సర్దుకుపోయే టైపా, కవ్వింపులకు దిగుతారా.. ఇలా అనేక కోణాల్లో పరిశీలిస్తున్నారు.
● వీటికి ప్రత్యేకంగా ఏజెన్సీలు కూడా పనిచేస్తున్నాయి. అభ్యర్థి పోస్టుల ఆధారంగా మనస్తత్వాన్ని అంచనా వేయడానికి ఏఐ టూల్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి.
● ఈ వెరిఫికేషన్‌లో ఏ మాత్రం అనుమానం వచ్చినా అభ్యర్థికి మిగిలేది మొండిచెయ్యే. చాలా సందర్భాల్లో ఇదీ కారణమని కూడా రిక్రూటర్లు చెప్పరు.
● ఉద్యోగాలకనే కాకుండా విదేశాలకు వెళ్లాలనుకున్నా, లోన్‌లు పొందాలనుకున్నా కూడా సోషల్ మీడియా స్క్రీనింగ్‌లో పాసవ్వడం తప్పనిసరి.

ఇవి వద్దు

● ఉద్వేగపూరిత, వివాదాస్పద అంశాల్లో అవగాహన లేకుండా రెచ్చగొట్టేలా వ్యాఖ్యానాలు చేయడం.
● సినిమా నటులు, రాజకీయ నాయకులపై అవాకులు చవాకులు పేలడం, వారిపై మీమ్‌లను తయారుచేయడం, రీపోస్ట్ చేయడం.
● అసభ్య పదజాలం, మహిళలపై చీప్ కామెంట్స్. అభ్యర్థులు ఫాలో అవుతున్న ఫేస్‌బుక్ పేజీలు, ఎక్స్ ఎకౌంట్‌లనూ రిక్రూటర్‌లు సమీక్షిస్తున్నారు.
● డ్రగ్స్, గంజాయి తీసుకోవడాన్ని హీరోయిజంగా భావించే పోస్టులు చేయడం. అలాంటి పోస్టులను లైక్ చేయడం.
● అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధాలు, పరిణామాలపై వాదనలకు దిగడం. జాతుల ఆధారంగా విమర్శలు చేస్తూ పోస్టులు.
● ఉద్యోగంలో ఉన్నప్పుడు బాస్ మీద జోకులు వేస్తూ, హేళన చేస్తూ పోస్టులు పెట్టినా, వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేసినా ఇబ్బందులు కొనితెచ్చుకున్నట్లే. ఆ ఉద్యోగం పోవచ్చు లేదా జాబ్ ఛేంజ్ అయినప్పుడు వెరిఫికేషన్‌లో ఆ పోస్టులు కొత్త రిక్రూటర్ కంటపడితే సెలక్ట్ కాకపోయే ప్రమాదముంది.
● చాలామంది టీనేజ్‌లో తెలిసీ తెలియక అనవసర, వెకిలి పోస్టులు చేసి ఉంటారు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నప్పుడు వాటి ప్రైవసీ స్టేటస్‌ను మార్చడమో, డిలీట్ చేయడమో చేయాలి.
● ఇంటర్వ్యూలకు వెళుతున్నాం కదా అని మొత్తంగా ఎకౌంట్‌లు ఇన్‌యాక్టివ్ చేయడమూ మంచిది కాదు. రిక్రూటర్‌లకు లేనిపోని అనుమానం కలిగించిన వారవుతారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

గౌతు లచ్చన్న స్ఫూర్తిని అందిపుచ్చుకుందాం

సీఎం చంద్రబాబు



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అణగారినవర్గాల పక్షాన గౌతు లచ్చన్న చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీఎం చంద్రబాబు కొనియాడారు. లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తికి, కార్యదక్షతకు, సాహసానికి లచ్చన్న ప్రతీక అని, ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో లచ్చన్న చిత్రపటానికి నివాళి అర్పించారు. గౌతు లచ్చన్న బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి అని మంత్రి లోకేశ్ కొనియాడారు. ఉండవల్లి నివాసంలో లోకేశ్, మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాళులర్పించారు.

త్వరలో 'ఆదరణ 3.0' పథకం అమలు

గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకల్లో మంత్రి సవిత



సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, సవిత, అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు. చిత్రంలో ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, గౌతు శిరీష, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు

ఈనాడు, అమరావతి, విద్యాధరపురం, న్యూస్‌టుడే: సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. త్వరలో 'ఆదరణ 3.0' పథకానికి శ్రీకారం చుడుతున్నాం. ఈ పథకం ద్వారా గీత కార్మికులకు ద్విచక్రవాహనాలు అందజేస్తాం' అని బీసీ, చేనేత జౌళి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడుతూ 'తాటి చెట్లు ఎక్కడానికి గీత కార్మికులకు అత్యాధునిక పరికరాలు అందిస్తాం. రంపచోడవరం ఉద్యాన పరిశోధన కేంద్రంలో తాటి ఉత్పత్తులను తయారు చేసి, గీత కార్మికుల ఉపాధి, ఆర్థిక వృద్ధికి చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ..మారుమూల పల్లెటూరులో పేద కుటుంబంలో జన్మించిన గౌతు లచ్చన్న 95 ఏళ్ల వయసులోనూ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ బీసీ వర్గాలకు సంబంధించిన వారిని ప్రభుత్వం తరఫున గౌరవించిన చరిత్ర తెదేపాకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ బొండా ఉమా, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, కేఈ ప్రభాకర్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకం.. వెల్లువెత్తిన ఉత్సాహం

● ఉచిత బస్సు ప్రయాణానికి విశేష స్పందన

ఈనాడు, అమరావతి: మహిళా లోకంలో ఉత్సాహం వెల్లివిరిసింది. కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఉచిత ప్రయాణ పథకానికి విశేష స్పందన లభించింది. శనివారం మహిళలు పెద్దసంఖ్యలో ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. 'స్త్రీశక్తి' పేరుతో ఐదు రకాల బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం ప్రారంభించగా... తొలిరోజు 76వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. శనివారం ఆ సంఖ్య భారీగా పెరిగింది. రాత్రి 9 గంటల వరకు 11.47 లక్షల మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. రెండు రోజులు కలిపి... ఈ పథకం వల్ల రూ.5 కోట్లకు పైగా లబ్ధి చేకూరిందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. సాధారణ రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) సగటున 69% ఉంటుంది. సెలవు రోజుల్లో 60% నమోదవుతుంది. కానీ ఉచిత బస్సు ప్రభావంతో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సెలవైనా 75% వరకు ఓఆర్ వచ్చింది. సోమవారం నుంచి 90%పైగా ఓఆర్ రావచ్చని ఆర్టీసీ వర్గాల అంచనా.

ఎటు చూసినా కోలాహలం

రాష్ట్రంలో శనివారం నగరాలు, పట్టణాలు, పల్లెలన్న తేడా లేకుండా మహిళా ప్రయాణికుల సందడి కనిపించింది. పిల్లలకు వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో... పుట్టిళ్లకు వెళ్లేవారు, బంధువుల ఇళ్లకు వద్దామనుకునేవారు, ఆలయాలు, విహార కేంద్రాలకు వెళ్లేవారితో ఎటు చూసినా కోలాహలం కనిపించింది. చిరు వ్యాపారులు గతంలో షేర్ ఆటోలు, ఇతర రవాణా సాధనాలపై ఎక్కువగా ఆధారపడేవారు. బస్సుప్రయాణం ఉచితం కావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. పట్టణాలు, నగరాల్లోని ఆస్పత్రులకు వెళ్లే మహిళలకు... గతంలో టికెట్ ఛార్జీలు అదనపు భారంగా ఉండేవి. ఇప్పుడు అదీ తగ్గింది. సిటీ సర్వీసుల్లోనూ శనివారం రద్దీ బాగా కనిపించింది.



విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో గుంటూరు వెళ్లే బస్సుల్లో రద్దీ

మహిళల్లో రెట్టించిన ఉత్సాహం

■ విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్సుస్టేషన్, సిటీబస్సు టెర్మినల్‌లో శనివారం మహిళా ప్రయాణికులు ఎక్కువగా కనిపించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి విజయవాడకు వచ్చే పలు సర్వీసులు కిటకిటలాడాయి.

■ సిటీబస్సు టెర్మినల్‌లోనూ మహిళా ప్రయాణికుల సందడి ఎక్కువగా కనిపించింది.

■ విశాఖపట్నంలో శనివారం ఉదయం నుంచి ముసురు పట్టినా మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గడంతో సిటీ సర్వీసులు, గ్రామీణ ప్రాంతాల బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి.

ఘాట్ సర్వీసుల్లో సీటింగ్‌తో ఉచిత ప్రయాణానికి అనుమతి

రాష్ట్రంలో వివిధ ఘాట్ రోడ్లలో తిరిగే బస్సుల్లో తొలుత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించలేదు. అయితే సీఎం ఆదేశాలతో ఘాట్ సర్వీసుల్లోనూ అమలుచేస్తున్నారు. ఘాట్‌రోడ్లలో తిరిగే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీటింగ్ సామర్థ్యం ఉన్నమేరకు... మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతించారు. తిరుమల ఘాట్‌లో తిరిగే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మాత్రం స్త్రీశక్తి పథకం వర్తించదని అధికారులు స్పష్టంచేశారు.

గుర్తింపుకార్డులపై గందరగోళం.. ఇక జిరాక్స్‌కూ అనుమతి

స్త్రీశక్తి పథకం వినియోగించుకోవాలంటే మహిళలు ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు జారీచేసిన గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలని, వాటిలో వారి ఇంటి చిరునామా ఉండాలని ఆర్టీసీ నిబంధన పెట్టింది. వాటి ఒరిజినల్ కార్డులే అనుమతిస్తామంది. దీనిపై అవగాహన లేని కొందరు మహిళలు గుర్తింపుకార్డు లేకుండానే బస్సులు ఎక్కారు. వారు టికెట్లు తీసుకోవాలని కండక్టర్లు చెప్పడంతో కొన్నిచోట్ల కండక్టర్లకు, ప్రయాణికులకు మధ్య చిన్నపాటి వాగ్వాదాలు జరిగాయి. మరికొందరు ప్రయాణికులు ఆధార్ కార్డులు మొబైల్‌లో చూపించగా.. కండక్టర్లు అంగీకరించలేదు. ఒరిజినల్, ముద్రిత కార్డు ఉండాల్సిందేనని చెప్పారు. దీనిపై ప్రయాణికుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఆధార్ జిరాక్స్ కాపీ చూపించినా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని శనివారం రాత్రి ఆదేశాలిచ్చింది.

■ మొబైల్‌లో ఆధార్ సాఫ్ట్‌కాపీని అనుమతించే అంశాన్నీ పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి.

స్టిక్కర్లు అతికించకపోవడంతో తికమక

ఏయే బస్సుల్లో స్త్రీశక్తి పథకం అమలవుతుందో తెలియజేసే స్టిక్కర్లు కొన్ని బస్సులపై లేకపోవడంతో శనివారం మహిళా ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. కొన్ని బస్సులకు డోర్ పక్కన చిన్న బోర్డులు ఏర్పాటుచేశారు. వాటిని గుర్తించడం కష్టంగా ఉంది.

బస్సుఛార్జీల కోసం పస్తులుండాల్సి వచ్చేది

- రాణి, పాలమంగళం గ్రామం, పుత్తూరు



మా ఊరు నుంచి తిరుపతి వచ్చి, పూలు అమ్ముకొని తిరిగి వెళ్తుంటాను. బస్సుఛార్జీలకు రోజుకు రూ.110 ఖర్చయ్యేది. వ్యాపారం సరిగ్గా జరగనిరోజు... ఛార్జీలకు డబ్బులు సరిపోవని, పస్తులుండాల్సి వచ్చేది. ఇప్పుడు రోజుకు రూ.110 మిగులుతాయి. పస్తులుండక్కర్లేదు. చాలా సంతోషంగా ఉంది.

ఆలయాలకు వెళ్లేందుకు ఛార్జీల భయం లేదు

- వి.పద్మ, తిరుపతి



ఎక్కువగా ఆలయాలను సందర్శిస్తుంటాను. ఏ ఆలయానికి వెళ్లాలన్నా బస్సుఛార్జీల కోసం కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వచ్చేది. ఇక ఆ చింత లేదు.

రాజకీయాలే తప్ప.. ఇంకేమీ పట్టవా?

జగన్‌పై మంత్రి కొండపల్లి ధ్వజం



విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి రాజకీయాలే తప్ప, రాష్ట్ర భవిష్యత్తు పట్ల ఆలోచన లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. తనొక్కడే నాయకుడని, వేరొకరు ఎదగకూడదని అనుకుంటారని పేర్కొన్నారు. విజయనగరం కలెక్టరేట్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షనేతగా, ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు శాసనసభ్యుడిగా స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో జగన్‌ను ప్రజలు పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారని, తమతోనే ఉన్నారనడానికి పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలే నిదర్శమన్నారు. ఈ ఎన్నికలు వైకాపాకు గుణపాఠమని పేర్కొన్నారు.

రేపు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

కోస్తా జిల్లాలకు అతిభారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: వాయవ్య, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఈ నెల 23న బంగాళాఖాతంలో ఇంకో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో కోస్తా జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని తెలిపింది.

■ మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం, గంగవరం, కళింగపట్నం పోర్టులకు మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు కొనసాగిస్తున్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. శనివారం విశాఖపట్నం, వైఎస్సార్ కడప, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కర్నూలు, విజయనగరం, అనంతపురం తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా రాత్రి 7గంటల వరకు విశాఖ జిల్లా పద్మనాభంలో 42.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



విజయాలను అలవాటుగా మార్చుకోవాలంటే..

ఒక్కసారి గెలిస్తే చాలనుకొనేవారు లక్ష్యంపై దృష్టిపెడతారు. కానీ విజయాలు సాధించడాన్ని అలవాటుగా మార్చుకోవాలనుకొనేవారు పటిష్ఠ ప్రక్రియను నిర్మించుకోవడంపై దృష్టిపెడతారు. అందులో భాగంగా తమ దినచర్యను మార్చుకుంటారు. నిత్యం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూనే ఉంటారు. అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి ఎంత దూరమైనా వెళ్తారు. ఫలితాలతో సంబంధం లేకుండా ప్రయత్నాలు సాగించడమే తమ కర్తవ్యంగా భావిస్తారు.

- హామిల్టన్ లిండ్లే, అంత్రప్రెన్యూర్

విలీన మండలాల మహిళలకు ఉచిత ప్రయాణం దూరం

కూనవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని విలీన మండలాల్లో అమలు కావడం లేదు. కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, చింతూరు మండలాలు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఉండటంతో ఆయా మండలాల్లోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రాలేదు. ఈ మండలాలకు వచ్చే ఆర్టీసీ బస్సులు తెలంగాణలోని భద్రాచలం వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిని అంతర్రాష్ట్ర సర్వీసులుగా ఆర్టీసీ అధికారులు చూపుతున్నారు. ఈ బస్సుల్లో రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే భద్రాచలం పట్టణం వస్తుంది. మిగతా ప్రయాణమంతా ఏపీలో సాగుతుంది. అయినా అధికారులు వీటిని అంతర్రాష్ట్ర సర్వీసులుగా పరిగణించడంతో నాలుగు మండలాల మహిళలకు ఉచిత బస్సు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఏపీలోని చివరి స్టాప్ వరకైనా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని మహిళలు కోరుతున్నారు.



బస్సు వెనుక అంతర్రాష్ట్ర సర్వీసులో 'స్త్రీ శక్తి' పథకం వర్తించదంటూ అతికించిన స్టిక్కర్



కూనవరం నుంచి భద్రాచలం 'అంతర్రాష్ట్ర సర్వీస్' బోర్డుతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

ఐటీ కంపెనీలను ఆకర్షించేలా టెక్‌హబ్స్ పాలసీ

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించేలా ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్(ఎల్‌ఐఎఫ్‌టీ) పాలసీ(4.0)ని ప్రకటిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వు జారీచేసింది. ఫార్చ్యూన్-500, ఫార్చ్యూన్-500 యూరప్, ఫార్చ్యూన్ గ్లోబల్-500, ఫార్చ్యూన్-1,000, ఫోర్బ్స్ గ్లోబల్-2,000లో గత మూడేళ్లలో ర్యాంకింగ్ పొందిన సంస్థలు ఐటీ, ఐటీఈఎస్, గ్లోబల్ కేపబుల్ సెంటర్స్(జీసీసీల) ఏర్పాటుకు రాయితీతో భూములు కేటాయిస్తారు. ఒక బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉండాలనే నిబంధన విధించారు. వీటికి రాష్ట్రంలో ఎక్కడైనా నామమాత్ర ధర కింద ఎకరా 99 పైసలకు కేటాయిస్తారు. ఐటీ, ఐటీఈఎస్‌లు ఏర్పాటు చేయాలనుకునే సంస్థలు మూడేళ్లలో కనీసం 3 వేల మందికి ఉపాధి కల్పించాలి. ఎకరాకు 500 మంది చొప్పున ఉద్యోగాలు ఇవ్వగలగాలి. జీసీసీలు అయితే మూడేళ్లలో 2 వేల మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉంటుందని పాలసీలో పేర్కొన్నారు.

రెట్టింపు చేస్తామని రూ.201 కోట్లు ఊడ్చేశారు

ఈనాడు, అమరావతి-విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పెట్టుబడుల పేరుతో విజయవాడ కేంద్రంగా జరిగిన కోట్ల రూపాయల భారీ మోసాన్ని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి సత్యనారాయణపురానికి చెందిన నిడుమోలు వెంకట సత్యలక్ష్మి కిరణ్(33)తో పాటు గుంటూరు జిల్లా కృష్ణానగర్‌కు చెందిన మిట్టపల్లి రాజేంద్రబాబు(63), మిట్టపల్లి రాజీవ్‌కృష్ణ (30)ను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఆ వివరాలను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు వెల్లడించారు. విజయవాడలోని సత్యనారాయణపురం ఆదిశేషయ్య వీధిలో 2014లో యుపిక్స్ పేరుతో ఓ యానిమేషన్ కంపెనీని నిడుమోలు వెంకట సత్యలక్ష్మి కిరణ్ ఏర్పాటు చేశాడు. ఓ పెద్ద భవనంలో 70 మంది ఉద్యోగులతో హడావుడి చేశాడు. హాలీవుడ్ సినిమాలకు యానిమేషన్ వర్క్స్ చేస్తున్నామని, ఇందులో పెట్టుబడులు పెడితే ఏడాదిలో రెట్టింపు ఇస్తామని ప్రజలను నమ్మించాడు. తన సన్నిహితులు కొత్తూరి వేణుగోపాల్‌రావు, మిట్టపల్లి రాజేంద్రబాబు, అతడి కుమారుడు రాజీవ్‌కృష్ణ, పేరం మాల్యాద్రి, అతడి కుమారుడు మహేశ్వర్‌రెడ్డితో పక్కా ప్రణాళిక రచించి, జనం నుంచి డబ్బుల వసూళ్లు మొదలెట్టారు. ప్రజలను నమ్మించేందుకు మ్యాజిక్ టాయ్స్, మ్యాజిక్ టాయ్స్ 2, కేరామిల్ ఫాక్స్ అనే సంస్థలనూ వీళ్లు ఏర్పాటు చేశారు. దీంతో గుంటూరు, నరసరావుపేట, విజయవాడకు చెందిన 344 మంది రూ.593 కోట్లను పెట్టుబడి పెట్టారు. వీరిలో 161 మంది తమ డబ్బులను మధ్యలోనే తిరిగి తీసేసుకోగా.. మిగిలిన 183 మందికి మాత్రం రూ.201.55 కోట్ల మేర నిర్వాహకులు కుచ్చుటోపీ పెట్టారు.



కిరణ్



రాజేంద్రబాబు



రాజీవ్ కృష్ణ

తలా ఇంత పంచేసుకున్నారు..

యుపిక్స్ మోసంపై 2025 ఏప్రిల్ 14న నరసరావుపేటకు చెందిన త్రిపురమల్లు శ్రీనివాసరావు, కలవకొల్లు దిలీప్‌కుమార్‌లు సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయగా.. రూ.వందల కోట్ల మోసం జరిగినట్లు ప్రాథమికంగా తేలింది. దాంతో పూర్తిస్థాయి విచారణను సిట్ చేపట్టింది. 183 మందికి సంబంధించిన రూ.201.55 కోట్లను ఎవరెవరు ఎంత తినేశారనే లెక్కలను సిట్ అధికారులు పక్కా ఆధారాలతో గుర్తించారు. ప్రధాన సూత్రధారి కిరణ్ రూ.26.24 కోట్లు, మిట్టపల్లి రాజేంద్రబాబు రూ.71.18 కోట్లు, కొత్తూరి వేణుగోపాలరావు రూ.27.26 కోట్లు, పేరం మాల్యాద్రి అండ్ కో రూ.10 కోట్లు కాజేశారని తేల్చారు. ఈ నలుగురు కలిసి మొత్తంగా రూ.134.68 కోట్లు తినేశారని తెలిపారు. మిగతా రూ.66.87 కోట్లను పెట్టుబడి పెట్టినవారిలో 121 మందికి లాభాల కింద పంచారని చెప్పారు. అరెస్టు చేసిన ముగ్గురు నిందితుల నుంచి రూ.90 లక్షల విలువైన 354 గ్రాముల బంగారం, 21 కిలోల వెండి, ఒక ఎక్స్‌యువీ కారు, ఒక బి.ఎం.డబ్ల్యూ. బైక్, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నామని కమిషనర్ వెల్లడించారు.

పాక్ ఉగ్రసంస్థ సానుభూతిపరుడి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుణ్ని నాలుగు రోజుల కిందటే అదుపులోకి తీసుకుని విచారించినా.. ఎలాంటి సమాచారం చెప్పనన్నట్లు తెలిసింది. శనివారం ఉదయం ఇన్‌ఛార్జి డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో నూర్ మహమ్మద్‌ను అరెస్టు చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు, ఉగ్రవాద సంస్థలకు మద్దతు, దేశద్రోహం తదితర సెక్షన్ల కింద ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. కదిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి లోకనాథ్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితుణ్ని కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

పరారీలో ప్రియురాలు

భార్యాబిడ్డలకు దూరంగా ఉంటున్న నూర్ మహమ్మద్ అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఓ మహిళతో సహజీవనం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.



నిందితుణ్ని అరెస్టు చేస్తున్న ధర్మవరం పోలీసులు

నూర్ అరెస్ట్ వార్త తెలియగానే ఆమె పరారైనట్లు తెలిసింది. ఆమె వద్ద సిమ్‌కార్డులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. లోనికోటలోని నూర్ ఇంటిని ఇటీవలే ఆధునికీకరించారు. ఇందుకోసం ఉగ్ర సంస్థల నుంచి ఆర్థిక సాయం ఏమైనా అందిందా అన్న కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు.

'నో ఇండియా.. ఐ లవ్ పాకిస్థాన్'

ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన ఆటో డ్రైవర్ రియాజ్ గురువారం రాత్రి వాట్సప్‌లో 'నో ఇండియా.. ఐ లవ్ పాకిస్థాన్' అని స్టేటస్ పెట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే ఆ యువకుణ్ని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించి, పంపించారు. శనివారం ఉదయం నూర్ ఉదంతం వెలుగుచూడటంతో అతనితో సంబంధాలున్నాయన్న అనుమానంతో రియాజ్‌ను మళ్లీ స్టేషన్‌కు పిలిపించారు. నూర్.. జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ నిర్వహిస్తున్న 37 వాట్సప్ గ్రూపుల్లో సభ్యుడిగా ఉన్నట్లు సమాచారం. 2016 నుంచి వారితో తరచూ వీడియోకాల్స్, చాటింగ్ చేస్తూ అనుబంధం కొనసాగించినట్లు తెలిసింది. వారు 2,250 పేజీల ఉగ్రవాద సాహిత్యం పంపించగా నూర్ అందులో 450 పేజీలు ప్రింట్ తీసుకున్నట్లు గుర్తించారు. అతనికి ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లోని సానుభూతిపరులతోనూ సంబంధాలున్నాయని సమాచారం.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
ఆదివారం ఆగస్టు 17, 2025




గోకుల బాల.. వేణుగోపాల..



కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఊరూవాడా పండగ చేసుకుంది. శ్రీకృష్ణుడు పుట్టినరోజున జిల్లాలో వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. దేవదేవుడిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలు సందడిగా సాగాయి. విజయవాడలోని యనమలకుదురు ఇస్కాన్ ఆలయంలో సందడి కనిపించింది. చిన్నారులు శ్రీకృష్ణ వేషధారణలో ఆకట్టుకున్నారు. - ఈనాడు, అమరావతి

కృష్ణం వందే జగద్గురుమ్



నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామిని ఆభరణాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించి 9 రకాల ప్రసాదాలు నివేదించారు.

- నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే

దారుల్లో అగాధాలు.. అల్లాడే ప్రాణాలు!

- వేసవిలో చేయాల్సిన పనులు.. వర్షాల వేళ
- భారీ గుంతల్లో నీళ్లు చేరి ప్రాణాలకు ముప్పు

ఈనాడు, అమరావతి

వేసవిలో చేయాల్సిన డ్రెయినేజీ కాలువలు, మ్యాన్‌హోళ్లు, రహదారుల పనులను.. వర్షాలు జోరుగా పడుతున్న ఈ సమయంలో చేపడుతున్నారు. వర్షాకాలం వచ్చేలోపే ఈ పనులు పూర్తిచేయాలని స్పష్టమైన ఆదేశాలున్నా అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. రహదారుల మధ్యలో.. లారీలు పడినా మునిగిపోయేంత భారీ గుంతలు తీసి.. వదిలేశారు. తాజాగా వన్‌టౌన్‌లో గులాం మొహిద్దీన్ వీధిలోని ఇలాంటి ఓ గుంతలోనే పడి ఒకరు ప్రాణాలు సైతం కోల్పోయారు.

భూగర్భంలో ఉన్న మ్యాన్‌హోళ్లు, వాటర్ పైప్‌లైన్ మరమ్మతుల కోసం ఈ గుంతలను తవ్వారు. ఇలాంటి వాటిని యుద్ధప్రాతిపదికన.. కేవలం ఒకటి రెండు రోజుల్లో పూర్తిచేయాల్సి ఉన్నా.. నెలలుగా సాగదీస్తున్నారు. విజయవాడను ఆనుకుని ఉన్న తాడిగడప మున్సిపాలిటీలోనూ ఇదే దుస్థితి. దీంతో ఈ మరమ్మతులు జరిగే రహదారుల్లో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని.. వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు.

విజయవాడ నగరపాలిక పరిధిలో రూ.23 కోట్లతో రహదారులు, రూ.3.30 కోట్లతో మ్యాన్‌హోళ్లు ఎత్తు పెంచడం, కాలువల మరమ్మతులు చేపట్టే పనులకు టెండరు వేసిన వేసవిలోనే పనులు ప్రారంభించారు. ఈ పనులు జూన్ లోపే పూర్తిచేయాలని చెప్పినా.. గుత్తేదారులు ఆలస్యంగా ఆరంభించడంతో.. ప్రస్తుతం ప్రమాదకరంగా మారాయి.

ఒకరిని మింగేసింది

మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి.. విజయవాడ పాతబస్తీ గులాం మొహిద్దీన్ వీధిలోని ఈ గుంత నీటితో నిండిపోయింది. దీనిలో పడి ఒకరు చనిపోయారు.





ఏనుగైనా మునుగుతుంది..

విజయవాడ వన్‌టౌన్ సుబ్బరామయ్య వీధిలో గత కొన్ని రోజులుగా ఇలా రహదారి మధ్యలో భారీ గుంతను తవ్వి.. మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు నత్తనడకన సాగిస్తున్నారు.



చినుకు రాలిందో ఇక చుక్కలే...

విజయవాడలో కోమలవిలాస్ సెంటర్ వద్ద కొన్ని రోజులుగా సాగుతున్న మ్యాన్‌హోల్, పైప్ లైన్ మరమ్మతులు ఇవి.. దారి మధ్యలో ఇలా చిన్న టేపు కట్టి వదిలేశారు. భారీ వర్షం పడితే.. మొత్తం మునిగి.. అసలు ఇవేవీ కనిపించక పోవడంతో.. ప్రమాదాలు తప్పవు.



రోడ్డు వేసే సమయమిదా..

బ్రాహ్మణవీధి సమీపంలో ఓ రహదారి పనులు మంచి ముహూర్తం చూసుకుని.. వర్షాల వేళ ఆరంభించారు. పని ఎలాగూ సాగడం లేదు. రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయేలా.. రోడ్డుపైనే ఇసుక, కంకర తెచ్చి పోసేసి వెళ్లిపోయారిలా.



ఇక్కడ నడవాలంటే నరకమే..

విజయవాడ వన్‌టౌన్‌లో రహదారి మధ్యన భారీ గుంత తవ్వి పనులు చేస్తున్నారు. పరిసర ప్రాంత ప్రజలు గుంత పక్క నుంచే ప్రమాదకరంగా నడిచి వెళుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరీ దారుణం.



తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని చలసానినగర్‌లో కాల్వ నిర్మాణానికి రోడ్డుపక్కన భారీగా గుంతలు తవ్వేశారు. వర్షానికి గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. ఇద్దరు మనుషులు మునిగేంత లోతులో ఈ గుంతలున్నాయి. కాలు తడబడితే అంతే..

గౌతు లచ్చన్న.. యువతకు ఆదర్శం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న.. నేటి యువతకు ఆదర్శనీయులని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో పాటు పడ్డారని కలెక్టర్ కొనియాడారు.

అయిదు మండలాల్లో వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని 5 మండలాల్లో వర్షం పడింది. శనివారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. తిరువూరు 4.6, వత్సవాయి 4, గంపలగూడెం 2, రెడ్డిగూడెం 1.2, ఇబ్రహీంపట్నంలో 0.2 మిల్లీ మీటర్ల మేర వర్షం కురిసింది.

నిలకడగా కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం శనివారం ఉదయం తగ్గుముఖం పట్టింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నిలకడగా ఉంది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 2.59 లక్షల క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 2.56 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎగువ నుంచి వచ్చే వరద 2,51,653 క్యూసెక్కులకు తగ్గింది. 2.49 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 2,46,884 క్యూసెక్కులు రాగా, 50 గేట్లను ఆరు అడుగులు, 20 గేట్లను 5 అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 2,44,250 క్యూసెక్కులు విడుదల చేశారు. రాత్రి 8 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు 2,634 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 2,118, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 516 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. గుంటూరు ఛానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

వాగుల్లో ఉద్ధృతంగా ప్రవాహం: కృష్ణా నదిలో విలీనమయ్యే వివిధ వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పులిచింతల (వజినేపల్లి) వైపు నుంచి 1,31,195, పాలేరు నుంచి 11,580, కీసర (మునేరు) నుంచి 35,290 క్యూసెక్కుల వరద ప్రవాహం నదికి ఎగువన ఉంది. బుడమేరు (వెలగలేరు) నుంచి ప్రవాహం లేదు.

బ్యారేజీ 67వ గేటుకు మరమ్మతులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రకాశం బ్యారేజీ 67వ కానా గేటు గొలుసు, వరద ప్రభావం వల్ల మూడు రోజుల క్రితం తెగిపోయింది. ఈ కానా విజయవాడ వైపు ఉంటుంది. అప్రమత్తమైన జలవనరుల శాఖ అధికారులు వెంటనే మరమ్మతులు చేశారు. దీనికి సంబంధించిన రోలర్ స్ట్రక్ అయింది. ముందు జాగ్రత్త చర్యగా ఈ గేటును మూసి ఉంచారు. వరద ప్రభావం తగ్గాక పూర్తి స్థాయి మరమ్మతులు చేయనున్నారు. గేటు దెబ్బతిందని, ఫలితంగా నగరానికి వరద ముప్పు పొంచి ఉన్నట్టు వస్తున్న వదంతుల్లో నిజం లేదని కృష్ణా నది సంబంధిత జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేశారు.

మునేరు ఉగ్రరూపం


- లింగాల కాజ్‌వేను తాకిన వరద నీరు
- రాకపోకల నిలిపివేత.. అధికారులు అప్రమత్తం

వత్సవాయి, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తెలంగాణ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరులో వరద ఉద్ధృతి పెరిగింది. గత మూడు రోజులుగా నిలకడగా ఉన్న వరద శనివారం సాయంత్రం ఒక్కసారిగా పెరగడంతో పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. పోలంపల్లి ప్రాజెక్టు వద్ద నీటి మట్టం 12 అడుగులకు చేరడంతో వరద 30 వేల క్యూసెక్కులకు పెరిగింది. సమాచారం తెలుసుకున్న వత్సవాయి తహసీల్దారు వెంకటేశ్వరరావు, ఆర్ఐ జనార్దన్ లింగాల కాజ్‌వేను పరిశీలించారు. వరద కాజ్‌వే అంచును తాకుతూ పారుతుండడంతో ఇరువైపులా సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేశారు. రాకపోకలను నిలిపివేశారు. నదీ పరివాహక గ్రామాల్లోని ప్రజలు నదిలో దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పెనుగంచిప్రోలు వద్ద మునేరు ఉద్ధృతంగా పారింది. ఎత్తైన కాజ్‌వే ఉండడంతో రాకపోకలు సాఫీగా సాగాయి. తిరుపతమ్మ దేవాలయం వద్ద నదిలోకి భక్తులు, స్థానికులు దిగకుండా ఎస్సై అర్జున్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



లింగాల వద్ద వంతెన అంచును తాకుతూ ఉద్ధృతంగా ప్రవాహం

ఆనందాలు.. రయ్ రయ్!





కూటమి ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై మగువల నుంచి హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి. ఏ గుర్తింపు కార్డునైనా చూపించి బస్సుల్లో వీరు ఉచితంగా ప్రయాణించవచ్చు. విజయవాడ సెంట్రల్ పరిధిలో కార్యక్రమాన్ని సింగ్‌నగర్ పైపులరోడ్డు వద్ద ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమ.. శనివారం నియోజకవర్గ మహిళలతో కలిసి ప్రారంభించారు. ఆయన కాసేపు బస్సు నడిపారు. మహిళలకు ఉచిత టికెట్లు జారీ చేశారు. ఉచిత ప్రయాణంపై నారీమణుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

- ఈనాడు, అమరావతి- పాయకాపురం, న్యూస్‌టుడే

సేవ చేసే నాయకులకే గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని). వేదికపై విప్ తంగిరాల సౌమ్య, దేవినేని ఉమా, నాయకులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: దశాబ్దాలు గడిచినా సేవ చేసే నాయకులను మాత్రమే ప్రజలు గుర్తుంచుకుంటారని, అందుకు నిదర్శనమే దేవినేని వెంకటరమణ అని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శనివారం రాత్రి కంచికచర్ల మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో దేవినేని, తంగిరాల కుటుంబాలది విడదీయరాని బంధమని అన్నారు. ప్రభుత్వ విప్ సౌమ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో గత అయిదేళ్లుగా కోగంటి ఎనలేని సేవలు అందించారన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ గత వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమయ్యిందని విమర్శించారు. అనంతరం యార్డు అధికారులు.. ఛైర్మన్‌గా కోగంటి బాబు, వైస్ ఛైర్మన్‌గా తోట రవిబాబు, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, నాలుగు మండలాల తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కోగంటి వెంకటసత్యనారాయణ(బాబు)ను మంత్రి కొల్లు రవీంద్ర, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు అభినందించి సన్మానించారు. రైతు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కోగంటి బాబు తెలిపారు.

తెగించినా.. తాత్సారమేనా?!

నిఘా లేక పేట్రేగుతున్న రౌడీషీటర్లు



రౌడీషీటర్ల ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. బహిష్కరణ అస్త్రం ప్రయోగిస్తున్నా వారి కార్యకలాపాలకు అడ్డుకట్ట పడడం లేదు. పోలీసింగ్‌లో సాంకేతికతను గరిష్ఠంగా వినియోగిస్తున్నామని చెబుతున్నా.. ఈవిషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాను రౌడీషీటర్లు విస్తృతంగా వినియోగిస్తున్నారు. వీటిలో విద్వేషాలను రెచ్చగొట్టే వీడియోలు చేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఫలితంగా వారి మధ్య గ్రూపు తగాదాలు జరిగే ప్రమాదం ఉన్నా పట్టించుకోవడం లేదు. రెండేళ్లుగా ఇలాంటి జరుగుతున్నా గత అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం లేదు. – ఈనాడు, అమరావతి

పెరుగుతున్న ప్రమాదకర ధోరణి...

పలువురు రౌడీషీటర్లు సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలకంగా ఉంటున్నారు. సినిమాల తరహాలో ఎదుటి పక్షాలకు హెచ్చరికలతో కూడిన వీడియోలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో పోస్టు చేస్తున్నారు. ఇలాంటివి గ్రూపుల మధ్య ఆధిపత్య పోరుకు ఆజ్యం పోస్తున్నాయి. రీల్స్, షార్ట్స్ వంటి వాటితో తమ వీడియోలను విస్తృతంగా సర్క్యులేట్ చేస్తూ ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి పెడధోరణులతో కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్నారు.

నగరంలోని రెండో పట్టణ ఠాణా పరిధిలో ఏసోబు.. మరో ఇద్దరితో కలసి చేసిన రీల్స్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పోలీసుల నిఘా లోపాన్ని ఇది ఎత్తిచూపుతోంది. పీకలు కోస్తాం.. లోపలకు వెళ్తాం అని ప్రత్యర్థులను హెచ్చరిస్తూ వీడియో పెట్టాడు. ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆ వీడియోలో గంజాయిని పక్కన పెట్టుకుని మరీ చేయడం బరితెగింపే. ఇది బయటకు వచ్చాక కానీ పోలీసులు స్పందించలేదు.

ఇన్‌స్టాగ్రామ్‌లో గంజాయి అమ్మకాలు..

విజయవాడ కమిషనరేట్ పరిధిలో మొత్తం 470 మంది రౌడీషీటర్లు, 350 మంది వరకు సస్పెక్ట్ షీటర్లు ఉన్నారు. వీరిలో సగం మంది క్రియాశీలకంగా ఉంటున్నారు. పలువురు నేరచరిత్ర ఉన్న వారితో కలిసి చురుగ్గా వ్యవహరిస్తున్నారు. చాలా మంది గంజాయిని తమ ముఖ్య ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఇన్‌స్టాలో చట్టవ్యతిరేక వీడియోలను పోస్టు చేయడంతోపాటు గంజాయి విక్రయాలకు దీనిని అడ్డాగా ఉపయోగిస్తున్నారు. ప్రత్యేక గ్రూప్‌లు పెట్టి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రతి వారం రౌడీషీటర్లు సంబంధిత స్టేషన్‌కు వచ్చేలా చూసేందుకు బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేశామని పోలీసులు చెబుతున్నారు. అంతకు మించి వారిపై నిఘా ఉండడం లేదు.

నిర్లిప్త వైఖరితో నష్టం

రౌడీషీటర్లను నగర బహిష్కరణ విధిస్తున్నా.. కొందరు నగరం బయటా కార్యకలాపాలు సాగిస్తూ, ఇక్కడ చక్రం తిప్పుతూనే ఉన్నారు. పోలీసులు ఇంతటితో చేతులు దులుపుకోకుండా తదనంతర కార్యకలాపాలపై నిఘా ఉంచితేనే ప్రయోజనం. వారి సామాజిక మాధ్యమ ఖాతాలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. సాంకేతిక అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా మంది రౌడీషీటర్లు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటూ.. వారి కార్యకలాపాలను ఇందులో ఉంచుతున్నారు. వీటిపై నిఘా ఉంచడంలో విఫలం అవుతున్నారు. ఎవరెవరు ఏయే పోస్టులు పెడుతున్నారు? వాటిని ఎవరు ఫాలో అవుతున్నారు? లైక్‌లు కొడుతోంది ఎవరని? పకడ్బందీగా వ్యవహరిస్తేనే రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసే వీలుంది.

సౌరభం తోడుగా.. లాభాల డ్రైవ్!

- సౌర డ్రయ్యర్లతో లాభాల పంట
- ధర లేని పంటలకు విలువ జోడింపు
- విదేశాలకు ఎగుమతి చేస్తూ ఆదాయం

ఈనాడు, అమరావతి



కొత్తూరు తాడేపల్లిలో సౌర డ్రయ్యర్లు

ప్రకృతి విపత్తులతో పంట నాణ్యత దెబ్బతిన్నా.. మార్కెట్ ఒడుదొడుకులతో ధర భారీగా పడిపోయినా.. ఉత్పత్తి ఎక్కువగా ఉండి గిట్టుబాటు కాకున్నా.. రైతులకు నష్టాలే శరణ్యం. ఈ తరహా విపత్తుల నుంచి కర్షకులకు ఊరట కల్పించేలా అడుగులు పడుతున్నాయి. సోలార్ డ్రయ్యర్లను ఏర్పాటు చేసి పంటలకు విలువ జోడిస్తున్నారు. ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసి లాభాలు పండిస్తున్నారు.

రైతుకు దన్నుగా... సాధారణంగా కోసిన పండ్లు, కూరగాయలు, పూలు, ఇతర ఏ పదార్థాలైనా కొన్ని రోజులే నిల్వ ఉంటాయి. అదే పదార్థాలను డ్రై చేస్తే ఆరు నెలలు నిల్వ ఉంటాయి. గిట్టుబాటు ధర లేనప్పుడు, తెగుళ్ల తాకిడికి.. నాణ్యతలేమితో అమ్ముడుపోనప్పుడు ఈ డ్రయ్యర్లతో ఎంతో ఉపయోగం. ఎండబెట్టడంతో ఆహార పదార్థాల పోషకాల్లో ఏ తేడా ఉండదు. మొదటి గ్రేడ్ పంట వెంటనే అమ్ముకుని కొంత నాణ్యత తక్కువ ఉన్న పంటలను డ్రై చేస్తే రైతులకు రెండు విధాలా ఆదాయం. విజయవాడ పరిసరాలే కాక.. కొత్తూరు తాడేపల్లి, ఉయ్యూరు, గుంటుపల్లి, ఆగిరిపల్లి తదితర ప్రాంతాల్లో 10కి పైగా సౌర డ్రయ్యర్లు నిర్వహిస్తున్నారు.



డ్రయ్యర్లలో ఉత్పత్తులు ఎండబెడుతూ

ఖండాంతరాలు దాటిస్తూ... ఈ ఉత్పత్తులకు రాష్ట్రంలో కంటే ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో డిమాండ్ బాగా ఉంది. ఇండోర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలే కాక... వివిధ దేశాల్లో కొన్ని కంపెనీలు డ్రయ్యర్ల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకుని ప్రతి సంవత్సరం లక్షల టన్నుల ఉత్పత్తులు కొంటున్నాయి.

ప్రత్యేకత ఇలా... ✪ అమెరికా వంటి దేశాల్లో మైదాకు ప్రత్యామ్నాయంగా అరటి పౌడర్‌ను బేకరీల్లో వాడుతున్నారు. ✪ కూరల్లో చింత పండు బదులు పచ్చి మామిడి పొడిని (ఆంచూర్) వినియోగిస్తున్నారు. ✪ అరబ్ దేశాల్లో డ్రై చేసిన పూలకు డిమాండ్ ఉంది. అత్తర్లు, సుగంధ ద్రవ్యాల తయారీలో వాడుతున్నారు. ✪ మామిడి, అరటి, పనస, అరటి, అల్లం, మిరియాలు, కరివేపాకు, మునగాకు, గోంగూర, కొత్తిమీర, గులాబీలు, పసుపు తదితరాలను డ్రై చేస్తున్నారు. ✪ ఆకుకూరలను ఎండబెట్టి.. పొడిగా మార్చి ప్యాక్ చేసి ఎగుమతి చేస్తున్నారు. ✪ మామిడి పండ్లతో తాండ్ర చేస్తున్నారు.

"విదేశాల్లో తాజావి దొరుకుతున్నా ధర ఎక్కువ కావడంతో ఇక్కడ నుంచి ఇతర దేశాలకు వెళ్లే వారు సైతం డ్రై పదార్థాలను తీసుకెళ్తున్నారు. ఒక 500 కేజీల సౌర డ్రయ్యర్ ద్వారా నెలకు రూ.10-15 వేలు ఆదాయం పొందవచ్చు."

రాయితీతో చేయూత... సౌర డ్రయ్యర్ ఏర్పాటుకు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ 35 శాతం రాయితీ ఇస్తోంది. 500 కేజీల సామర్థ్య సౌర డ్రయ్యర్ ధర రూ.2.2 లక్షలు. ఇందులో 10 శాతం సొమ్ము చెల్లిస్తే 90 శాతం బ్యాంకు రుణం ఇస్తుంది. దీంతో యంత్రం సమకూర్చుకోవచ్చు. తర్వాత 35 శాతం రాయితీ సొమ్ము రూ.77 వేలు జమవుతుంది. పండ్లు, కూరగాయలు, పూల.. డ్రయింగ్‌కు ముందు నిల్వ చేయడానికి ఉద్యాన శాఖ శీతల గదులను 40 శాతం రాయితీపై అందిస్తోంది.



ప్యాకింగ్ చేసి డ్రై చేసిన ఉత్పత్తులు



సమన్వయంతో సుసాధ్యం..!

సైబర్ నేర పరిశోధనలో సులువుగా పోలీసింగ్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

★ సుబ్బారావు రైలు ఎక్కుతుండగా ఓ వ్యక్తి చరవాణి లాక్కుని క్షణాల్లో మాయమయ్యాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో.. సదరు చరవాణి బిహార్‌లో వాడుతున్నట్లు గుర్తించారు. రూ.20వేల విలువైన ఫోన్‌ను తీసుకువచ్చేందుకు పోలీసు సిబ్బందిని అక్కడికి పంపి తీసుకురావడం ఒకింత కష్టమే. ప్రతి రోజూ నగరంలో పదుల సంఖ్యలో చరవాణులు చోరీకి గురవుతుంటాయి. వీటిని ఇతర రాష్ట్రాల్లో విక్రయించేస్తారు. వాటిని స్వాధీనం చేసుకోవాలంటే తలకు మించిన భారమే.

ఈ ఇబ్బందులను తొలగించేందుకు కేంద్ర హోంశాఖ వినూత్న కార్యక్రమం చేపట్టింది. దేశంలోని అన్ని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్లను అనుసంధానం చేస్తూ 'జాయింట్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ టీమ్' పేరుతో 'సమన్వయ' అనే సరి కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను 7 రీజియన్లుగా విభజించి వాటి పరిధిలో ఉండే అన్ని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్లను వీటి పరిధిలోకి చేర్చారు.

'సమన్వయ'లో సకల వివరాలు

సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ల పూర్తి వివరాలను ఈ 'సమన్వయ' పోర్టల్‌లో ఉంచారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ల అధికారులు లాగిన్ అయ్యేందుకు ఐడీలు ఉంటాయి. విజయవాడలో పోయిన చరవాణిని ఇతర రాష్ట్రాల్లో ఎవరైనా వాడుతుంటే.. దాని లొకేషన్‌ను గుర్తిస్తారు. అందులో వేసిన చరవాణి నంబరును, ఫోన్ కాల్స్ వివరాలు సేకరిస్తారు. 'సమన్వయ' పోర్టల్ ద్వారా సంబంధిత సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ అధికారికి కేసు వివరాలు పంపిస్తారు. చోరీకిగురైన ఫోన్ వాడుతున్న వ్యక్తి వద్దకు సిబ్బంది వెళ్లి దానిని స్వాధీనం చేసుకుంటారు. లేదా ఆ వ్యక్తితోనే చరవాణిని కొరియర్ చేయిస్తారు.




విజయవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్న చరవాణులు

96 చరవాణులు రప్పించారు

ఈ నెల 12న విజయవాడలో చోరీకి గురైన, పోయిన 600 చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 96 చరవాణులు ఇతర రాష్ట్రాల్లో వాడుతుండగా.. వాటిని అక్కడి నుంచి రప్పించారు. 'సమన్వయ' పోర్టల్‌తోనే ఇది సాధ్యమైంది. అలాగే ఇతర రాష్ట్రాల్లో చోరీ అయి విజయవాడలో వాడుతున్న 32 చరవాణులను విజయవాడ పోలీసులు ఇదే విధంగా.. స్వాధీనం చేసుకుని రాజస్థాన్, గుజరాత్, పుణె, దిల్లీ పోలీసులకు అప్పగించారు.

రాష్ట్రం	ఫోన్లు
ఒడిశా	20
కర్ణాటక	18
మహారాష్ట్ర	16
రాజస్థాన్	13
ఉత్తర్‌ప్రదేశ్	12
బిహార్	10
పశ్చిమ్‌బంగా	7



చరవాణిని ప్రత్యేకమైన కవర్‌లో పెట్టి యజమానికి అందిస్తామంటున్న సీపీ

పోలీసింగ్ సులువు: సమన్వయ పోర్టల్‌తో పోలీసింగ్ సులువుగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఎవరికైనా నోటీసులు జారీ చేయాలంటే గతంలో పోస్టు ద్వారా పంపేవారు. వాటిని అక్కడి వారు తీసుకునేందుకు నిరాకరించవచ్చు. ఇప్పుడు అవే 41ఏ నోటీసులను 'సమన్వయ' పోర్టల్‌లో పెడితే.. స్థానిక పోలీసులు వెళ్లి ప్రత్యక్షంగా అందజేస్తారు.

'ఈనాడు' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 19న ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో మూడు విభాగాల్లో ఛాయాచిత్రాల పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను కలెక్టర్ జి.లక్ష్మీశ శనివారం విడుదల చేయగా.. 'ఈనాడు' ఫొటోగ్రాఫర్లకు మూడు విభాగాల్లోనూ అవార్డులొచ్చాయి. ★ తల్లికి వందనం, విద్య, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ఫొటో విభాగంలో.. ఎం.పి.ఎస్.కె.దుర్గాప్రసాద్, బి.మరిడయ్య, వై.వి.వి.సత్యనారాయణ, ఎం.సంపత్‌కుమార్‌కు ప్రోత్సాహక బహుమతులొచ్చాయి. ★ ఉత్తమ న్యూస్ ఫొటో విభాగంలో బి.మరిడయ్య, పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర అంశంలో చల్లా మల్లికార్జునకు ప్రోత్సాహక బహుమతులొచ్చాయి.

బ్యారేజీ గేటు విరిగిందని అసత్య ప్రచారం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీ 67వ గేటు విరిగిపోయిందని అసత్య ప్రచారం చేసిన సుమన్ టీవీ యూట్యూబ్ ఛానల్‌పై వన్‌టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన యూట్యూబ్ ఛానల్‌పై చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ సత్య రాజేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల వివరణ లేకుండా అసత్య ప్రచారం చేసినందుకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక.. ఎకో టూరిజం అభివృద్ధికి కృషి



స్వామికి హారతి ఇస్తున్న ఎంపీ శివనాథ్, పక్కన ఎమ్మెల్యే రామమోహన్, భవకుమార్ తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: నగరంలో ఆధ్యాత్మిక, ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా విజయవాడ స్వ్యూజిబిట్ సమీపంలోని ఇస్కాన్ జగన్నాథ మందిరానికి శనివారం ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌తో కలిసి వచ్చిన ఎంపీ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల నాటికి నగరానికి పర్యాటక ప్రదేశంగా గుర్తింపు వచ్చేలా విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజ హితాన్ని కాంక్షిస్తూ.. ఇస్కాన్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా ఇస్కాన్ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం హర్షణీయమని పేర్కొన్నారు. సమాజం బాగుండాలంటే ఇటువంటి సంస్థలు మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇస్కాన్ లాంటి సంస్థ అభివృద్ధి చేస్తే సామాజిక ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. అన్నదానాలతో పాటు మాదక ద్రవ్యాల వల్ల సమాజానికి జరిగే దుష్ప్రభావాల గురించి సంస్థ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, రత్నం రమేష్, సొంగా సంజయ్ వర్మ, చరణ్‌సాయి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చీరలు.. అలరించిన యువతులు

కళాంజలి పట్టు చీరలు ధరించి శారద విద్యార్థినుల ఫ్యాషన్ షో



ఫ్యాషన్ షోలో మెరిసిన యువతులు




అలరించిన శాస్త్రీయ నృత్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: మానవ విలువలు నేర్పించే కేంద్రాలు కేవలం విద్యాసంస్థలే అని పాఠశాల, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ పేర్కొన్నారు. స్థానిక శారద కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఎ ప్లస్ కన్వెన్షన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థినులు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కళాంజలి డిజైన్ చేసిన ప్రత్యేక పట్టు చీరలను ధరించి ఫ్యాషన్ షో నిర్వహించారు. ర్యాంప్ వాక్ చేసి హొయలొలికించారు. విడిగా, జంటగా, బృందాలుగా ప్రదర్శనలిస్తూ ఆహూతులకు కనువిందు చేశారు. సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి, చెడు దృష్టిలో పెట్టుకొని వినియోగించుకోవాలని సూచించారు. డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు మాట్లాడుతూ విద్యతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు రాణించాలని కోరారు. శారద విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, సలహాదారు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జి.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

గోపాల.. గోపాల

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం చిన్ని కృష్ణుని జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి వారి మూలవిరాట్‌ను దర్శించుకుని పాల పొంగళ్లతో మొక్కులు చెల్లించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు తిరునఘరి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీకృష్ణపరమాత్మకు ప్రీతిపాత్రమైన పులిహోర, తలిహోర, మిలిహోర, దద్దోజనం, చక్రపొంగలి, క్షీరాన్నం, శనగలు, వడపప్పు, కాయపిండి (9 రకాల ప్రసాదాలు), పానకం నివేదన చేశారు. గోశాలలో గోమాతలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, తెదేపా నాయకులు బెల్లం మధుసూదనరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి ఉట్టి కొట్టే ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో నవనీత కృష్ణుని అలంకరణలో ఉన్న చిన్నికృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు దర్శించుకున్నారు.



నెమలి కృష్ణాలయం వద్ద ఉట్టి కొట్టే వేడుక

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న ఈవో శీనానాయక్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ న్యాయస్థానాల సముదాయంలో బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్, 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు. మహిళా న్యాయవాదులకు పలు పోటీలు నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. తొలిసారిగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని జడ్జిలు ఎ.సత్యానంద్, ఎం.సునీల్‌కుమార్‌లు పేర్కొన్నారు. బీబీఏ కార్యవర్గ సభ్యులు కె.వి.రంగారావు, పిల్లా శ్రీనివాసరావు, జి.వరాహలక్ష్మి, ముద్దాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై కనులపండువగా..

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కృష్ణాష్టమి వేడుకలు శనివారం కనులపండువగా నిర్వహించారు. ఈవో శీనానాయక్ దంపతులతో ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వేదపండితులు ప్రత్యేక పూజలు చేయించారు. సాయంత్రం రాజగోపురం ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉద్యోగుల ఆనందంగా నిర్వహించారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు కృష్ణాష్టమి వేడుకలను ఆసక్తిగా తిలకించారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, ఏసీ రంగారావు, ఏఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తులు సత్యానంద్, సునీల్‌కుమార్ తదితరులు..

పాడి పరిశ్రమ అభివృద్ధికి చంద్రబాబు కృషి

మునగచర్ల(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: గుజరాత్ తరహాలో మన రాష్ట్రంలోనూ పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. శనివారం మునగచర్లలోని పీ4లో భాగంగా కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కేడీసీసీబీ ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన చంద్రన్న సామూహిక గోకులాన్ని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలిసి ఎంపీ ప్రారంభించారు. చిల్లకల్లు పాలశీతల కేంద్రం పరిధిలోని పాడి రైతులకు రూ.1.50 కోట్ల బోనస్ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ పాడి రైతులు ఆర్థికంగా ఎదిగేలా సామూహిక గోకులం షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వపరంగా సహకరిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలుంటే అందులో వీటిని నిర్మిస్తామన్నారు. కృష్ణా జిల్లా 18.5 శాతం జీడీపీ సాధించేలా కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పాడి గేదెల కొనుగోలుకు కేడీసీసీబీ రైతులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తుందన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ సామూహిక గోకులంలోని పశువుల దాణా, గడ్డికోత, పాలు పితికే యంత్రాలను పరిశీలించారు. పెయ్య దూడలు పుట్టేలా లక్ష డోసుల మేలైన పశు వీర్యం రైతులకు ఇవ్వడానికి కృష్ణా మిల్క్ యూనియన్ రూ.కోటి రాయితీ ప్రకటించిందని చెప్పారు. కృష్ణా మిల్క్ యూనియన్.. పీ4లో 5వేల రైతు కుటుంబాలను దత్తత తీసుకుందని తెలిపారు. కేడీసీసీబీ సీఈవో ఎ.శ్యామనోహర్, పశుసంవర్ధశాఖ జేడీ హనుమంతరావు, ఆర్డీవో బాలకృష్ణ, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబు, డైరెక్టర్లు నెలకుదిటి నాగేశ్వరరావు, కోకా వెంకటేశ్వరరావు, సర్పంచి నరసింహయ్య, పాలకేంద్రం అధ్యక్షుడు నాగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి, తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు వీరాస్వామి, చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ నందిగామ డీడీ మోసెస్‌వెల్లీ, ఏడీ వెంకట్రావు, తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న గోకులం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, ఎంపీ శివనాథ్, తాతయ్య

వాజ్‌పేయీ సేవలు మరువలేనివి

భవానీపురం, న్యూస్‌టుడే: దేశానికి మాజీ ప్రధాని వాజ్‌పేయీ చేసిన సేవలు మరువలేనివని భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం పేర్కొన్నారు. వాజ్‌పేయీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని భవానీపురంలోని ఉద్యానంలో శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. అడ్డూరి శ్రీరాం మాట్లాడుతూ.. దేశాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందేలా ప్రగతి పథంలో నడిపించారని వెల్లడించారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు రామయ్య, బుల్లబ్బాయి, సురేష్, పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.



భవానీపురంలో వాజ్‌పేయీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రైతు బాంధవుడు గౌతు లచ్చన్న

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: గౌతులచ్చన్న రైతు బాంధవుడని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని అన్నారు. శనివారం గౌతులచ్చన్న జయంతి వేడుకలను పురస్కరించుకుని శనివారం ఆమె కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ... గౌతులచ్చన్న సిక్కోలు ముద్దుబిడ్డగా సుపరిచితులని, ఆయన రైతుల కోసం, బడుగు బలహీనవర్గాల కోసం పోరాడారని కొనియాడారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని తెలిపారు. సిబ్బంది నవీన్, బాలాజీ, విద్యాసాగర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సుహాసిని తదితరులు

వర్షపాతం సాధారణం.. పైపైకి భూగర్భ జలం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

జిల్లాలో ఈ ఏడాది జూన్, జులై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. భూగర్భ జలాల పరంగా చూస్తే.. మే, జూన్, జులై నెలల్లో వృద్ధి చెందాయి. విజయవాడ గ్రామీణ మండలంలో భూగర్భ జలాలు 25 మీటర్ల లోతులో ఉన్నాయి. నగరం చెంతన నివాస ప్రాంతాలు అధికం కావడంతో భూమిలోని నీటిని తోడేస్తున్నారు. ఎనికేపాడులో పరిస్థితిని పరిశీలిస్తే 25.04 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. గంపలగూడెం మండలం ఊటుకూరు గ్రామంలో చాలా అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది జులై నెలలో 5.79 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు, ఈ ఏడాది జులైలో 5.54 మీటర్లకు వచ్చాయి. 0.25 మీటర్లు పెరిగాయి. ఈ ఏడాది మే, జూన్‌లోనూ జలాలు వృద్ధి చెందాయి. ఏటా జూన్ నుంచి ఆ తదుపరి ఏడాది మే వరకు.. ఒక జల సంవత్సరంగా పరిగణిస్తారు.

వర్షపాతం (మి.మీ.లలో)..

నెల/ఏడాది	పడిన వర్షం	సాధారణం	వ్యత్యాసం (శాతం)
జూన్ 2025	105	109	–3
జులై 2025	207	234	–12

వివిధ ప్రాంతాల్లో ఇలా...

భూగర్భ జల మట్టాలను తెలిపే పిజో మీటర్లు జిల్లాలో 70 ప్రాంతాల్లో ఉన్నాయి. 0 నుంచి 3 మీటర్ల లోతులో నీరు ఉన్న ప్రాంతాలు 24 ఉన్నాయి. 3 నుంచి 8 మీటర్ల లోతులో 34 ప్రాంతాలు, 8 నుంచి 12 మీటర్ల లోతులో 7 ప్రాంతాలు, 12 నుంచి 16 మీటర్ల లోతులో 2 ప్రాంతాలు, 20 మీటర్లకు పైబడిన ప్రాంతాలు 3 ఉన్నాయి.

భూగర్భ జలాలు (లోతు మీటర్లలో)

గత ఏడాది	
జులై	5.79
ఈ ఏడాది	
మే	6.28
జూన్	6.04
జులై	5.54

అమరావతిలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఏపీ రాజధాని అమరావతిలో రీజనల్ సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది కుసుకు రవిశంకర్ కోరారు. శనివారం ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దక్షిణ భారత ప్రజలకు సుప్రీం కోర్టు సేవలు అందుబాటులో ఉండేలా అమరావతిలో శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కక్షిదారులు సుప్రీం కోర్టు వరకు వెళ్లాలంటే అధిక వ్యయప్రయాసలు కోర్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు దిల్లీ వరకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. బెంచ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని.. ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల అమరావతి రాజధాని అభివృద్ధి చెందడమే కాకుండా ఆదాయ వనరులు పెరుగుతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆలోచన చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ఎం.రాజశేఖర్, వి.బి.శంకరరావు, టి.ఎస్.విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిశంకర్. పక్కన రాజశేఖర్, విజయశేఖర్

సోనోవిజన్ లక్కీ డిప్ విజేతల వెల్లడి

సీతారాంపురం, న్యూస్‌టుడే : నగరంలోని ఏలూరు రోడ్డు విజయప్లాజా సోనోవిజన్ షోరూమ్‌లో స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని కొనుగోలుదారులకు శనివారం రాత్రి లక్కీ డిప్ నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విచ్చేసి లక్కీ డ్రా తీశారు. హోండా అమేజ్ కారును ఉమామహేశ్వరరావు (విజయవాడ), ఎల్ఈడీ టీవీని షేక్ మీరావలి (పెనమలూరు), రిఫ్రిజిరేటర్‌ను బిందుపావని (ప్రసాదంపాడు), వాషింగ్ మెషీన్‌ను డి.దుర్గాప్రసాద్ (కట్టుబడిపాలెం)లు గెలుపొందారు. విజేతలకు పట్టాభిరామ్ ఫోన్ చేసి, అభినందనలు తెలిపారు. సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పొట్లూరి భాస్కరమూర్తి మాట్లాడుతూ.. కొనుగోలుదారులకు నాణ్యమైన ఉత్పత్తులు, నమ్మకమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోనోవిజన్ టీమ్ తరపున అందరినీ షోరూమ్‌కు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.



హోండా అమేజ్ కార్ విజేత కూపన్ చూపిస్తున్న పట్టాభిరామ్. పక్కన భాస్కరమూర్తి, శివ సంజీవ జనార్దనమూర్తి

తగ్గని వరద.. తప్పని అవస్థ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద శనివారం కూడా రాకపోకలు నిలిచాయి. కట్లేరులో వరద తగ్గక పోవడంతో అధికారులు వంతెనకు ఇరువైపులా రహదారికి అడ్డుగా కంప వేసి పోలీసులతో కాపలా ఏర్పాటు చేశారు. వరద తాకిడికి వంతెన వద్ద మళ్లింపు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రహదారి పొడవునా రాళ్లు నీటిలో కొట్టుకుపోయి గండ్లు పడ్డాయి. వరద తగ్గినా మళ్లింపు రోడ్డుకు మరమ్మతులు చేస్తేనే ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుంది. వరుసగా మూడు రోజుల నుంచి వంతెన వద్ద ప్రయాణాలు నిలిచిపోవడంతో మండల కేంద్రం నుంచి ఏటి అవతల గ్రామాలైన కనుమూరు, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి, తండా, నారికింపాడు గ్రామస్థులు తిరువూరు మండలం మీదుగా 50 కి.మీ ప్రయాణించి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఎరువుల కొనుగోలుకు రైతులు, ఆస్పత్రులకు వెళ్లాల్సిన రోగులు, ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. కట్లేరులో వరద తగ్గితే సోమవారం నుంచి రాకపోకలు పునరుద్ధరించే అవకాశాన్ని పరిశీలిస్తామని అధికారులు తెలిపారు.



మళ్లింపు రహదారిపై ప్రవహిస్తున్న నీరు

ధర వరలు

వంకాయలు-16, టమాటా-48, బెండ-16, పచ్చిమిర్చి-34, కాకర-20, బీర-26, క్యాబేజి-22, క్యారెట్-36/46, దొండ-14, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరుచిక్కుళ్లు-26, దోస-16, సొర-10, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-26, అల్లం-90, మునగ-5/6, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-38, బీట్ రూట్-30, కీరదోస-35, బీన్స్-74, క్యాప్సికమ్-68, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర-10/20, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-13/15 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

కల్లుగీత కార్మికులను ఆదుకోండి



మాట్లాడుతున్న నరసింహమూర్తి. వేదికపై వివిధ సంఘాల నాయకులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం గీత కార్మికులను ఆదుకోకుండా ఉన్న ఉపాధిని దెబ్బతీయడం తగదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.నరసింహమూర్తి అన్నారు. బెల్టు షాపులు తొలగించి కల్లుగీత వృత్తిని రక్షించాలంటూ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3396 మద్యం దుకాణాలు, 75వేల బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్ముతున్నారని పేర్కొన్నారు. విచ్చలవిడి విక్రయాల వల్ల అత్యాచారాలు, అఘాయిత్యాలు, హత్యలు అధికంగా జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకుండా.. తక్షణం అరికట్టాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. బెల్టు షాపులు తొలగించి.. కార్మికుల ఉపాధిని కాపాడే వరకు సంఘం చేపట్టే 58 రోజుల రాష్ట్ర వ్యాప్త పోరాటానికి సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 30వ తేదీన అన్ని జిల్లాల్లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతామని వెల్లడించారు. సెప్టెంబరు 8వ తేదీన మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనర్‌కు, 10వ తేదీన ముఖ్యమంత్రికి సమస్యలపై మెమోరాండాలు సమర్పిస్తామని వివరించారు. ప్రభుత్వ విధానాలు మారని పక్షంలో ప్రజాసంఘాలతో, ప్రజలను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. పలు సంఘాల నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, పి.బాలకృష్ణ, ఎం.భాస్కరయ్య, రమాదేవి, రామన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, చికెన్ స్కిన్‌లెస్ - 233. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

పుదుచ్చేరిలో కాకర్ల యువకుడి దుర్మరణం

6000 Sq.Ft. Total Carpet Area G+2 Commercial Building Near Ironyard, Bhavanipuram Bypass Road, Vijayawada For Bar & Restaurants, Godowns/ Offices/ Showrooms. Cont: 83093 29294.

విజయవాడ మొగల్‌రాజపురం
జమున జ్యోతి ఎంపోరియమ్ వెనుక P&G రెసిడెన్సీ 1st ఫ్లోర్ నందు
3 BHK ఫ్లాట్ రెసిడెన్స్ / ఆఫీసులకు అద్దెకు
88858 89922 92993 58470

విజయవాడ, గూడవల్లి, ఏలూరు రోడ్డు (నేషనల్ హైవే) ఫేస్ టాటా మోటార్స్ ఎదురుగా 12 సెంట్ల కమర్షియల్ స్థలము అద్దెకు / లీజుకు ఇవ్వబడును. సంప్ర ✆ 93979 85555.

MORE CLASSIFIEDS ON PAGES 11

అటుకులతో అదిరిపోయే మిక్చర్



బండి టేస్ట్ గురూ!

సాయంత్రం అయ్యిందంటే చాలు... ఆ బండి దగ్గరకి అటుకుల మిక్చర్ కోసం జనం గుటకలు వేస్తూ వచ్చేస్తారు. అదే నల్గొండలోని శివశంకర్ మిఠాయి దుకాణం వద్ద ఉండే బండి స్పెషాలిటీ. ఈ స్వీట్ షాప్ వాళ్లు యాభై ఏళ్లుగా ఇక్కడ ఈ వ్యాపారం చేస్తున్నారు. రోజుకు 50 కేజీల మిక్చర్ అమ్ముతున్నారు! ఎలా లేదన్నా సాయంత్రం నుంచి రాత్రి వరకూ 400 నుంచి 500 టోకెన్లు తెగిపోతాయంటే నమ్మండి. ఒకటే నిష్పత్తిలో పదార్థాల కలయికే ఈ రుచికి కారణమని నిర్వాహకులు చెబుతున్నారు. దీనికోసం కీరదోస, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, కొత్తిమీర, పుదీనా, క్యారెట్, అన్నీ చిన్నచిన్న ముక్కలుగా తరుగుతారు. తర్వాత వేయించిన అటుకులు, పల్లీలు, బూందీ, ఉడికించిన శనగలు, కార్న్‌ఫ్లేక్స్, చాట్ మసాలా, పసుపు, గరంమసాలా పొడి, కారం, ఉప్పు తగినంత వేసి మొత్తం బాగా కలిపేస్తారు. చివర్లో నిమ్మకాయ పిండి పొట్లం చుట్టి ఇస్తే ఉంటుందీ... ఇది తినడానికి నల్గొండ ప్రాంతవాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వస్తుంటారంటే అర్థం చేసుకోండి!

– ఈనాడు, నల్గొండ

మఖానా రోటీలు





ఫూల్ మఖానా మనందరికీ ఎంతో ఇష్టమైన స్నాక్. కానీ దీంతో రోటీలు కూడా చేసుకునే విధానాన్ని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్తలు తయారుచేశారు. ఈ తామర గింజలను పొడి చేసి చేసే రోటీలు ఎంతో శక్తిమంతమైన ఆహారమని తేల్చారు. 5 కప్పుల మఖానా పిండికి 1 కప్పు గోధుమ పిండి కలిపితే ఇలా రోటీలను తయారుచేయవచ్చుట. రుచి కూడా దాదాపు గోధుమ చపాతీ మాదిరిగానే ఉంటుందట. ప్రతి 100 గ్రాముల మఖానా రోటీలోనూ 10 శాతం ప్రొటీన్, ఇంకా చాలా పీచు పదార్థాలు, పిండిపదార్థాలు, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి మినరల్స్ ఉంటున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

–ఈనాడు, హైదరాబాద్

- మధుమేహంతో ఇబ్బంది పడేవారు మందులు వాడుతూ వీటిని తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుందని తేల్చారు. మరి రోజూ ఒకే తరహా చపాతీని తిని బోర్ కొడుతుంటే, సరదాగా వీటిని ట్రై చేయండి!

aha@eenadu.in

ఆహా! .. ఏమి రుచి



ఊరికే ఫ్రిడ్జ్‌డోర్ తెరవకు!

ఏమీ తోచట్లేదు... తిందామా?
టీవీ ఊరికే ఏం చూస్తాం.. తిందామా?
ఏంటో దిగులుగా ఉంది... తిందామా?
చాలా కోపమొస్తుంది... తిందామా?
మీరు మొదటి మాట అనగానే టింగ్‌మని మైండ్ రెండో మాటతో రెడీ అయిపోతుందా?
అయితే మనం ఎమోషనల్ ఈటింగ్, బింజ్ ఈటింగ్ చేసేస్తున్నామని అర్థం.
అంటే ఏ పనీ లేదు కాబట్టి తినడాన్ని పనిగా పెట్టుకోవడం అన్నమాట.
ఇలా చేయడం వల్ల వద్దన్నా వచ్చే బరువు, వ్యాధులు తప్ప వేరే ఏ ఉపయోగం లేదు.
మరి ఈ అలవాటును మార్చుకునేదెలా...

ఒత్తిడి, యాంగ్జైటీ, ఒంటరితనం, కోపం.. ఇలా ఏ కారణంతో అయినా సరే అధికంగా ఆహారం తీసుకోవాలి అనిపిస్తుంటే దాన్ని ఎమోషనల్ ఈటింగ్ అంటారు. అదే ఏమీ తోచక అలా నోట్లో వేసుకుని నమిలే అలవాటుని బింజ్ ఈటింగ్ అంటున్నారు. ఈ రెండింటి వల్ల శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కెలోరీలు చేరిపోయి అనేక రకాల జబ్బులు తలెత్తుతున్నాయి. కొన్ని టిప్స్ పాటిస్తే వీటి నుంచి బయటపడొచ్చు.

- ఈ అలవాట్లు మరీ ఎక్కువగా ఉన్నాయని వీలైతే... ఏం తింటున్నాం, ఎప్పుడు ఎంత తీసుకుంటున్నాం అనే విషయాన్ని ఒకచోట రాసుకోవాలి. దాని ద్వారా లోనికి వెళ్తున్న ఆహారం లెక్క తెలుస్తుంది.
- ఒత్తిడి తగ్గించుకోవడానికి, ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలి. రిలాక్సేషన్ టెక్నిక్స్, మైండ్‌ఫుల్‌నెస్ పాటించాలి.
- ధూమపానం చేస్తే శరీరానికి ఎటువంటి హాని కలుగుతుందో, ఎలాంటి టాక్సిన్లు విడుదల అవుతాయో... అచ్చం అలాంటి పరిస్థితే మన మనసు ఒంటరితనాన్ని ఫీలైనప్పుడు ఏర్పడుతుంటుంది. దీనివల్ల విపరీతంగా తినాలని అనిపిస్తుంది. అందుకే వీలైనంతగా నలుగురిలో కలవాలి.
- శారీరక వ్యాయామం పెంచాలి. ఇది మానసిక ఆరోగ్యానికీ, ఆహార అలవాట్ల మెరుగుదలకు ఉపయోగపడుతుంది.
- ఎండలో తగినంత సమయం తిరగాలి. విటమిన్-డి తగ్గడం వల్ల కూడా ఆకలిలో తేడా వస్తుంది.
- ఫోన్‌లో చాలామందికి ఫుడ్ రీల్స్ చూసే అలవాటు ఉంటుంది. వాటిని పదే పదే చూడటంతో ఆ రుచులన్నీ తినాలి అనిపిస్తుంది. దీన్ని తగ్గించాలి.
- చిరుతిళ్లు వంటివి కంటికి ఎదురుగా, అందుబాటులో ఉంచుకోకూడదు.
- ఖాళీగా ఉన్నప్పుడల్లా ఫ్రిడ్జ్ డోర్ తెరవకూడదు. చాక్లెట్లు వంటివి వెనక వరుసలో ఉంచాలి.

మైండ్‌ఫుల్ ఈటింగ్ ప్రాక్టీస్ చేయాలి. అంటే తినేటప్పుడు దాని మీద ధ్యాస ఉంచి తినాలి తప్ప ఏదో పని చేస్తూ ఎక్కువగాను తినకూడదు.

– డా.క్రాంతికిరణ్, వెల్‌నెస్ కోచ్

వాక్కాయతో వెరైటీలెన్నో..



ఇది వాక్కాయల సీజన్. ఎరుపు, తెలుపు, నేరేడు రంగుల్లో ఆకర్షణీయంగా ఉండే పుల్లపుల్లటి వాక్కాయలు పప్పులో వేశామంటే.. ఆ రుచి వారెవ్వా అనిపిస్తుంది. చారులో చింతపండుకు బదులుగా, నాన్‌వెజ్‌లో గోంగూరకు ప్రత్యామ్నాయంగా వేస్తూ ఉంటారు. ఇంకా కొత్తగా ఇలా ట్రై చేద్దామా!


చెర్రీలు



కావాల్సినవి: వాక్కాయలు, పంచదార - కిలో చొప్పున, ఫుడ్ కలర్ - ఒకటిన్నర గ్రాములు, సిట్రిక్ యాసిడ్, సోడియం బెంజోయేట్ - 1 గ్రాము.

తయారీ: ఎర్రటి, మెత్తబడని ఒకే పరిమాణంలో ఉన్న వాక్కాయలను ఎంపిక చేసుకోవాలి. వాటిని కడిగి అరలీటరు నీళ్లలో రెండు మూడు నిమిషాలు ఉడికించాలి. ఇలా చేస్తే త్వరగా పాడైపోవు. వీటిని పూర్తిగా కోయకుండా జాగ్రత్తగా విత్తనాలు తీసేయాలి. చక్కెరలో అరలీటరు నీళ్లు పోసి వేడిచేయాలి. పంచదార పూర్తిగా కరిగిపోయాక.. ఫుడ్‌కలర్, సిట్రిక్ యాసిడ్, సోడియం బెంజోయేట్, విత్తనాలు తొలగించిన వాక్కాయలను జతచేయాలి. సెగ తగ్గించి నాలుగు నిమిషాలు ఉడికించాలి. నురగలు వస్తున్నప్పుడు దించేయాలి. ఈ చక్కెర పాకంలో మూడురోజుల పాటు కాయలను అలాగే నాననివ్వాలి. తర్వాత కాయలను పాకం నుంచి టిష్యూ మీదికి తీసి.. నీడలోనే ఫ్యాన్ గాలికి ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల ఒకదానికొకటి అంటుకోవు. వీటిని తడిలేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. అంతే, వాక్కాయ చెర్రీ రెడీ.

క్యాండీలు



కావాల్సినవి : వాక్కాయలు - కిలో, చక్కెర - కేజీ పైన పావు, సిట్రిక్ యాసిడ్, సోడియం బెంజోయేట్ - 1 గ్రాము చొప్పున.

తయారీ: మంచి వాక్కాయలను ఎంచుకోవాలి. దుమ్ము, జిగురు లేకుండా శుభ్రంగా కడిగి.. రెండు మూడు నిమిషాలు ఉడికించాలి. కాయలను తడి లేకుండా తుడిచి సగానికి కోసి విత్తనాలు తీసేయాలి. అరలీటరు నీళ్లలో చక్కెర వేసి పాకం పట్టాలి. అందులో సగానికి కోసిన కాయలు వేయాలి. రెండు నిమిషాల తర్వాత సెగ తీసేయాలి. ఒక రోజంతా ముక్కలను పాకంలోనే ఉంచి తర్వాత తీసి.. నీళ్లతో కడిగి సుమారు పది గంటలు ఆరబెట్టాలి. వాటిని తడిలేని సీసాలో భద్రం చేసుకుంటే.. ఎంచక్కా వాక్కాయ క్యాండీలు తింటుండవచ్చు. వీటిని కిస్‌మిస్‌లా పాయసంలో కూడా వేసుకోవచ్చు.

– ఎం.గోవిందమ్మబాయి, గుంటూరు
– పి.రమేష్, ఈనాడు, గుంటూరు

అట్టు కథలు



అట్టును చందమామలా గుండ్రంగా వేయాలని ప్రయత్నించే భట్టి విక్రమార్కులు ఎందరో! నిజానికి అట్టు వేయడమనేది చెట్టెక్కడమంత కష్టం కాదు, అలా అని మెట్టెక్కడమంత సులభం కాదు. కాకపోతే ఏఐ టెక్నాలజీ అంటే వేళ్ల మీద పని కానీ అట్టేయడం మన వల్ల ఎక్కడయ్యేది? పొరపాటున ప్రయత్నిస్తే చాలు, కార్టూన్ చానెల్‌లో కూడా లేని చిత్ర విచిత్ర జీవులన్నీ కిచెన్‌లోని పెనం మీద జీవం పోసుకుంటాయి.

అసలు అట్టేయడం అనేదాన్ని అరవైఐదో కళగా జాబితాలో చేర్చే తీరాలి. అసలే మనకు తెలిసింది అంతంత మాత్రం అంటే.. అందులోనూ ఒక్కో పిండితో ఒక్కోలా అట్టు వేయాలంటారు మరీ తలనొప్పి కాకపోతేనూ. ముందు పెనం పూర్తిగా వేడెక్కిందో లేదో తెలీదు, మనం వేసిన అట్టు దాన్ని వీడి పైకొస్తుందో అందులోనే భూస్థాపితం అయిపోతుందో తెలియదు. కాలే వరకూ ఎంత టెన్షన్ అని, షేర్‌మార్కెట్‌లోనూ ఉండనంత!

ఒక్కోసారి అట్టు మనలో రంగులను గుర్తించే సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు పరీక్షలు పెడుతుంది. కొంత నల్లగా మాడితే బొగ్గునుంచి రాలిన బూడిదలా, మరీ పూర్తిగా మాడితే ఆ సింగరేణి బొగ్గు నిక్షేపాలే మన ఇంట్లో పడ్డాయనేంత గొప్పగా మాడిపోతుంటుంది. అంతలా మాడిన ఆ అట్టును ఎవరికంటా పడకుండా పారేయడంలో మనలో ఉన్న జేమ్స్‌బాండ్ బయటకొస్తాడు... టిటీటిటీ టిటీటీ.. అని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వేసుకుంటూ మరి. అట్టేయడంలో ఉన్న అడ్వాంటేజ్ ఇది.

అయినా అమ్మ ఓపిగ్గా వేడివేడిగా ఒకటీ ఒకటీ వేసిస్తుంటే, ఒక్కో ముక్కా తుంచుకుంటూ, ఒక ముక్కని కొబ్బరిచట్నీలో ముంచి, మరో ముక్కని పల్లీ చట్నీలో తేల్చి.. అలా నోట్లో వేస్తే వచ్చే ఆనందాన్ని కొలవగలమా? అన్నా చెల్లెళ్లతో నీకిన్ని, నాకిన్ని అని పంచుకుంటూ తినే అట్ల కోసం అల్లిన కట్టు కథలు లెక్కపెట్టగలమా? అట్లతద్దినాడు ఆడపిల్లల సందళ్లు మర్చిపోగలమా? అందుకే తెలుగువారి అట్టు... ఎప్పుడూ సూపర్‌హిట్టు!

మళ్లీ ముసురు కలవరం

18న మరో అల్పపీడనం?

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వాతావరణ శాఖ మళ్లీ ముసురు కబురే చెప్పింది. ఇప్పటికే దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. ఈనెల 18వ తేదీ సోమవారం నాటికి వాయువ్య బంగాళాఖాతం, దీనికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని సూచించింది. దీని ప్రభావం వల్ల సోమవారం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడవచ్చు. ఈ జిల్లాల్లో మంగళవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

'సూపర్-6.. సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం'

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : సూపర్-6.. సూపర్ హిట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్పదమని ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల విమర్శించారు. ఇది హిట్ ఎలా అయిందో చెప్పాలని శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాల్లో ఒక్కరికైనా ఇచ్చారా? అని అడిగారు. నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఏ ఒక్క నిరుద్యోగికైనా అందిందా? చెప్పాలన్నారు. 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళకైనా నెలకు రూ.1500 ఆమె ఖాతాలో పడ్డాయా అని అడిగారు. అన్నదాత సుఖీభవ కింద సొంతంగా రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు మాట మార్చి కేంద్రం ఇచ్చే రూ.6వేలతో లింక్ పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు ఘనమని.. అమలు అంతంతే అని ఆమె విమర్శించారు.

20 నుంచి ఉచిత శిక్షణ తరగతులు

పామర్రు గ్రామీణం: కురుమద్దాలి నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో ఈ నెల 20 నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ శనివారం తెలిపారు. శిక్షణ తరగతులు మూడు నెలల పాటు కొనసాగుతాయన్నారు. 10వ తరగతి.. ఆపై చదివిన నిరుద్యోగ యువతి, యువకులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 80743 70846లో సంప్రదించాలన్నారు.

హోరాహోరీగా యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమట సీహెచ్ ఆర్కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్-2025 కబడ్డీ లీగ్ పోటీలో శనివారం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. రెండో రోజు పోటీలను శాప్ పాలకమండలి సభ్యుడు పేరం రవీంద్రనాథ్ ప్రారంభించారు. అమరావతి క్రషర్స్ జట్టు 51-31 తేడాతో కృష్ణా డిఫెండర్స్‌పై, తిరుపతి రైడర్స్ జట్టు 44-37 తేడాతో వైజాగ్ కమెండోస్ జట్టుపై, విజయనగరం నింజాస్ జట్టు 41-35 తేడాతో కాకినాడ క్రాకెన్స్ జట్టుపై, భీమవరం గార్డియన్స్ జట్టు 44-42 తేడాతో కర్నూలు నైట్స్ జట్టుపై విజయం సాధించాయి. ఒక్కో మ్యాచ్‌లో 'బెస్ట్ రైడర్', 'బెస్ట్ డిఫెండర్'లకు నగదు బహుమతులను పేరం రవీంద్రనాథ్ అందజేశారు.



టాప్ వేసి పోటీ ప్రారంభిస్తున్న శాప్ పాలకమండలి సభ్యుడు పేరం రవీంద్రనాథ్

ఛాంపియన్

సూర్యకుమార్..
రైట్ రైట్


సూర్యకుమార్

దిల్లీ

భారత టీ20 కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ ఫిట్‌నెస్ సాధించాడు. ఈసారి టీ20 ఫార్మాట్లో జరగనున్న ఆసియా కప్ వచ్చే నెల 9న ఆరంభం కాబోతుండగా.. మూడు వారాల ముందే సూర్య ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)లో అతడికి పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఐపీఎల్ అనంతరం సూర్య జర్మనీలోని మ్యూనిక్‌లో హెర్నియా శస్త్రచికిత్స చేయించుకున్నాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఓ క్రికెటర్ శస్త్రచికిత్స చేయించుకుంటే.. తిరిగి జట్టులోకి రావడానికి సీఓఈలో ఫిట్‌నెస్ పరీక్ష పాసవడం తప్పనిసరి. ఆసియా కప్ కోసం జట్టును ఎంపిక చేసేందుకు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మంగళవారం సమావేశం కానున్న నేపథ్యంలో సూర్య.. సీఓఈకి వెళ్లి ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. సెలక్షన్ కమిటీ సమావేశంలో సూర్య కూడా పాల్గొంటాడు. యూఏఈ వేదికగా సెప్టెంబరు 9-28 తేదీల మధ్య ఆసియా కప్ జరుగుతుంది. 10న యూఏఈ మ్యాచ్‌తో భారత్ ఈ టోర్నీని ఆరంభిస్తుంది. 14న దుబాయ్‌లో భారత్, పాకిస్థాన్ తలపడతాయి. ఈ రెండు జట్లూ లీగ్ దశ దాటితే 21న సూపర్-4 మ్యాచ్‌లో మరోసారి ఢీకొనే అవకాశముంది.

అందుబాటులో బుమ్రా: ఆసియా కప్‌లో భారత అగ్రశ్రేణి పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆడే అవకాశముంది. తాను ఈ టోర్నీకి అందుబాటులో ఉంటానని సెలక్టర్లకు బుమ్రా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. పూర్తి ఫిట్‌నెస్ లేకపోవడం వల్ల ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో జస్‌ప్రీత్ మూడు మ్యాచ్‌లే ఆడాడు. నిరుడు టీ20 ప్రపంచకప్ తర్వాత బుమ్రా అంతర్జాతీయ టీ20లే ఆడలేదు. దీంతో ఈ ఫార్మాట్లో మళ్లీ బరిలోకి దిగుతాడా లేదా అన్న సందేహాలు కలిగాయి. కానీ ఆసియా కప్‌లో ఆడేందుకు అతను సిద్ధమయ్యాడు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ వరకు అతను ఈ ఫార్మాట్లో కొనసాగే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది.


బుమ్రా

చివరి బెర్తు సొంతం

అండర్-19 ప్రపంచకప్‌లో అమెరికా



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్లో వడివడిగా అడుగులు వేస్తున్న అమెరికా.. మరో ఘనత సాధించింది. ఇప్పటికే సీనియర్ జట్టు వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించగా.. జూనియర్ జట్టు వచ్చే ఏడాది జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో చోటు దక్కించుకుంది. టోర్నీలో మిగిలిన చివరి బెర్తును యుఎస్ సొంతం చేసుకుంది. కెనడా, బెర్ముడా, అర్జెంటీనా జట్లతో కలిసి జార్జియాలో డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ ఆడిన యుఎస్.. అందులో విజేతగా నిలిచి ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. బెర్ముడా, అర్జెంటీనాలను ఓడించిన అనంతరం కెనడాతో జరిగిన మ్యాచ్‌లో అమెరికా 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 2026 అండర్-19 ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు పోటీ పడతాయి. 2024 టీ20 ప్రపంచకప్‌లో టాప్-10లో నిలిచిన భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఐర్లాండ్ బంగ్లాదేశ్.. ఆతిథ్య హోదాలో జింబాబ్వే నేరుగా బెర్తులు దక్కించుకున్నాయి. మిగతా అయిదు బెర్తులను క్వాలిఫయర్స్ ద్వారా ఎంపిక చేశారు. అఫ్గానిస్థాన్, స్కాట్లాండ్, జపాన్, టాంజానియా, అమెరికా ఇలా అర్హత సాధించాయి.


తన్యా

సైపాన్ టైటిల్ తాన్యా సొంతం

దిల్లీ: భారత యువ షట్లర్ తాన్యా హేమంత్ సైపాన్ ఇంటర్నేషనల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. నార్తర్న్ మరియానా ద్వీపంలో జరిగిన ఈ పోటీల్లో మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ తాన్యా 15-10, 15-8తో అన్‌సీడెడ్ ప్లేయర్ కని సకాయ్ (జపాన్)ను ఓడించింది. బీడబ్ల్యూఎఫ్ కొత్త స్కోరింగ్ పద్ధతిని ప్రయోగాత్మకంగా ఉపయోగించడానికి నిర్వహిస్తున్న టోర్నీల్లో సైపాన్ ఓపెన్ కూడా భాగం. గతంలో ఇండియా ఓపెన్ (2022), ఇరాన్ ఫజర్ ఇంటర్నేషనల్ (2023), బెండిగో ఓపెన్ (2024) టోర్నీల్లో తాన్యా విజేతగా నిలిచింది. గతేడాది అజర్‌బైజాన్ టోర్నీలో రన్నరప్ అయింది.

స్విస్ గ్రాండ్ చెస్

ఓపెన్ బరిలో దివ్య


దివ్య

దిల్లీ: భారత యువ చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్ ఫిడే స్విస్ గ్రాండ్ టోర్నీలో పోటీపడబోతోంది. ఇటీవల ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత స్పీడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఆడి క్వార్టర్స్‌లోనే ఓడిన దివ్య.. స్విస్ టోర్నీలో ఓపెన్ విభాగంలో బరిలో దిగనుంది. సెప్టెంబర్ 3న ఆరంభమయ్యే ఈ టోర్నీలో దివ్యతో పాటు రష్యా అమ్మాయి అలెగ్జాండ్రా గొర్యాచకినాకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ దక్కింది. ఇదే కేటగిరిలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్, అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానంద, విదిత్, పెంటేల హరికృష్ణ, నిహాల్ సరీన్ కూడా ఆడుతున్నారు. స్విస్ టోర్నీ మహిళల విభాగంలో ప్రపంచకప్ రన్నరప్ కోనేరు హంపి, వైశాలి పోటీలో ఉన్నారు. "యువ క్రీడాకారిణులు ఎక్కువ మంది ఓపెన్ టోర్నీల్లో ఆడాలి. పురుషులతో పోటీపడాలి. మహిళా టోర్నీల మీద మాత్రమే దృష్టి సారించకూడదు'' అని ఇటీవల స్టార్ ప్లేయర్ తానియా సచ్‌దేవ్ పేర్కొంది.



జకోవిచ్, డానిలోవిచ్

యుఎస్ ఓపెన్‌లో మెరుపు 'మిక్స్‌డ్'

న్యూయార్క్

ప్రతి గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు జరుగుతాయి. దీని గురించి అభిమానులు పెద్దగా పట్టించుకోరు. సింగిల్స్‌లో ఎవరు ఆడుతున్నారనే విషయంపైనే దృష్టి పెడతారు. కానీ ఈసారి యుఎస్ ఓపెన్లో మిక్స్‌డ్ డబుల్స్‌పై ఓ కన్ను వేయాల్సిందే. పోటీలు జరిగేది కేవలం రెండు రోజులే (ఆగస్టు 19, 20). అంటే మెరుపులా ముగిసిపోతాయి. అయినా అభిమానులకు వినోదం పక్కా. ఎప్పుడూ లేనట్లు యానిక్ సినర్, జకోవిచ్, అల్కరాస్, జ్వెరెవ్, స్వైటెక్ లాంటి స్టార్లు తమ జోడీలతో ఆడబోతుండడమే ఇందుకు కారణం.

- మిక్స్‌డ్ డబుల్స్‌ను ఆకర్షణీయంగా మార్చే క్రమంలో యుఎస్ ఓపెన్‌లో ఈసారి మిక్స్‌డ్ పోటీలను వినూత్నంగా నిర్వహిస్తున్నారు. సింగిల్స్ పోటీలు ఆరంభానికి ముందే, కేవలం రెండు రోజుల్లో విజేతను తేల్చనుండటంతో పాటు.. ప్రైజ్‌మనీ భారీగా దక్కనుండటంతో అగ్రశ్రేణి క్రీడాకారులు బరిలో నిలిచారు. సెట్‌లో ఆరు గేమ్‌లకు బదులు నాలుగు గేమ్‌లను ఆడించడం లాంటి ప్రయోగాలను ఈసారి చేయనున్నారు.
- 16 జోడీలు ఇప్పటికే ఖరారు అయ్యాయి. కంబైన్డ్ సింగిల్స్ ర్యాంకు ఆధారంగా ఎనిమిది జంటలకు నేరుగా ఎంట్రీ దక్కింది. మరో ఎనిమిది జోడీలకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభించింది.
- జకోవిచ్-డానిలోవిచ్, అల్కరాస్-రదుకాను, స్వైటెక్-రూడ్, మెద్వెదెవ్-ఆండ్రీవా లాంటి స్టార్ జోడీల ఆటను ఈ టోర్నీలో చూడొచ్చు.
- 45 ఏళ్ల వీనస్ విలియమ్స్ మిక్స్‌డ్ బరిలో నిలవడం విశేషం. వీనస్-రిలీ ఒపెల్కా ద్వయానికి వైల్డ్‌కార్డ్ దక్కింది. వీనస్ సింగిల్స్‌లోనూ బరిలో ఉంది.
- తాజాగా ఎమా నవారో, బదోసా, టామీ పాల్ మిక్స్‌డ్ డ్రా నుంచి తప్పుకోవడంతో జెస్సికా పెగులాతో కలిసి జేక్ డ్రేపర్ పోటీ పడనున్నాడు. నవారో వైదొలగడంతో ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినర్ మరో భాగస్వామిని ఎంచుకోవాల్సి ఉంది.
- విజేతగా నిలిచిన జంటకు రికార్డు స్థాయిలో రూ.8 కోట్ల 76లక్షల నగదు బహుమతి దక్కనుంది. రన్నరప్ ద్వయానికి రూ.3 కోట్ల 50 లక్షలు దక్కుతాయి.



కరుణ్ నాయర్

ఆరంభాలను సద్వినియోగం చేసుకుంటా

బెంగళూరు: ఆరంభాలను మంచి స్కోర్లుగా మలచాలన్న తన సంకల్పాన్ని ఇంగ్లాండ్ పర్యటన బలోపేతం చేసిందని టీమ్‌ఇండియా బ్యాటర్ కరుణ్ నాయర్ అన్నాడు. ఇంగ్లాండ్ పర్యటనలో కరుణ్ ఆశించినంతగా రాణించలేకపోయిన సంగతి తెలిసిందే. దేశవాళీ క్రికెట్లో పరుగుల వరద పారించి జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్న అతడు.. ఆ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. ఇంగ్లాండ్‌లో ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో 25.62 సగటుతో 205 పరుగులు మాత్రమే చేశాడు. అత్యధికం 57. 40, 31, 26, 21 స్కోర్లు కూడా అతడి ఖాతాలో ఉన్నాయి. ఆరంభాలను అతడు సద్వినియోగం చేసుకోలేకపోయాడని అవి సూచిస్తున్నాయి. దీనిపై కరుణ్ స్పందిస్తూ.. "ఏదో నిరూపించుకోవాలనే ప్రయత్నం నేను చేయలేదు. కొన్నిసార్లు అలా జరుగుతుంటుంది. చాలా మ్యాచ్‌ల్లో చక్కగా ప్రారంభించాక ఔటవుతాం. ఇంగ్లాండ్‌లో నా విషయంలో అదే జరిగింది'' అని అన్నాడు. "సిరీస్ ఆసాంతం నేను బాగానే ఆడాను. ఎక్కువసార్లు బాగానే ఆరంభించా. కానీ ఆరంభాలను పెద్ద స్కోర్లుగా మలవలేకపోయా. ఇది నాకు చాలా అసహనాన్ని కలిగిస్తోంది. 30, 40ల్లో ఎందుకు ఔటయ్యానో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించా. ఆరంభాలను మంచి స్కోర్లుగా మలవాలనే పాఠం నేర్చుకున్నా. నేను చాలా మందితో మాట్లాడాను. వాళ్లు నాకు కొన్ని సలహాలు ఇచ్చారు. వాటిని దృష్టిలో ఉంచుకుని సాధన చేస్తా. అలా చేస్తే.. ఇకపై మెరుగ్గా ఆరంభించినప్పుడు దాన్ని మంచి స్కోరుగా మలవగలుగుతా'' అని కరుణ్ చెప్పాడు. ఇంగ్లాండ్‌లో సిరీస్‌ను 2-2తో సమం చేసిన జట్టులో ఉన్నందుకు గర్వంగా ఉందని అతడు అన్నాడు.


మెరిసిన మ్యాక్స్‌వెల్

దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ ఆసీస్ వశం


మ్యాక్స్‌వెల్

కెయిర్న్స్ (ఆస్ట్రేలియా): గ్లెన్ మ్యాక్స్‌వెల్ (62 నాటౌట్; 36 బంతుల్లో 8×4, 2×6) చాన్నాళ్ల తర్వాత ఓ మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా సొంతం చేసుకుంది. శనివారం నిర్ణయాత్మక మూడో టీ20లో ఆసీస్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట దక్షిణాఫ్రికా 7 వికెట్లకు 172 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (53; 26 బంతుల్లో 1×4, 6×6) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. వాండర్‌డసెన్ (38) కూడా రాణించాడు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎలిస్ (3/31), ఆడమ్ జంపా (2/24), జోష్ హేజిల్‌వుడ్ (2/30) ఆకట్టుకున్నారు. అనంతరం కెప్టెన్ మిచెల్ మార్ష్ (54; 37 బంతుల్లో 3×4, 5×6) జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చినప్పటికీ.. కార్బిన్ బోష్ (3/26), మఫాకా (2/36), రబాడ (2/32)ల ధాటికి ఆసీస్ తడబడింది. ఆ జట్టు 122 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన స్థితిలో మ్యాక్స్‌వెల్ నిలిచాడు. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా తొణకని మ్యాక్సీ.. సఫారీ బౌలర్లపై ఎదురుదాడి చేసి ఆసీస్‌ను గెలిపించాడు. ఈ విజయంతో 3 మ్యాచ్‌ల సిరీస్‌ను కంగారూ జట్టు 2-1తో కైవసం చేసుకుంది. తొలి టీ20లో ఆసీస్ గెలవగా, రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా నెగ్గింది. రెండు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ మంగళవారం మొదలవుతుంది.

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ బాబ్ సింప్సన్ మృతి


బాబ్ సింప్సన్

సిడ్నీ: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ బాబ్ సింప్సన్ కన్నుమూశారు. ఆయన వయసు 89 ఏళ్లు. సింప్సన్ 1957 నుంచి 1978 వరకు 62 టెస్టులు, రెండు వన్డేల్లో ఆసీస్‌కు ప్రాతినిధ్యం వహించారు. టెస్టుల్లో 10 సెంచరీలు సహా 4,869 పరుగులు చేశారు. 71 వికెట్లు కూడా పడగొట్టారు. సింప్సన్ 39 టెస్టుల్లో ఆసీస్‌కు సారథ్యం వహించారు. ఆయన 1986 నుంచి 1996 వరకు ఆస్ట్రేలియా జట్టుకు కోచ్‌గా కూడా పనిచేశారు.

ఆఖరి పోరుకు అనహత్


అనహత్

బెగా (ఆస్ట్రేలియా): భారత యువ స్క్వాష్ ప్లేయర్ అనహత్ సింగ్ ఎన్ఎస్‌డబ్ల్యూ బెగా ఓపెన్లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శనివారం మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్లో ఈ టాప్‌సీడ్ ప్లేయర్ 10-12, 11-5, 11-5, 10-12, 11-7తో నూర్ ఖఫాగి (ఈజిప్ట్)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో గాయమైనా అనహత్ పోరాడి విజయాన్ని అందుకుంది. ఫైనల్లో రెండో సీడ్ హబీబా హని (ఈజిప్ట్)తో అనహత్ తలపడనుంది. మరో సెమీస్‌లో ఆకాంక్ష సాలుంకే 9-11, 11-7, 10-12, 6-11తో హబీబా చేతిలో ఓడింది.

ఛెత్రి లేకుండానే..


ఛెత్రి

దిల్లీ: తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే నేషన్స్ కప్ కోసం ఎంపిక చేసిన 35 మంది భారత ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో స్టార్ స్ట్రైకర్ సునీల్ ఛెత్రికి చోటు దక్కలేదు. కొత్త కోచ్ ఖలీద్ జమీల్ శనివారం ఈ జాబితాను ప్రకటించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికి ఇటీవలే రిటైర్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్న తర్వాత ఛెత్రి నాలుగు మ్యాచ్‌లే ఆడాడు. విశ్రాంతి కావాలనే ఉద్దేశంతో నేషన్స్ కప్‌కు తనను పరిగణనలోకి తీసుకోవద్దని అతడు కోరి ఉంటాడని ఫుట్‌బాల్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది జూన్‌లో కువైట్‌తో మ్యాచ్ తర్వాత ఛెత్రి రిటైర్ అయ్యాడు. ఈ ఏడాది మార్చిలో పునరాగమనం చేసి మాల్దీవులపై ఆడాడు. నాలుగు మ్యాచ్‌ల్లో ఒక గోలే కొట్టాడు. నేషన్స్ కప్‌నకు ఎంపిక చేసిన జట్టులో గోల్‌కీపర్, కెప్టెన్ గుర్‌ప్రీత్ సింగ్, డిఫెండర్లు చింగ్లెన్ సనా సింగ్, రాహుల్ బెకే, రోషన్ సింగ్, సురేశ్ సింగ్ తదితరులు ఉన్నారు. ఈనెల 29న ఆరంభమయ్యే నేషన్స్ కప్‌లో గ్రూప్-బిలో ఉన్న భారత్.. తజకిస్థాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్‌తో కలిసి ఆడనుంది. 29న తజకిస్థాన్‌తో, సెప్టెంబర్ 1న ఇరాన్.. 4న అఫ్గానిస్థాన్‌తో ఆడనుంది.

ఐఎస్ఎల్ క్లబ్‌ల ఆందోళన

దిల్లీ: ఐఎస్ఎల్ నిర్వహణపై అనిశ్చితి కొనసాగితే తమ క్లబ్‌లు పూర్తిగా మూతపడే అవకాశముందని ఆ లీగ్ క్లబ్‌లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్)ను హెచ్చరించాయి. ఈ మేరకు ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబేకు లేఖ రాశాయి. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)ను నిర్వహించే ఎఫ్ఎస్‌డీఎల్, ఏఐఎఫ్ఎఫ్ మధ్య ఒప్పందం పునరుద్ధరణ జరగకపోవడంతో ఐఎస్ఎల్ 2025-26 సీజన్ సందిగ్ధంలో పడింది. ఈ సంక్షోభం వల్ల భారత్‌లో ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ స్తంభించిందని లేఖలో క్లబ్‌లు వాపోయాయి. "2025 ఐఎస్ఎల్ సీజన్ జరగకపోయే ప్రమాదం ఉంది. ఇది కేవలం పరిపాలన పరమైన సమస్య కాదు. భారత ఫుట్‌బాల్ ఉనికికే ముప్పు ఏర్పడింది'' అని చెప్పాయి.

దొంగలు పతకాలు ఎత్తుకెళ్లారు


బులా చౌదరి

కోల్‌కతా: పద్మశ్రీ అవార్డీ, మాజీ స్విమ్మర్ బులా చౌదరి ఇంట్లో దొంగలు పడ్డారు. కెరీర్‌లో ఆమె సాధించిన విలువైన పతకాలను ఎత్తుకెళ్లారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో బులా చౌదరి ఇల్లు ఉంది. ఆమె అక్కడ ఉండట్లేదు. కస్బా ప్రాంతంలో కుటుంబంతో నివసిస్తోంది. హుగ్లీలోని నివాసానికి సమీపంగా ఉండే ఆమె సోదరుడు ఆ ఇంటిని పర్యవేక్షిస్తుంటాడు. ఇటీవలే బులా ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు దొరికిన సొమ్ముతో పాటు పతకాలను కూడా దోచుకెళ్లారు. అర్జున అవార్డు, టెన్సింగ్ నార్కే మెడల్‌ను మాత్రమే వదిలేశారు. "నా కెరీర్‌లో ఎంతో కష్టపడి సంపాదించిన పతకాలను దొంగలు తీసుకెళ్లిపోయారు. వీటిలో శాఫ్ క్రీడల్లో సాధించిన ఏడు స్వర్ణాలు కూడా ఉన్నాయి. అర్జున అవార్డు, టెన్సింగ్ నార్కే పతకాలు చిన్నగా ఉండడంతో వాటిని పట్టించుకోలేదనుకుంటా. గతంలోనూ నా ఇంట్లో చోరీలు జరిగాయి'' అని బులా ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తీవ్రంగా గాయపడితే మ్యాచ్‌లో మరొకరు

దేశవాళీ క్రికెట్లో కొత్త నిబంధన

ముంబయి: ఇకపై దేశవాళీ క్రికెట్లో ఏ ఆటగాడైనా తీవ్రంగా గాయపడితే అతడి స్థానంలో మరో ఆటగాణ్ని ఆడించవచ్చు. 2025-26 దేశవాళీ సీజన్ నుంచి బీసీసీఐ ఈ కొత్త నిబంధనను అమలు చేయనుంది. ఇటీవల అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీలో నాలుగో టెస్టులో పంత్ పాదం విరగగా.. అయిదో టెస్టులో వోక్స్ భుజం స్థానభ్రంశమైంది. దీంతో జట్లకు ఓ ఆటగాడు తగ్గినట్లయింది. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ దేశవాళీ క్రికెట్లో కొత్త నిబంధన తీసుకొచ్చింది. "మ్యాచ్ సందర్భంగా ఆటగాడు తీవ్రంగా గాయపడితే అతడి స్థానంలో అలాంటి మరో ఆటగాణ్ని అనుమతించవచ్చు'' అని సవరించిన ఆట నిబంధనల్లో బోర్డు పేర్కొంది. అంతర్జాతీయ క్రికెట్లో చాలా ఏళ్లుగా కంకషన్ సబ్‌స్టిట్యూట్‌ను అనుమతిస్తున్నారు. ఇతర తీవ్ర గాయాలైన ఆటగాళ్ల బదులు వేరే వాళ్లను తీసుకునే అవకాశం మాత్రం లేదు.

గుకేశ్‌కు ఆరో స్థానం


గుకేశ్

సెయింట్ లూయిస్ (అమెరికా): సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌ను ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ ఉమ్మడిగా ఆరో స్థానంతో ముగించాడు. చివరి రోజు, శనివారం ఈ భారత స్టార్ మెరుగ్గానే ఆరంభించాడు. తొలి నాలుగు గేమ్‌లలో 3.5 పాయింట్లు సాధించాడు. మొదట అరోనియన్‌తో డ్రా చేసుకున్న గుకేశ్.. తర్వాత సాంక్‌లాండ్, వెస్లీ సో (అమెరికా), నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్)లను ఓడించాడు. తర్వాత అయిదు గేమ్‌లలో మూడింటిని డ్రా చేసుకుని.. రెండు ఓడిపోయాడు. దీంతో మొత్తంగా 18 పాయింట్లతో లిమ్ క్వాంగ్ (వియత్నాం)తో కలిసి ఉమ్మడిగా ఆరో స్థానంలో నిలిచాడు. అరోనియన్ (అమెరికా, 24.5) టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఫాబియానో కరువానా (అమెరికా, 21.5), మాక్సిమ్ లాగ్రెవ్ (ఫ్రాన్స్, 21) తర్వాతి రెండు స్థానాలు దక్కించుకున్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

'ఇది చాలదు. చాలా సాధించాలి. గొప్ప శిక్షకుల నుంచి నేర్చుకోవాల్సింది ఇంకా ఉంది. అప్పుడే ప్రపంచ రేసర్ ఛాంపియన్‌గా నిలుస్తా' అంటోంది ఆసియా పసిఫిక్ ర్యాలీ ఛాంపియన్‌షిప్(ఏపీఆర్‌సీ)ఫైనల్స్‌కు అర్హత సాధించిన ఏకైక భారత మహిళా కార్ రేసర్ **నికితా టకలే.**


నికిత

ఓడినరోజే గెలవడం ప్రారంభించాలి!

నికిత... ఇండోనేసియాలోని మెడాన్‌లో గతవారం జరిగిన ఏపీఆర్‌సీ మూడో రౌండ్‌లో తన సహ డ్రైవర్ సుధీంద్రతో కలిసి ఏపీఆర్‌సీ ఆర్‌సీ4, లేడీస్ క్లాస్, సుమతేరా ర్యాలీ ఆర్‌సీ4 అనే మూడు టైటిళ్లను గెలుచుకుంది. నవంబర్‌లో జపాన్‌లో జరగనున్న ఫైనల్స్‌కు అర్హత సాధించి, దేశంలోనే తొలి మహిళా కార్ రేసింగ్ ఛాంపియన్‌గా నిలిచింది.



పుణెలోని షెవాలేవాడీ ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త నితిన్ టకలే ఏకైక కుమార్తె నికిత. చిన్నప్పటి నుంచి స్కూల్లో అథ్లెట్‌గా, ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా ఎన్నో ట్రోఫీలనూ గెలిచింది. బీబీఏ చేశాక, ఫ్యాషన్ డిజైనింగ్, కాస్మెటాలజీ కోర్సులూ చేసింది. అనుకోకుండా ఈ రంగంలోకి అడుగుపెట్టింది. నికిత తండ్రి తన కూతురు అందరిలా ఉండాలనుకోలేదు. క్రీడల్లో రాణించాలనుకునేవారు. తల్లి కరాటేను కెరియర్‌గా ఎంచుకోమంది. అయితే ఓసారి నికిత తండ్రితోపాటు కార్ రేసింగ్ పోటీలు చూడ్డానికి వెళ్లింది. అక్కడ కోచ్ చేతన్ శివరామ్‌ని తొలిసారి కలిసిందట. ఆయన మోటార్‌స్పోర్ట్స్‌లో పాల్గొనమన్నారట. వాళ్ల నాన్న కూడా ప్రోత్సహించడంతో తొలి ప్రయత్నంలోనే 9 ట్రోఫీలను గెలుచుకుంది. దాంతో దీన్నే కెరియర్‌గా తీసుకోమన్న తండ్రి సూచన మేరకు శిక్షణ తీసుకుని, దేశంలోనే తొలి మహిళా రేసర్ ఛాంపియన్‌గా ఎదిగింది. అలా పద్దెనిమిదేళ్ల వయసులో ప్రొఫెషనల్ ర్యాలీ డ్రైవింగ్‌లోకి అడుగుపెట్టిన రెండేళ్లకే 99 ట్రోఫీలు గెలుచుకుంది. నిజానికి నికిత రెండేళ్ల క్రితమే ఆసియా పసిఫిక్ ర్యాలీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. కొన్ని కారణాల వల్ల ఫైనల్స్‌కు వెళ్లలేకపోయింది. ఈసారి ఎలాగైనా వీటిల్లో రాణించాలనుకుంటోంది. తరవాత క్లిష్టమైన డకార్ ర్యాలీ, ప్రపంచ ర్యాలీ ఛాంపియన్‌షిప్‌లోనూ పాల్గొనడమే లక్ష్యమంటోంది నికిత.

'మోటార్‌స్పోర్ట్స్ అనగానే వేగంగా దూసుకుపోవడమే అనుకుంటారంతా. కానీ చాలా నేర్చుకోవాలి. ట్రాక్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మెలకువలు తెలుసుకోవాలి. నాకు తొలి గురువు నాన్నే. ఆయనతోపాటు భర్త శుభమ్, గురువు చేతన్ శివరామ్, కుటుంబసభ్యుల సహకారం, ప్రోత్సాహాలతోనే ఈ రంగంలో రాణిస్తున్నా. అలాగని రేస్ ట్రాక్‌లో నా ప్రయాణం సాఫీగా సాగలేదు. ఎత్తుపల్లాలెన్నో. నాగాలాండ్‌లో జరిగిన జూనియర్ ఇండియన్ నేషనల్ ర్యాలీ ఛాంపియన్‌షిప్ (జేఐఎన్ఆర్‌సీ)లో నా కారు స్టీరింగ్ విరిగిపోయింది. మరోపక్క పొగమంచు. పైగా కిందకి దిగే విభాగం. దాంతో వేగం తగ్గించకుండా స్టీరింగ్‌ని పట్టుకుని ర్యాలీ పూర్తి చేయాలనుకున్నా. ఈలోగా కీ కూడా విరగడంతో బోనెట్ ఎత్తి వైర్ల ద్వారా స్టార్ట్ చేసి ర్యాలీని పూర్తి చేయడమే కాదు, ఆ పోటీలో మూడో స్థానంలో నిలిచా. ఇది నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పోటీతత్వం, ఎట్టి పరిస్థితిలోనూ గివ్‌అప్ చేయకపోవడం... ఇలా రేసింగ్ నుంచి ఎన్నో నేర్చుకున్నా. ఏ క్రీడలోనైనా ప్రతిరోజూ మనది కాదు. ఒకరు గెలుస్తారు, ఇంకొకరు ఓడిపోతారు. ఓడిన రోజే గెలుపు మొదలవుతుందని గుర్తుంచుకోవాలి. చేసే పనిమీద నమ్మకాన్ని కోల్పోకూడదు. అప్పుడే లక్ష్యాన్ని చేరుకుంటాం' అంటోన్న నికిత ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

ఆమె హక్కులు చెప్పేందుకే...

పనిచేసే చోట లైంగిక వేధింపులు... ఆడపిల్లల ఉన్నతికే కాదు... మనుగడకూ ప్రమాదకరంగా మారాయి. అలాంటి ఇబ్బందే తనూ ఎదుర్కోవడంతో ఆ సంస్థపై పోరాడారు. చివరికి ఉద్యోగాన్ని వదిలి న్యాయవాదిగా మారి పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తున్నారు. పోష్ చట్టంపై ఓ పుస్తకమూ రాశారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది దార్ల అనుపమను వసుంధర పలకరించగా...


అనుపమ

సమస్యల నుంచే పరిష్కారాలూ పుట్టుకొస్తాయి. అనుభవమే పాఠాలు నేర్పిస్తుంది అనడానికి నేనే ఓ ఉదాహరణ. గతంలో ఓ జాతీయ బ్యాంకులో ఉద్యోగం చేశా. అప్పుడు సివిల్స్‌కి సన్నద్ధమవ్వాలనే ఆలోచనతో కొన్ని నెలలు సెలవు పెట్టా. అయితే, తిరిగి ఉద్యోగంలో చేరాక నాకు వేధింపులు మొదలయ్యాయి. ఉన్నతాధికారులు.. . 6 నెలల పాటు జీతం రాకుండా ఇబ్బంది పెట్టారు. ఈ పరిస్థితి నా మీద తీవ్ర ప్రభావం చూపించింది. ఒకవేళ నామీదే కుటుంబం ఆధారపడి ఉంటే పరిస్థితి ఏంటి? అందుకే, ఆ సంస్థపై పోరాడాలనుకున్నా. అప్పటికే లా పూర్తిచేయడంతో పనిచేస్తున్న సంస్థపై కేసు వేశా. ఏపీలో మొదటి పోష్ కేసు ఇది. కుటుంబ మద్దతు ఉండటంతో జాబ్‌కి రాజీనామా చేశా. ఇలాంటి పరిస్థితి మరే మహిళకూ ఎదురుకాకూడదని భావించి... అప్పటి నుంచి స్త్రీల సమస్యలపై పనిచేస్తున్నా. ముఖ్యంగా ఈవ్‌టీజర్స్‌కు కౌన్సెలింగ్ చేయడం, పోక్సో చట్టంతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పాఠశాలల్లో అవగాహన కల్పించడం వంటివెన్నో చేశా. ఈ క్రమంలోనే మార్పు ట్రస్ట్, వాసవ్య మహిళామండలి, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్, మెప్మాతో పాటు హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, ఆర్పీఈయూఎస్, వంటివాటితో కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.

ఈ చట్టంపై అవగాహన...

ఆడవాళ్ల కోసం చట్టాలెన్నో వచ్చినా చాలావాటిపై కనీస అవగాహనా ఉండట్లేదు. అలాంటివాటిల్లో పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 (పోష్) ఒకటి. దీని ప్రకారం బాధితులు ఫిర్యాదు చేయడానికి పది మందికి పైగా పనిచేసే సంస్థల్లో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ(ఐసీసీ), అంతకంటే తక్కువ మంది పనిచేస్తే వారికి జిల్లాలో ఓ ఉన్నతాధికారిణితో పాటు ఐదుగురు సభ్యులతో కూడిన లోకల్ కంప్లైంట్ కమిటీ(ఎల్‌సీసీ)లు ఉండాలి. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో దీనిపై అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలి. అయితే, దీనిపై సుప్రీంకోర్టు గతేడాది కొన్ని రాష్ట్రాలకు జరిమానా విధించినా నేటికీ చాలా చోట్ల బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీనిపై కోర్టుకి వెళ్లాలని నిర్ణయించుకున్నా. ఇదే అంశంపై ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నా. ఒకప్పుడు పోష్ బాధితురాలినైన నేను ఇప్పుడు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌తో సహా కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఐసీసీ కమిటీ సభ్యురాలిగా ఉన్నా. 'వివాహిత మహిళల హక్కులు- హక్కుల సాధనలో తీసుకోవాల్సి జాగ్రత్తలు', తాజాగా పోష్ చట్టంపై 'మీరు పని చేయు చోట లైంగిక వేధింపులా?' అనే పుస్తకాలనీ రాశా.

- రాగళ్ల హరీష్

మీకు తెలుసా?



గర్భస్థ శిశువులు 28వ వారానికే కళ్లు తెరుస్తారు. మూడో త్రైమాసికానికి రెప్ప వేయడానికీ ప్రయత్నిస్తారు. అంతేకాదు, అమ్మ పొట్టలో ఉన్నప్పుడే చర్మం ద్వారా ప్రసరించే కాంతినీ గుర్తించగలరు. కవలలైతే కళ్లు తెరవడమే కాదు, చేతులూ పట్టుకుంటారట.

పాదాల పగుళ్లు తగ్గేదెలా?

నాకు 36 సంవత్సరాలు. కాలంతో సంబంధం లేకుండా నా పాదాలు పగులుతున్నాయి. అలాగని నేనేమీ మట్టిలో ఎక్కువగా తిరగను, నీళ్లల్లో తడవను. ఎందుకిలా? దీనికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఏం క్రీములు వాడితే సమస్య తగ్గుతుంది? - గాయత్రి, మండపేట

ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది ఫిర్యాదు చేస్తోన్న సమస్యల్లో పాదాల పగుళ్లు ఒకటి. పొడిచర్మ తత్వం, అధిక బరువుతో పాటు ఎటోపిక్ డెర్మటైటిస్, అలర్జీ టెండెన్సీ, సొరియాసిస్, ప్లాంటర్ హైపర్ కెరటోసిస్, కెరటోడెర్మాస్... వంటి జన్యు సమస్యలూ ఇందుకు కారణమే. అయితే, సాధారణ పగుళ్ల కంటే కాస్త మందంగా ఉంటాయివి. ఇలాంటప్పుడు వారానికి రెండు సార్లు గోరువెచ్చని నీళ్లలో కాస్త షాంపూ వేసి పాదాల్ని నాననివ్వండి. అరగంటయ్యాక పమిస్ స్టోన్ లేదా బ్రష్‌తో రుద్ది మృతకణాలు తొలగించాలి. ఆపై పెట్రోలియం జెల్లీ, షియాబటర్, కోకో బటర్ లాంటి ఆయిల్ బేస్డ్ క్రీముల్ని పాదాలకు రాయాలి. ఇక, యూరియా, సాలిసిలిక్ యాసిడ్, అమోనియా లాక్టేటివ్ ఉన్న క్రీములు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇవి పైన ఉన్న మృతకణాల్ని తొలగించి మృదువుగా మారుస్తాయి. శరీరం మరీ ఎక్కువగా పొడిబారుతుందంటే.. ఒమెగా త్రీ ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఈ క్యాప్సూల్స్ తీసుకుంటే మేలు. ఇవి సమస్యను కొంతమేర తగ్గిస్తాయి. కాళ్లకు మాయిశ్చరైజర్ రాసుకుని కాటన్ సాక్స్ వేసుకుంటే తగిన తేమ అంది పొడిబారవు. అలానే బరువు తగ్గడం కూడా ముఖ్యమే. పాదాలపై ఒత్తిడి పడకుండా మెత్తగా ఉండే చెప్పుల రకాల్నే వాడాలి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సమస్య తగ్గడం లేదంటే దగ్గర్లోని డెర్మటాలజిస్ట్‌ని కలవండి. సమస్య ఏంటో గుర్తించి తగిన చికిత్స చేస్తారు. అయితే, మధుమేహ బాధితులు మాత్రం పగుళ్లు రాకుండానే చూసుకోవాలి. లేదంటే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

డియర్ వసుంధర


- సూరపనేని పద్మావతి
డెర్మటాలజిస్ట్

తిరిగి నా చర్మానికి కళ రావాలంటే...

ప్రసవం తర్వాత ముఖం డల్‌గా అయిపోయింది. సోషల్‌మీడియా అంతా హైడ్రా ఫేషియల్ ప్రచారమే కనిపిస్తోంది. దీన్ని చేయించుకుంటే తిరిగి నా చర్మం యూత్‌ఫుల్‌గా మారుతుందా? లేదంటే ఏం చేయాలి? - రమ, గుంటూరు

గర్భం దాల్చినప్పుడు ముఖం ఎంతో కళగా, నున్నగా మెరుస్తుంది. హార్మోన్ల మార్పులు, రక్తప్రసరణ పెరగడం వంటివి ఇందుకు కారణాలు. అయితే, ప్రసవమయ్యాక అవన్నీ సాధారణ స్థితికి రావడంతో చర్మం వడిలిపోయినట్లు, డీహైడ్రేషన్ బారినపడ్డట్లు అనిపిస్తుంది. నిద్రలేమి, బీ12, డి-విటమిన్, ఐరన్ వంటి పోషకాల లోపం కూడా ఇందుకు దారితీయొచ్చు. కొందరిలో పిగ్మెంటేషన్ వస్తుంది. స్కిన్ డల్‌గా కనిపిస్తుంది. ఇలాంటప్పుడు పరిష్కారంగా జెంటిల్ క్లెన్సర్‌తో రోజూ ఫేస్‌వాష్ చేసుకోవాలి. మృతకణాలు ఎక్కువగా పేరుకుని ఉంటాయి కాబట్టి వారానికి రెండు సార్లు ఫేషియల్ స్క్రబ్, గ్లైకాలిక్ ఫేస్‌వాష్ వంటివి ఇంట్లోనే ప్రయత్నించవచ్చు. హైలురోనిక్ బేస్డ్ మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ తప్పక వాడాలి. ముఖం కాంతిమంతంగా మారడానికి రాత్రి పడుకునే ముందు నియాసినమైడ్, విటమిన్ సి సీరమ్‌ని రాసుకుంటే మేలు. అప్పుడు మీ అసలు రంగు, చర్మం తిరిగి వస్తాయి. ఇక, మీరు అడిగినట్లు హైడ్రా ఫేషియల్ కూడా ప్రయత్నించవచ్చు. మెషీన్ సాయంతో చేసే ఈ చికిత్సలో విటమిన్ సి, హైడ్రేటింగ్, బ్రైటనింగ్ సీరమ్‌లని చర్మంలోకి ఇన్‌ఫ్యూజ్ చేస్తాం. ఇది మీ చర్మానికి మునుపటి కళను తెస్తుంది. మీ సమస్య తీవ్రతను బట్టి చర్మవ్యాధి నిపుణులను కలవండి.

నీకెందుకు... అన్నారు!

'నాలుగిళ్లల్లో పనిచేసుకునే నీకెందుకు సోషల్‌మీడియా', 'డ్యాన్స్ వేసే బదులు పనిచేసుకుంటే డబ్బులొస్తాయిగా'... ఇలా ఆమెను నిరాశపరుస్తూ ఎన్నో కామెంట్లు. అయినా తన ప్యాషన్‌ని వదల్లేదు వర్షా సోలంకి. ఫలితమే... లక్షల్లో ఫాలోయర్లు.



నాన్న తాగుబోతు. అమ్మ నాలుగిళ్లల్లో పనిచేస్తేనే ఇల్లు గడిచేది. ఆ మొత్తం చాలక చాలా చిన్నవయసులోనే తనూ అమ్మకు వెంట వెళ్లడం మొదలుపెట్టింది వర్ష. ఈమెది ముంబయి. రోజంతా పనితో అలసిపోయిన తనకు ఉపశమనం డ్యాన్స్. పెళ్లయ్యి పిల్లలు పుట్టాక దానికీ దూరమైంది. కానీ డ్యాన్స్‌పై ప్రేమ మాత్రం తగ్గలేదు. ఓరోజు సోషల్‌మీడియాలో వీడియోలు చూస్తున్నప్పుడు తనకీ ప్రయత్నించాలి అనిపించింది. దీంతో తన వీడియో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. వాటికి ట్రోల్ చేస్తూ చాలా కామెంట్లు వచ్చాయి. చుట్టుపక్కల వాళ్లూ నవ్వేవారు. కానీ తను మాత్రం కొనసాగించింది. తన నమ్మకానికి తగ్గట్టే వీక్షణలు పెరిగాయి. అంతేకాదు, ఆమె కథ తెలిశాక 'నీ వీడియోలు చూస్తూ డ్యాన్స్ నేర్చుకుంటున్నాం', 'నువ్వు మాకు స్ఫూర్తి' అన్న కామెంట్లు మొదలయ్యాయి. వాటిని చూసి ఆమెలో ఆత్మవిశ్వాసం పెరిగింది. డ్యాన్స్ వీడియోలతోపాటు సరదా, సామాజిక అంశాలపై చేసే కామెడీ స్కిట్‌లకీ ఆదరణ ఎక్కువే. టీవీ ఛానెళ్లలో డ్యాన్స్ పోటీల్లోనూ పాల్గొని గుర్తింపు తెచ్చుకుంది. వర్షకి ఇన్‌స్టాలో 68 లక్షలు, 'వర్ష కవాలే' పేరుతో ప్రారంభించిన యూట్యూబ్ ఛానెల్‌కి 30 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. 'పనమ్మాయి అన్నది నా గుర్తింపు కాకూడదు. నలుగురిలో నాకంటూ ప్రత్యేక గుర్తింపు కావాలి అనుకునేదాన్ని. దానికి సోషల్‌మీడియా రూపంలో నాకు అవకాశం వచ్చింది. నా ప్రతిభను నమ్మాను. నాకొచ్చిన ఈ రెండో అవకాశాన్ని వినియోగించుకున్నా'నంటోంది వర్ష. కాస్త ధైర్యం, ప్యాషన్‌తో ఎవరైనా ఎంత ఎత్తుకైనా ఎదగొచ్చు అనడానికి వర్ష ఉదాహరణంటే కాదనగలమా?

బంగారం - వెండి



16న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,730	93,150	1,17,431
విజయవాడ	99,610	92,750	1,17,500
ప్రొద్దుటూరు	1,00,650	92,600	1,17,300
రాజమహేంద్రవరం	1,01,180	92,750	1,26,200
విశాఖపట్నం	1,00,820	92,750	1,25,000
తమిళనాడు	-----	92,750	1,27,000



మీకేం కావాలో స్పష్టత ఉంటే... దాన్ని సాధించడంమీదే దృష్టి పెట్టండి. ఈ క్రమంలో మిమ్మల్ని కొందరు కిందకి లాగాలని ప్రయత్నిస్తారు. అది మీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయొచ్చు, మధ్యలోనే వదిలేసే పరిస్థితీ రావొచ్చు. అలాంటప్పుడే మానసికంగా బలంగా ఉండాలి. లక్ష్యసాధనలో మీదైన ప్రత్యేక రహదారిని ఏర్పరచుకోండి. ఇబ్బందులను తేలికగా అధిగమిస్తారు.

- దీపికా పదుకోణ్, బాలీవుడ్ నటి

స్వేచ్ఛ... సమయం రెండూ ఇవ్వండి!



'మా పిల్లాడు నేనేం చెబితే అదే చేస్తాడు', 'తోటిపిల్లలు మా వాడిని చెడగొడతారనే ఎక్కడికీ పంపించను', 'మేమిద్దరం ఆఫీసు నుంచి తిరిగి వచ్చేవరకూ మా పాప ఎక్కడికీ వెళ్లదు... టీవీ చూస్తూ ఇంట్లోనే ఉంటుంది' అంటూ బిడ్డల గురించి గొప్పగా చెప్పే తల్లులు చాలామందే. అయితే, ఇదంతా మాకు పిల్లల మీద ఉన్న ప్రేమ, శ్రద్ధ అని ఏ పేరు పెట్టుకున్నా సరే... ఈ తీరు వాళ్లపై తీవ్ర ప్రభావం చూపిస్తుందంటారు నిపుణులు. చిన్న కుటుంబాలు పెరిగిపోవడం, ఒక్కరే సంతానం కావడం... వంటి పరిస్థితులు పిల్లలు ఒంటరితనానికే కాదు, గ్యాడ్జెట్లకూ అలవాటుపడేలా చేస్తున్నాయని చెబుతున్నారు. తోటివారితో కలవడానికీ, కలిసి ఏదైనా పంచుకోవడానికీ పేచీలు పెడుతుంటారు. ఏ తల్లిదండ్రులకైనా బిడ్డలే పంచప్రాణాలు. అలాగని వారినే ఎప్పుడూ అంటిపెట్టుకుని ఉండటం, ఎవరితోనూ కలవనివ్వకపోవడం, పిల్లల ప్రతి అవసరాన్నీ మీరే తీర్చాలనుకోవడం.. వంటివి భవిష్యత్తులో వాళ్లు ఇతరుల మీద ఆధారపడేలా చేస్తాయి. స్వతంత్రంగా ఆలోచించే శక్తిని కోల్పోయేలా చేస్తాయి. ఆత్మన్యూనతకూ కారణం అవుతాయి. ఇది మీ చిన్నారి భవిష్యత్తునే ప్రమాదంలో పడేలా చేస్తుంది. మరేం చేయాలనేగా మీ ప్రశ్న... వారి ఆలోచనలను తెలుసుకోండి. మంచి చెడులను వివరించండి. తప్పొప్పులను సరిదిద్దండి. తోటివారితో కలిసే స్వేచ్ఛనూ సమయాన్నీ కల్పించండి. అప్పుడే వారిలో తెలివితేటలు పెరుగుతాయి. సర్దుకుపోయేతత్వం, పంచుకునే స్వభావం, సమస్యల్ని పరిష్కరించుకునే చాకచక్యం అలవడతాయి. మీ జీవనశైలి దృష్ట్యా పిల్లలు ఒంటరిగా ఉండాల్సి వస్తే... వారిని హాబీ క్లాసులో చేర్చండి. కొత్త ప్రపంచంలో ఒత్తిడినీ అధిగమించగలరు.



రిబ్బను రబ్బరు పెట్టేద్దాం!





కిడ్స్ కార్నర్

ఒకప్పుడు పిల్లల హెయిర్ స్టైల్ అంటే రిబ్బన్లతో రకరకాల పువ్వులు వేయడమే. తర్వాత కాలంలో అవి విద్యార్థుల యూనిఫామ్‌లో భాగం అయిపోయాయి. దాంతో అమ్మలకి జడలు వేయడం ఓ పనిగా మారిపోయింది. నున్నగా తల దువ్వి... జడ కొనల వరకూ రిబ్బనుతో అల్లి పైకి కట్టేవారు. ఇక్కడే వారి నైపుణ్యాలన్నీ ప్రదర్శించేవారు. వాటి చివర్లను అందమైన కుచ్చుల్లా, పువ్వుల్లా... తీర్చిదిద్దేవారు. నిజానికి ఇందుకు బోలెడు సమయమూ కేటాయించేవారు. కానీ, ఈ రోజుల్లో తల్లులకు అంత తీరికెక్కడిది? అలాంటివారికోసమే రెడీమేడ్ రిబ్బన్ ఫ్లవర్స్ మార్కెట్లోకి వచ్చేశాయి. లేదంటే కాస్త సమయం కేటాయించి మనమూ చేసుకోవచ్చు. ముందుగానే నచ్చిన ఆకృతిలో మడతబెట్టి సూదీ దారంతో కుట్టు వేసుకోవాలి. ఆపై రబ్బరు బ్యాండ్‌ని దానికి అటాచ్ చేస్తే చాలు సిద్ధమైపోతుంది. జడవేసుకుని చివరగా దీన్ని పెట్టేస్తే అచ్చం రిబ్బనుతో జడ వేసినట్లే అనిపిస్తుంది.







నడి వయసులో నిద్రపట్టకపోతే...

మెనోపాజ్ సమయంలో హార్మోన్ల వ్యత్యాసంతో రకరకాల సమస్యలు తలెత్తుతాయి. వాటిల్లో ప్రధానమైనది నిద్రలేమి. చాలామంది మహిళలు దీన్ని సహజంగా భావించి పట్టించుకోరు. కానీ ఈ సమస్య తేలికగా తీసుకునేది కాదనీ, దీనివల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం లేకపోలేదనీ అంటున్నారు పిట్స్‌బర్గ్ యూనివర్సిటీ నిపుణులు. వీళ్లు మెనోపాజ్‌లో ఉన్న కొందరు మహిళల్ని ఎంపికచేసి అధ్యయనం చేసినప్పుడీ విషయం స్పష్టమైంది. పోషకాహారం, శారీరక శ్రమ, ధూమపానం, నిద్ర, బీఎంఐ, రక్తంలో కొవ్వులూ చక్కెర నిల్వలు, రక్తపోటు... వంటివన్నీ గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నది తెలిసిందే. కాబట్టి ఎంపిక చేసిన మహిళల్లో ఇవన్నీ ఒక్కొక్కటిగా పరిశీలించారు. వీటన్నింటిలోకీ రక్తంలో గ్లూకోజ్ మోతాదులు పెరగడం, అధిక రక్తపోటు, ధూమపానం, నిద్రలేమి వంటివి ఎక్కువగా గుండె సమస్యలకు కారణమవుతున్నాయి. ఈ నాలుగింటిలో కూడా నిద్రలేమి మరింత ప్రభావం చూపుతున్నట్లు గుర్తించారు. మొత్తమ్మీద ప్రతి ఐదుగురిలో ఒకరే హాయిగా నిద్రపోతున్నారనీ వాళ్లు మాత్రమే ఎలాంటి గుండె సమస్యలూ లేకుండా ఆరోగ్యంగా ఉన్నట్లు తేలింది. పైగా మహిళల్లో ఆకస్మిక మరణాలకి గుండెజబ్బులే ప్రధాన కారణం. కాబట్టి గుండె ఆరోగ్యం బాగుండాలంటే మధ్య వయసులో కనీసం ఏడు గంటలైనా కంటినిండా నిద్ర పట్టేలా చూసుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారు. ఆయుష్షూ పెరుగుతుంది.


శోధిత

హైదరాబాద్

రాజధానిలోని కోకాపేటలో నిర్మాణంలో ఉన్న ఆకాశహర్మ్యాలను చూస్తే హైదరాబాద్‌లో ఉన్నామా లేక సింగపూర్‌లోనా అని అనిపించక మానదు. ఓఆర్‌ఆర్‌కు పక్కనే అటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఇటు గచ్చిబౌలి, హైటెక్‌సిటీలు కూతవేటు దూరంలో ఉండడంతో ఉస్మాన్‌సాగర్ నుంచి శంకర్‌పల్లి వరకు హైరైజ్ భవనాలు విస్తరిస్తున్నాయి.

– ఈనాడు, హైదరాబాద్



సైన్స్ లోకంలోకి ప్రయాణం



విద్యార్థులకు ఎదురవుతున్న ప్రయోగశాలల ఇబ్బందిని అధిగమించేలా చేయడమే లక్ష్యంగా.. పశ్చిమగోదావరి జిల్లా శృంగవృక్షానికి చెందిన యువకుడు మధులాష్‌బాబు ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో) బస్సును అందుబాటులోకి తెచ్చారు. బీటెక్ పూర్తయిన తర్వాత ఆయన పిల్లలకు ఆవిష్కరణల వెనుక ఉన్న సాంకేతికతను వివరించాలనుకున్నారు. 'డూ ఇట్ యువర్ సెల్ఫ్' (డీఐవై) కిట్ల ద్వారా దాదాపు 10వేల మంది విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు. ఇంకా ఎక్కువ మందితో చేయించాలని తపనపడేవారు. ఈ క్రమంలోనే సంచార ప్రయోగశాల దిశగా అడుగులు పడ్డాయి. అయితే లారీ డ్రైవర్ కుమారుడైన మధులాష్‌బాబుకు నిధుల సమస్య ఎదురైంది. దీంతో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్ (టీబీఐ)కు దరఖాస్తు చేసుకోగా రూ.25 లక్షలు వచ్చాయి. అమెరికాలోని జార్జ్ మాసన్ విశ్వవిద్యాలయం మరో రూ.80 లక్షలు ఇచ్చింది. ఈ నిధులతో ఏడాదిపాటు కష్టపడి ఫ్లో బస్సును తయారు చేయించారు. 'ఏడో ధ్వజ' అనే కంపెనీ కింద దీనిని తీసుకొచ్చారు. గతేడాది జూన్ 10న ఫ్లో బస్సు.. పాఠశాలలు, కళాశాలల బాట పట్టింది. బస్సులో ప్లానెటోరియం, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఐవోటీ, వర్చువల్, అగ్మెంటెడ్ రియాలిటీ, డ్రోన్లు, రోబోటిక్స్, సైబర్ భద్రత, త్రీడీ చిత్రాలు, ప్రోగ్రామింగ్ జోన్, ఏఐ.. ఇలా 16 రకాల అంశాలపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థులతో సైన్స్ ప్రయోగాలు చేయిస్తారు. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్తంగా ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 50వేల మంది విద్యార్థులతో ప్రయోగాలు చేయించాయి.



-ఈనాడు, చిత్తూరు




ఈ పాదం.. ఇలలోన అభయ వేదం

యాభై ఏళ్ల క్రితం 1975లో ప్రారంభమైన జైపుర్ పాదాల తయారీదారు 'భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయతా సమితి' (బీఎంవీఎస్ఎస్) ఇప్పటిదాకా దేశ, విదేశాల్లో 24 లక్షల మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించింది. సంస్థ వ్యవస్థాపకుడైన డాక్టర్ మెహతా శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఇందులో 46 దేశాల్లో నిర్వహించిన 116 శిబిరాల ద్వారా 47,527 మంది విదేశీయులు సహాయం పొందారన్నారు. గతేడాది ఏకంగా 1.78 లక్షల మందికి కృత్రిమ అవయవాలు, క్యాలిపర్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి పరికరాలు అందజేసినట్లుగా వివరించారు. స్వర్ణోత్సవం జరుపుకొంటున్న ఈ సంస్థ అమృత్‌సర్, భోపాల్ ఎయిమ్స్‌లలో కొత్త శాఖలను ఏర్పాటు చేసింది. త్వరలో జగదల్‌పుర్, షిల్లాంగ్, బాడ్‌మేర్, హమీర్‌పుర్, జమ్మూ ఎయిమ్స్‌లలోనూ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

-జైపుర్

అమ్మకు నీడనిచ్చిన అశోక!



రావణుడు సీతమ్మను అపహరించి లంకకు తీసుకువెళ్లి అశోకవనంలో ఉంచారని రామాయణం చెబుతోంది. అయితే అలాంటి అశోక వృక్షాలు ప్రస్తుతం అంతరించిపోతున్న జాతులలో ఉన్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య డి.సంధ్య దీపిక తెలిపారు. 'ఇప్పుడు మనందరం నిటారుగా పెరిగి పొడవైన ఆకులు కలిగి ఉన్న చెట్టును అశోక చెట్టుగా పిలుస్తున్నాం. కానీ వాస్తవంగా అశోక చెట్టు ఇలా ఉండదు. వాటి కొమ్మలు విశాలంగా విస్తరిస్తాయి. ఈ చెట్టు శిఖరంలో ఆకులు దట్టంగా ఉంటాయి. 'సీతా అశోక' అని పిలుచుకునే దీనికి 'సరక అశోక' అనే శాస్త్రీయ నామం ఉంది. ఈ తరహా చెట్లు భారత్‌లోని అస్సాం, తూర్పు హిమాలయాలు, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, శ్రీలంకలో అరుదుగా కనిపిస్తాయి. ఇలాంటి చెట్టు ఒకటి ఏయూ వృక్షశాస్త్ర విభాగంలో ఉంది. 20 ఏళ్ల క్రితం ఆచార్య వెంకయ్య దీన్ని ఇక్కడ నాటారు. అప్పటినుంచి కాపాడుతున్నాం' అని సంధ్య దీపిక చెప్పారు. ఏయూకు వచ్చిన వారంతా ఈ వృక్షాన్ని సీతమ్మవారి చెట్టుగా భావించి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, ఏయూ ప్రాంగణం(విశాఖపట్నం)



'పూజ్య' బాపూజీ

మహాత్ముడి జయంతి, వర్ధంతి... స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో మినహా.. మిగతా రోజుల్లో ఆయన విగ్రహాలను పట్టించుకునే వారు అరుదు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో మాత్రం మహాత్ముడిని దేవుడిగా పూజిస్తున్నారు. 1973లో అప్పటి గ్రామ సర్పంచి వెంకట్‌రెడ్డి, నాటి ఎమ్మెల్యే పి.రామచంద్రారెడ్డిలు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి గ్రామానికి చెందిన అర్చకుడు మహాలింగం ప్రతి శుక్రవారం గాంధీ విగ్రహానికి పూజలు చేయడం ప్రారంభించారు. గ్రామస్థులు సామూహికంగా పూజల్లో పాల్గొంటున్నారు. మహాలింగం వృద్ధాప్యం నేపథ్యంలో.. ఆయన చిన్న కుమారుడు ఆదివయ్యస్వామి ప్రస్తుతం ఈ క్రతువును కొనసాగిస్తున్నారు. గాంధీ జయంతి రోజు ప్రత్యేక పూజలతోపాటు క్షీరాభిషేకం చేసి జాతీయ జెండాను ఆవిష్కరించి గ్రామ సభ నిర్వహిస్తారు.

– ఈనాడు, సంగారెడ్డి



నారికేళం కళాత్మకం



కుక్క పిల్ల.. సబ్బు బిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు కొబ్బరి ఆధారిత వ్యర్థాలను కళాకృతులుగా మారుస్తూ వాటికీ అర్థం ఉందని నిరూపిస్తున్నారు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం మెంటేవారితోటకు చెందిన బత్తుల ముసలయ్య. కొబ్బరి చిప్పలు, పీచుతో వివిధ కళాఖండాలు తయారుచేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ప్రస్తుతం ఓ విద్యాసంస్థలో తోటమాలిగా పనిచేస్తున్న ముసలయ్య 23 ఏళ్ల నుంచి వీటిని తయారు చేస్తున్నారు. మొదట ఓ ఆకృతిని ఎంచుకొని దానికి అనుగుణంగా కొబ్బరి చిప్పలను చిన్నచిన్న ముక్కలుగా కత్తిరిస్తారు. అనంతరం కొబ్బరి పీచుని ఉపయోగించి కళాకృతులను తీర్చిదిద్దుతున్నారు.

– న్యూస్‌టుడే, భీమవరం పట్టణం



గ్వాలియర్ గోపాలుడు రూ.వంద కోట్ల ఆసామి

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో గల గోపాల మందిరం శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భక్తులతో కళకళలాడింది. ఈ ఆలయాన్ని వందేళ్ల క్రితం సింధియా రాజవంశం నిర్మించినట్లు ఆలయ పూజారి సాగర్ బాబా తెలిపారు. ఏటా జన్మాష్టమి రోజున భారీ పోలీసు భద్రత మధ్య బ్యాంక్ లాకరు నుంచి రూ.100 కోట్ల ఆభరణాలను బయటకుతీసి దేవతా మూర్తులను అలంకరిస్తారు. అంతే మొత్తానికి బీమా చేయించిన ఈ ఆభరణాలు తమ పర్యవేక్షణలో ఉంటాయని గ్వాలియర్ మున్సిపల్ కమిషనర్ సంఘ్ ప్రియ చెప్పారు. బంగారు కిరీటాలు, ఏడు వారాల పచ్చల హారాలు, వజ్రాలు.. రత్నాలు పొదిగిన కంకణాలు, పసిడి వేణువు ఇందులో ఉన్నాయి.

–ఈటీవీ భారత్

ప్రవాహంలో.. విహారం



కృష్ణానదిలో జల విహారానికి పర్యాటకశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏటా ఈ సమయానికి సోమశిల టు శ్రీశైలం లాంచీ ప్రయాణాలు మొదలవుతాయి. ఇప్పటికే ఇక్కడ భక్తులు, పర్యాటకుల సందడి పెరగడంతో రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు అధికారులు ఆ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఈ నెల 19 నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తీరంలోని సోమశిల నుంచి కృష్ణానదిలో శ్రీశైలానికి లాంచీ ప్రయాణాలు మొదలు కానున్నాయి. దీనికోసం డబుల్‌డెక్కర్ ఏసీ లాంచీలు, మినీలాంచీలు, స్పీడ్‌బోట్లను సిద్ధం చేశారు. 120 కిలోమీటర్ల జలవిహారం 6 నుంచి 7 గంటల పాటు సాగుతుంది. ఈ ప్రయాణంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పలు చారిత్రక కట్టడాలు, రమణీయమైన ప్రకృతి అందాలను తిలకించొచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రయాణానికి పెద్దవారికి రూ.2 వేలు, చిన్నపిల్లలకు రూ.1,600ల చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. టికెట్ల కోసం తెలంగాణ టూరిజంశాఖ వెబ్‌సైట్‌ను లేదా సోమశిలలోని పర్యాటకశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

–న్యూస్‌టుడే, కొల్లాపూర్, కొల్లాపూర్ పట్టణం

తినగ తినగ వెదురు తీయనవును!





వెదురుతో తడకలు కట్టడం, బుట్టలు అల్లడమే కాదు.. రుచికరమైన వంటకాలూ వండుతారండోయ్..! పార్వతీపురం మన్యంలో వర్షాకాలంలో వెదురు తోటలు చిగురించి కొత్త మొక్కలు పుట్టుకొస్తాయి. భూమి లోపల లేతగా ఉండే వాటి కాండాలతో వండిన కూర తింటే జన్మకి ఇది చాలనుకుంటామని గిరిజనులు చెబుతున్నారు. వీటిలో పోషకాలూ మెండుగానే ఉంటాయి. ఇది సీజన్ కావడంతో లేత వెదురు కాండాలను సేకరించి శనివారం గుమ్మలక్ష్మీపురంలో జరిగే సంతకు తీసుకొచ్చారు.

–న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

చిన్ననాటి మల్లెచెట్టు.. హరిత దీక్షకు మెట్టు



సత్యనారాయణ

పెంచిన పచ్చదనం

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ దగ్గరలోని చౌటపల్లికి చెందిన పుల్లె సత్యనారాయణ 6వ తరగతిలో ఉండగా పాఠశాలలో ఓ మల్లె మొక్కను నాటారు. ఏడాదికేడాదికి పెద్దదవుతున్న ఆ మొక్కను చూసి ఆనందించేవారు. 'ఇది నా చెట్టు' అని దోస్తులకు చెప్పుకొనేవారు. పదో తరగతి వరకు దానిని సంరక్షించారు. తర్వాత హుస్నాబాద్‌లో ఇంటర్ చేరారు. ఓ రోజు చౌటపల్లి పాఠశాలకు వెళ్లి చూస్తే అక్కడ మల్లె చెట్టు లేదు. బెంచీలు వేసేందుకు నరికేశారని తెలిసి కన్నీటి పర్యంతమయ్యారు. అప్పుడే.. ఖాళీ సమయం ఉన్నప్పుడల్లా మొక్కలు నాటాలని 'హరిత సంకల్పం' తీసుకున్నారు. 1993లో ఆర్టీసీలో చేరాక డ్యూటీకి ముందు, తర్వాత.. సెలవు రోజుల్లో మొక్కలు నాటడాన్ని వ్యాపకంగా చేసుకున్నారు. విద్యాభ్యాసం చేసిన హుస్నాబాద్‌లో.. ఆ తర్వాత ఉద్యోగం చేస్తున్న కరీంనగర్‌లో రహదారుల వెంట, ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వేస్టేషన్, కోర్టు ఆవరణ, ఆర్టీసీ వర్క్‌షాప్‌లో.. కొండగట్టు ఆలయ దారుల్లో.. శాతవాహన వర్సిటీలో.. పల్లెల్లో.. పాఠశాలల్లో.. ఇలా అనేకచోట్ల మొక్కలు నాటారు. ఇలా నాటిన మొక్కల సంఖ్య 70 వేలు దాటింది. కరీంనగర్‌లో ఇంటింటికీ వెళ్లి మొక్కలు నాటి.. 'నీళ్లు పోసి పెంచాలి.. కొంత కాలం అయ్యాక వచ్చి చూస్తా' అని మరీ చెబుతున్నారు. 'మొక్కలకు గుంతలు తీసేందుకు, వేసవిలో ట్యాంకర్‌తో నీళ్లు పోయించేందుకు సొంత డబ్బులు వెచ్చిస్తున్నా' అని సత్యనారాయణ 'ఈనాడు'తో పేర్కొన్నారు. పచ్చదనం కోసం సత్యనారాయణ చేస్తున్న కృషిని గుర్తించి ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బస్‌భవన్‌లో సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందించింది. అటవీశాఖ గతంలో 'హరితమిత్ర' అవార్డును అందజేసింది.

– ఈనాడు, హైదరాబాద్

పశువులకూ హాస్టల్



రాష్ట్రంలో మొట్ట మొదట ప్రారంభమైన పశువుల హాస్టల్ కర్నూలు జిల్లా తడకనపల్లిలో ఉంది. పశువులను ఒకే చోట ఉంచి, ఆరోగ్యకర పరిస్థితుల మధ్య పెంచితే పాల ఉత్పత్తి పెరుగుతుందన్న శాస్త్రీయత ఆధారంగా ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసింది. ఈ హాస్టల్‌ను 2017లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కేంద్రంలో స్వచ్ఛమైన గాలి, వెలుతురు ఉండేలా విశాలంగా నాలుగు షెడ్లను నిర్మించారు. షెడ్లలో పంకాలనూ బిగించారు. ప్రతి పశువుకు నిర్ణీత స్థలం, కావాల్సినప్పుడు మేత మేయడానికి, నీళ్లు తాగడానికి వీలుగా ఏర్పాట్లున్నాయి. రూ.2 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఆ వసతిగృహ నిర్వహణను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించింది. ఈ వ్యవసాయ క్షేత్రంలోనే కొంతభాగంలో పచ్చగడ్డిని పెంచుతున్నారు. అవసరమైన వైద్యం చేయడానికి కావాల్సిన కొన్ని పరికరాలనూ అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం ఇక్కడ హరియాణా నుంచి తీసుకొచ్చినవి సహా 50 వరకు పశువులు ఉంటున్నాయి. ఇందులో గ్రామానికి చెందిన ఎవరైనా వారి పశువులను ఉంచవచ్చు. నిర్వహణ ఖర్చులను యజమానులందరూ కలిసి పంచుకుంటారు. ఆరోగ్యకరమైన వాతావరణం ఉండటంతో పశువుల నుంచి వచ్చే పాల దిగుబడి ఎక్కువగా ఉంటోంది. ఓ గేదె ఉదయం 18 లీటర్లు, సాయంత్రం 18 లీటర్ల పాలు ఇస్తుండటం విశేషం. పాలకోవా పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతున్న తడకనపల్లిలో ఈ పశువుల వసతిగృహం తయారీదారులకు వరంగా మారింది. వారంతా ఇక్కడి నుంచే పాలను తీసుకెళ్లి కోవా తయారీకి ఉపయోగిస్తున్నారు.

– ఈనాడు, కర్నూలు



ఈ మూడింటిని గుర్తిస్తేనే విజయం

✦ విజయం సులువుగా దక్కదు. అనాయాసంగా వచ్చేదేదీ విలువైనది కాదు. ✦ రాత్రికి రాత్రే లక్ష్యాన్ని చేరుకోలేం. దీర్ఘకాలిక కృషి అవసరం. ✦ ఎంత కష్టపడినా, ఎంత సమయం వెచ్చించినా విజయానికి గ్యారంటీ ఉండదు. ఈ మూడు విషయాలు అనుభవంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టుదలతో ముందుకు వెళ్లేవారినే విజయం వరిస్తుంది.

–టామ్ డిల్లాన్, ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్

కేంద్రమైనా కదులుతుంది!

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ చేశారు. ఏడాది అయినా పెన్షన్ రావడం లేదు...మాతృశాఖ, పెన్షన్‌కు సంబంధించిన శాఖలకు పదేపదే విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడెలా?

కేంద్ర పర్యాటక శాఖ ద్వారా బుక్ చేసుకున్న ప్యాకేజీలో నిర్దేశించిన మేరకు పర్యాటక ప్రదేశాలను చూపించలేదు... దీనిపై పర్యాటక శాఖను సంప్రదించినా స్పందన లేదు.. మరేంచేయాలి?

స్థానిక సంస్థలనైతే నేరుగా అడగొచ్చు... రాష్ట్ర ప్రభుత్వాన్నీ ప్రశ్నించొచ్చు... మరి కేంద్ర ప్రభుత్వ సేవా లోపాలపై ఎవరిని అడగాలి.. దీనికి సమాధానం సీపీ గ్రామ్స్.

సేవా లోపాలకు సమాధానం సీపీగ్రామ్స్



- కేంద్ర ప్రభుత్వ సంస్థలు, శాఖల సేవల్లో లోపం ఉంటే ఉపేక్షించాల్సిన అవసరం లేదు. దానిపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందొచ్చు.
- దీనికోసం కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (సీపీ గ్రామ్స్)ని అందుబాటులోకి తెచ్చారు.
- కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఈ పోర్టల్‌లో అనుసంధానమై ఉంటాయి.

ఇందులో తేలిగ్గా ఫిర్యాదు చేసే విధానంతో పాటు... 21 రోజుల్లో తప్పనిసరిగా పరిష్కరించేలా పకడ్బందీ కార్యాచరణ కూడా ఉంటుంది.

- ఇక్కడ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 97 శాఖలు, విభాగాలకు సంబంధించిన సేవల లోపాలపై ఒకే వ్యవస్థ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.
- హిందీ, ఇంగ్లిషు, తెలుగు సహా మరో 21 భాషల్లో ఫిర్యాదు చేసే సౌలభ్యం ఉంది. 24 గంటలూ ఈ అవకాశం ఉంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన ఫిర్యాదులుంటే సంబంధిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపుతారు.
- దీనికోసం ప్రతి రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతానికి ఒక్కో నోడల్ అధికారి ఉంటారు.

ఇలా చేయాలి...

నేరుగా సీపీగ్రామ్స్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు. లేదా ప్లేస్టోర్‌లో నుంచి మై గ్రీవెన్స్ (సీపీగ్రామ్స్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో నుంచి కూడా కంప్లైంట్ ఇవ్వొచ్చు.

దీనికోసం మొదట మనం ఫోన్ నంబర్ లేదా ఈమెయిల్ ఐడీ ద్వారా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా పాస్‌వర్డ్‌ను ఎంపిక చేసుకోవాలి.

తర్వాత సంప్రదింపులకు మనకు ఇచ్చే ప్రత్యేక ఐడీని ఉపయోగించుకోవచ్చు.

పోస్టు ద్వారా ఫిర్యాదు పంపాలంటే చిరునామా:
పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, 5వ అంతస్తు, సర్దార్ పటేల్ భవన్, సంసద్ మార్గ్, న్యూదిల్లీ - 110001.

ఫిర్యాదు చేసిన తర్వాత...

- రిజిస్ట్రేషన్ చేసుకున్న లాగిన్ ఆధారంగా కంప్లైంట్ నమోదుచేయొచ్చు. సంబంధితశాఖ లేదా సంస్థ వివరాలను నమోదు చేస్తే ఫిర్యాదుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తారు.
- ఇదే సమయంలో ఫిర్యాదును ఆ శాఖకు పంపి తగిన చర్యలు తీసుకుంటారు. ప్రత్యేక ఐడీతో మన ఫిర్యాదు స్థితిని ట్రాక్ చేయొచ్చు.

ఒక వేళ మొదట పరిష్కరించిన విధానంతో మనం సంతృప్తి చెందకపోతే మళ్లీ అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కూడా సీపీగ్రామ్స్ అందిస్తుంది.

- చర్యల నివేదిక (ఏటీఆర్) ఎస్ఎంఎస్ లేదా మెయిల్ ద్వారా వస్తుంది.
- ఫిర్యాదు పరిష్కారమైన తీరుపై మన అభిప్రాయం తీసుకుంటారు. మనం సంతృప్తి చెందితే దాన్ని క్లోజ్ చేస్తారు. లేకుంటే అప్పిలేట్ అథారిటీకి ఫిర్యాదును పంపి పునర్విచారణ చేయిస్తారు.
- కేంద్ర ప్రభుత్వంలో 97 శాఖలు, వాటికి సంబంధించి ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారి, అధికారి హోదా, చిరునామా, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ వంటి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయి.

ఇవి దీని పరిధిలోకి రావు..

- సమాచారహక్కుకు సంబంధించిన (ఆర్టీఐ) విషయాలు
- కోర్టు సంబంధిత లేదా న్యాయపరిధిలోని అంశాలు
- మతపరమైన విషయాలు
- ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన అంశాలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించి

- ఈనాడు, హైదరాబాద్

విభిన్న ప్రతిభావంతుల విద్యకు ప్రభుత్వ భరోసా

- చదువుతో పాటు ఆర్థిక చేయూత
- ట్యాబ్‌లతో డిజిటల్ విద్య
- దేశంలో తొలిసారి 125 ఆటిజం కేంద్రాల ఏర్పాటుకు ఎస్‌ఎస్‌ఏ చర్యలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులకు విద్యను చేరువ చేసేందుకు పాటు వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) కృషిచేస్తోంది. ఇలాంటి విద్యార్థులను సాధారణ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా సమాన అవకాశాలు కల్పిస్తోంది. ట్యాబ్‌లలో 33 రకాల యాప్‌లను ఇన్‌స్టాల్ చేసి, భోదన చేయిస్తోంది. ప్యామిలీ యాప్‌ను పిల్లల ఐడీని లింక్ చేయడం ద్వారా ఎంతవరకు యాప్ ఉపయోగించారో పర్యవేక్షిస్తున్నారు. దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఇప్పటికే 679 భవిత కేంద్రాలు ఏర్పాటుచేయగా... దేశంలో తొలిసారి ఆటిజం పిల్లల కోసం పట్టణాల్లో 125 కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 85,046 మంది ప్రత్యేకఅవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందిస్తున్నారు.

ఇంటి వద్ద బోధన

★ ఏటా బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తారు. గుర్తించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేస్తున్నారు.
★ భవిత కేంద్రాల్లో పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలతో పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో చెప్తిస్తున్నారు.
★ తీవ్రమైన వైకల్యంతో పాఠశాలకు రాలేని పిల్లలకు ప్రతి శనివారం వారి ఇంట్లోనే బోధన చేస్తున్నారు.

చదువుకు సహాయంగా భత్యం

★ దివ్యాంగ పిల్లలకు నెలకు రూ.600 చొప్పున రవాణా భత్యాన్ని అందిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో 3,932, సెకండరీ స్థాయిలో 4,058 మందికి ఈ భత్యాన్ని ఇస్తున్నారు. బాలికలకు నెలకు రూ.200 అదనంగా ఇస్తున్నారు.
★ సొంతంగా బడికి రాలేనివారికి సహాయకుల భత్యాన్ని అందిస్తున్నారు. 1-8 తరగతుల్లో నమోదై 40% హాజరు ఉన్న పిల్లల సహాయకులకు నెలకు రూ.600 చొప్పున ఇస్తున్నారు.
★ ఇంటివద్దనే ఉండే వారికి పది నెలలకు రూ.3వేలు ఇస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో 6,790 మంది ఈ సహాయాన్ని పొందుతున్నారు.

ప్రత్యేక సహకారాలు

★ వారంలో 3 రోజులు ఫిజియోథెరపిస్టులు భవిత కేంద్రాలను సందర్శించి సేవలు అందిస్తున్నారు.
★ క్రీడల కోసం ప్రత్యేకంగా జిల్లాకు రూ.లక్ష వరకు వ్యయం చేస్తున్నారు.
★ భవిత కేంద్రాల్లో రూ.7వేల చొప్పున గౌరవ వేతన మిస్తూ సహాయకులను నియమించారు.

సాధారణ పిల్లల కంటే దేనిలోనూ తీసిపోరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. సాధారణ పిల్లల కంటే వీరు దేనిలోనూ తీసిపోరు. ప్రవేశాలు పెంచేందుకు, తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత అందించేందుకు భత్యాలను అందిస్తున్నాం. అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్‌ఎస్‌ఏ

రాజధానిలో 'చెట్టు'పట్టాలు!

- అమరావతిలో దేశంలోనే పెద్ద ట్రాన్స్‌లోకేటెడ్ ట్రీ నర్సరీ
- ఐదు ఎకరాల్లో 4 వేల వృక్షాలతో ఏర్పాటు
- మరో 4 వేలు తరలించేందుకు సన్నాహాలు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ప్రధాన రహదారుల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులకు అడ్డుగా ఉన్న చెట్లను కొట్టేయకుండా... వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించి భారీ నర్సరీని సిద్ధం చేశారు. అనంతవరం వద్ద ఐదెకరాల్లో 4 వేల చెట్లతో దేశంలోనే పెద్దదైన ట్రాన్స్ లోకేటెడ్ ట్రీ నర్సరీ సిద్ధమైంది. వీటిని రాజధానిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా బఫర్ జోన్లలో నాటనున్నారు. రాజధానిలో ఒక్క చెట్టుని కూడా నరకకూడదన్న లక్ష్యంతో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఈ కార్యక్రమం చేపట్టింది. బెంగళూరు విమానాశ్రయం నిర్మాణం వంటి ప్రాజెక్టుల్లో ఇలా చెట్లను ట్రాన్స్‌లోకేట్ చేసి మరోచోట నాటినా, అమరావతిలో మాదిరిగా విస్తృత స్థాయిలో చేయలేదని ఏడీసీ ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

పదేళ్ల కంటే ఎక్కువ వయసున్నవే ఎక్కువ

ట్రీ నర్సరీకి తరలించిన వాటిలో ఎక్కువ శాతం పది నుంచి పదేళ్ల వయసున్నవే. రాజధాని పనులు మొదలైన కొత్తలో అనంతవరం వద్ద పెద్ద నర్సరీని అభివృద్ధి చేశారు. రాజధానిలో రోడ్ల నిర్మాణం పూర్తయ్యాక వాటికి ఇరువైపులా, పార్కుల్లో నాటేందుకు ఆ నర్సరీలో వేల సంఖ్యలో మొక్కలు పెంచారు. వైకాపా ప్రభుత్వం రాజధాని పనులను నిలిపివేయడంతో నర్సరీని గాలికొదిలేశారు. అక్కడి మొక్కలు ఏపుగా ఎదిగి చెట్లయ్యాయి. ఆ నర్సరీ మీదుగా ఇప్పుడు ప్రధాన రహదారి నిర్మిస్తుండటంతో... అక్కడున్న చెట్లను కొట్టేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏడీసీ అధికారులు ట్రాన్స్‌లోకేటెడ్ ట్రీనర్సరీ ఆలోచన చేసి, అక్కడి 2,000 చెట్లను అనంతవరంలోనే వేరే చోటుకు తరలించారు. మల్కాపురం నుంచి మరో 1,000, రోడ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న వాటిని మరి కొన్నింటిని తీసుకొచ్చారు. ఇలా.. నాలుగు నెలల వ్యవధిలో 4 వేల చెట్లను ఈ నర్సరీకి చేర్చారు.

శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షణ

తరలించాలనుకున్న చెట్ల కొమ్మల్ని మొదట తొలగిస్తున్నారు. దీంతో దాని బరువు తగ్గుతుంది. కొమ్మలకు రసాయనాలు పూస్తున్నారు. తర్వాత చెట్టు చుట్టూ కందకం తవ్వి వేర్లను కత్తిరిస్తున్నారు. కొంత స్థిరపడ్డాక తల్లి వేరు కత్తిరించి, వేళ్ల చుట్టూ పట్టా కట్టి... ట్రీ నర్సరీకి తరలిస్తున్నారు. అక్కడ సంచుల్లో మట్టి, ఎరువు నింపి చెట్లను దానిలో ఉంచి సంరక్షిస్తున్నారు. నర్సరీకి తరలించిన వాటిలో రావి, మర్రి, ఏగిస, మారేడు, బౌహీనియా, లెగ్‌స్ట్రోమియా వంటి జాతులున్నాయి. ట్రాన్స్‌లొకేట్ చేసిన చెట్లలో 85-95 శాతం బతుకుతున్నాయని ఏడీసీ ఉద్యాన విభాగం జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.ధర్మజ తెలిపారు. పదేళ్ల వయసున్న వాటిని కొని నాటాలంటే... ఒక్కోదానికి రూ.లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుందని, తమకు ఒక్కో చెట్టు ట్రాన్స్ లొకేషన్‌కు రూ.6-7 వేలు ఖర్చవుతోందని ఆయన తెలిపారు. వీటిన్నింటినీ డిసెంబరు లోపు నాటనున్నట్లు వెల్లడించారు.



ట్రాన్స్‌లొకేటెడ్ ట్రీ నర్సరీలో పునరుజ్జీవమైన చెట్లు

లక్షల వైద్యం ఉచితంగా..!

సర్కారులో సూపర్ సేవలు!

వ్యాధి
కంటికి వచ్చినా...
పంటికి వచ్చినా...
సామాన్యులకు నరకమే...
ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే
ఖర్చు భయం.
ప్రభుత్వాసుపత్రికి వెళితే సేవలపై అయోమయం.

ఇప్పుడా ఆందోళనను తగ్గిస్తూ... రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రభుత్వాసుపత్రులు ఆధునిక పరికరాలతో, సూపర్ స్పెషాలిటీ సేవలతో మంచి వైద్యం అందిస్తామని భరోసా ఇస్తున్నాయి... దాదాపు ఉచితంగా అందే ఈ సేవలు సామాన్యులకు వరంగా మారుతున్నాయి. ఎవరైనా, ఏ రాష్ట్రం వారైనా వీటిని వినియోగించుకోవచ్చు!



డయాబెటిస్.. రెటినోపతి...

- మధుమేహాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల చాలామందిలో కనిపించే సమస్య డయాబెటిక్ రెటినోపతి. దీనికి చికిత్స ప్రైవేటు కంటి ఆసుపత్రుల్లో ఖరీదైన వ్యవహారమే.
- హైదరాబాద్‌లోని ప్రభుత్వ సరోజిని దేవి కంటి ఆసుపత్రిలో ఈ సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. జీవితాంతం ఉచితంగా ఈ సేవలు కల్పిస్తున్నారు.
- కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో కూడా డయాబెటిక్ రెటినోపతికి చికిత్స చేస్తున్నారు.




సంతాన సాఫల్యత కోసం...

- సంతానం కోసం చాలామంది ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.లక్షలు ఖర్చు చేస్తుంటారు.
- హైదరాబాద్‌లోని గాంధీ, పేట్లబుర్జు ఆసుపత్రుల్లో ఇప్పటికే సంతానం లేని పేద జంటలకు చికిత్సలు, కౌన్సెలింగ్‌లాంటి సేవలు ఉచితంగా అందిస్తున్నారు.
- ఈ రెండు ఆసుపత్రుల్లో ఇప్పటికే ఇంట్రా యూటరైన్ ఇన్సెమినేషన్(ఐయూఐ) చికిత్సలు అందుబాటులోకి తెచ్చారు. త్వరలో ఐవీఎఫ్ సేవలను ప్రవేశపెట్టబోతున్నారు.

ఇక్కడ వృద్ధులకు ప్రత్యేకం...

వృద్ధులకు సేవలు అందించేందుకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో జిరియాట్రిక్ విభాగం ఉంది. వృద్ధులకు ఎలాంటి అనారోగ్య సమస్య ఉన్నాసరే... ఈ విభాగంలో ఉచితంగా సేవలు పొందొచ్చు. నిమ్స్‌లోనూ ఈ సేవలున్నాయి.

క్యాన్సర్‌కు రోబోటిక్ సర్జరీలు...



- గతంలో రోబోటిక్ సర్జరీలు కేవలం కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితం. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఎంఎన్‌జేలో కూడా రోబోటిక్ క్యాన్సర్ చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.
- ఇక్కడ అన్నవాహిక, కాలేయంలో కణితి, కిడ్నీ, పెద్దపేగు క్యాన్సర్ తదితర సమస్యలకు రోబోటిక్ విధానంతో పూర్తి ఉచితంగా చికిత్స చేస్తున్నారు.
- పెట్‌స్కాన్ లాంటి ఖరీదైన పరీక్షలు కూడా ఎంఎన్‌జేలో ఉచితంగానే చేస్తారు. కీమో సేవల్లో జాప్యం లేకుండా.. డేకేర్ విధానం అమలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా నిమ్స్‌లో సైతం పూర్తిగా ఉచితంగా రోబోటిక్ సేవలను పొందే వీలుంది.
- విజయవాడలోని బోధనాసుపత్రిలో క్యాన్సర్ వైద్య సేవలు ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో ఉంటాయి. కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో క్యాన్సర్‌కు మంచి వైద్యం అందుతోంది.

జిల్లాల్లోనూ..

- గుంటూరు జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, సీటీవీఎస్, గ్యాస్ట్రో ఎంటరాలజీ తదితర 11 సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ఒంగోలులోని జీజీహెచ్‌లో ఏడు విభాగాల్లో వైద్యసేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్స్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, నియోనాటాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, సర్జికల్, మెడికల్ ఆంకాలజీ విభాగాల్లో రోగులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మంచి వైద్య సేవలందుతున్నాయి.
- కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియో థొరాసిక్ విభాగంలో గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేస్తున్నారు.
- విజయవాడలోని బోధనాసుపత్రిలో ప్లాస్టిక్ సర్జరీ వైద్య సేవలు ప్రతి సోమ, గురువారాల్లో అందిస్తారు. న్యూరో సర్జరీ విభాగంలో నెలకు 70 నుంచి 80 వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి.
- ఆదిలాబాద్‌లోని 'రిమ్స్'కు అనుబంధంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గత రెండేళ్లుగా క్యాన్సర్, మూత్రపిండాల శస్త్రచికిత్సలు చేస్తున్నారు.
- ఏజెన్సీ ప్రాంతమైన ములుగు ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఆంకాలజీ సేవలు ప్రవేశపెట్టారు.
- విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు, విజయవాడ, తిరుపతిల్లో మధుమేహానికి సమగ్ర వైద్య సదుపాయాలున్నాయి.

మోకీళ్లు, తుంటి మార్పిడి...

- మోకీళ్లు, తుంటి మార్పిడి చికిత్సలు అంటే చాలామందికి ప్రైవేటు ఆసుపత్రులే గుర్తుకొస్తాయి. కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ప్రైవేటులో రూ.3 లక్షల వరకు అయ్యే ఈ సేవలను పూర్తి ఉచితంగా అందిస్తున్నారు.
- నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ ఉంటే ఉచితంగానే మోకీళ్ల చికిత్స చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ లేకపోయినా.. ప్రైవేటు కంటే 40 శాతం తక్కువ ఖర్చుతో నిమ్స్‌లో ఈ సేవలు పొందవచ్చు.
- వరంగల్ కేఎంసీకి అనుబంధంగా ఉన్న సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సైతం మోకీళ్ల శస్త్రచికిత్సలు వందల సంఖ్యలో జరుగుతున్నాయి. ఆరోగ్యశ్రీ కింద గుండెకు స్టంట్లను కూడా ఉచితంగా వేస్తున్నారు. ఏపీలోని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోనూ ఈ సర్జరీలు చేస్తున్నారు.
- విజయవాడలోని బోధనాసుపత్రిలో మెదడు- వెన్నెముక- నరాల సమస్యలతో వచ్చే రోగులకు ప్రతి మంగళవారం, గురువారం, శనివారం నాడు సేవలు అందుబాటులో ఉంటాయి.



పైసా ఖర్చు లేకుండా డయాలసిస్..

- కిడ్నీలు విఫలమైతే డయాలసిస్ తప్పనిసరి. వారానికి 3-5 సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిందే. కొందరికి రోజూ అవసరమవుతుంది. ప్రైవేటులో ఒక్కో డయాలసిస్‌కు వేలల్లో వసూలు చేస్తారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియాలో కిడ్నీ రోగులకు ఈ సేవలు పూర్తి ఉచితం.
- ఆరోగ్యశ్రీ ఉంటే నిమ్స్‌లో సైతం డయాలసిస్ ఉచితంగా చేస్తారు.
- విజయవాడలోని బోధనాసుపత్రిలో కిడ్నీ, యూరాలజీ, వైద్య సేవలు సోమ, గురువారాల్లో అందిస్తారు. కర్నూలు నెఫ్రాలజీ విభాగంలో ప్రతినెలా 150 మందికి ఆధునిక వైద్యం ఉచితంగా అందుతోంది.

- ఈనాడు, అమరావతి, హైదరాబాద్

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం


రింగ్‌రోడ్డులోని సర్వదర్శనం క్యూలైన్‌లోకి వెళ్లేందుకు వేచి ఉన్న భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: వరుస సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. దాంతో సర్వదర్శనం కోసం వస్తున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా లేపాక్షి విక్రయ కేంద్రం నుంచి అదనపు ఈవో కార్యాలయం, నారాయణగిరి అతిథి గృహాలు, ఆర్‌బీసీ సెంటర్, మేదరమిట్ట, ఎస్వీ గోశాల మీదుగా ఆక్టోపస్ భవనం వరకు కొంతసేపు వాహన రాకపోకలు నిలిపివేశారు. ఈ మార్గంలో నడిచి వస్తున్న సర్వదర్శనం భక్తులనే అనుమతించారు. సాయంత్రం వరకు భక్తుల రాక కొనసాగడంతో వైకుంఠం క్యూకాంప్లెక్స్-2, నారాయణగిరి షెడ్లు నిండిపోయి ఆక్టోపస్ భవనం వరకు క్యూలైన్‌లో మూడు కి.మీ. మేర రద్దీ ఏర్పడింది. ప్రస్తుతం సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోందని, ఆదివారం ఉదయం ఆరు గంటలకు క్యూలైన్‌లోకి రావాలని భక్తులకు సాయంత్రం నుంచే మైక్ ద్వారా అధికారులు ప్రచారం చేస్తున్నారు. గదుల కోసం కూడా రద్దీ పెరగడంతో శ్రీవారి ఆలయం, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్లు, సాధారణ షెడ్లలో భక్తులు సేద తీరుతున్నారు. శుక్రవారం శ్రీవారిని 77,043 మంది దర్శించుకోగా.. రూ.3.53 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

తిరుమల మార్గంలో ఫాస్టాగ్ నిబంధన అమలు


అలిపిరి టోల్‌గేట్ వద్ద ఫాస్టాగ్ తీసుకుంటున్న శ్రీవారి భక్తులు


ఫాస్టాగ్ స్టిక్కర్‌ను అందజేస్తున్న ఐసీఐసీఐ సిబ్బంది

ఈనాడు, తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల వాహనాలకు ఈ నెల 15 నుంచి ఫాస్టాగ్ తప్పనిసరి చేయడంతో.. ఫాస్టాగ్ లేని వాహనాలను శనివారం అలిపిరి టోల్‌గేట్ వద్ద నిలిపేశారు. దాంతో అక్కడ తితిదే ఆధ్వర్యంలో ప్రైవేటు బ్యాంకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో కొందరు ఫాస్టాగ్ తీసుకున్నారు. రీఛార్జి చేయించుకోనివారు, బ్లాక్‌లిస్ట్ సమస్యలు ఉన్నవారు అక్కడి సిబ్బందిని సంప్రదించారు. దూరప్రాంత భక్తులు ముందే ఏర్పాట్లు చేసుకోవాలని తితిదే అధికారులు సూచిస్తున్నారు.

సీసీ కెమెరా ఫుటేజీ వివరాలివ్వండి

ఎస్ఈసీని కోరిన వైకాపా

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, వాటి ప్రాంగణాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ, వెబ్ కాస్టింగ్ ఫీడ్, పోలింగ్ ఏజెంట్ల జాబితా, వేర్వేరు ఘటనల వీడియో కవరేజీ, ఫామ్-12, ఫామ్-32 తదితర వివరాలను సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)ను వైకాపా కోరింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఎస్ఈసీ నీలం సాహ్నికి శనివారం లేఖ రాశారు. వీలైనంత త్వరగా ఈ వివరాలు ఇవ్వాలని కోరారు.



తల్లిదండ్రులూ.. ఆ తప్పు చేయకండి

మీ పిల్లలకు అన్ని పనులూ మీరే చేసిపెడుతున్నారంటే, వారికి చేటు చేస్తున్నారని అర్థం. దీనివల్ల వారు ప్రతిదానికీ మిమ్మల్ని సాయం అడగడం తప్ప ఇంకేమీ నేర్చుకోరు. తమ పనులను స్వయంగా చేసుకోగల శక్తి తమకుందన్న విషయమూ తెలుసుకోలేరు. పనులను విజయవంతంగా పూర్తి చేసినప్పుడు కలిగే ఆత్మవిశ్వాసాన్నీ సొంతం చేసుకోలేరు. దీనివల్ల భవిష్యత్తులో వారి ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పిల్లల పట్ల అతి గారాబంతో ఆ తప్పు చేయకండి.

– జెఫ్, పేరెంటింగ్ కోచ్

ఏసీఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్.. కార్యదర్శిగా సానా సతీశ్‌బాబు

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

ఈనాడు, అమరావతి, విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏసీఏ అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా బి.విజయ్‌కుమార్, కౌన్సిలర్‌గా గౌర్ విష్ణుతేజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడి పదవికి నామినేషన్ వేసిన బండారు నరసింహారావు సమర్పించిన ధ్రువీకరణ పత్రాల్లో వివరాలు సరిగ్గా లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధికార ప్రతినిధి మ్యాంచో ఫెర్రర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికైన సభ్యులకు రమేశ్‌కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వచ్చే నెలలో ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహిస్తామని ఏసీఏ సభ్యులు తెలిపారు. ఈ కార్యవర్గం పదవీకాలం 2028 వరకు ఉంది. వైకాపా హయాంలోని ఎపెక్స్ కౌన్సిల్ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజీనామా చేయడంతో మిగిలిన ఏడాది కాలానికి అప్పట్లో ఏసీఏ అధ్యక్షుడిగా కేశినేని శివనాథ్, కార్యదర్శిగా సానా సతీశ్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ కార్యవర్గ పదవీకాలం ఇటీవల ముగియడంతో తాజాగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని. చిత్రంలో సానా సతీశ్‌బాబు, విజయ్‌కుమార్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, గౌర్ విష్ణుతేజ్

సాఫ్ట్‌టెక్‌కే.. డీపీఎంఎస్ పోర్టల్ 2.0 కాంట్రాక్టు

సంస్థ పనితీరుపై పలు విమర్శలు

ఈనాడు, అమరావతి: బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేసే డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీపీఎంఎస్) పోర్టల్ 2.0 నిర్వహణ కాంట్రాక్టు మళ్లీ సాఫ్ట్‌టెక్ సంస్థకే దక్కింది. మరో ఐదేళ్ల కాలానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆ సంస్థతో తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వం డీపీఎంఎస్ పోర్టల్‌ను కొత్త ప్లాట్‌ఫాం (సాఫ్ట్‌వేర్)లోకి మార్చుతోంది. దీన్ని డీపీఎంఎస్ 2.0గా చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ వెర్షన్ మార్చడంతో పాటు పోర్టల్ నిర్వహణ కోసం పిలిచిన సుమారు రూ.15 కోట్ల విలువైన టెండర్‌ను సాఫ్ట్‌టెక్ సంస్థ దక్కించుకుంది. అయితే, భవన నిర్మాణాలకు చేసే దరఖాస్తుల వడపోత (స్క్రూటినీ)లో కీలకంగా వ్యవహరిస్తున్న ఈ సంస్థ పనితీరుపై పలు విమర్శలున్నాయి. ప్రత్యేకించి బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులకు కావాలనే ఇబ్బందులు సృష్టిస్తోందని, కొర్రీలు పెడుతూ బిల్డర్లను తిప్పించుకుంటోందని ఆరోపణలు వస్తున్నాయి.

18 నుంచి క్వాంటమ్ పై అధ్యాపకులకు శిక్షణ

ఈనాడు, అమరావతి: క్వాంటమ్ టెక్నాలజీస్‌పై అధ్యాపకులకు ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 11 వరకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి టీవీ శ్రీకృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మాలవీయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-జైపూర్, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్టీ), ఐబీఎం, టీసీఎస్, ఐఐటీ మద్రాస్, ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వ శాఖలతో కలిసి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

దేశాన్ని జగన్ అవమానించారు: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఓ మాజీ సీఎంగా, రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా జాతీయ పతాకాన్ని జగన్ ఎగరవేయకపోవడం దేశాన్ని, స్వాతంత్ర్య సమరయోధుల్ని, త్రివర్ణ పతాకాన్ని అవమానించడమేనని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధ్వజమెత్తారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమితో ఆయనలో ఏర్పడిన తీవ్ర అసహనమే ఇందుకు కారణమని ఎక్స్ వేదికగా శనివారం పేర్కొన్నారు.

సియాటిల్‌లో
90 సెకన్లలో భారీ దోపిడీ



సియాటిల్‌: అమెరికాలోని సియాటిల్‌ నగరంలో మిట్ట మధ్యాహ్నం భారీదోపిడీ జరిగింది. మాస్కులు ధరించిన నలుగురు దుండగులు తాళం వేసి ఉన్న స్థానిక నగల దుకాణం గాజు తలుపును సుత్తులతో బద్దలు కొట్టి లోనికి చొరబడ్డారు. 90 సెకన్ల వ్యవధిలో 2 మిలియన్‌ డాలర్ల (రూ.17.53 కోట్లు) వజ్రాలు, ఖరీదైన రోలెక్స్‌ గడియారాలు, పచ్చలహారాన్ని వారు దోచుకున్నట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఎలుగుబంట్లపై చల్లే స్ప్రేతోపాటు ఎలక్ట్రిక్‌ తుపాకీతో వారు దుకాణ సిబ్బందిని బెదిరించినట్లు తెలిపారు. దోపిడీ అనంతరం కారులో పారిపోయారన్నారు. సీసీ టీవీలో రికార్డయిన ఈ దృశ్యాలు వైరల్‌గా మారాయి.

కోర్టు హాలులో
‘చేతబడి’ చేష్టలు!



ఇంటర్నెట్‌ డెస్క్‌: దిల్లీలోని అడిషనల్‌ సెషన్స్‌ కోర్టులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఓ హత్యకేసులో నిందితుడిగా ఉన్న డాక్టర్‌ చందర్‌ విభాస్‌ను కోర్టులో హాజరు పరచగా.. అతడు ఉద్దేశపూర్వకంగా కోర్టు హాలులో బియ్యం చల్లడం మొదలుపెట్టాడు. ఈ చేష్టలను చేతబడిగా అనుమానించిన న్యాయవాదులు.. న్యాయమూర్తి షెఫాలీ బర్నాలా టాండన్‌ దృష్టికి తీసుకెళ్లారు. ఈ చర్యను తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి నిందితుడికి ఒకరోజు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు. స్వీపరును పిలిచి హాలు శుభ్రం చేయించారు. తప్పు చేశానని నిందితుడు క్షమాపణ కోరగా.. వృత్తిరీత్యా వైద్యుడైన వ్యక్తి ప్రవర్తన ఆశ్చర్యం కలిగించిందని జడ్జి వ్యాఖ్యానించారు.


సుప్రీంకోర్టులో
పంచాయతీ ఓట్ల గణన



మోహిత్‌ మాలిక్‌ (ఎడమ) ప్రమాణం

ఈటీవీ భారత్‌: సుప్రీంకోర్టులో ఓ పంచాయతీ ఎన్నికల ఈవీఎంలను తెరిచి, ఓట్లను మళ్లీ లెక్కించడం దేశంలోనే తొలిసారిగా ఆగస్టు 11న జరిగింది. హరియాణాలోని పానీపత్‌ జిల్లా బువానా లాఖు గ్రామం ఇలా రికార్డులకు ఎక్కింది. 2022 నవంబరులో జరిగిన ఈ గ్రామ పంచాయతీ ఎన్నికలో కుల్దీప్‌ను విజేతగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని అనుమానించిన ప్రత్యర్థి మోహిత్‌ మాలిక్‌ జిల్లా కోర్టులో పిటిషను వేశారు. ఎలాంటి పురోగతి లేకపోవడంతో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టుకు ఈవీఎంలను తెప్పించి మళ్లీ లెక్కింపు చేపట్టగా, 51 ఓట్ల తేడాతో మోహిత్‌ విజయం సాధించారు. కోర్టు ఆదేశంతో జిల్లా అధికారులు రెండు రోజుల్లోపు ప్రమాణం చేయించగా, ఆగస్టు 15న కొత్త సర్పంచి మోహిత్‌ జాతీయ జెండాను కూడా ఎగురవేశారు.

నేడు భారత్‌కు శుభాంశు శుక్లా
ప్రధాని మోదీతో భేటీ!



దిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్‌)ను సందర్శించిన తొలి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఆదివారం భారత్‌కు తిరిగి రానున్నారు. తన అనుభవాలను స్నేహితులు, సహచరులతో పంచుకోవడానికి ఆత్రుతతో ఉన్నానని వెల్లడించారు. యాక్సియం-4 మిషన్‌ శిక్షణలో భాగంగా శుక్లా గతేడాది అమెరికాకు వెళ్లిన విషయం తెలిసిందే. మిషన్‌ విజయం తర్వాత స్వదేశం భారత్‌కు వస్తున్నట్లు శుక్లా సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. అమెరికా నుంచి బయలుదేరిన ఆయన విమానంలో కూర్చొన్న ఫొటోను ఈ పోస్టుకు జత చేశారు. ఇక్కడికి వచ్చాక ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నెల 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో శుక్లా పాల్గొననున్నారు.

ఓటర్ల జాబితాలను
పార్టీలు పరిశీలించడం మంచిదే


- సకాలంలో అభ్యంతరాలు తెలిపితే తప్పులు సరిచేయడానికి వీలవుతుంది
- ఆరోపిస్తున్నవారు ముందుగానే ఆ పని చేస్తే బాగుండేది: ఈసీ

ఈనాడు, దిల్లీ: ఓటర్ల జాబితాలో లోపాలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన మొదలుపెట్టిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) స్పందించింది. రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించడం మంచిదేనని, దానివల్ల తప్పులను సరిదిద్ది లోపరహితం చేయడానికి వీలవుతుందని పేర్కొంది. ఇప్పుడు తప్పుల గురించి ఆందోళనకు దిగిన రాజకీయ పార్టీలు, వ్యక్తులు నిర్దేశించిన సమయంలో స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని శనివారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో ఈసీ పేర్కొంది. ‘ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత, తుది జాబితా ప్రచురించడానికి ముందూ లోపాలను ఎత్తిచూపడానికి, అభ్యంతరాలు తెలపడానికి వ్యక్తులకు, పార్టీలకు నిర్దేశిత గడువు ఇస్తున్నాం. కొన్ని రాజకీయపార్టీలు, వాటి బూత్‌స్థాయి ఏజెంట్లు సరైన సమయంలో ఓటర్ల జాబితాను పరిశీలించి, అందులోని తప్పులను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లుగా లేదని తెలుస్తోంది’ అని ఈసీ ఆ ప్రకటనలో పేర్కొంది. సరైన సమయంలో ఈ విషయాలను ప్రస్తావించి ఉంటే, ఒకవేళ అవి వాస్తవమైతే సంబంధిత అధికారులు ఎన్నికలకు ముందే ఆ తప్పులను సరిదిద్దేవారని స్పష్టం చేసింది.

నేడు ఈసీ మీడియా సమావేశం

బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించనుంది. ఎన్నికల షెడ్యూలుపై కాకుండా ఆరోపణలపై ఈసీ అధికారికంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం చాలా అరుదు.

స్పేస్‌ నీడిల్‌పై త్రివర్ణ పతాకం రెపరెప



సియాటిల్‌: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సియాటిల్‌లో నగర అందాలను వీక్షించడానికి నిర్మించిన 605 అడుగుల ప్రఖ్యాత స్పేస్‌ నీడిల్‌ టవర్‌పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అమెరికాలోని ఈ ప్రముఖ ప్రాంతంలో విదేశీ జెండాను ఎగురవేయడం ఇదే తొలిసారి. భారత కాన్సుల్‌ జనరల్‌ ప్రకాశ్‌ గుప్తా, సియాటిల్‌ మేయర్‌ బ్రూస్‌ హారెల్‌, మరికొందరు ప్రముఖులు ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ‘స్పేస్‌ నీడిల్‌పై మన జెండా ఎగరడాన్ని మించిన గొప్ప గౌరవం లేదు’ అని పేర్కొంటూ ఎగురుతున్న త్రివర్ణ పతాకం వీడియోతో పాటు మరికొన్ని దృశ్యాలను గుప్తా ‘ఎక్స్‌’లో శనివారం పంచుకున్నారు.

రన్‌వేను తాకిన విమానం తోక

ఇంటర్నెట్‌ డెస్క్‌: ముంబయి ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానానికి (ఎయిర్‌బస్‌ ఏ321) ప్రమాదం తప్పింది. విమానాశ్రయంలో కిందికి దిగే ప్రయత్నంలో విమానం తోకభాగం రన్‌వేను తాకింది. పైలట్‌ అప్రమత్తతతో వెంటనే మళ్లీ గాల్లోకి లేచిన విమానం.. రెండోసారి సురక్షితంగా దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రతికూల వాతావరణంతో ఇలా జరిగినట్లు ఇండిగో విమానయాన సంస్థ ప్రతినిధి ధ్రువీకరించారు.

గ్వాలియర్‌లో ఎయిరిండియా..

బెంగళూరు నుంచి 160 మంది ప్రయాణికులతో శనివారం మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చేరుకొన్న ఎయిరిండియా విమానం స్థానిక ఎయిర్‌పోర్టులో దిగేందుకు చేసిన తొలి ప్రయత్నం విఫలమైంది. కాసేపు చుట్టూ తిరిగాక రెండో ప్రయత్నంలో సురక్షితంగా దిగింది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురైనట్లు ఎయిర్‌పోర్టు డైరెక్టరు ఎ.కె.గోస్వామి తెలిపారు.



మీ విశ్వసనీయతను దెబ్బతీసేది ఎవరంటే..

ఉద్యోగులకైనా, సంస్థలకైనా విశ్వసనీయత చాలా ముఖ్యం. దాన్ని సంపాదించుకోవడానికి కొన్నేళ్లు పడుతుంది. కానీ దాన్ని పోగొట్టుకోవడానికి కొన్ని నిమిషాలు చాలు. మన విశ్వసనీయతను దెబ్బతీసేది మన చర్యలు, ప్రవర్తనే తప్ప ఇంకెవరో కాదు. అందుకే సరదాకైనా మీ వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చే పనులు చేయకండి.

– మార్క్‌ మాన్సన్‌, రచయిత

16 రోజులు.. 1,300 కిలోమీటర్లు

- బిహార్‌లో నేటి నుంచి రాహుల్‌గాంధీ యాత్ర



పట్నా: బిహార్‌ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ ఆ రాష్ట్రంలో భారీ యాత్రకు సిద్ధమయ్యారు. ఓటరు జాబితా సంక్షిప్త ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్‌) ద్వారా పౌరుల ఓటు హక్కును దోచుకుంటున్నారని ఆరోపిస్తున్న ఆయన “ఓట్‌ అధికార్‌ యాత్ర’ పేరుతో దీనిని చేపట్టనున్నారు. ఆదివారం సాసారాం నగరం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర 16 రోజుల పాటు 1,300 కిలోమీటర్ల దూరం 25 జిల్లాల మీదుగా కొనసాగుతుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించే భారీ సభతో ముగుస్తుంది. రాహుల్‌తో పాటు ఇండియా కూటమిలో భాగస్వాములైన ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌, మూడు వామపక్ష పార్టీల నేతలూ పాల్గొంటారు. నడవడంతో పాటు వాహనాల్లో ప్రయాణిస్తూ రాహుల్‌ ఈ యాత్రను కొనసాగిస్తారు.

‘లాపతా ఓటు’ వీడియో విడుదల

ఓటు హక్కుపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా ‘లాపతా ఓటు’ (గల్లంతైన ఓటు) పేరుతో ‘ఎక్స్‌’ వేదికగా వీడియోను శనివారం రాహుల్‌ విడుదల చేశారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా పోరాడి మన హక్కులను కాపాడుకుందామంటూ అందులో పిలుపునిచ్చారు.

కాల్‌సెంటర్‌ డేటా లీకేజీ..
రూ.2.60 కోట్ల మోసం



దిల్లీ: దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డు వినియోగదారులను రూ.2.60 కోట్ల మేర మోసగించిన కేసులో ఆర్నెల్లపాటు నిర్వహించిన ఆపరేషనులో భాగంగా 18 మందిని అరెస్టు చేసినట్లు దిల్లీ పోలీసులు శనివారం వెల్లడించారు. హరియాణాలోని గురుగ్రామ్‌లో గల ఓ కాల్‌సెంటరు సిబ్బంది నుంచి వినియోగదారులకు సంబంధించిన రహస్య సమాచారాన్ని నిందితులు పొందినట్లు ఆరోపణలున్నాయి. బ్యాంకు అధికారులుగా నటిస్తూ ఓటీపీలు, కార్డ్‌ వెరిఫికేషన్‌ వాల్యూస్‌ (సీవీవీ) వంటి సున్నిత సమాచారాన్ని వీరు సేకరించినట్లు అధికారులు తెలిపారు. అంకిత్‌ రాఠీ, వసీం, విశాల్‌ భరద్వాజ్‌లను ఈ మోసానికి ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. డేటా లీకేజీకి బాధ్యులైన కాల్‌సెంటర్‌ సిబ్బంది ఇద్దరిని కూడా అరెస్టు చేశారు.

కాంగ్రెస్‌, జిన్నా, మౌంట్‌బాటన్‌ల వల్లే దేశ విభజన

- కొత్త మాడ్యూల్‌లో పేర్కొన్న ఎన్‌సీఈఆర్‌టీ



దిల్లీ: భారతదేశ విభజనకు జిన్నా, కాంగ్రెస్‌ పార్టీ, ఆనాటి వైస్రాయ్‌ లార్డ్‌ మౌంట్‌బాటన్‌లే కారణమని ఎన్‌సీఈఆర్‌టీ విడుదలచేసిన కొత్త మాడ్యూల్‌ పేర్కొంది. దేశ విభజన తరవాతే కశ్మీర్‌ సమస్య పుట్టుకొచ్చిందని ఉద్ఘాటించింది. ఎన్‌సీఈఆర్‌టీ.. 6 నుంచి 8 తరగతుల (మిడిల్‌ స్టేజ్‌) వరకు ఒక మాడ్యూల్‌, 9-12 తరగతులకు(సెకండరీ దశ) రెండో మాడ్యూల్‌ను విడుదలచేసింది. దేశ విభజన కాలంలో లక్షలమంది నిర్వాసితులయ్యారని, ఎందరో ప్రాణాలు కోల్పోయారని, వారి సంస్మరణార్థం ఆగస్టు 14వ తేదీని దేశ విభజన కాలంనాటి భయానక స్మృతుల సంస్మరణ దినంగా పాటిస్తామని ప్రధాని మోదీ 2021లో ట్విటర్‌ (ఎక్స్‌)లో చేసిన పోస్టును ఈ సంస్థ ఉటంకించింది. దేశ విభజన తప్పుడు భావనల వల్లే అది సంభవించిందని మిడిల్‌ స్టేజ్‌ తరగతుల మాడ్యూల్‌ వివరించింది. హిందువులు, ముస్లింలు ఒకరికొకరు ఏమాత్రం పొంతనలేనివారని వాదిస్తూ జిన్నా దేశ విభజనను డిమాండ్‌ చేయగా, కాంగ్రెస్‌ దాన్ని ఆమోదించిందని, విభజన నిర్ణయాన్ని మౌంట్‌బాటన్‌ అమలు చేశారని పేర్కొంది. “భారతదేశానికి 1948 జూన్‌లో స్వాతంత్ర్యం ఇవ్వాల్సి ఉండగా, ఆ తేదీని ముందుకు జరిపి 1947 ఆగస్టులోకి తీసుకురావడం మౌంట్‌బాటన్‌ చేసిన పొరపాటు. దీంతో భారత్‌, పాకిస్థాన్‌ల మధ్య సరిహద్దుల నిర్ణయాన్ని సర్‌ సైరిల్‌ రాడ్‌క్లిఫ్‌ కేవలం 5 వారాల్లో పూర్తిచేయాల్సి వచ్చింది. దేశం రణరంగమైంది కాబట్టి విడిపోతేనే మేలని వల్లభ్‌భాయ్‌ పటేల్‌ పేర్కొన్నారు. దేశ విభజనను తాను ఆమోదించకపోయినా కాంగ్రెస్‌ సమ్మతిస్తే అడ్డుకోబోనని మహాత్మాగాంధీ వ్యాఖ్యానించారు” అని ఎన్‌సీఈఆర్‌టీ మాడ్యూల్‌ పేర్కొంది.


వక్రీకరిస్తున్నారు: కాంగ్రెస్‌

ఈ మాడ్యూల్‌పై కాంగ్రెస్‌ మండిపడింది. చరిత్రలో జరిగిన అసలు నిజాలు తెలియకుండా వక్రీకరిస్తున్నారని దుయ్యబట్టింది. కాంగ్రెస్‌ విమర్శలను భాజపా ఖండించింది. విభజనకు సంబంధించిన వాస్తవాలు బయటకు రావడం వల్లే కాంగ్రెస్‌ బాధపడుతోందని విమర్శించింది.

బెంగళూరులో ఐదుగురి సజీవ దహనం



మదన్‌కుమార్‌, సంగీత, మితేశ్‌, విహాన్‌



సురేష్‌

బెంగళూరు(యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఘోర అగ్నిప్రమాదం బెంగళూరు నగరాన్ని వణికించింది. సెంట్రల్‌ సిటీలోని నగర్తపేటలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ దుర్ఘటన ఐదుగురిని బలితీసుకుంది. అందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. నగర్తపేటలో సందీప్‌, బాలకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులకు చెందిన నాలుగు అంతస్తుల భవనం కింది భాగంలోని 2 దుకాణాల్లో ప్లాస్టిక్‌ వస్తువులు నిల్వ చేశారు. శనివారం తెల్లవారుజామున అక్కడ మంటలు చెలరేగాయి. అనంతరం మొదటి అంతస్తుకు వ్యాపించాయి. ఆ అగ్నికీలల తీవ్రతకు సురేష్‌ (31) అనే వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఒక్కసారిగా మంటలు మూడో అంతస్తుకు వ్యాపించడంతో అక్కడ నివశిస్తున్న మదన్‌కుమార్‌ (38) ఆయన భార్య సంగీత (33), కుమారులు మితేశ్‌ (8), విహాన్‌(5)లూ సజీవ దహనమైనట్లు నగర పోలీసు కమిషనర్‌ సీమంత్‌ కుమార్‌ సింగ్‌ తెలిపారు.

అమరావతి ఉద్యమం అజరామరం

- అరాచక ప్రభుత్వాన్ని సాగనంపడంలో కీలకపాత్ర
- ‘నేను-నా అమరావతి’ పుస్తకంలో ఉద్యమాన్ని కళ్లకు కట్టారు
- పోతుల బాలకోటయ్య కృషిని కొనియాడిన వక్తలు



‘నేను– నా అమరావతి’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, పువ్వాడ సుధాకర్‌, తులసిరెడ్డి, పోతుల బాలకోటయ్య, టీడీ జనార్దన్‌, మంత్రి కొల్లు రవీంద్ర

ఈనాడు, అమరావతి: రాజ్యహింసను ఎదిరించిన శాంతియుత శౌర్యం అమరావతి ఉద్యమమని పలువురు వక్తలు కొనియాడారు. జగన్‌ అరాచక పాలనకు చరమగీతం పాడటంలో ఈ ఉద్యమం కీలకభూమిక పోషించిందన్నారు. మహిళలు, రైతులు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలు దీన్ని ముందుండి నడిపించాయని గుర్తు చేశారు. రైతులు, మహిళల త్యాగానికి గుర్తుగా.. భావితరాలకు ప్రేరణ ఇచ్చేలా అమరావతిలో ఓ మ్యూజియం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య రాసిన ‘నేను-నా అమరావతి’ పుస్తకంలో అమరావతి ఉద్యమ ప్రస్థానాన్ని, వైకాపా ప్రభుత్వ దమనకాండను కళ్లకు కట్టారని పేర్కొన్నారు. అమరావతి చరిత్రను భావితరాలకు తెలియజేయడానికి ఇదో కరదీపికని తెలిపారు. విజయవాడలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. బాలకోటయ్య పోరాటాన్ని గుర్తించి కూటమి ప్రభుత్వం ఆయన్ను సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గా నియమించిందన్నారు. ‘గత ప్రభుత్వంలో నేను దిల్లీలో ఉన్నా ఏదో ఒక రూపంలో అమరావతి ఉద్యమంలో పాల్గొనేవాణ్ని. నిరంతరం బాలకోటయ్య లాంటి ఉద్యమ నేతలను సంప్రదిస్తుండేవాణ్ని. ఇక అమరావతికి విఘ్నాలు లేవు. రెండున్నరేళ్లలో అసెంబ్లీ భవన నిర్మాణం పూర్తికానుంది’ అని రఘురామ చెప్పారు. బ్రిటిష్‌ కాలం నాటి అరాచకాలు వైకాపా ప్రభుత్వంలో పునరావృతమయ్యాయని.. రైతులు, మహిళల్ని నిర్బంధించారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అలాంటి వాటిపై అహింసా మార్గంలో ఎలా పోరాడాలో అమరావతి ఉద్యమం నేర్పిందని చెప్పారు. ప్రపంచంలో జరిగిన ఉద్యమాల్లో అమరావతి ఉద్యమానికి ప్రత్యేక స్థానం ఉంటుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ అన్నారు. ఓ మహోజ్వల చరిత్రను బాలకోటయ్య పుస్తకంలో నిక్షిప్తం చేశారని కాంగ్రెస్‌ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో రెరా మాజీ ఛైర్మన్‌ రామనాథ్‌, గోళ్ళ నారాయణరావు, ఉన్నం మురళీధరరావు, పాములపాటి వెంకటశేషయ్య, పువ్వాడ సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

విచ్చుకున్న నైసార్‌ యాంటెన్నా రిఫ్లెక్టర్‌



శ్రీహరికోట, న్యూస్‌టుడే: నాసా, ఇస్రో సంయుక్తంగా ప్రయోగించిన నాసా, ఇస్రో సింథటిక్‌ ఎపర్చర్‌ రాడార్‌ (నైసార్‌) ఉపగ్రహంలోని యాంటెన్నా రిఫ్లెక్టర్‌ విజయవంతంగా విచ్చుకుంది. జులై 30న శ్రీహరికోటలోని షార్‌ నుంచి ప్రయోగం నిర్వహించగా 17 రోజుల తర్వాత 12 మీటర్ల పరిమాణంలో ఉండే ఈ భాగం తెరుచుకుంది. దిగువ భూకక్ష్యలో ఉన్న నైసార్‌ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అడవులు, అగ్ని పర్వతాలు, హిమానీనదాల్లో వచ్చే మార్పులను నైసార్‌ ఎప్పటికప్పుడు స్కాన్‌ చేస్తూ విలువైన సమాచారం అందించనుంది.

ఆ క్షణాల్లో.. ఆయనే దేవుడు!

- తిరుమలలో సీపీఆర్‌ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌



భక్తుడికి ప్రథమ చికిత్స అందిస్తున్న కానిస్టేబుల్‌ గురప్ప



సీపీఆర్‌ అనంతరం కోలుకున్న భక్తుడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనానికి తిరుమల వచ్చిన ఓ భక్తుడికి గుండెపోటు రాగా ఓ కానిస్టేబుల్‌ దేవుడిలా వచ్చి ఆయనను కాపాడారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కంది మండలం మామిడిపల్లికి చెందిన మేడం శ్రీనివాసులు (61) కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం లడ్డూలు తీసుకుని మ్యూజియం వైపు వెళ్తుండగా గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయారు. అక్కడే విధుల్లో ఉన్న తిరుమల వన్‌టౌన్‌ కానిస్టేబుల్‌ గురప్ప సమయస్ఫూర్తితో వ్యవహరించి శ్రీనివాసులుకు సీపీఆర్‌, ప్రథమ చికిత్స చేశారు. కాస్త కోలుకోగానే తొలుత తితిదే అశ్విని ఆసుపత్రికి, అనంతరం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. శ్రీనివాసులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని వైద్యులు వెల్లడించారు.

ఏలూరు సమీపంలో ఎల్వీ ప్రసాద్‌ కంటి ఆసుపత్రి

- పనులకు రేపు భూమిపూజ
- భూమి విరాళమిచ్చిన విశ్రాంత ఐఏఎస్‌ దమయంతి

ఈనాడు, ఏలూరు: గోదావరి జిల్లాల వాసులకు ఉన్నతస్థాయి కంటి వైద్యం అందించేందుకు అడుగులు పడుతున్నాయి. ఏలూరు సమీపంలోని వంగూరులో ద్వితీయశ్రేణి నేత్ర సంరక్షణ కేంద్రాన్ని సకల సౌకర్యాలతో నిర్మించాలని ఎల్వీ ప్రసాద్‌ నేత్రవైద్య విజ్ఞానసంస్థ నిర్ణయించింది. ఇందుకు గ్రామానికి చెందిన విశ్రాంత ఐఏఎస్‌ అధికారిణి కాసరనేని దమయంతి 10.87 ఎకరాల భూమిని ఇచ్చారు. దీనికి సోమవారం భూమిపూజ చేయనున్నారు. ‘కాసరనేని పరిపూర్ణ లక్ష్మి నేత్రసంరక్షణ కేంద్రం’గా పేరు పెట్టారు. మూడేళ్లలో 15వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రిని నిర్మించనున్నారు. అప్రోచ్‌ రోడ్‌ నిర్మాణానికి దమయంతి సోదరుడు విద్యాసాగర్‌ 61 సెంట్ల భూమిని విరాళంగా ఇవ్వడంతో దారి సమస్య కూడా పరిష్కారమైంది.

బొటిక్‌ నడిపే ఆమె.. పోలీసులనే శాసించారు!

- నెల్లూరు జిల్లాలో అరాచకశక్తిగా ఓ మహిళ
- వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకుల అండదండలతో దందాలు
- అప్పట్లో నెల్లూరులో పనిచేసిన ఓ పోలీసు ఉన్నతాధికారితో సన్నిహిత సంబంధాలు
- ఆ ఐదేళ్లూ సెటిల్‌మెంట్ల పర్వం
- తాజాగా మళ్లీ పైరవీలు, దందాలు మొదలు

ఈనాడు, నెల్లూరు: ఒకప్పుడు ఆమె చిన్న బొటిక్‌ నిర్వహించుకునేవారు. వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకుల అండదండలు, అప్పట్లో జిల్లాలో పనిచేసిన ఓ పోలీసు ఉన్నతాధికారితో సన్నిహిత సంబంధాలతో ఆ ఐదేళ్లలో అత్యంత ‘పవర్‌ఫుల్‌’గా తయారయ్యారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లను తన కనుసైగలతో శాసించేంతగా తయారై.. సెటిల్‌మెంట్లు, దందాలతో పేట్రేగిపోయారు. డెన్లు ఏర్పాటుచేసుకుని రౌడీషీటర్లతో గ్యాంగ్‌లు నడిపించారు. గంజాయి స్మగ్లింగ్‌ చేయిస్తూ.. రూ.కోట్లు కూడబెట్టారు. తనను తాను ఓ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శిగా పరిచయం చేసుకుంటూ ఈ దందాలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్నాళ్ల పాటు వ్యూహాత్మక మౌనం పాటించిన ఆమె తాజాగా మళ్లీ పైరవీలు, దందాలు మొదలుపెట్టేశారు. ఓ హత్య కేసులో దోషిగా తేలి యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్‌ అనే ఖైదీకి నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల పెరోల్‌ ఇప్పించటంలో ఆమెదే కీలకపాత్రని సమాచారం.

అధికార యంత్రాంగం ఆమెకు ఎంతలా సాగిలపడిందో!

ఓ వైన్‌షాపు మేనేజర్‌ను హత్య చేసిన కేసులో తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన శ్రీకాంత్‌ను దోషిగా తేల్చి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష వేసింది. 2010 నుంచి నెల్లూరు కేంద్ర కారాగారంలో అతను ఖైదీగా ఉన్నాడు. 2014 ఫిబ్రవరి 12న జైలు నుంచి తప్పించుకుని పారిపోయిన శ్రీకాంత్‌.. 2018 నవంబరులో మళ్లీ పోలీసులకు చిక్కి అప్పటి నుంచి జైల్లో ఉన్నాడు. పెరోల్‌ కోసం ఇటీవల శ్రీకాంత్‌ దరఖాస్తు చేసుకున్నాడు. శ్రీకాంత్‌ బయటకొస్తే తీవ్ర నేరాలకు పాల్పడే అవకాశముందని.. అతనికి పెరోల్‌ ఇవ్వొద్దంటూ నెల్లూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలు, నెల్లూరు జైల్‌ సూపరింటెండెంట్‌ అభ్యంతరం తెలిపారు. వాటిని బేఖాతరు చేస్తూ అతనికి 30 రోజుల పెరోల్‌ మంజూరు చేస్తూ కొద్ది రోజుల కిందట హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాంత్‌ కారాగారంలో ఉంటే అతని గ్యాంగ్‌ను తానే నడిపిస్తూ దందాలు చేయిస్తున్న సదరు మహిళే.. నెల్లూరు జిల్లాలో కొంతమంది నాయకులతో పాటు సచివాలయంలోనూ కొందరు ఉన్నతాధికారులను ప్రభావితం చేసి మరీ ఈ పెరోల్‌ మంజూరు చేయించారని చెబుతున్నారు. ఈ వ్యవహారం వివాదాస్పదమవటంతో ప్రభుత్వం పెరోల్‌ను రద్దు చేసింది. అయితే ఆ మహిళ ఏ స్థాయిలో పైరవీలు, సిఫార్సులు చేస్తున్నారో, అధికార యంత్రాంగం ఆమెకు ఎంతలా సాగిలపడుతుందో చెప్పేందుకు ఈ ఘటన ఉదాహరణగా నిలిచింది.

ఆసుపత్రిలో ఖైదీతో సరసాలు.. చోద్యం చూసిన పోలీసులు

అనారోగ్యం పాలయ్యారంటూ శ్రీకాంత్‌ను గతేడాది డిసెంబరులో నెల్లూరు జిల్లా జైలు అధికారులు తిరుపతి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసు వాహనం దిగి, అతను ఆసుపత్రికి నడుచుకుంటూ వెళ్తుండగా ఓ ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనటంతో చేయి విరిగింది. దీంతో శ్రీకాంత్‌ను మళ్లీ నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు అతణ్ని ఎవరూ కలవకుండా చూడాల్సిన బాధ్యత సెంట్రీ పోలీసులదే. కానీ ఈ పవర్‌ఫుల్‌ మహిళకు సెంట్రీ విధుల్లో ఉన్న పోలీసులు దాసోహమైపోయారు. ఆమె ఎప్పుడు కావాలంటే అప్పుడు శ్రీకాంత్‌ దగ్గరకు వెళ్లేవారు. ఆసుపత్రి పడకపై ఖైదీ శ్రీకాంత్‌ ఆమెతో సరసాలాడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ అవుతున్నాయి.

EENADU Vol: 52, Issue: 8 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఐటీలో.. మీదైన ప్రత్యేకత ఉండాలి

● నైపుణ్యాలు పెంచుకుంటేనే మనుగడ ● కెరీర్ మధ్యలో ఉన్నవారికి తప్పనిసరి

● ఈనాడుతో టీమ్‌లీజ్ డిజిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీతి శర్మ

'ఐటీ రంగంలో నియామకాల తీరు మారింది. ఒకప్పటిలా ఒకే సాంకేతికతను నేర్చుకొని, అందులోనే కొనసాగుతాం అంటే ఉద్యోగం సాగదు. ముఖ్యంగా మిడ్-కెరీర్‌లో ఉన్నవారు తమ నైపుణ్యాలను పెంచుకోవాల్సిందే. ఐటీతోపాటు, ఇతర రంగాల్లోనూ నియామకాలు పెరుగుతున్నాయి. అందులో ఉన్న అవకాశాలనూ ఒడిసి పట్టుకోవాలి' అని అంటున్నారు.. ఐటీ ఉద్యోగాల నియామకాల సేవలను అందించే టీమ్‌లీజ్ డిజిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీతి శర్మ. ఇప్పుడున్న ఉద్యోగ పరిస్థితులపై ఆమె ఇంకా ఏమంటున్నారంటే...

? భారత ఉద్యోగ మార్కెట్లో ఏయే రంగాలు వేగంగా వృద్ధి చెందుతున్నాయి

ప్రస్తుతం మన దేశ ఉద్యోగ మార్కెట్‌లో డిజిటల్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఆరోగ్య సంరక్షణ, తయారీ, జీసీసీ వంటి రంగాల్లో అధికంగా ఉద్యోగావకాశాలు కనిపిస్తున్నాయి. వీటితోపాటు విద్యుత్ వాహనాలు, క్లీన్ ఎనర్జీ, బ్యాటరీ టెక్నాలజీ, ఇంజినీరింగ్, పర్యావరణహిత ప్రాజెక్టుల్లోనూ కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ రంగం డిజిటల్ అవుతోంది. దీంతో ఆన్‌లైన్ మెడికల్ సర్వీసుల్లో కొత్త నియామకాలు పెరుగుతున్నాయి. తయారీ రంగంలోనూ డిజైనర్లకు ప్రాధాన్యం కనిపిస్తోంది. అదే సమయంలో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) ఫైనాన్స్, డేటా అనాలిసిస్, టెక్నాలజీ నైపుణ్యాలు ఉన్నవారిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికీ ఇ-కామర్స్, డెలివరీ కోసం కార్మికులకు గిరాకీ అధికంగా ఉంటోంది. ఈ రంగంలో ఎంతోమందికి చోటుంది.

? ఎలాంటి నైపుణ్యాలు ఉన్న వారికి ఇప్పుడు ఉద్యోగాలు లభిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎలాంటి మార్పులు వచ్చే అవకాశం ఉంది

కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ టెక్నాలజీ వంటి నైపుణ్యాలున్న వారిని నియమించుకునేందుకు కంపెనీలు అధికంగా ఆసక్తి చూపిస్తున్నాయి. వీటితో పాటు మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్లు, క్లౌడ్ ఆర్కిటెక్ట్స్, డెవాప్స్ ఇంజినీర్లు, ఫుల్-స్టాక్ డెవలపర్లకు గిరాకీ ఉంది. పైథాన్, క్యూబర్‌నెటెస్, ఏడబ్ల్యూఎస్, అజూర్, ఏపీఐ ఇంటిగ్రేషన్ వంటి నైపుణ్యాలుంటే ఉద్యోగాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండటం లేదు. సంస్థలు ఇప్పటి ప్రయోజనాలతోపాటు, భవిష్యత్తు అవసరాలనూ చూస్తున్నాయి. అందుకు తగ్గట్లుగా ఉద్యోగార్థులు సిద్ధం కావాలి. జనరేటివ్ ఏఐ, లో-కోడ్ ప్లాట్‌ఫారాలు, ఎడ్జ్ కంప్యూటింగ్‌లాంటివి ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. అయితే నియామకాల విషయంలో ప్రస్తుతం కంపెనీలు కాస్త నెమ్మదిగా ముందుకెళ్తున్నాయి.



? రెండు, మూడో తరగతి పట్టణాల్లో ఐటీ ఉద్యోగాలకు అవకాశాలు ఎలా ఉన్నాయి

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె వంటి నగరాలు ఐటీ నియామకాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే కోయంబత్తూరు, భువనేశ్వర్, ఇందౌర్ వంటి రెండో శ్రేణి నగరాల్లోనూ ఐటీ సంస్థలు ఏర్పాటవుతున్నాయి. చాలా సంస్థలు రెండు, మూడో శ్రేణి నగరాల్లో తమ కేంద్రాలను ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా మధ్యస్థాయి కంపెనీలు, అంకురాలు మెట్రో నగరాలకు అవతల తమ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాయి. కాకపోతే, అధిక నైపుణ్యాలు, నాయకత్వ స్థానాల్లో ఉన్నవారు లభించడం కాస్త కష్టంగానే ఉంటోంది.

? భారత ఐటీ మార్కెట్‌లో ఉద్యోగాల కోత, నైపుణ్యాల కొరతలాంటి సవాళ్లు కనిపిస్తున్నాయి. పరిశ్రమ దీనిని ఎలా అధిగమించగలదు

మధ్యస్థాయి, సీనియర్ ఉద్యోగులపై ఉద్యోగాల కోత ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. పరిశ్రమకు కావాల్సిన, ఉద్యోగాల్లోకి వస్తున్న వారి నైపుణ్యాల మధ్య చాలా అంతరం ఉంటోంది. ఏఐ, క్లౌడ్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీలాంటివి ఇప్పుడు తప్పనిసరి అయ్యాయి. సానుకూల అంశం ఏమిటంటే.. ఇప్పటికే చాలామంది ఐటీ నిపుణులు ప్రాజెక్టులపై కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తూ నేర్చుకోవడంలాంటివి చేస్తున్నారు. కంపెనీలూ మధ్యస్థాయి ఉద్యోగులను భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. ఉద్యోగాల్లోకి వస్తున్న వారు డొమైన్ నైపుణ్యాలతోపాటు, క్రిటికల్ థింకింగ్‌లాంటి సాఫ్ట్ స్కిల్స్‌నూ నేర్చుకోవాలి.

? ఇప్పుడంతా జీసీసీల పైనే చర్చిస్తున్నారు. వీటిలో చేరేందుకు ఏ నైపుణ్యాలు అవసరం

హైదరాబాద్ ఇప్పుడు దేశంలో ఆకర్షణీయమైన జాబ్ మార్కెట్‌లలో ఒకటిగా నిలవడానికి ప్రధాన కారణం జీసీసీలే. అంతర్జాతీయ స్థాయిలో ఆలోచిస్తూ, అందుకు తగ్గట్లుగా పనిచేసే వారికే వీటిలో ఉద్యోగాలుంటాయి. ఏఐ, ఎంఎల్‌లు మాత్రమే సరిపోవు. ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లాంటివి కావాలి. జీసీసీల పనితీరును అర్థం చేసుకోవాలి. అలాంటి వారికి ఎప్పుడూ ఇబ్బంది ఉండదు.

– ఈనాడు, హైదరాబాద్

ఈనాడు బిజినెస్ వారాంతం

ఈ వారమూ ఐపీఓల సందడే

అయిదు ప్రధాన, రెండు ఎస్ఎమ్ఈ ఇష్యూలు



ఈ వారం ఏడు పబ్లిక్ ఇష్యూ(ఐపీఓ)లు మార్కెట్లోకి రానున్నాయి. ప్రధాన విభాగం(మెయిన్‌బోర్డ్)లో విక్రమ్ సోలార్, శ్రీజి షిప్పింగ్, జెమ్ ఏరోమాటిక్స్, పటేల్ రిటైల్, మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ ఇష్యూలు సబ్‌స్క్రిప్షన్‌కు సిద్ధం అవుతున్నాయి. వీటిల్లో మంగళ్ ఎలక్ట్రికల్ 28న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానుండగా, మిగతా నాలుగూ 26న నమోదు కానున్నాయి. ఎస్ఎమ్ఈ విభాగంలో రెండు కొత్త పబ్లిక్ ఇష్యూలు(స్టూడియో ఎల్ఎస్‌డీ, ఎల్‌జీటీ బిజినెస్ కనెక్షన్స్) రానున్నాయి.

లిస్టింగ్‌లూ ఉన్నాయ్: ప్రధాన ఇష్యూల్లో ఈ వారం బ్లూస్టోన్ జువెలరీ ఆగస్టు 19న, రెగాల్ రీసోర్సెస్ 20న నమోదు కానున్నాయి. ఎస్ఎమ్ఈ విభాగంలో 18న ఏఎన్‌బీ మెటల్‌క్యాస్ట్, స్టార్ ఇమేజింగ్, మెడిస్టెప్ హెల్త్‌కేర్; 19న ఇకోడెక్స్ పబ్లిషింగ్, 20న మహేంద్ర రియల్టర్స్ ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈ ప్లాట్‌ఫాంపై నమోదు కానున్నాయి.

కంపెనీ	తేదీ	ధర శ్రేణి (రూ.లలో)	నిధుల సమీకరణ (రూ.కోట్లలో)
విక్రమ్ సోలార్	19–21	315–332	2079.37
శ్రీజి షిప్పింగ్ గ్లోబల్	19–21	240–252	410.71
జెమ్ ఏరోమాటిక్స్	19–21	309–325	451.25
పటేల్ రిటైల్	19–21	237–255	242.76
మంగళ్ ఎలక్ట్రికల్	20–22	533–561	400.00

ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 47% పెరిగాయ్: గోయల్



దిల్లీ: భారత్ నుంచి ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 2025-26 ఏప్రిల్-జూన్‌లో 47% పెరిగాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. సమీక్షా త్రైమాసికంలో 12.4 బిలియన్ డాలర్ల (రూ.1.08 లక్షల కోట్ల) ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు నమోదయ్యాయి. 2014-15లో 31 బి.డాలర్ల ఎలక్ట్రానిక్స్‌ను మన దేశం ఉత్పత్తి చేస్తుండగా, 2024-25 నాటికి 133 బి.డాలర్ల స్థాయికి చేరుకోవడం 'మేకిన్ ఇండియా' సాధించిన విజయమని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి పోస్ట్ చేశారు. తయారీలో మన దేశాన్ని ఆత్మనిర్భర్ (స్వావలంబన)గా మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టడంతో 2014లో 2 మొబైల్ తయారీ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 300కు చేరాయని మంత్రి తెలిపారు.

గూగుల్‌లో మళ్లీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు

● ఏఐ సాధనాలతో మోసం చేస్తున్న వారికి కళ్లెం

● కనీసం ఒక విడత నేరుగా ముఖాముఖి

దిల్లీ: దృశ్య మాధ్యమ (వర్చువల్) విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు జరుపుతుంటే, నమ్మదగిన వ్యక్తులు సంస్థలోకి రావడం లేదని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే గూగుల్‌లో మళ్లీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మంచి నైపుణ్యం కలిగిన వ్యక్తులను నిర్ధారించుకోవడానికి, అభ్యర్థులను కనీసం ఒక విడత వ్యక్తిగత ఇంటర్వ్యూలతో పరీక్షించాలని గూగుల్ యోచిస్తోందని పిచాయ్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఎందుకు వద్దంటే..: కృత్రిమ మేధ (ఏఐ) సమస్య చాలా విస్తృతంగా వ్యాపించినందున, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు రిమోట్ జాబ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలను నిర్వహించవద్దని గూగుల్ ఉద్యోగులు కంపెనీ యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగంలోకి వచ్చిన తర్వాత అభ్యర్థులు రియల్-టైమ్ కోడింగ్ సవాళ్లను పరిష్కరించాల్సి ఉంటుందని, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల సమయంలో కెమెరా బయట ఏఐ సాధనాలను ఉపయోగించడం వల్ల అభ్యర్థుల వాస్తవిక సత్తా తెలియడం లేదని వాపోయారు. దీనిపై గూగుల్ ఇప్పుడు పునరాలోచనలో పడింది.



గతంలో ఎందుకు నిర్వహించారు?: గూగుల్ గతంలో ఆన్‌లైన్ ఇంటర్వ్యూలను ఎందుకు ఇష్టపడిందంటే.. ప్రాథమిక సవాలును ఎదుర్కోవడం ఇష్టం లేకపోవడం వల్లే అని గూగుల్ వైస్ ప్రెసిడెంట్ బ్రియాన్ ఓంగ్ అంగీకరించారు. వర్చువల్ ఇంటర్వ్యూలు రెండు వారాల పాటు వేగంగా షెడ్యూల్ చేయడం సులభమని తెలిపారు. దీంతో శ్రమ, సమయం, వ్యయాలు తగ్గుతాయని పేర్కొన్నారు. అయితే ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ప్రక్రియలో ఏఐ ఇప్పుడు ఎలా ప్రభావం చూపుతుందో సమగ్రంగా పర్యవేక్షించడానికి మేము కచ్చితంగా ఇంకా ఎక్కువగా దీనిపై పని చేయాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.

మోసం చేస్తోంది 50% కంటే ఎక్కువే: ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల్లో 50% కంటే ఎక్కువ మంది ఏఐ సాధనాల సాయంతో మోసం చేస్తున్నారని నియామక నిర్వాహకులు పేర్కొంటున్నారని ఒక నివేదిక వెల్లడించింది. 'మనమందరం హైబ్రిడ్‌గా పని చేస్తున్నందున, ఇంటర్వ్యూలలో కొంత భాగాన్ని వ్యక్తిగతంగా నిర్వహించడంపై ఆలోచించడం మంచిదని నేను భావిస్తున్నాను. గూగుల్ సంస్కృతిని అభ్యర్థులు అర్థం చేసుకోవడానికి కూడా ఇది సహాయపడుతుందని అనుకుంటున్నాన'ని పిచాయ్ వెల్లడించారు.

సమస్య అంతటా: ఈ సమస్య కేవలం గూగుల్‌కే పరిమితం కాలేదని, 'పరిశ్రమ వ్యాప్త సంక్షోభం'గా మారుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి మార్గాలను అన్వేషిస్తున్నామని బ్రియాన్ ఓంగ్ వెల్లడించారు.

కోడి గుడ్లు

17న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	520
గోదావరి	510
విశాఖపట్నం	515
చిత్తూరు	548

అత్యధిక యువత మెచ్చిన నగరం బ్యాంకాక్



దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా 30 సంవత్సరాల్లోపు యువత (జెన్ జెడ్) మెచ్చిన నగరాల్లో బ్యాంకాక్ (థాయ్‌లాండ్) అగ్రస్థానంలో నిలిచింది. ముఖ్యంగా అందుబాటు ధరలు, సంస్కృతి, రాత్రివేళల్లో వినోదభరిత జీవనం, నాణ్యమైన జీవితం- ఈ నాలుగు అంశాలకు వాళ్లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఓ సర్వే తెలిపింది. ప్రస్తుత సంవత్సరానికి గాను టైమ్ అవుట్ ఈ సర్వేను నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 18,500 మంది ఇందులో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇందులో రెండో ఉత్తమ నగరంగా మెల్‌బోర్న్‌కు ఎక్కువ మంది ఓటేశారు. ఆస్ట్రేలియాకు చెందిన ఈ నగరంలో అందరికీ సమాన అవకాశాలతో కూడిన పరిస్థితులు, సంస్కృతి విధానాలు తమకు నచ్చాయని యువత వెల్లడించినట్లు సర్వే తెలిపింది. మూడో స్థానంలో నిలిచిన కేప్‌టౌన్‌లో ప్రకృతి సౌందర్యం, రాత్రిపూట వినోదభరిత జీవనం వంటి అనుకూలతలు ఉన్నట్లు వారు చెప్పారని పేర్కొంది.

జెన్ జెడ్ మెచ్చిన ఉత్తమ 10 నగరాలివే..

స్థానం	నగరం	దేశం
1	బ్యాంకాక్	థాయ్‌లాండ్
2	మెల్‌బోర్న్	ఆస్ట్రేలియా
3	కేప్‌టౌన్	దక్షిణాఫ్రికా
4	న్యూయార్క్	యునైటెడ్ స్టేట్స్
5	కోపెన్‌హగన్	డెన్మార్క్
6	బార్సిలోనా	స్పెయిన్
7	ఎడిన్‌బర్గ్	యునైటెడ్ కింగ్‌డమ్
8	మెక్సికో సిటీ	మెక్సికో
9	లండన్	యునైటెడ్ కింగ్‌డమ్
10	షాంఘై	చైనా

యాపిల్ ఫోన్ల సరఫరాలు 21.5% పెరిగాయ్



● 2025 ప్రథమార్ధంలో 59 లక్షలకు చేరిక

● రెండో త్రైమాసికంలో వివో ఆధిపత్యం

● ఐడీసీ నివేదిక

దిల్లీ: మన దేశంలో ఈ ఏడాది ప్రథమార్ధంలో యాపిల్ ఫోన్ల సరఫరాలు వార్షిక ప్రాతిపదికన 21.5 శాతం పెరిగి 59 లక్షలకు చేరాయని ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) వెల్లడించింది. సమీక్షా కాలంలో ఐఫోన్ 16 ఫోన్లు అత్యధికంగా సరఫరా అయ్యాయని తెలిపింది. ఐడీసీ ప్రకారం..

* దేశీయ స్మార్ట్‌ఫోన్ విపణిలోకి 2025 ప్రథమార్ధంలో మొత్తం 7 కోట్ల ఫోన్లు సరఫరా అయ్యాయి. వార్షికంగా 0.9 శాతం నమోదైంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికం వరకు చూస్తే 7.3 శాతం వృద్ధితో 3.7 కోట్ల ఫోన్లు సరఫరా అయ్యాయి.

✦ చైనా కంపెనీలకు చెందిన వన్ ప్లస్, పోకో, షియోమీ, రియల్‌మీ ఫోన్ల సరఫరాలు తగ్గడంతో మొత్తం స్మార్ట్‌ఫోన్ల సరఫరాలు వృద్ధి తక్కువగా నమోదైంది.

✦ యాపిల్ మాత్రం 21.5 శాతం వృద్ధి సాధించి, 59 లక్షల స్మార్ట్‌ఫోన్లను సరఫరా చేసింది. మొత్తం భారత సరఫరాల్లో ఐఫోన్ 16 వాటా 4 శాతంగా ఉంది.

✦ రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో యాపిల్ ఐఫోన్ సరఫరాలు 19.7 శాతం పెరిగి 27 లక్షలకు చేరాయి. దేశీయ స్మార్ట్‌ఫోన్ విపణిలో 7.5 శాతం మార్కెట్ వాటా పొందాయి.

✦ జూన్ త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ విపణిలో వివో 19 శాతం మార్కెట్ వాటా పొందింది. ఫోన్ల సరఫరా వృద్ధి 23.5 శాతం పెరిగింది.

✦ వివో తర్వాత శాంసంగ్ 14.5 శాతం మార్కెట్ వాటా దక్కించుకుంది. స్మార్ట్‌ఫోన్ల సరఫరాల్లో 21 శాతం వృద్ధి సాధించింది.

✦ ఒపో సరఫరాలు 25.4 శాతం పెరిగాయి. మార్కెట్ వాటా 13.4 శాతంగా నమోదైంది. మోటోరోలా మార్కెట్ వాటా 8 శాతంగా ఉంది. ఫోన్ల సరఫరా వృద్ధి 39.4 శాతానికి చేరింది. ఐకూ 4.3 శాతం మార్కెట్ వాటా పొందింది. సరఫరాలు 68.4 శాతం పెరిగాయి.

✦ వన్‌ప్లస్ మార్కెట్ వాటా తగ్గి 2.5 శాతానికి పరిమితమైంది. ఏడాది క్రితం ఇదే సమయంలో 4.4 శాతంగా ఉండేది. కంపెనీ సరఫరాలు కూడా 39.4 శాతం తగ్గాయి.

✦ రియల్‌మీ మార్కెట్ వాటా కూడా 9.7 శాతానికి తగ్గింది. స్మార్ట్‌ఫోన్ల సరఫరాలు కూడా 17.8 శాతం తగ్గాయి. షియోమీ మార్కెట్ వాటా 9.6 శాతానికి పరిమితమైంది. సరఫరాలు 23.5 శాతం తగ్గాయి. పోకో మార్కెట్ వాటా 3.8 శాతానికి తగ్గింది. సరఫరాలు 28.8 శాతం తగ్గాయి.

✦ ప్రీమియం విభాగం(రూ.52,000-70,000)లోని ఫోన్ల వృద్ధి 96.4 శాతంగా నమోదైంది. మార్కెట్ వాటా 2 నుంచి 4 శాతానికి చేరింది. సూపర్ ప్రీమియం విభాగం(రూ.70,000కు పైగా)లోని ఫోన్ల వృద్ధి 15.8 శాతం కాగా మార్కెట్ వాటా 7 శాతం వద్ద స్థిరంగా ఉంది.

చైనా కంపెనీతో డిక్సన్ జేవీ

దిల్లీ: దేశీయ ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీ సంస్థ డిక్సన్ టెక్నాలజీస్, చైనా కంపెనీ హెచ్‌కేసీ ఓవర్సీస్‌తో కలిసి రూ.370 కోట్లతో ఒక సంయుక్త సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేసింది. ఎల్‌సీడీ, టీఎఫ్‌టీ-ఎల్‌సీడీ మాడ్యూళ్ల తయారీ, విక్రయాన్ని ఈ జేవీ చేపడుతుంది. ఈ మాడ్యూళ్లను టీవీ, మొబైల్ ఫోన్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల డిస్‌ప్లేల్లో ఉపయోగిస్తారు. ఒప్పందంలో భాగంగా జేవీ అయిన డిక్సన్ డిస్‌ప్లే టెక్నాలజీస్‌లో 26% వాటాను హెచ్‌కేసీ ఓవర్సీస్ రూ.95.5 కోట్లకు, మిగతా 74% వాటాను రూ.274 కోట్లకు డిక్సన్ టెక్నాలజీ కొనుగోలు చేస్తుంది.

భారత్‌లో శాంసంగ్ తయారీ విస్తరిస్తోంది

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ భారత్‌లో తన తయారీని విస్తరిస్తోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా శాంసంగ్‌కు రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీ యూనిట్ భారత్‌లోనే ఉంది. కంపెనీకి భారత్‌లో ఉన్న పరిశోధన యూనిట్‌లో 7,000కు పైగా ఇంజినీర్లున్నారని వైష్ణవ్ అన్నారు. శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌పీ చున్‌తో మంత్రి సమావేశమైన ఫొటోను ఎక్స్‌లో పంచుకున్నారు.

2047 నాటికి జీఎస్‌టీలో ఒకే శ్లాబు

ప్రతిపాదిత సంస్కరణలు తదుపరి తరం జీఎస్‌టీకి బాట వేస్తాయ్: ఉన్నతాధికారి



దిల్లీ: ప్రతిపాదిత వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) సంస్కరణలను 'నెక్ట్స్ జెన్ జీఎస్‌టీ'గా ఒక ఉన్నతాధికారి విశదీకరించారు. భవిష్యత్తులో క్రమంగా 'సింగిల్ ట్యాక్స్ శ్లాబ్'గా మారేందుకు అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతిపాదిత కొత్త జీఎస్‌టీ విధానంలో 5%, 18% శ్లాబులు మాత్రమే ఉండటంతో ఆర్థిక వ్యవస్థను ఇది ఉత్తేజితం చేస్తుందని సదరు అధికారి తెలిపారు. అలాగే టారిఫ్ భయాలను కూడా అధిగమించేలా చేస్తుందని పేర్కొన్నారు. ప్రతిపాదిత రెండు శ్లాబుల విధానాన్ని జీఎస్‌టీ మండలి ఆమోదిస్తే, ప్రస్తుతం ఉన్న 4 శ్లాబుల్లో 12, 28 శాతం శ్లాబులు తొలగిపోతాయని వివరించారు. ఈ చర్య 'గేమ్ ఛేంజర్' సంస్కరణగా మిగిలిపోతుందన్నారు.

❑ ప్రతిపాదిత కొత్త జీఎస్‌టీ విధానంలో సాధారణంగా వాడే వస్తువులన్నింటిపై 5 శాతం జీఎస్‌టీ ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలకు మేలు చేకూరనుంది. అలాగే ధరలు తగ్గడంతో వినియోగం కూడా బాగా పెరిగే అవకాశం ఉంది.

❑ తక్కువ పన్నులు విధించడం అంటే ప్రజల జేబుల్లో మరింత డబ్బులు ఉంచడమే అని సదరు అధికారి తెలిపారు. ఇది కచ్చితంగా వినియోగాన్ని పెంచుతుందని వివరించారు. సుమారు 6 నెలల పాటు సాగిన చర్చలు, డజన్ల సమావేశాల తర్వాత ప్రతిపాదిత జీఎస్‌టీ విధానం తెరమీదకు వచ్చిందని పేర్కొన్నారు.

❑ కేంద్రం ప్రతిపాదనను మంత్రుల బృందం(జీఓఎం) ఆమోదించి ఆ తర్వాత జీఎస్‌టీ మండలి కూడా పచ్చజెండా ఊపితే ఇది పన్ను రేట్ల ప్రవాహానికి ముగింపు పలకడంతో పాటు స్థిరత్వాన్ని తీసుకొస్తుందని అధికారి వివరించారు. మధ్య తరగతి, పేదలు, రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ)ను దృష్టిలో ఉంచుకుని 'నెక్ట్స్ జెన్ జీఎస్‌టీ'ని సూచించినట్లు తెలిపారు. రోజువారీగా అందరూ వాడే వస్తువులపై తక్కువ జీఎస్‌టీ ఉంటుందని పేర్కొన్నారు.

❑ ఈ ప్రతిపాదిత రెండు శ్లాబుల జీఎస్‌టీ విధానం అమల్లోకి వస్తే, దేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి వస్తుంది. అప్పుడు ఒకే రేటు జీఎస్‌టీ గురించి ఆలోచిస్తామన్నారు. సింగిల్ రేట్ స్ట్రక్చర్ అభివృద్ధి చెందిన దేశాలకు సరిగ్గా సరిపోతుందని, అక్కడ ఆదాయ వ్యయాల సామర్థ్యం ఏకరీతిన ఉంటుందని వివరించారు. 2047 నాటికి ఒకే శ్లాబు జీఎస్‌టీ స్థాయికి చేరతామని ధీమా వ్యక్తం చేశారు.



చిన్న విమానాల్లో రారాజు ఎయిర్‌బస్ ఏ320!



● మొత్తం డెలివరీల్లో త్వరలోనే అగ్రస్థానానికి ● 4 దశాబ్దాల బోయింగ్ 737 ఆధిపత్యానికి చరమగీతం

దిల్లీ

ఐరోపాకు చెందిన దిగ్గజ విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ తన ఏ320 శ్రేణి విమానాల డెలివరీలో కొత్త మైలురాయిని అందుకోబోతోంది. ఈ సన్న ఆకృతి (న్యారో బాడీ) విమానాలు.. త్వరలోనే ప్రపంచంలో అత్యధికంగా డెలివరీ అయిన వాణిజ్య విమానాలుగా అగ్రస్థానంలో నిలవనున్నట్లు విమానయానరంగ కన్సల్టెన్సీ సంస్థ సిరియమ్ ఆధారంగా తెలుస్తోంది. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఈ స్థానంలో అమెరికా దిగ్గజ విమానాల తయారీ సంస్థ బోయింగ్‌కు చెందిన బోయింగ్ 737 విమానాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు ప్రారంభం నాటికి ఏ320 శ్రేణి విమానాలను మొత్తంగా 12,155 వరకు ఎయిర్‌బస్ డెలివరీ చేసింది. బోయింగ్ 737 విమానాలకు, ఎయిర్‌బస్ ఏ320 విమానాలకు డెలివరీపరంగా సుమారు 20 విమానాల వ్యత్యాసమే ఉన్నట్లుగా తెలుస్తోంది. వచ్చే నెలలో ఈ వ్యత్యాసం కూడా తొలగిపోయే అవకాశం ఉందని, తద్వారా డెలివరీలో బోయింగ్ 737ను ఎయిర్‌బస్ ఏ320 శ్రేణి విమానాలు వెనక్కినెడతాయని ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కథనం వెల్లడించింది. అయితే వార్షిక డెలివరీ సంఖ్యలో 2000లోనే, ఆర్డర్లపరంగా 2019 ఆఖరునాటికే ఎయిర్‌బస్ ఏ320 శ్రేణి విమానాలు అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపింది. మొత్తం డెలివరీల్లో అగ్రస్థానం మాత్రం ఇంకా సొంతం కాలేదు.

ఎప్పుడొచ్చామన్నది కాదు..

బోయింగ్ 737 విమానాలను 1966లో బోయింగ్ అందుబాటులోకి తెచ్చింది. తక్కువ దూర మార్గాల్లో చౌక ధరకే విమాన సర్వీసులను అందించడం, నిర్వహణపరంగానూ లాభదాయకంగా ఉండటం వల్ల విమానయాన పరిశ్రమ స్వరూపాన్నే ఈ విమానాలు మార్చేశాయి. 1988లో ఎయిర్‌బస్ తన ఏ320 విమానాల సేవలను ప్రారంభించే సమయం నాటికే 1500 వరకు బోయింగ్ 737 విమానాలు డెలివరీ అయ్యి ఉండటం గమనార్హం. అప్పటికే డెలివరీలో 1500 ఆధిక్యంతో ఉన్న బోయింగ్ 737 విమానాలను ఎయిర్‌బస్ ఏ320 విమానాలు వెనక్కినెడతాయని బహుశా ఆ సమయంలో ఎవరూ ఊహించకపోవచ్చు. అయితే ఎప్పుడొచ్చామన్నది కాదు.. అగ్రస్థానాన్ని కొట్టడమే లక్ష్యంగా ఏ320 విమానాలు ప్రపంచవ్యాప్తంగా ఆదరణను చూరగొంటూ వచ్చాయి. ఇందుకు ఎయిర్‌బస్ అనుసరించిన వ్యూహాలు, విధానాలు కూడా ఉపకరించాయి. దీంతో బోయింగ్ 737తో డెలివరీ సంఖ్యాపరంగా ఉన్న అంతరం క్రమేణా తగ్గుతూ వచ్చింది. అలా విమానాల తయారీ రంగంలో ఒక కొత్త సంస్థగా అడుగుపెట్టిన ఎయిర్‌బస్.. అప్పటికే ఈ రంగంలో ఆధిపత్యం కొనసాగిస్తున్న అమెరికా బోయింగ్‌కు గట్టి పోటీ ఇచ్చే సంస్థగా అవతరించింది. ఎయిర్‌బస్ తొలినాళ్లలో అంతర్గత వైరుధ్యాలు; ఫ్రాన్స్, జర్మనీల నుంచి రాజకీయ, వాణిజ్యపరమైన సమస్యల రూపంలో సవాళ్లను కూడా ఎదుర్కొంది. అయితే న్యారో బాడీ విమానాల మార్కెట్‌కు ఉన్న ప్రాముఖ్యాన్ని గుర్తించి.. ఏ320 విమానాల తయారీ విషయంలో ధైర్యంగా అడుగులు ముందుకు వేసింది. అది సత్ఫలితమిచ్చి ప్రపంచ దిగ్గజ విమానయాన సంస్థల్లో ఒకటిగా ఎయిర్‌బస్‌ను నిలిపింది.

వీటిల్లోనే సగం మంది ప్రయాణం..

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విమాన ప్రయాణికుల్లో దాదాపు సగం మంది ఏ320, బోయింగ్ 737 శ్రేణికి చెందిన విమానాల్లోనే ప్రయాణిస్తున్నారు. సరఫరాపరమైన అవరోధాలు ఉన్నప్పటికీ.. ఈ ఏడాదిలో 820 విమానాలను డెలివరీ చేయాలని ఎయిర్‌బస్ లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు ఏ320తో పోలిస్తే ఎయిర్‌బస్ తీసుకొచ్చిన ఏ380 విమానాలు అంత విజయవంతం కాలేదు. అందుకే కొత్త విమానాల మోడళ్లను తీసుకొని రావడం కంటే.. ఇప్పటికే విజయవంతమైన మోడళ్లను నవీకరించడం పైనే ఎయిర్‌బస్, బోయింగ్ దృష్టి సారిస్తున్నాయి. 2030 కల్లా అధునాతన ఇంజిన్‌లు, హైడ్రోజన్‌తో నడిచే విమానాలను తీసుకొని వచ్చేందుకు కూడా ఎయిర్‌బస్ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఈనాడు సినిమా

ఒకేసారి రెండు చిత్రాలతో


బాలకృష్ణ

ఇకపై ఏడాదికి నాలుగు చిత్రాలు చేస్తానంటూ ఇటీవల నిర్మాతలతో జరిగిన భేటీలో నందమూరి బాలకృష్ణ తెలిపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీనికి తగ్గట్లుగానే ఆయన తదుపరి చిత్రాల కోసం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 'అఖండ 2: తాండవం'ను ముగించే పనిలో ఉన్న బాలయ్య.. ఆ వెంటనే దర్శకులు గోపీచంద్ మలినేని, క్రిష్ జాగర్లమూడితో కలిసి పని చేయనున్నారు. ఈ రెండు సినిమాల్ని ఆయన ఒకేసారి సమాంతరంగా పూర్తి చేయనున్నారని సమాచారం. వీటిలో గోపీచంద్ తెరకెక్కిస్తున్న సినిమా చరిత్ర, వర్తమానంతో ముడిపడి ఉండే మాస్ యాక్షన్ డ్రామాగా ఉండనుండగా.. క్రిష్ చిత్రం 'ఆదిత్య 369'కి కొనసాగింపుగా ఉంటుందని తెలిసింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ రెండు ప్రాజెక్టులు నవంబరు నాటికి సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు ఆ చిత్రాల సన్నిహిత వర్గాల సమాచారం. ఇక మరోవైపు రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2'లోనూ బాలయ్య ప్రత్యేక పాత్రలో కనువిందు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే దీనిపైనా స్పష్టత రానుంది.

అందం.. ప్రశాంతం.. కన్మణి


ప్రియాంక మోహన్

ఓజీ... ఓజీ... అంటూ పవన్ కల్యాణ్ అభిమానులు, సినీ ప్రియులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఆ ఆసక్తికి తగ్గట్టుగానే సినిమా వడి వడిగా చిత్రీకరణని చేసుకొని వచ్చే నెల 25న విడుదలకు ముస్తాబవుతోంది. ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో పవన్‌కల్యాణ్ నటిస్తున్నారు. ఆయన సరసన కథానాయికగా ప్రియాంక మోహన్ సందడి చేయనున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆమె పాత్ర పేరు.. కన్మణి. శనివారం సినిమాలోని ఆమె లుక్‌ని విడుదల చేశారు. అగ్ని తుపాన్‌ని గుర్తు చేసే పాత్రలో పవన్ కల్యాణ్ కనిపించనున్నారు. ఆ తుపాన్‌కి ముందు ప్రశాంతతని ప్రతిబింబించేలా అందమైన కన్మణి పాత్ర ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రంలోని రెండో పాటని విడుదల చేయనున్నారు. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. తమన్ స్వరకర్త.

'కానిస్టేబుల్ కనకం'ను యూనివర్స్‌లా మారుస్తా!

'కానిస్టేబుల్ కనకం' వెబ్‌సిరీస్ ప్రేక్షకుల్ని అలరిస్తోంది. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రధారిగా ప్రశాంత్ కుమార్ దిమ్మల రూపొందించిన ఈ సిరీస్‌ను కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సిరీస్ ఇటీవలే ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో విడుదలైంది. ఈ నేపథ్యంలోనే శనివారం 'ఈనాడు సినిమా'తో ప్రత్యేకంగా ముచ్చటించారు దర్శకుడు ప్రశాంత్.


ప్రశాంత్

● "మా సిరీస్‌కు ఇటు ప్రేక్షకులతో పాటు అటు సినీ వర్గాల నుంచి మంచి ఆదరణ దక్కుతుండటం చాలా ఆనందంగా ఉంది. చుక్క రక్తం బొట్టు చూపించకుండా.. ఎలాంటి అసభ్యతకు తావు లేకుండా పిల్లలు, పెద్దలు చూడగలిగేలా ఓ మంచి క్రైమ్ థ్రిల్లర్‌ను తీశావని ప్రశంసిస్తున్నారు. చాలా మంది చంద్రికకు ఏమైంది, సిరీస్‌లో చూపించిన ఊరు నిజంగా ఉందా? అని ఫోన్లు చేసి అడుగుతున్నారు. ఈ సిరీస్ చూసి నిర్మాతలు శరత్ మరార్, సుస్మిత కొణిదెల, స్వప్న దత్ ఫోన్ చేసి ప్రశంసించడం ఎంతో ఆనందాన్నిచ్చింది".

● "సమాజంలో అమ్మాయిల్ని అందరూ జింకల్లా చూస్తుంటారు. కానీ, వాళ్లు శివంగుల్లా మారితే ఎలా ఉంటుందన్నది తెలియజేయాలన్న ఉద్దేశంతో రాసుకున్న కథే 'కానిస్టేబుల్ కనకం'. ఈ సిరీస్ రెండో సీజన్ చిత్రీకరణ కూడా ఇప్పటికే పూర్తయింది. దీంట్లో ఊహకందని ట్విస్టులుంటాయి. చంద్రికకు ఏమైందన్నది తెలిసినప్పుడు అందరూ షాక్ అవుతారు. అసలీ కథలో మెయిన్ విలన్ ఎవరన్నది ఏ ఒక్కరూ కనిపెట్టలేరు. ఇది నా ఛాలెంజ్. ఈ సిరీస్‌లోని కనకం పాత్రను.. 'బ్లడీ మేరీ'లోని మేరీ పాత్రతో ముడిపెడుతూ దీన్ని ఓ యూనివర్స్‌లా మార్చాలన్న ఆలోచన ఉంది.

● నా అభిమాన నటుడు చిరంజీవి. నేను నా ప్రతి కథను ఆయనతో పంచుకుంటుంటా. మొదట 'కానిస్టేబుల్ కనకం' కథ విషయంలో సమస్య వచ్చినప్పుడు నేను చాలా కుంగిపోయా. ఆ సమయంలో సుస్మిత ద్వారా చిరంజీవి నుంచి పిలుపు వస్తే వెళ్లి ఆయన్ని కలిశా. ఆ సమయంలో వారు నా ముఖంలో నిరుత్సాహాన్ని గమనించి.. నా చేయి పట్టుకుని ఓ మాట చెప్పారు. 'నువ్వు దేనికీ అధైర్య పడకు. కథలు బాగా చెప్తావు. నీ బలమేంటో తెలుసుకుని ఆ దిశగా ప్రయత్నించు. దారి దొరుకుతుంద'ని ధైర్యాన్ని నింపారు. దగ్గరకు తీసుకుని ఫొటో దిగి నాకొక కిక్ ఇచ్చారు. ఆ తర్వాత వారం రోజులకే ఈటీవీ విన్‌లో సిరీస్ చేసే అవకాశం దొరికింది. ఎప్పటికైనా ఆయనతో ఓ సినిమా చేయాలి. అదే నా కల".

నేడు చిరంజీవి సమక్షంలో చర్చలు

సినీ కార్మికుల వేతనాలపై అగ్ర కథానాయకుడు చిరంజీవి సమక్షంలో నేడు చర్చలు జరగనున్నాయి. నిర్మాతలు, కార్మిక సంఘాలతో విడివిడిగా సమావేశమై చర్చలు జరపనున్నారు. అనంతరం ఇరు వర్గాలకు ఆమోదం అయ్యేలా నిర్ణయాల్ని ప్రకటిస్తారని సమాచారం. వేతనాల పెంపు కోరుతూ కొన్ని రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. నేటితో ఆ సమస్య కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయని, సోమవారం నుంచి చిత్రీకరణలు మొదలయ్యే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.

ఆ మలయాళ దర్శకుడితో సూర్య 47?


సూర్య

కథానాయకుడు సూర్య త్వరలో 'కరుప్పు' సినిమాతో థియేటర్లలో సందడి చేయనున్నారు. మరోవైపు తెలుగులో వెంకీ అట్లూరితో ఓ చిత్రం చేస్తున్నారు. ఇది ప్రస్తుతం చిత్రీకరణ దశలోనే ఉంది. కాగా, ఇప్పుడాయన కొత్తగా మరో సినిమాకీ పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. 'రోమాంచమ్', 'ఆవేశం' చిత్రాలతో వరుస విజయాల్ని అందుకున్న మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ ఈ కొత్త సినిమాని తెరకెక్కించనున్నారని సమాచారం. ఇది 'సూర్య 47' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలిసింది. దీన్ని ఓ ప్రముఖ తమిళ నిర్మాణ సంస్థ నిర్మించనుందని త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి.

'పరదా' కోసం ఓ కొత్త సంస్కృతిని సృష్టించాం!

"ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని పంచడం కోసం తెరపైన ఓ కొత్త సంస్కృతిని ఆవిష్కరిస్తూ చేసిన సినిమానే 'పరదా'. తెలుగు నుంచీ ఇలాంటి కథలు వస్తాయని చాటి చెబుతూ ఓ ప్రత్యేకమైన చర్చని లేవనెత్తేలా ఈ సినిమా ఉంటుంది" అన్నారు దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల. 'సినిమా బండి'తో ప్రయాణం ఆరంభించిన ఆయన ఇటీవల 'శుభం'తో ఆకట్టుకున్నారు. ఆయన మూడో చిత్రంగా 'పరదా' రూపొందింది. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా నటించారు. చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు ప్రవీణ్ కండ్రేగుల.


ప్రవీణ్

"మహిళల చుట్టూ తిరిగే కథే అయినా ఇది అందరి గురించీ మాట్లాడే చిత్రం. మనందరిలోనూ ఎవరికీ కనిపించని ఓ పరదా ఉంటుంది. దాని గురించే తీసిన సినిమా. పూర్తిగా కల్పిత కథే అయినా 1980ల్లో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో రూపొందించాం. పడతి అనే ఓ ఊరు చుట్టూ ఈ కథ సాగుతుంది. ఆ ఊరు మనది కాదు, ఆ సంస్కృతి మనది కాదు. అయినా సరే, కొత్తగా ఉందే అని ఆశ్చర్యపోతూనే కనెక్ట్ అవుతారు ప్రేక్షకులు".

❑ "ఎప్పట్నుంచో నా మనసులో ఉన్న కథ ఇది. దీనికంటే ముందు దుల్కర్‌సల్మాన్‌తో ఓ సినిమా చేయాలనుకున్నా. అది కార్యరూపం దాల్చలేదు. అప్పుడు ఈ కథని బయటికి తీశా. అనుపమ ఈ కథ విన్నప్పుడే కాదు నటిస్తున్నప్పుడు కూడా అంతే భావోద్వేగానికి గురయ్యారు. ఆమె భుజానికెత్తుకుని ఈ సినిమాని ప్రచారం చేస్తుండటానికి కారణం అదే. అనుపమని ఇప్పటి వరకూ కమర్షియల్ సినిమాల్లో కథానాయికగానే చూశాం. ఆమెలో ఇంత మంచి నటి ఉందా అని ఆశ్చర్యపోయేలా ఇందులో నటించారు".

❑ "మలయాళంలోనే కంటెంట్ ప్రధానమైన సినిమాలు వస్తాయనే అభిప్రాయం ఉంటుంది. మలయాళంవాళ్లు కూడా ఈ సినిమా చూసి ఆశ్చర్యపోయేంత బలమైన కంటెంట్ ఇందులో ఉంది. సంగీత దర్శకుడు గోపీసుందర్ మొదట ఈ కథ విన్నప్పుడు, తెలుగు నుంచి ఇలాంటి కథా అని ఆశ్చర్యపోయాడు. ఆయన సమకూర్చిన సంగీతం చిత్రానికి ప్రధానబలం. ఛాయాగ్రాహకురాలు మృదుల్ సుజిత్ సేన్ కెమెరా పనితనం కట్టిపడేస్తుంది".

❑ "స్వతహాగా నాకు కమర్షియల్ సినిమా అంటే ఇష్టం. మొన్న కూడా 'అతడు' సినిమాకి వెళ్లి థియేటర్‌లో ఈలలు కొట్టి, డ్యాన్సులు వేసి వచ్చా. అలాంటి సినిమాలు చేయాలని నాకూ ఉంది. ఆ అవకాశం రావాలంటే ముందు దర్శకుడిగా నేను నిరూపించుకోవాలి కదా. అందుకే 'సినిమా బండి', 'శుభం' సినిమాల్ని తీశా. 'పరదా' చూశాక ఇతను పెద్ద కాన్వాస్ ఉన్న కమర్షియల్ సినిమాల్నీ చేయగలడనే నమ్మకం అందరిలోనూ కలుగుతుందని నా అభిప్రాయం". ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్, దర్శన రాజేంద్ర, సంగీత, రాగ్ మయూర్‌లు తమ నటనతో ఆకట్టుకుంటారు.

మరోసారి సత్తా చాటిన హోమ్‌బౌండ్



ఇద్దరు స్నేహితుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. ప్రముఖ దర్శకుడు నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే కేన్స్‌లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా తాజాగా 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్'(ఐఎఫ్ఎఫ్ఎం)లో ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడిగా నీరజ్ ఘైవాన్ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఈ చిత్రోత్సవాల్లో బాలీవుడ్ అగ్రహీరో ఆమిర్ ఖాన్ 'ఎక్సలెన్స్ ఇన్ సినిమా' అవార్డును అందుకున్నారు. 2025 సంవత్సరానికి గానూ ఐఎఫ్ఎఫ్ఎం ప్రకటించిన ఈ పురస్కారాల్లో 'ఐ వాంట్ టు టాక్' చిత్రంలోని తన నటనకు గానూ ఉత్తమ నటుడిగా అభిషేక్ బచ్చన్, 'అంగమ్మాళ్' (తమిళం) చిత్రానికి గానూ గీతా కైలాసం ఉత్తమ నటిగా, 'బ్లాక్ వారెంట్' ఉత్తమ సిరీస్‌గా అవార్డుల్ని గెల్చుకున్నాయి. కథానాయిక అదితీరావ్ హైదరీ 'డైవర్సిటీ ఇన్ సినిమా' పురస్కారాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆమిర్ మాట్లాడుతూ.. "నేను బాల్యం నుంచే సినిమాల పట్ల ఆకర్షితుడిని. ఇప్పుడు నేను ఈ 'ఎక్సలెన్స్ ఇన్ సినిమా' అవార్డును దక్కించుకోవడానికి నాకు అద్భుతమైన సినిమాల్లో అవకాశం ఇచ్చిన దర్శకులు, నా సహనటులు, నన్ను ఆదరిస్తున్న ప్రేక్షకులే కారణం. వీరంతా లేకపోతే ఈ పురస్కారం సాధ్యం కాదు" అని అన్నారు.

ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన తండ్రిని నేను


అభిషేక్ బచ్చన్, అమితాబ్ బచ్చన్

మెల్‌బోర్న్ చిత్రోత్సవాల్లో ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న అభిషేక్ బచ్చన్‌ను ప్రశంసిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ పెట్టారు అమితాబ్ బచ్చన్. తను ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన తండ్రినని అన్నారు. "అభిషేక్ నువ్వు కుటుంబానికి గర్వకారణం, గౌరవం. 'నన్ను ఎంత కిందకు లాగితే.. నేను నా కృషితో మళ్లీ నిలబడతాను.. ఎత్తుకు ఎదుగుతాను' అనే దృక్పథంతో ముందుకు సాగుతున్నావు. నువ్వు నీ ప్రతిభను ప్రపంచానికి చూపించావు. మెల్‌బోర్న్‌లో ఉత్తమ నటుడిగా నిన్ను ప్రకటించారు. తండ్రికి ఇంతకంటే పెద్ద బహుమతి మరొకటి ఉండదు. ఒకానొక సమయంలో నీ నటనను ప్రశంసించినప్పుడు చాలా మంది ఎగతాళిగా నవ్వారు. ఇప్పుడు నీ గెలుపే వాళ్లకు అంతిమ సమాధానం" అంటూ తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు అమితాబ్.

ఇంటిల్లిపాదీ చూసేలా.. సుందరకాండ


వెంకటేశ్ నిమ్మల, వాసుకి, సంతోష్, నారా రోహిత్, శ్రీదేవి

ఇంటిల్లిపాదీ కలిసి వినోదాన్ని ఆస్వాదించేలా రూపొందిన స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రమే మా 'సుందరకాండ' అన్నారు నారా రోహిత్. ఆయన కథానాయకుడిగా కొత్త దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రమిది. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘాని కథానాయికలు. సంతోష్ చిన్నపొళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఈ నెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. కథానాయకుడు మాట్లాడుతూ "నాకూ, మా బృందానికి ఓ మంచి జ్ఞాపకం ఈ సినిమా. చాలా కొత్తగా ఉంటుంది. ట్రైలర్‌కీ, పాటలకీ మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమా మొదలైనప్పుడు ఎంత సంతోషంగా ఉన్నామో, ఇప్పుడూ అంతే సంతోషంగా ఉన్నాం. ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం" అన్నారు. రొమాంటిక్ కామెడీ కథల్లో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిదని, ఇందులో నారా రోహిత్‌ని తప్ప మరొకరిని ఊహించుకోలేం అన్నారు వీకే నరేశ్. ఈ కార్యక్రమంలో వాసుకితోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

మట్టి వాసనలా స్వచ్ఛమైన ప్రేమ


మధుశాలిని, గీత్ షైనీ

తిరుపతి అనే ఓ యువ రైతు, కన్యాకుమారి అనే యువతి మధ్య సాగే స్వచ్ఛమైన ప్రేమకథే మా చిత్రం అంటున్నారు దర్శకుడు సృజన్ అట్టాడ. ఆయనే నిర్మాతగా... గీత్ షైనీ, శ్రీచరణ్ రాచకొండ జంటగా తెరకెక్కించిన చిత్రం 'కన్యా కుమారి'. కథానాయిక మధుశాలిని సమర్పకురాలు. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. మధుశాలిని మాట్లాడుతూ "సినిమా చూశాక మా అమ్మానాన్నల ప్రేమకథ ఇలాగే మొదలైందేమో అనిపించింది. సృజన్ ఇదివరకు తీసిన 'పుష్పక విమానం' అన్నా నాకెంతో ఇష్టం. ఇలాంటి కొత్త ప్రతిభకు సహకారం అందించాలనే ఈ సినిమాలో భాగం అయ్యాను. తెలుగులో 'గూఢచారి' తర్వాత నేను నటించిన సినిమాలేవీ రాలేదు కానీ, వెబ్‌సిరీస్‌లతో పాటు, ఇతర భాషల్లో కొన్ని సినిమాలు చేశా. త్వరలోనే నేను దర్శకత్వం వహిస్తూ, నిర్మించిన మరొక సినిమానీ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తా" అన్నారు. కథానాయిక గీత్‌షైనీ మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ విభిన్నమైన ప్రేమకథ ఇది. వర్షం పడినప్పుడు వచ్చే మట్టి వాసనలా స్వచ్ఛంగా ఉంటుంది. ఇందులో కన్యాకుమారి పాత్ర చేయడం నా అదృష్టం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "పంట పొలాల గట్టు మీద పూసిన ఓ పువ్వు లాంటి సినిమా ఇది. కరోనా లాక్‌డౌన్ సమయంలో శ్రీకాకుళం పక్కన ఓ ఊళ్లో ఉండిపోయా. అక్కడి నుంచి శ్రీకాకుళం వరకూ ఓ అమ్మాయి ఉదయపు నడకకు వెళ్లేది. ఆ పక్కనే నలుగురు కుర్రాళ్లు కూర్చొని సరదాగా మాట్లాడుకుంటున్న దృశ్యం కనిపించేది. అలాంటి స్వచ్ఛమైన మనుషుల నేపథ్యంలో, అక్కడే తీసిన సినిమానే ఇది" అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల, సంగీత దర్శకుడు రవి, ఎడిటర్ నరేశ్, సహ నిర్మాతలు అప్పలనాయుడు, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై శివ పోరు


మణికాంత్, అశ్వనీదత్

మణికాంత్ హీరోగా ప్రభాస్ నిమ్మల తెరకెక్కించిన చిత్రం 'ఫైటర్ శివ'. ఉన్నం రమేశ్, నర్సింహ గౌడ్ నిర్మించారు. ఐరా బన్సాల్ కథానాయిక. సునీల్, వికాశ్ వశిష్ఠ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్ర టీజర్‌ను నిర్మాత అశ్వనీదత్ శనివారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రభాస్ నిమ్మల మాట్లాడుతూ.. "మాస్ యాక్షన్‌తో పాటు మంచి సందేశంతో నిండిన సినిమా ఇది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మన ప్రభుత్వాలు ఎంతో పోరాడుతున్నాయి. ఆ అంశాన్ని దీంట్లో స్పృశించాం" అన్నారు. "డ్రగ్స్‌ను నిర్మూలించాలనే ప్రభుత్వ పోరాటాన్ని ఆధారంగా తీసుకుని ఈ సినిమాని రూపొందించామ"న్నారు చిత్ర నిర్మాతలు. ఈ కార్యక్రమంలో గౌతమ్ రవిరామ్, సురేందర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నవ్వించే దెయ్యం



సత్యం రాజేశ్, రియా సచ్‌దేవ్ జంటగా తెరకెక్కుతున్న చిత్రం... 'ఫ్రెండ్లీ ఘోస్ట్'. జి.మధుసూదన్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. విశ్వనాథ్.డి.కె నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని కథానాయకుడు మంచు మనోజ్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రమిది. ప్రేక్షకుల మెప్పు పొందుతుందని ఆశిస్తున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "సస్పెన్స్‌తోపాటు, కామెడీకి పెద్ద పీట వేస్తూ రూపొందించిన చిత్రమిది. స్నేహంగా ఉంటూ నవ్వులు పంచే దెయ్యం కథ ఇందులో కీలకం. చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌లని విడుదల చేస్తాం" అన్నారు. సునీత మరసియర్, శ్రీనివాస్‌రెడ్డి, సప్తగిరి, వెన్నెల కిశోర్, మధునందన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కూర్పు: బొంతల నాగేశ్వరరెడ్డి, ఛాయాగ్రహణం: హరిజ్ ప్రసాద్.

విభజన ముగియలేదు.. ఇది ఆరంభమే



'ది బెంగాల్ ఫైల్స్'

"1947లో ప్రారంభమైన విభజన ఇప్పటికీ కొనసాగుతోంది. ఇక ఇది ఎప్పటికీ ముగియదు" అంటూ 'ది బెంగాల్ ఫైల్స్' ప్రపంచాన్ని పరిచయం చేశారు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. ఆయన తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్ర బృందం. బెంగాల్‌లో ప్రజలు ఎదుర్కొన్న ఆనాటి సమస్యలను చూపిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. "భారతీయుడి ప్రాణం ఎందుకు ముఖ్యం కాదు.. 80ఏళ్ల తర్వాత కూడా మనం ఇప్పటికీ.. అదే పాత మత రాజకీయాలతో ఎందుకు పోరాడుతున్నాం. మనం నిజంగా స్వేచ్ఛగా జీవిస్తున్నామా?', 'విభజన ముగియలేదు.. ఇది ఆరంభం మాత్రమే" లాంటి సంభాషణలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. సెప్టెంబరు 5న విడుదల కానుందీ చిత్రం.

'పెరుసు' హిందీ రీమేక్?



సినిమాకి కథే హీరో అని మరోసారి నిరూపించింది తమిళ చిత్రం 'పెరుసు'. వైభవ్, నిహారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను ఇళంగో రామ్ తెరకెక్కించారు. హాలసాయం అనే వ్యక్తి మరణం చుట్టూ తిరిగే కథనంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల్ని నవ్వించడంలో విజయం సాధించింది. ఇప్పటికే తెలుగులో విడుదలై మంచి ఆదరణను దక్కించుకున్న ఈ ఫ్యామిలీ డ్రామాను ఇప్పుడు హిందీలో రీమేక్ చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన హక్కులను దర్శకుడు హన్సల్ మెహతా, కాస్టింగ్ డైరెక్టర్ ముఖేశ్ ఛబ్రా సొంతం చేసుకున్నట్లు సమాచారం. త్వరలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన తారాగణం, తదితర వివరాల్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



కణం అనేది అన్ని జీవుల్లో ఉండే అతిచిన్న భాగం. ఇది ప్రాథమిక నిర్మాణాత్మక, క్రియాత్మక, జీవసంబంధ ప్రమాణం. కణాలను తరచుగా 'జీవ నిర్మాణ ఇటుకలు' అని పిలుస్తారు. వీటిని అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'కణ జీవశాస్త్రం' అంటారు. కణద్రవం అనేది కణం లోపల ఉండే ఒక పదార్థం. యూకారియోటిక్ కణాల్లో కణాంగాలు ఉంటాయి. వీటికి సంబంధించిన నిర్మాణాలు, విధులు, తదితర అంశాలపై పోటీపరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి.

పోషకాలను శక్తిగా మార్చే.. జీవ నిర్మాణ ఇటుకలు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

కణ జీవశాస్త్రం

కణాలు దేహానికి అవసరమయ్యే పోషకాలను ఆహారం నుంచి గ్రహిస్తాయి. ఈ పోషకాలను శక్తిగా మార్చడంతో పాటు ప్రత్యేక విధులను నిర్వర్తిస్తాయి. దాదాపు అన్ని యూకారియోటిక్ కణాల్లో (నిజకేంద్రక కణాలు) ప్రధాన కణాంగాలు ఉంటాయి. ఇవి కణాల మనుగడకు అవసరమయ్యే శక్తిని ఉత్పత్తి చేయడం, ప్రోటీన్ల తయారీ, వ్యర్థాల తొలగింపు లాంటి పనులు నిర్వహిస్తాయి. కణాంగాల్లో కేంద్రకం, కణపొర (సెల్ మెంబ్రేన్), మైటోకాండ్రియా, ఎండోప్లాస్మిక్ రెటిక్యులం ముఖ్యమైనవి.

కణపొర (సెల్ మెంబ్రేన్)

కణాన్ని దాని పరిసరాల నుంచి రక్షించడం కణపొర ప్రాథమిక విధి. దీన్ని ప్లాస్మా పొర లేదా సైటోప్లాస్మిక్ పొర అని కూడా పిలుస్తారు. ఇది ప్రోటీన్లతో కూడిన లిపిడ్ బైలేయర్‌ను కలిగి ఉండి కణాల లోపలి భాగాన్ని కణ బాహ్య ప్రదేశంతో వేరు చేస్తుంది.

- ఇది కణ భౌతిక సమగ్రతను కాపాడుకోవడానికి ఒక భౌతిక అవరోధంగా పనిచేస్తుంది అంటే కణం కంటెంట్‌లను యాంత్రికంగా కప్పి ఉంచడం, కణంలోకి, కణం నుంచి అయాన్లు లేదా అణువులు లాంటి కణాల కదలికను నియంత్రిస్తుంది.
- కార్బన్ డైఆక్సైడ్ (CO_2), ఆక్సిజన్ (O_2) లాంటి కొన్ని పదార్థాలు (చిన్న అణువులు, అయాన్లు) ప్లాస్మా పొర ద్వారా రవాణా అవుతాయి.
- కణపొర ఫాస్ఫోలిపిడ్లు, కొలెస్ట్రాల్, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు అనే నాలుగు వేర్వేరు రకాల అణువులతో ఏర్పడుతుంది.

కణద్రవం (సైటోప్లాజం)

కణద్రవం అనేది కణం లోపల ఉండే పదార్థం. ఇందులో సైటోసోల్ (జెల్ లాంటి పదార్థం), కణాంగాలు ఉంటాయి. ఇది కణానికి ఆకృతిని ఇవ్వడంతో పాటు కణాంగాలు వాటి స్థానంలో అమరి ఉండేలా చేస్తుంది.

- సైటోప్లాజమ్ దాదాపు 80% నీటిని కలిగి ఉంటుంది. కణంలో జరిగే ముఖ్యమైన కార్యకలాపాలన్నీ ఇక్కడే జరుగుతాయి.
- కణద్రవ్యంలో వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడానికి, జీవక్రియ కార్యకలాపాలకు సహాయపడే ఎంజైమ్‌లు ఉంటాయి.

కేంద్రకం

కేంద్రకం యూకారియోటిక్ కణాల్లో కనిపించే ఒక కణాంగం.

- కేంద్రకంలో కేంద్రక త్వచం, కేంద్రక ద్రవం, కేంద్రకాంశం, జన్యు పదార్థం ఉంటాయి.
- జన్యు పదార్థం డీఎన్ఏ అణువులతో పాటు వివిధ రకాల ప్రోటీన్లతో కలిసి క్రోమోజోములుగా ఏర్పడి ఉంటుంది.

కేంద్రకం విధులు: కేంద్రక త్వచంలోని అనేక రంధ్రాలు కేంద్రకం లోపలికి, బయటికి ఏయే పదార్థాలు వెళ్లాలో నిర్ణయించి అనుమతిస్తాయి.

- కేంద్రకాంశం రైబోజోమ్‌లను తయారు చేస్తుంది. కణం లోపల అతి ముఖ్యమైన పని ఇదే.
- క్రోమోజోమ్‌లు కణ జన్యు సమాచారాన్ని (DNA) కలిగి ఉంటాయి. కణంలో జరిగే అన్ని విధులకు క్రోమోజోమ్‌లు సంకేతంగా ఉంటాయి.
- క్రొమాటిన్ అనే పిలిచే పొడవైన, సన్నటి DNA (డీఆక్సీరైబోన్యూక్లిక్ ఆమ్లం) తంతువులు వంశపారంపర్య పదార్థం, జన్యువులను నిల్వ చేస్తాయి.
- జన్యు వ్యక్తీకరణను నియంత్రించడం, కణచక్రం సమయంలో DNA ప్రతికృతిని మధ్యవర్తిత్వం చేయడం కణ కేంద్రకం ప్రధాన విధుల్లో ముఖ్యమైనవి.

మైటోకాండ్రియా

యూకారియోటిక్ జీవుల్లో రెండు పొరలతో కనిపించే కణాంగమే మైటోకాండ్రియా.

- కణానికి రసాయన శక్తి వనరుగా ఉపయోగపడే అడినోసిన్ ట్రైఫాస్ఫేట్ (ATP)ను ఉత్పత్తి చేస్తుంది.
- కణంలో మైటోకాండ్రియాల సంఖ్య జీవి, కణజాలం, కణ రకం ఆధారంగా మారుతూ ఉంటుంది.

ఉదా: ఎర్ర రక్తకణాల్లో మైటోకాండ్రియా ఉండదు. కానీ కాలేయ కణాల్లో 2000 కంటే ఎక్కువ ఉంటాయి.

- మైటోకాండ్రియాలో బయటి, అంతర పొరల మధ్యస్థలం, లోపలి పొర (క్రిస్టే), మాతృక ఉంటాయి.

విధులు: కణానికి కావాల్సిన శక్తిని ఉత్పత్తి చేయడం మైటోకాండ్రియా ప్రధాన విధి. అందుకే మైటోకాండ్రియాను 'కణ శక్తి కర్మాగారం' అంటారు.

క్లోరోప్లాస్ట్

ఇది మొక్కలు, ఆల్గే కణాల్లో కనిపించే ఒక ముఖ్యమైన కణాంగం.

- క్లోరోప్లాస్ట్ సాధారణంగా అండాకారం లేదా డిస్క్ ఆకారంలో ఉంటుంది. దీని చుట్టూ బాహ్య, అంతర పొరలు ఉంటాయి.
- బాహ్య పొర క్లోరోప్లాస్ట్‌ను కణద్రవం నుంచి వేరు చేస్తుంది. దాదాపు అన్ని అణువులను స్వేచ్ఛగా లోపలికి, బయటికి అనుమతిస్తుంది.
- అంతర పొర బాహ్య పొర లోపల ఉంటుంది. ఇది కొన్ని అణువులను మాత్రమే లోపలికి అనుమతిస్తుంది. ఈ రెండు పొరల మధ్య అంతర పొర స్థలం ఉంటుంది.
- క్లోరోప్లాస్ట్ లోపల స్ట్రోమా, థైలకాయిడ్లు, గ్రానా, లామెల్లే/స్ట్రోమా లామెల్లే అనే భాగాలు ఉంటాయి.

క్లోరోప్లాస్ట్ విధులు: కిరణజన్య సంయోగక్రియను నిర్వహించడం క్లోరోప్లాస్ట్ ప్రధాన విధి.

- ఈ ప్రక్రియతో మొక్కలు తమకు అవసరమైన ఆహారాన్ని (చక్కెర) తయారు చేసుకుంటాయి.
- ఈ కిరణజన్య సంయోగక్రియ ద్వారా మొక్కలకు ఆహారం అందించడంతో పాటు భూమిపై జీవులకు అవసరమైన ఆక్సిజన్ విడుదలవుతుంది.

రైబోజోమ్

రైబోజోమ్‌లు RNA, దాని సంబంధిత ప్రోటీన్లతో కూడిన చిన్న కణాలు. ఇది జన్యు సంకేతాన్ని అమైనో ఆమ్లాల గొలుసులుగా మార్చడానికి ఉపయోగించే సంక్లిష్టమైన కణ యంత్రాంగం. వీటిలో ప్రోటీన్ల సంశ్లేషణ జరుగుతుంది.

ఎండోప్లాస్మిక్ రెటిక్యులం (ER)

యూకారియోటిక్ కణాల్లో కనిపించే ఒక కణాంగం.

- ఇది సిస్టర్నే అని పిలిచే చదునైన, పొరతో కప్పిన సంచులు లేదా గొట్టం లాంటి నిర్మాణాలను కలిగి ఉండి ఒకదానితో ఒకటి అనుసంధానితమై ఒక నెట్‌వర్క్‌ను ఏర్పరుస్తుంది. ఇందులో నునుపు, గరుకు అనే రెండు రకాల ఎండోప్లాస్మిక్ రెటిక్యులాలు ఉంటాయి.
- ఎండోప్లాస్మిక్ రెటిక్యులం అనేక సాధారణ విధులను నిర్వర్తిస్తుంది. సిస్టర్నే సంచుల్లో ప్రోటీన్ అణువులను మడతపెట్టడం, సంశ్లేషణ చేసిన ప్రోటీన్‌లను వెసికిల్స్ ద్వారా గాల్జీ ఉపకరణానికి రవాణా చేస్తుంది.

గాల్జీ ఉపకరణం

ఇది చాలా యూకారియోటిక్ కణాల్లో కనిపించే ఒక కణాంగం. దీన్ని గాల్జీ ఉపకరణం, గాల్జీ కాంప్లెక్స్, గాల్జీ బాడీ, లేదా గాల్జీ అని పిలుస్తారు.

- ఈ ఉపకరణం వరుస కంపార్ట్‌మెంట్‌లతో చదునైన సిస్టర్నే పొరతో కప్పి ఉంచిన డిస్కుల సమూహం.
- ఎండోప్లాస్మిక్ రెటిక్యులం నుంచి అందుకున్న ప్రోటీన్‌లను సేకరించి, పంపిణీ కేంద్రంగా పనిచేస్తుంది.
- వెసికిల్స్ ద్వారా రవాణా అయిన సంశ్లేషణ ప్రోటీన్‌లను ప్యాక్ చేసి సరఫరా చేస్తుంది.
- లిపిడ్ రవాణా, లైసోజోమ్ ఏర్పడటంలో తోడ్పడతాయి.


రచయిత
డాక్టర్ బిరుదు రవిబాబు
విషయ నిపుణులు

Word of the Day 744

Effulgent

Telugu meaning: కాంతిమంతమైన, ప్రకాశించే

English meaning: The word effulgent (ఎఫుల్జెంట్) is an adjective that describes something shining brightly or radiating brilliance, often used figuratively for joy or beauty.


Synonyms: Radiant, Dazzling

Antonyms: Dull, Lackluster

Usage: **1.** The bride looked effulgent in her white gown, glowing with happiness.

2. The effulgent morning sun bathed the entire valley in golden light.

Current Affairs



Prime Minister Narendra Modi addressed the nation from the ramparts of the Red Fort on the 79th Independence Day, delivering his 12th consecutive speech on 15 August 2025. He first addressed the nation as Prime Minister from the Red Fort in 2014 and has now delivered a speech every year without a break, from 2014 to 2025.

- The milestone makes PM Modi the second Indian Prime Minister to deliver 12 Independence Day speeches in a row, after Pandit Jawaharlal Nehru, who still has the most consecutive speeches delivered with 17 in total.



Anandkumar Velkumar won a bronze medal in the men's 1000m sprint inline speed skating track event at the World Games 2025 in Chengdu, People's Republic of China, on 15 August 2025. He clocked 1:22.482 in the final.

- Spain's Jhoan Sebastian Guzman Bitar took gold with 1:22.288 while Colombia's Jhon Edwar Tascon Holguin had to settle for silver despite a faster run of 1:21.846.

Indian Naval Ships INS Rana (a Guided Missile Destroyer) and INS Jyoti (Fleet Tanker) arrived at Colombo to participate in the 12th edition of Sri Lanka India Naval Exercise (SLINEX-25) scheduled from 14 to 18 Aug 25. Conceptualised in 2005, SLINEX is a bilateral naval exercise that has strengthened maritime cooperation between the two nations over two decades.

India has achieved a landmark milestone of 100 Gigawatt of solar photovoltaic (PV) module manufacturing capacity listed under the Approved List of Models and Manufacturers (ALMM), a remarkable leap from just 2.3 GW in 2014. The Ministry of New and Renewable Energy introduced the ALMM Order in 2019, with the first list enlisting 8.2 GW of capacity.

For more Current Affairs: Scan QR code

ఇండియన్ స్టాండర్డ్ టైం (ఐఎస్‌టీ)

స్టడీ జోన్



ప్రతి మనిషి జీవితంలో సమయపాలన ఎంతో ముఖ్యం. ఆధునిక సాంకేతికత విస్తరిస్తున్న నేపథ్యంలో అందరూ 'టైం'కు అనుగుణంగా తమ కార్యాచరణను రూపొందించుకుని ఆచరిస్తున్నారు. మన దేశంలో ఇండియన్ స్టాండర్డ్ టైం (ఐఎస్‌టీ)ని పౌరులంతా అనుసరిస్తారు. ఇది అంతర్జాతీయ ప్రామాణిక రేఖాంశమైన యునైటెడ్ కింగ్‌డమ్‌లోని గ్రీనిచ్ రేఖాంశానికి - అంటే కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైం-యూటీసీకి అయిదున్నర గంటలు ముందుంటుంది

- భారతదేశ ప్రామాణిక కాలమానాన్ని 82.5 డిగ్రీల తూర్పు రేఖాంశం ఆధారంగా లెక్కిస్తారు. ఈ రేఖాంశం యూపీలోని ప్రయాగ్‌రాజ్‌కు దగ్గరున్న మీర్జాపూర్ పట్టణానికి కొద్దిగా పశ్చిమంగా, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ మీదుగా వెళ్తుంది. మీర్జాపూర్, గ్రీనిచ్‌లోని రాయల్ అబ్జర్వేటరీ మధ్య రేఖాంశ అంతరం 5.30 గంటలు. మీర్జాపూర్ దగ్గరి సమయాన్నే దేశమంతటా పాటిస్తారు.
- బ్రిటిష్ కాలంలో 1906లో ఐఎస్‌టీని నెలకొల్పారు. 1947 సెప్టెంబరు 1న భారత ప్రభుత్వం దీన్ని అధికారికంగా ప్రవేశపెట్టింది.
- ఐఎస్‌టీని ప్రస్తుతం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ - నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (సీఎస్ఐఆర్ - ఎన్‌పీఎల్) నిర్వహిస్తోంది.

భారత్, ఇతర దేశాల మధ్య సమయ వ్యత్యాసాలను పరిశీలిస్తే..

దేశం	వ్యత్యాసం (గంటల్లో)
శ్రీలంక	00.00
నేపాల్	+0.15
బంగ్లాదేశ్	+0.30
చైనా	+2
జపాన్	+3.5
ఆస్ట్రేలియా	+4.5
న్యూజిలాండ్	+6.5
పాకిస్థాన్	-0.30
సౌదీ అరేబియా	-2.5
దుబాయ్	-1.5
బ్రిటన్	-4.5
రష్యా	-2.5
అమెరికా (న్యూయార్క్)	-9.5
అమెరికా (కాలిఫోర్నియా)	-12.5

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

పాలిమర్లు

ఒకే పదార్థం లేదా రెండు, మూడు పదార్థాలకు చెందిన అల్పఅణుభారం, సరళ అణునిర్మాణం కలిగిన అణువులు ఒకదానితో మరొకటి పుంఖానుపుంఖాలుగా కలిసి ఏర్పర్చే అత్యధిక అణుభారమున్న అణువులే పాలిమర్లు. పాలిమరీకరణ చర్యలో అనేక అణువుల కలయిక వల్ల పాలిమర్ అణువులు ఏర్పడతాయి. పోటీపరీక్షార్థులు పాలిమరీకరణ, అవధి, వర్గీకరణ - అందులోని అంశాలపై దృష్టి సారించాలి.



పాలిమర్ అంటే అనేక చిన్న భాగాలు లేదా అణువులను కలిగిన బృహదణువు అని అర్థం.

- గ్రీకు భాషలో పాలి (poly) అంటే అనేకం, మెర్ (mer) అంటే భాగం అని అర్థం.
- పాలిమర్‌ను ఏర్పర్చిన సరళ అణువులను మోనోమర్లు అంటారు. వేల సంఖ్యలో మోనోమర్ అణువులు కలవడం వల్ల పాలిమర్ అణువు ఏర్పడుతుంది.

పాలిమరీకరణం

మోనోమర్ నుంచి పాలిమర్ ఏర్పడే విధానాన్ని పాలిమరీకరణం అంటారు. అనేక అణువుల కలయికతో పాలిమర్లు ఏర్పడతాయి.

- తగిన ఉష్ణోగ్రత, పీడనం, ఉత్ప్రేరకం, ద్రావణి, ఇతర కారకాల సమక్షంలో మోనోమర్ అణువులు చర్య జరిపి పాలిమర్లను ఏర్పరుస్తాయి.

పాలిమరీకరణ అవధి, పాలిమరీకరణం రకాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

జనరలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పుణె దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో 500 జనరలిస్ట్ ఆఫీసర్ (స్కేల్ II) పోస్టుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ఫీజు రూ.1,180. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

ఒడిశాలోని సీఎస్ఐఆర్ - ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ) భువనేశ్వర్ తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 23. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 ఆగస్టు 31.

కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్ పథకం

సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖకు చెందిన వికలాంగుల (దివ్యాంగుల) సాధికారిత విభాగం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ గుర్తింపు పొందిన వైకల్యం కలిగిన విద్యార్థుల విద్యా పురోగతికి సహాయం చేయడానికి (స్కాలర్‌షిప్ ఫర్ స్టూడెంట్స్ విత్ డిజేబిలిటీస్) ఆరు విభిన్న స్కాలర్‌షిప్ పథకాలు అందిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 31 అక్టోబరు 2025.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఆగస్టు 17) చివరి తేదీ

- ఇంటెలిజెన్స్ బ్యూరోలో 4,987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టులు. టెన్త్ ఉత్తీర్ణులు అర్హులు.
- ఐఐటీ గువాహటిలో 12 ఉద్యోగాలు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగ అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Statements & Conclusions

Directions (Qs. 1 - 4): *Read the following information carefully and answer the question that follows. You must assume everything in the statement to be true and decide which of the conclusion/s logically follow/s.*

1. The coastal town of Blue Harbor has recently reported an unusual increase in cases of skin irritation among fishermen and swimmers. Environmental experts traced the cause to untreated wastewater being released directly into the bay by a nearby seafood processing plant. The plant management denied any wrongdoing at first, but after a government investigation and media coverage of the issue, the company received an official order to suspend all sea-bound waste disposal until further notice.

Which of the following can be concluded from the given information?

1. The seafood processing plant will be permanently shut down.
2. The wastewater from the plant contains harmful substances causing skin irritation.
3. The government acted only because of media reports on the issue.
4. People engaging in activities in the bay water risk exposure to harmful substances.

Railway Exams

Reasoning

A) Only 2 and 4 B) Only 1 and 4
C) Only 1 and 3 D) Only 2 and 3

2. The mountain village of Silver Peak recently faced a shortage of clean drinking water. Investigations revealed that a nearby mining site had been contaminating the underground water sources with chemical runoff. Initially, the mining company denied responsibility and continued operations. However, after multiple water samples confirmed high levels of toxins, the local council ordered the company to stop all mining activities until proper waste management systems were installed.

Which of the following can be concluded from the given information?

1. Mining activities in Silver Peak will never resume in the future.
2. The contamination in underground water was caused by chemical waste from the mine.
3. The council acted after confirming the source of contamination.
4. The people of Silver Peak currently do not have access to safe underground water.

A) Only 2 and 4 B) Only 1 and 4
C) Only 1 and 3 D) Only 2 and 3

3. The coastal town of Bayview has reported a significant drop in fish population over the last six months. Marine biologists have traced the cause to an offshore oil spill from a leaking tanker, which has polluted large sections of the bay. The shipping company responsible for the tanker initially denied the leak, but satellite images confirmed the presence of oil slicks. The government has ordered the company to fund a clean-up operation and temporarily banned all commercial fishing in the affected area.

Which of the following can be concluded from the given information?

1. Commercial fishing in Bayview will be permanently stopped.
2. The oil spill was caused by the leaking tanker owned by the shipping company.
3. The government acted after receiving conclusive evidence of the oil spill.
4. The fish population drop is directly linked to the polluted waters.

A) Only 1 and 4 B) Only 1 and 3
C) Only 2 and 3 D) Only 2 and 4

4. The city library of Oakwood has seen a sharp decline in visitors over the past year. A survey revealed that many residents now prefer using online reading platforms instead of borrowing physical books. In response, the library introduced a digital membership program, allowing members to access e-books and audiobooks from home. Within three months, the number of active memberships increased significantly, but foot traffic to the physical library building continued to decrease.

Which of the following can be concluded from the given information?

1. The decline in physical visits to the library is due to the growing popularity of digital reading platforms.
2. The library's new digital membership program has attracted more overall members.
3. The physical library building will be closed permanently in the near future.
4. People who prefer physical books have completely stopped using the library.

A) Only 1 and 3
B) Only 1 and 2
C) Only 2 and 4
D) Only 3 and 4

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

ఎదగాలంటే.. ఏఐ నేర్చుకో! | జాబ్ స్కిల్స్



రోజు రోజుకీ అందరి జీవితాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ప్రభావం పెరిగిపోతోంది. ఉద్యోగాల తీరు, పని స్వభావం పూర్తిగా మారిపోతున్నాయి. ఐటీ రంగంలో 'లే-ఆఫ్'లు దాని పరిణామమే అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఏఐతో కొన్ని రకాల ఉద్యోగాలు పోయినప్పటికీ, కొత్త ఉద్యోగాలు తప్పకుండా పుట్టుకొస్తాయంటున్నారు. వాటిని అందుకోవాలంటే సరికొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. అపోహలను పక్కన పెట్టి, స్కిల్స్ పెంచుకోవడం ఎందుకు అవసరమో తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్

■ 'ఏక్ పేడ్ మా కే నామ్ 2.0' ప్రచార కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏ దినోత్సవం సందర్భంగా ప్రారంభించారు?



జ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం

మాదిరి ప్రశ్నలు

■ ఇటీవల ఏ దేశ ప్రభుత్వం షేక్ ముజిబుర్ రెహమాన్‌కు 'జాతిపిత' అనే బిరుదును తొలగించింది?

జ. బంగ్లాదేశ్ (ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం జాతిపిత బిరుదును తొలగించడంతోపాటు షేక్ ముజిబుర్ రెహమన్ చిత్రం లేని కొత్త కరెన్సీ నోట్లను విడుదల చేసింది.)

■ ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? **జ:** జూన్ 8

మరింత సమాచారం

■ బ్లూ బర్డ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఏ దేశం అభివృద్ధి చేస్తుంది? **జ:** అమెరికా

జవాబు దక్కాలంటే దిక్కులే దిక్కు!

కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు గమ్యాన్ని చేరడానికి జీపీఎస్ ఉన్నప్పటికీ దిక్కులు తెలియకపోతే గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంది. డ్రైవింగ్ చేసేటప్పుడు రోడ్లపై కనిపించే ట్రాఫిక్ గుర్తులను సరిగా గుర్తించాలంటే దిక్కుల పరిజ్ఞానం ఉండాలి. నిత్య జీవితంలో కీలకమైన ఈ అంశంలో అభ్యర్థుల నైపుణ్యాన్ని పరీక్షించేందుకు రీజనింగ్‌లో భాగంగా దిక్కులపై ప్రశ్నలు అడుగుతుంటారు. వీటికి తగిన సమాధానాలను వేగంగా కనుక్కోవాలంటే ప్రధాన దిక్కులు, ఉపదిక్కుల గురించి తెలుసుకోవాలి. దిశల మార్పులు అంటే కుడివైపు, ఎడమవైపులకు తిరగడంపై అవగాహన కలిగి ఉండాలి. కోణాలను అర్థం చేసుకోవాలి.



జనరల్ స్టడీస్ రీజనింగ్


దిక్కులు



వివిధ రకాల పోటీ పరీక్షల్లో 'దిక్కులు' అనే అంశం నుంచి తరచూ ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక వ్యక్తి.. ప్రశ్నలో ఇచ్చిన పలు నియమాల ఆధారంగా గమ్యస్థానం చేరినప్పుడు అతడు బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు? ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు? ప్రారంభ స్థానం దృష్ట్యా ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు? మొదలైన ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది. వీటితోపాటుగా నీడలు, గడియారాన్ని ఆధారంగా చేసుకుని కూడా ప్రశ్నలు వస్తుంటాయి. దూరాన్ని కనుక్కోవడానికి పైథాగరస్ సిద్ధాంతంపై పట్టు పెంచుకోవాలి.

★ దిక్కులు మొత్తం 8 అందులో ప్రధానమైనవి 4.

❋ ఉత్తరం (N)
❋ దక్షిణం (S)
❋ తూర్పు (E)
❋ పడమర (W)
❋ ఈశాన్యం (N-E)
❋ ఆగ్నేయం (S-E)
❋ నైరుతి (S-W)
❋ వాయవ్యం (N-W)



★ ప్రతి రెండు వరుస దిక్కులు లేదా ప్రతి రెండు వరుస మూలల మధ్యకోణం 90°.


★ ఒక దిక్కు, దాని అనురూప మూల మధ్యకోణం 45°.

★ 1 ఎడమ లేదా కుడి = 90°.

★ ఒక వ్యక్తి తూర్పు దిశకు అభిముఖంగా ఉన్నాడు అంటే అతడు తూర్పు వైపు ముఖం పెట్టి ఉన్నాడని అర్థం.

★ ఒక వ్యక్తి బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఉన్నాడని అన్నప్పుడు క్షితిజ సమాంతర దూరాన్ని కనుక్కోవాలి.

పైథాగరస్ సూత్రం: ఒక లంబకోణ త్రిభుజంలో కర్ణం మీది వర్గం, మిగతా రెండు భుజాల వర్గాల మొత్తానికి సమానం.





$కర్ణం^2 = భుజం^2 + భుజం^2$

$AC^2 = AB^2 + BC^2$

(AB, BC, AC) పైథాగరస్ త్రికాలు

★ (3, 4, 5), (5, 12, 13), (7, 15, 17), (16, 63, 65) .... మొదలైనవి పైథాగరస్ త్రికాలు.

నీడలు: ★ ఉదయం సమయంలో ఒక వ్యక్తి లేదా వస్తువు నీడ పడమర వైపు ఉంటుంది.

★ సాయంత్రం సమయంలో ఒక వ్యక్తి లేదా వస్తువు నీడ ఎల్లప్పుడూ తూర్పు వైపు ఉంటుంది.

1. ఒక వ్యక్తి తూర్పు దిశగా ప్రయాణాన్ని ప్రారంభించి మొదటగా ఎడమవైపు, ఎడమవైపు, కుడివైపు, ఎడమవైపు, కుడివైపు, కుడివైపు, కుడివైపు, కుడివైపు, కుడివైపు, కుడివైపు మలుపులు తిరుగుతూ చివరగా కుడివైపునకు తిరిగి తన గమ్యస్థానాన్ని చేరినా, ప్రస్తుతం అతడు ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు?

1) పడమర 2) ఉత్తరం
3) వాయవ్యం 4) తూర్పు

వివరణ: ఎడమ, ఎడమ, కుడి, ఎడమ, కుడి, కుడి, కుడి, కుడి, కుడి, కుడి పైశ్రేణిలో ఒక ఎడమకు, ఒక కుడిని కొట్టివేసి మిగిలిన ఎడమలు/కుడులు ప్రారంభంలో వ్యక్తి ప్రయాణిస్తున్న దిశకు వర్తింపజేయాలి.



ఎ, ఎ, కు, ఎ, కు, కు, కు, కు, కు, కు

ఒక కుడి = 90°

మూడు కుడులు = 3 × 90 = 270°

తూర్పు + కుడివైపు (270°) = ఉత్తరం **జ: 2**

2. ఒక వ్యక్తి ఆగ్నేయ దిశగా, తన ప్రయాణాన్ని ప్రారంభించి మొదటగా కుడివైపు 180°లతో, ఎడమవైపు 270°, కుడివైపు 90°, కుడివైపు 180°, ఎడమవైపు 90° కోణంతో మలుపులు తిరుగుతూ చివరగా ఎడమవైపు 270°లతో తిరిగి గమ్యస్థానం చేరాడు. అయితే ప్రస్తుతం ఆ వ్యక్తి ఏ దిశకు అభిముఖంగా ప్రయాణిస్తున్నాడు?

1) పడమర 2) తూర్పు
3) వాయవ్యం 4) ఈశాన్యం

వివరణ:

కుడివైపు	ఎడమవైపు
180	270
90	90
180	270
450	630




తేడా 630 − 450 = 180 ఇది ఎడమలో మిగిలింది కాబట్టి ప్రారంభంలో వ్యక్తి ప్రయాణిస్తున్న దిశకు అనువర్తింపజేయాలి.

ఆగ్నేయం + ఎడమవైపు (180°) = వాయవ్యం **జ: 3**

3. మెహెర్ పాఠశాల నుంచి తూర్పు దిశగా 5 కి.మీ. ప్రయాణించి అక్కడి నుంచి ఉత్తరం వైపు 10 కి.మీ., పడమర వైపు 15 కి.మీ., ప్రయాణించి చివరగా దక్షిణం వైపు 20 కి.మీ. ప్రయాణించి ఇంటికి చేరాడు. అయితే అతడు బయల్దేరిన స్థానం దృష్ట్యా ఎంత దూరంలో, ఏ దిశలో ఇల్లు ఉంది?

1) $5\sqrt{5}$ కి.మీ., దక్షిణం 2) 5 కి.మీ., దక్షిణం
3) $10\sqrt{2}$ కి.మీ., నైరుతి 4) 5 కి.మీ., నైరుతి

వివరణ:





AB = 10,

BC = 10

$AC^2 = AB^2 + BC^2 = 10^2 + 10^2 = 100 + 100$

$AC^2 = 200$


$AC = \sqrt{200} = \sqrt{100 \times 2} = 10\sqrt{2}$ కి.మీ. **జ: 3**

4. దార్మిక్ తన ఇంటి నుంచి 50 మీ. ఉత్తరం వైపు ప్రయాణించి, అక్కడి నుంచి కుడివైపు తిరిగి 80 మీ. ప్రయాణించాడు. అక్కడి నుంచి ఉత్తరం వైపు 20 మీ., తూర్పు వైపు 40 మీ. ప్రయాణించి అక్కడి నుంచి కుడివైపు 70 మీ. ప్రయాణించి చివరగా పడమర వైపు 15 మీ. ప్రయాణించి మార్కెట్ చేరుకున్నాడు. అయితే ఇంటి నుంచి మార్కెట్ ఎంత దూరం?

మాదిరి ప్రశ్నలు

1) 100 మీ. 2) 200 మీ.
3) 105 మీ. 4) 180 మీ.

వివరణ:



AB = 50, BC = 80, CD = 20, DE = 40, EF = 70, FG = 15


AG = 80 + (40 − 15) = 80 + 25 = 105 మీ.

ఇంటి నుంచి మార్కెట్ 105 మీ. దూరం **జ: 3**

5. B యొక్క ఉత్తర దిశలో A, B కు తూర్పు దిశలో C ఉన్నారు. అయితే C దృష్ట్యా A యొక్క దిశ?

1) ఆగ్నేయం 2) వాయవ్యం
3) నైరుతి 4) ఈశాన్యం

వివరణ:




C దృష్ట్యా A యొక్క దిశ వాయవ్య దిశ. **జ: 2**

6. ఒక వ్యక్తి తన గడియారాన్ని బల్లపై ఉదయం 6 గంటల సమయంలో దాని గంటల ముల్లు ఉత్తర దిశను సూచించేలా పెట్టాడు. ఉదయం 9:15 నిమిషాల సమయంలో ఆ గడియారంలోని నిమిషాల ముల్లు సూచించే దిశ?

1) ఆగ్నేయం 2) పడమర
3) దక్షిణం 4) ఉత్తరం

వివరణ:




∴ 9:15 నిమిషాలకు నిమిషాల ముల్లు పడమర దిశను సూచిస్తుంది. **జ: 2**



7. ఒక లంబకోణ సమద్విబాహు త్రిభుజం ABC యొక్క శీర్షాల వద్ద ముగ్గురు వ్యక్తులు నిల్చున్నారు. B వద్ద వ్యక్తి A కు ఉత్తరంగా, C వద్ద వ్యక్తి A కు తూర్పు దిశగా ఉంటే అప్పుడు B దృష్ట్యా C ఉండే దిశ?

1) నైరుతి 2) ఆగ్నేయం
3) వాయవ్యం 4) ఈశాన్యం

వివరణ:



B దృష్ట్యా C దిశ ఆగ్నేయ దిశ **జ: 2**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

చరక సంహితలో చర్మవ్యాధుల సమాచారం!

విజ్ఞాన శాస్త్రం




చుట్టూ ఉన్న ప్రపంచంలోని వాస్తవాలను హేతుబద్ధమైన నియమాల ఆధారంగా సైన్స్ లేదా విజ్ఞాన శాస్త్రం వివరిస్తుంది. నిర్ణీత అంశాలపై పరిశీలన, ప్రయోగాల ద్వారా సేకరించిన సమాచారాన్ని శాస్త్రీయంగా తెలియజేస్తుంది. అనేక విభాగాలతో కూడిన ఆ శాస్త్రం జ్ఞానాన్ని పెంచుకోవడానికి, జీవితాలను మెరుగుపరచుకోవడానికి ఉపకరిస్తుంది. జీవి ఆవిర్భావం, పుట్టుక, పెరుగుదల, జీవక్రియలు జరిగే విధానం, కాలక్రమంలో జీవుల పరిణామం, వివిధ రకాల వ్యాధులు, కారకాలతోపాటు నివారణ మార్గాలు తదితరాలను బోధించే జీవశాస్త్రం విజ్ఞాన శాస్త్రంలో ఒక చిన్న భాగం మాత్రమే. పలు శాస్త్రాలు, వాటి అధ్యయనాలు, అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు, ప్రాథమిక వైజ్ఞానిక విశేషాలతో వెలువడిన ప్రసిద్ధ గ్రంథాలు, రచయితలు మొదలైన విషయాలపై పోటీపరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. జీవశాస్త్ర ప్రాథమిక పరికల్పనలను, వాటి అవసరాలను అర్థం చేసుకోవాలి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

1. కింది వారిలో ప్రపంచ విజ్ఞానశాస్త్ర పితామహుడు?
1) గెలీలియో గెలీలి 2) జగదీష్ చంద్రబోస్
3) రాబర్ట్ హుక్ 4) రాబర్ట్ బ్రౌన్

2. కింది వాటిలో సత్య ప్రవచనాన్ని ఎన్నుకోండి.
ఎ) సైన్స్ అనేది ఆంగ్ల పదం.
బి) సైన్షియా అనేది లాటిన్ పదం.
సి) సిరే అంటే జ్ఞానం అని అర్థం.
డి) భారతదేశ విజ్ఞానశాస్త్ర పితామహుడు జగదీష్ చంద్రబోస్.



జగదీష్ చంద్రబోస్


1) ఎ, బి 2) ఎ, బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

3. వాదన–ఎ: విజ్ఞాన శాస్త్రంలో జీవశాస్త్రం అనేది ఒక శాఖ.
వాదన–బి: విజ్ఞాన శాస్త్రం అన్ని శాఖలకు తల్లి లాంటిది.
1) ఎ, బి లు సరైనవి.
2) ఎ సరైంది, బి సరికాదు.
3) ఎ సరికాదు, బి సరైంది. 4) ఎ, బి లు సరికావు.

4. 'చరిత్రలో సైన్స్' అనే పుస్తక రచయిత?
1) ఐన్‌స్టీన్ 2) కార్ల్ పాపర్
3) కార్ల్ పియర్‌సన్ 4) ఎఫ్. ఖజోరి

5. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
1) సైన్స్ అనేది భూగోళం మీద ఉన్న సజీవ, నిర్జీవ అంశాల మధ్య ఉండే సంబంధాన్ని వివరిస్తుంది.
2) సైన్స్ అనేది జ్ఞాన సంఘటితం.
3) సైన్స్‌లో ఎలాంటి శాఖలుండవు.
4) సైన్స్ అనేది ప్రయోగం, పరిశీలనలపై ఆధారపడుతుంది.

6. బయాలజీ అనే పదాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
1) జీన్ లామార్క్
2) జాన్ బాప్టిస్టా
3) అరిస్టాటిల్
4) 1, 2



జీన్ లామార్క్

7. కింది వాటిని జతపరచండి.

1) అరిస్టాటిల్	ఎ) వృక్షశాస్త్ర పితామహుడు
2) థియోఫ్రాస్టస్	బి) రాబర్ట్ హుక్
3) లూయీపాశ్చర్	సి) జీవశాస్త్ర పితామహుడు
4) మైక్రో గ్రాఫియా	డి) సూక్ష్మజీవ సిద్ధాంతం

1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
3) 1-సి, 2-ఎ, 3-బి, 4-డి 4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి

8. కింది వారిలో 'ఆర్గనోన్' గ్రంథ రచయిత?
1) జీన్ లామార్క్ 2) ప్లేటో
3) అరిస్టాటిల్ 4) ష్వాన్

9. వాదన–ఎ: భారతదేశంలో మొదటి వర్గీకరణ పితామహుడు పరాశరుడు.
వాదన–బి: భారతదేశంలో వైద్యశాస్త్రం అభివృద్ధికి పునాది వేసినవారు – చరకుడు, శుశ్రుతుడు.
1) ఎ, బి లు రెండూ అసత్యాలు.
2) ఎ, బి లు రెండూ సత్యాలు.
3) ఎ సత్యం, బి అసత్యం.
4) ఎ అసత్యం, బి సత్యం.

10. కింది వాటిలో జీవశాస్త్ర ప్రాథమిక శాఖ కానిది?
1) సూక్ష్మజీవ శాస్త్రం 2) స్వరూప శాస్త్రం
3) కణజీవ శాస్త్రం 4) పురాజీవ శాస్త్రం

11. 'ఫిలాసఫియా జూలాజిక' గ్రంథకర్త ఎవరు?
1) చార్లెస్ డార్విన్ 2) జీన్ లామార్క్
3) ష్వాన్ 4) 1, 2

12. కింది వాటిని జతపరచండి.

జీవులు	అధ్యయనాలు
1) శిలీంధ్రాలు	ఎ) ఎంబ్రియాలజీ
2) శైవలాలు	బి) మైకాలజీ
3) పిండాలు	సి) ఎంటమాలజీ
4) కీటకాలు	డి) ఆల్గాలజీ

1) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి 2) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
3) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి 4) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి

13. కింది వాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
ఎ) జీవశాస్త్రం అంటే జీవులను అధ్యయనం చేసేది.
బి) జీవశాస్త్రం జీవి బాహ్య, అంతర నిర్మాణాల గురించి చర్చిస్తుంది.
సి) జీవశాస్త్రం కేవలం జీవుల గురించి మాత్రమే చెబుతుంది, పరిసరాలను పట్టించుకోదు.
డి) జీవిలో పరిసరాలకు అనుగుణంగా వచ్చే మార్పులను జీవశాస్త్రం అధ్యయనం చేస్తుంది.
1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) సి, డి

14. ఏరోబయాలజీ అనేది?
1) జీవశాస్త్ర అనువర్తిత శాఖ
2) జీవశాస్త్ర సంబంధిత శాఖ
3) జీవశాస్త్ర ప్రాథమిక శాఖ 4) 1, 3

15. కింది వాటిని జతపరచండి.


శాస్త్రవేత్తలు	మారు పేర్లు
1) కార్ల్ ఎర్నెస్ట్ వాన్‌బేర్	ఎ) ఆధునిక జీవావరణ పిత
2) పంచానన్ మహేశ్వరి	బి) పిండోత్పత్తిశాస్త్ర పిత
3) చార్లెస్ డార్విన్	సి) భారత పిండోత్పత్తిశాస్త్ర పిత
4) యూజీన్ పి ఓడమ్	డి) పరిణామశాస్త్ర పిత

1) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి 2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
3) 1-బి, 2-డి, 3-ఎ 4-సి 4) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి

16. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
1) జీవశాస్త్ర పితామహుడు - అరిస్టాటిల్
2) బయాలజీ అనేది గ్రీకు పదం
3) బయోస్, లాగోస్ అనేవి గ్రీకు పదాలు
4) బయాలజీ అనే పదాన్ని ప్రాతిపాదించిన వ్యక్తి జీన్ లామార్క్

17. పిండాభివృద్ధి గురించి ప్రస్తావించే గ్రంథం?
1) ఆన్ ది మోషన్ ఆఫ్ ఆర్ట్ అండ్ బ్లడ్ ఇన్ యానిమల్స్
2) ఆన్ ది రీప్రొడక్షన్ ఇన్ యానిమల్స్
3) కాజ్ ఆఫ్ రీప్రొడక్షన్ ఇన్ యానిమల్స్
4) ఎక్సర్‌సైజస్ ఆన్ ది జనరేషన్ ఆఫ్ యానిమల్స్


18. కింది వాటిలో సత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
ఎ) చర్మవ్యాధులు, మూత్రకోశ వ్యాధుల నిర్ధారణ గురించి ప్రస్తావించే గ్రంథం - చరక సంహిత



బి) వస్తుగుణ దీపిక - విదేశీయులకు మార్గదర్శకమైన గ్రంథం.
సి) రాబర్ట్ హుక్ వెరిస్ డయాఫ్రమ్ అనే పరికరాన్ని కనుక్కున్నారు.
డి) శిలాజాలు ఏర్పడే విధానాన్ని కనుక్కున్నది - బీర్‌బల్ సహాని
1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
3) ఎ, బి 4) ఎ, డి

19. 'యోగ్యతముల సార్థక జీవనం' అనే అంశాన్ని ప్రస్తావించిన వ్యక్తి?
1) లూయీపాశ్చర్ 2) అరిస్టాటిల్
3) డార్విన్ 4) 1, 3

20. కింది ఏ వ్యక్తి పరిశోధనలో అండం, శుక్రకణం కలయిక వల్ల పిండం ఏర్పడుతుందని నిరూపితమైంది?
1) విలియం హార్వే
2) విరోనిమస్ ఫ్రెబ్రికస్
3) క్రిస్టోఫర్ రెన్
4) క్రిస్టియన్ హైగెన్స్




విలియం హార్వే

21. శిలీంధ్ర, శైవలాలు కలిసి ఏర్పడే కొత్త జీవిగా దేన్ని పరిగణిస్తారు?
1) బ్రయోఫైటా 2) టెరిడోఫైటా
3) లైకెన్లు 4) థాలోఫైటా

22. కింది వాటిలో అరిస్టాటిల్‌కు సంబంధం లేనిది?
ఎ) నెమరువేసే జంతువుల జీర్ణాశయం నిర్మాణం
బి) తేనెటీగల నృత్యం సి) భూమి ఆవిర్భావం
డి) పర్వతాల ఏర్పాటు
1) ఎ, బి 2) సి, డి 3) బి 4) డి

23. కింది వాటిలో సత్యవాక్యాన్ని ఎంచుకోండి.
ఎ) ఆంత్రాక్స్ వ్యాధికి విరుగుడు కనుక్కున్నది - లూయీపాశ్చర్
బి) ఆక్టోపస్ అంతర నిర్మాణం కనుక్కున్నది - అరిస్టాటిల్
సి) జీవజాతుల గురించి ప్రస్తావించిన వ్యక్తి - చార్లెస్ డార్విన్



చార్లెస్ డార్విన్

డి) నాడీస్పందన, హృదయ స్పందనకు మధ్య ఉండే సంబంధాన్ని తెలిపిన వ్యక్తి - విలియం హార్వే
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
3) బి, సి 4) బి, సి, డి

24. పదార్థాల స్ఫటిక నిర్మాణాన్ని అధ్యయనం చేసిన వ్యక్తి?
1) రాబర్ట్ బ్రౌన్ 2) విలియం హార్వే
3) లూయిస్ పాశ్చర్ 4) న్యూటన్

25. కంటికి కనిపించే శిలీంధ్రం?
1) స్పైరోగైరా 2) పుట్టగొడుగు
3) కాండిడా 4) 1, 2

26. శిలీంధ్ర జాలాన్ని ఏమంటారు?
1) స్పోరై 2) హైఫై
3) స్పొరై 4) హైఫే

27. అంతరీక్ష యాత్రికులు తమతోపాటు ఆక్సిజన్ కోసం తీసుకుని వెళ్లే శైవలం?
1) క్లోరెల్లా 2) స్పైరోగైరా
3) కాండిడా 4) అజోల్లా

28. కింది వారిలో లైకెన్స్‌ల పితామహుడు?
1) లిన్నేయస్ 2) అరిస్టాటిల్
3) పట్వర్ధన్ 4) మైకేలీ

29. వివృత బీజాల్లో అత్యంత ఎత్తుకు పెరిగే మొక్క?
1) గింకో 2) సిక్వియ
3) దేవదారు 4) నీలగిరి

30. విజ్ఞాన శాస్త్రం అంటే?
1) క్రమబద్ధం చేసిన జ్ఞానం
2) జీవన విధానం
3) వ్యవస్థీకృతమైన లోకజ్ఞత 4) పైవన్నీ

31. కలుపు మొక్కల గురించి ప్రస్తవించిన మొదటి పురాతన గ్రంథం?
1) కృషి పరాశరం 2) వృక్షాయుర్వేదం
3) శుశ్ర సంహిత 4) చరక సంహిత

32. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుక్కోండి.
1) బరువైన వస్తువులు తొందరగా భూమిని చేరునని కనుక్కున్న వ్యక్తి - అరిస్టాటిల్.
2) మైక్రోగ్రాఫియాను రచించింది - రాబర్ట్ హుక్
3) నీటిని వేడి చేయడం వల్ల సూక్ష్మజీవులు చనిపోతాయని మొదటిగా పేర్కొంది - లూయీ పాశ్చర్
4) దోమల వల్ల వివిధ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని కనుక్కున్న మొదటి వ్యక్తి- పాట్రిక్ మాన్‌సన్

33. మొదటిగా సరళ సూక్ష్మదర్శిని కనుక్కున్న వ్యక్తి?
1) జాకారియస్ జాన్సన్
2) లీవెన్ హుక్
3) రాబర్ట్ హుక్ 4) నాల్-రష్కీ

34. జీవశాస్త్రంలో భాగమైన వృక్షశాస్త్రంపై ఎక్కువగా ప్రయోగాలు జరిపిన భారతీయ శాస్త్రవేత్త?
1) చరకుడు 2) శుశ్రుతుడు
3) పరాశరుడు
4) పైవారంతా

35. జీవశాస్త్రంలో జాతి అనే పదాన్ని పరిచయం చేసిన వ్యక్తి?
1) జాన్ రే 2) పరాశరుడు
3) లిన్నేయస్ 4) విట్టేకర్



జాన్ రే

36. బీర్బల్ సాహ్నికి సంబంధించి సరైన వాక్యం?
1) వర్గీకరణలో ప్రథముడు
2) వివృత బీజాల శిలాజాలపై ప్రయోగం చేసిన వ్యక్తి
3) ఆర్థిక వృక్షశాస్త్రపిత 4) 1, 2

37. గడ్డి అధ్యయన శాస్త్రం?
1) ఎంటమాలజీ 2) ఆగ్రోనమి
3) అగ్రస్టాలజీ 4) కైరిప్టాలజీ



రచయిత: వట్టిగౌనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-1; 2-4; 3-2; 4-4; 5-3; 6-1; 7-2; 8-3; 9-2; 10-1; 11-2; 12-1; 13-3; 14-1; 15-2; 16-2; 17-4; 18-1; 19-3; 20-1; 21-3; 22-3; 23-1; 24-3; 25-2; 26-4; 27-1; 28-3; 29-2; 30-4; 31-1; 32-3; 33-1; 34-3; 35-1; 36-2; 37-3.

పూర్వీకుల గ్రామంలో శిబూ సోరెన్ శ్రద్ధా కార్యక్రమం

రాంచీ: మూత్రపిండాల సమస్యతో ఈ నెల 4న తుదిశ్వాస విడిచిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ శ్రద్ధా కార్యక్రమం శనివారం ఆయన పూర్వీకుల స్వగ్రామం నెమ్రాలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్, ఎంపీ పప్పూ యాదవ్, భాజపా నేత, మాజీ కేంద్రమంత్రి అశ్వినీ కుమార్ చౌబే, యోగా గురు బాబా రాందేవ్ సహా పలువురు హాజరయ్యారు. శిబూ సోరెన్‌కు నివాళులర్పించారు. "నాకు తెలిసినంత వరకు ఆయన(శిబూ సోరెన్) నిరాడంబరంగా ఉండేవారు. బిర్సాముండా తర్వాత గిరిజన సమాజంలో జన్మించిన వీరుడు ఎవరైనా ఉంటే అది 'దిశోమ్ గురు' శిబూ సోరెన్ మాత్రమే. ఆయన లేని వెలితి తీర్చలేనిది. తన జీవితాన్ని పేదలకు అంకితం చేశారు. కేంద్రం, నా పార్టీ తరఫున ఆయనకు నివాళులర్పించడానికి వచ్చాను" అని రాజ్‌నాథ్ సింగ్ మీడియాతో చెప్పారు.

కేరళలో అరుదైన మెదడు వాపు వ్యాధి సోకి బాలిక మృతి

కోజికోడ్: కేరళలోని కోజికోడ్ జిల్లాలో తొమ్మిదేళ్ల బాలిక మృతికి కారణం అమీబిక్ ఎన్‌కెఫలిటిస్ అనే అరుదైన మెదడు వాపు వ్యాధి అని ఆరోగ్యశాఖ అధికారులు శనివారం నిర్ధారించారు. కలుషిత నీటిలో నివసించే అమీబా వల్ల ఈ వ్యాధి సోకుతుందని వారు తెలిపారు. జ్వరంతో బాధపడుతోన్న తమరస్సేరీకి చెందిన బాలికను ఈ నెల 13న కుటుంబసభ్యులు సమీప ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మరుసటిరోజు బాలికను కోజికోడ్‌లోని వైద్య కళాశాలకు తరలించగా అదేరోజు ఆమె మరణించింది. మైక్రోబయాలజీ పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలిక మరణానికి అమీబిక్ ఎన్‌కెఫలిటిస్ కారణమని స్పష్టంచేశారు. ఈ వ్యాధికి సంబంధించి ఈ ఏడాది జిల్లాలో మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ వ్యాధి సోకడానికి కారణమైన అమీబా గురించి అన్వేషించడానికి బాలిక ఇంటి పరిసరాల్లోని నీటి కాలువలు, చెరువులను పరిశీలిస్తున్నారు.

ఇంటింటా ఓటర్ల తనిఖీ

- ప్రారంభించిన యువజన కాంగ్రెస్

పట్నా: బిహార్ ఓటర్ల జాబితాలో లోపాలపై విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాను పరిశీలించడం, రిగ్గింగ్‌ను బయటపెట్టడం కోసం భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ) 'స్టాప్ ఓట్ చోరీ' పేరుతో శనివారం దిల్లీలో కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ఐవైసీ కార్యకర్తలు ప్రతి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి అధికార ఓటర్ల జాబితాతో ఓటరు వివరాలు సరిపోతున్నాయా లేదా? అని పరిశీలించనున్నట్లు ఐవైసీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ తెలిపారు.



రష్యా పరిశ్రమలో అగ్నిప్రమాదం.. 11 మంది మృతి, క్షతగాత్రులు 130

మాస్కో: రష్యా రాజధాని నగరం మాస్కోకు ఆగ్నేయంగా 250 కిలోమీటర్ల దూరంలోని షిలోవ్‌స్కీ జిల్లా రియాజాన్ ప్రాంతంలోని ఎలాస్టిక్ ప్లాంటులో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 11 మంది మృతి చెందగా, 130 మంది గాయపడినట్లు రష్యా అధికారులు శనివారం వెల్లడించారు. రష్యన్ వార్తాసంస్థ ఆర్ఐఏ కథనం ప్రకారం.. ప్లాంటులోని గన్‌పౌడర్ వర్క్‌షాపులో పేలుడు జరిగింది. ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్లాంటులో అగ్నిప్రమాదం జరగడం నాలుగేళ్లలో ఇది రెండోసారి. 2021 అక్టోబరులో జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది కార్మికులు మృతిచెందారని ఆర్ఐఏ పేర్కొంది.

యాప్‌లో పాలు కొనుగోలు యత్నం..

బ్యాంకు ఖాతాల్లో రూ.18.5 లక్షలు మాయం

ముంబయి: ఆన్‌లైన్ యాప్‌లో పాలు కొనుగోలుకు యత్నించిన 71 ఏళ్ల వృద్ధురాలు రూ.18.5 లక్షలు పోగొట్టుకున్న ఘటన ముంబయిలో చోటుచేసుకుంది. వడాలాకు చెందిన ఆ మహిళ ఈ నెల 4న ఓ ఆన్‌లైన్ యాప్ ద్వారా లీటరు పాలు ఆర్డర్ చేశారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్‌నంటూ దీపక్ అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి ఆర్డర్‌ను పూర్తిచేసేందుకు తాను పంపించిన లింకుపై క్లిక్ చేసి సూచనలను అనుసరించాలని తెలిపాడు. గంటకు పైగా కాల్ కొనసాగడంతో విసిగిపోయిన ఆమె ఫోన్ పెట్టేశారు. మరుసటి రోజు అదే నిందితుడు మళ్లీ ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత బాధితురాలు బ్యాంకుకు వెళ్లగా తన ఖాతా నుంచి రూ.1.7 లక్షలు మాయమైనట్లు గ్రహించారు. మరో రెండు బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కూడా ఖాళీ అయినట్లు తెలిసింది. మొత్తంగా రూ.18.5 లక్షలు చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

'కాంగో' తిరుగుబాటుదారుల దాడిలో 30 మంది హతం

కిన్షాసా: ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న అలైడ్ డెమాక్రటిక్ ఫోర్స్ (ఏడీఎఫ్) సంస్థకు చెందిన తిరుగుబాటుదారుల దాడిలో 30 మంది మరణించారు. మరో 100 మందిని తిరుగుబాటుదారులు నిర్బంధించారు. దేశంలోని ఉత్తర కివు రాష్ట్రంలో ఈ ఘటన జరిగిందని కాంగో సైనిక అధికారులు తెలిపారు. గత బుధ, శుక్రవారాల్లో బాపెరె గ్రామంలో ఈ మారణహోమం జరిగిందని లుబెరో ప్రాంత సైనిక కర్నల్ అలైన్ కివావా తెలిపారు. గ్రామంలో విస్తృతంగా గృహదహనాలు చోటుచేసుకున్నాయని, గ్రామస్థుల్ని కత్తులతో పొడిచి చంపారని అధికారులు చెప్పారు.





మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా శనివారం దిల్లీలోని అటల్ సదైవ్ వద్ద నివాళి కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ✦ పుష్పాంజలి ఘటిస్తున్న మోదీ

ప్రతి ఒక్కరికీ వాజ్‌పేయీ స్ఫూర్తి: మోదీ

దిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఏడవ వర్ధంతి సందర్భంగా ప్రధాని మోదీ శనివారం దివంగత నేతకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయీ సేవలను గుర్తుచేసుకున్నారు. 'దేశ సర్వతోముఖాభివృద్ధికి, ఆర్థిక స్వావలంబనకు అంకితభావంతో వాజ్‌పేయీ చేసిన సేవ ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంద'ని ప్రధాని మోదీ కొనియాడారు. వాజ్‌పేయీ స్మృతి చిహ్నం 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ తదితరులు నివాళులు అర్పించారు.

ట్రంప్-పుతిన్ భేటీని స్వాగతించిన భారత్

దిల్లీ: ఉక్రెయిన్‌లో యుద్ధం త్వరగా ముగిసిపోవాలని ప్రపంచం కోరుకుంటోందని భారత్ శనివారం స్పష్టంచేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల మధ్య అలాస్కాలో జరిగిన భేటీని స్వాగతించింది. శాంతి కోసం ఇరు దేశాల నేతలు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని భారత విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది.

ఉక్రెయిన్‌లో శాంతి వెల్లివిరియాలి: మోదీ

ఉక్రెయిన్‌లో శాంతి, అభివృద్ధి వెల్లివిరియాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన ఉక్రెయిన్ అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పుతిన్‌కు మెలనియా లేఖ

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయిన వేళ పుతిన్‌కు అమెరికా ప్రథమ మహిళ మెలనియా ట్రంప్ వ్యక్తిగతంగా ఓ లేఖ రాసినట్లు తెలుస్తోంది. సుదీర్ఘకాలంగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపే ప్రయత్నాల్లో భాగంగా ట్రంప్, పుతిన్ అలాస్కా వేదికగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ట్రంప్ ఆ లేఖను పుతిన్‌కు అందించినట్లు తెలుస్తోంది. యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్, రష్యాలోని పిల్లల దుస్థితి గురించి మెలానియా ఆ లేఖలో ప్రస్తావించారని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు.

జీఎస్టీ సంస్కరణల కోసం ఏడాదిన్నరగా డిమాండ్ చేస్తున్నాం: కాంగ్రెస్

దిల్లీ: "జీఎస్టీలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావాలని ఏడాదిన్నరగా డిమాండ్ చేస్తున్నాం. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో 'జీఎస్టీ 2.0'ను మా మేనిఫెస్టోలోనూ పొందుపర్చాం. సంస్కరణలు చేపట్టేవరకు ఆర్థికవృద్ధి వేగవంతం కాదనే వాస్తవాన్ని గుర్తించిన ప్రధాని మోదీ ఎట్టకేలకు మేల్కొన్నట్లు కనిపిస్తోంది" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఇప్పటివరకూ విధించినది వస్తు, సేవల పన్ను(గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్-జీఎస్టీ) కాదనీ, అది అభివృద్ధిని అణచివేసే పన్ను(గ్రోత్ సప్రెషన్ టాక్స్) అని పేర్కొన్నారు. దాని స్థానంలో మంచి, సరళమైన(గుడ్ అండ్ సింపుల్) పన్ను విధించాలని డిమాండ్ చేశారు. విద్యుత్, మద్యం, పెట్రోలియం, స్థిరాస్తి రంగాలకు రాష్ట్ర స్థాయి జీఎస్టీని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. కాగా జీఎస్టీ విధానంలో సంస్కరణల ప్రతిపాదనకు ప్రతిపక్ష కాంగ్రెస్ క్రెడిట్ తీసుకునేందుకు ప్రయత్నిస్తోందని కేంద్రం మండిపడింది.



మహారాష్ట్రలోని నాలా సోపారాలో భారీ వర్షాల కారణంగా జలమయమైన రహదారి

భారీవర్షాలతో ముంబయి విలవిల

ముంబయి: భారీ వర్షాలు ముంబయి నగరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. శనివారం కొన్ని ప్రాంతాల్లో 200 మి.మీ.ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక రైళ్లకు తీవ్ర అంతరాయం కలిగింది. రెండు రోజుల పాటు నగరంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప పౌరులు ఇళ్ల నుంచి బయటకు రావద్దని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) విజ్ఞప్తిచేసింది. తూర్పు శివారులోని విక్రోలీ పార్క్‌సైట్ ప్రాంతంలో అత్యధికంగా 248.5 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా సాంతాక్రూజ్-232.5 మి.మీ., సాయన్-221 మి.మీ., జుహూ-208 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

ఇద్దరి మృతి, పలువురికి గాయాలు

తూర్పు శివారులోని విక్రోలీ పార్క్‌సైట్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి చెందగా, అనేక మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. మృతులను శాలు మిశ్రా(19), సురేష్ మిశ్రా(50)లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

కిశ్త్‌వాడ్‌లో సహాయక చర్యల్లో జాప్యంపై స్థానికుల ఆగ్రహం

- సీఎం ఒమర్ ముందే నిరాశ వెలిబుచ్చిన వైనం

కిశ్త్‌వాడ్: ఆకస్మిక వరదలతో అల్లకల్లోలంగా మారిన జమ్మూ కశ్మీర్‌లోని చశోతీ గ్రామంలో సహాయక చర్యల్లో జాప్యం జరుగుతుండడంపై స్థానికుల్లో ఆగ్రహం పెల్లుబికింది. శనివారం గ్రామంలో పర్యటించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ముందే వందల మంది తమ నిరాశను వెలిబుచ్చారు. "రాజకీయ నాయకులు వచ్చిన ప్రతిసారీ సహాయక చర్యలు ఆగిపోతున్నాయి. వారు ఫొటోలు దిగి కనీసం బాధితుల గోడును వినకుండానే వెళ్లిపోతున్నారు. 20 బుల్డోజర్లు ఉంటే కేవలం రెండింటినే ఉపయోగిస్తున్నారు" అని డజను మంది కుటుంబసభ్యుల జాడ తెలియక ఆందోళన చెందుతున్న ఓ వ్యక్తి జాతీయ మీడియాతో అన్నారు. అప్పుడే అక్కడకు చేరుకున్న ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆయన్ను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. సహాయక చర్యలు త్వరగా పూర్తి కావాలని తానూ కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రజాగ్రహం సరైనదే అని అన్నారు. వారి బాధను తాను అర్థం చేసుకుంటున్నానని తెలిపారు. అనంతరం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబం ఒక్కోదానికి రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్ప గాయాలతో బయటపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. పూర్తిగా ధ్వంసమైన ఇళ్లకు రూ.లక్ష, తీవ్రంగా దెబ్బతిన్న నివాసాలకు రూ. 50 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇంటికి రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శనివారం సాయంత్రం నుంచి చశోతీలో సహాయక చర్యలు పుంజుకున్నాయి. భారీ బండరాళ్లను పేలుడు పదార్థాలను ఉపయోగించి పేల్చేశారు. వరదల్లో దెబ్బతిన్న నివాసాలను తిరిగి నిర్మిస్తామని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బాధితులకు హామీ ఇచ్చారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సహా 60 మంది మృతిచెందగా.. 82 మంది గల్లంతయ్యారు. 167 మందిని రక్షించారు. మరోవైపు వరదల్లో కనిపించకుండా పోయినవారు సురక్షితంగా ఉండాలని కోరుతూ వందల మంది మచైల్ మాతా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కిశ్త్‌వాడ్‌లో వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

మతకల్లోలం ఇతివృత్తంగా రూపొందిన "ద బెంగాల్ ఫైల్స్" చిత్ర ట్రైలర్ నిలిపివేత

కోల్‌కతా: 1946 నాటి కలకత్తా మత కల్లోలం ఇతివృత్తంగా వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన "ద బెంగాల్ ఫైల్స్" చిత్ర ట్రైలర్ ప్రదర్శనను కోల్‌కతా పోలీసులు నిలిపివేశారు. ఈ చిత్ర ట్రైలర్‌ను శనివారం మధ్యాహ్నం ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో ప్రదర్శించాల్సి వుంది. ఈ చర్యపై వ్యాఖ్యానించడానికి పోలీసు అధికారులు నిరాకరించారు. పోలీసు చర్య ప్రజల ప్రజాస్వామిక హక్కులపై జరిగిన దాడి అని వివేక్ అగ్నిహోత్రి ఆరోపించారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చిందని, చిత్ర ప్రదర్శనపై విధించిన నిషేధంపై కలకత్తా హైకోర్టు స్టే ఇచ్చిందని అగ్నిహోత్రి తెలిపారు. ట్రైలర్ ప్రదర్శనను ముందుగా హోటల్ ప్రతినిధి ఒకరు వచ్చి నిలిపివేశారని, ప్రెస్ కాన్ఫరెన్స్‌కు మాత్రమే అనుమతి ఉందని తెలిపారని దర్శకుడు వివరించారు.

అజయ్ భల్లాకు నాగాలాండ్ గవర్నర్ బాధ్యతలు

ఈనాడు, దిల్లీ: లా గణేషన్ మరణంతో ఖాళీ అయిన నాగాలాండ్ గవర్నర్ పదవీ బాధ్యతలను మణిపుర్ గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాకు అప్పగించారు. దీనికి రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర హోంశాఖ శనివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపింది.

భారత్‌కు రానున్న చైనా విదేశాంగ మంత్రి

- 18, 19 తేదీల్లో పర్యటన

దిల్లీ: చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఈ నెల 18, 19 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. సరిహద్దు సమస్యలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌తో చర్చలు జరపడానికి ఆయన భారత్‌కు రానున్నారని విదేశీ వ్యవహారాల శాఖ శనివారం వెల్లడించింది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశంలో మోదీ పాల్గొనడానికి ముందు వాంగ్ ఈ పర్యటనకు రానుండటం గమనార్హం.

'ఎయిర్ కెనడా' సిబ్బంది సమ్మెతో 700 సర్వీసులపై ప్రభావం

టొరంటో: వేతనాలు పెంచాలని డిమాండ్‌చేస్తూ 10 వేల మందికి పైగా ఫ్లైట్ అటెండెంట్లు చేస్తున్న సమ్మెతో కెనడా అతిపెద్ద విమానయాన సంస్థ 'ఎయిర్ కెనడా' శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె నోటీసు గడువు నేటితో ముగియడంతో.. ఎయిర్ కెనడా, అనుబంధ సంస్థ ఎయిర్ కెనడా రూజ్ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. డిమాండ్ల నేపథ్యంలో ఎలాంటి ఒప్పందం కుదరలేదని కెనడా యూనియన్ ఆఫ్ పబ్లిక్ ఎంప్లాయిస్ ప్రతినిధి హ్యూ పౌలియోట్ ధ్రువీకరించిన కాసేపటికే కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు 'ఎయిర్ కెనడా' ప్రకటన చేసింది. ఈ పరిణామంతో రోజుకు 1.3 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. ఎయిర్ కెనడా నిత్యం 700 సర్వీసులు నడిపిస్తోంది. విమాన ప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు ఈ సంస్థలో పనిచేసే 10 వేల మంది ఫ్లైట్ అటెండెంట్లదే బాధ్యత. వేతనాల పెంపునకు సంబంధించి వీరంతా ఆగస్టు 13న మూడు రోజుల సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆ గడువు ముగిసినా.. ఇప్పటికీ ఒప్పందం కుదరకపోవడంతో సమ్మెను ప్రారంభించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా సేవలందించే ఎయిర్ కెనడా విమానాలు నేలకే పరిమితమయ్యాయి. విమానాల నిలిపివేత విదేశీ ప్రయాణాలపై అధికంగా ప్రభావం చూపనుంది. రద్దయిన విమానాల్లో టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులు పూర్తి రుసుము వాపసుకు అర్హులని, వీలైనంత వరకూ ఇతర విమాన సంస్థలతో మాట్లాడి ప్రయాణికుల్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

మరింత బలపడిన పుతిన్ స్వరం!

- అమెరికాపైనా ప్రభావం చూపారంటున్న విశ్లేషకులు

వాషింగ్టన్: ఉక్రెయిన్ యుద్ధాన్ని విరమింపజేసే మాట ఎలాఉన్నా తన బలాన్ని, స్వరాన్ని మరింత పెంచుకోవడంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విజయం సాధించినట్లు చెబుతున్నారు. చర్చల నిమిత్తం అలాస్కాకు వచ్చిన పుతిన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా స్వాగతించడంతోపాటు రెండు దేశాల మధ్య సంబంధాలను కొనియాడారు.



రష్యా బలమైన దేశమని, ప్రపంచంలో రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. శాంతిస్థాపనకు కాల్పుల విరమణను పాటించాలని చెబుతూవస్తున్న ట్రంప్ ఇప్పుడు దానిని వదిలేసినట్లు ఆయన తాజా ప్రకటన చెబుతోంది. దీని బదులు పూర్తిస్థాయి శాంతి ఒప్పందం కుదరడానికే తాను అనుకూలమని ట్రంప్ చెప్పారు. రష్యా చాలాకాలం నుంచి ఇదే చెబుతోంది. యుద్ధం విరమించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ట్రంప్ ఇదివరకు రష్యాకు చేసిన బెదిరింపులు ఇప్పుడు వినిపించడం లేదు. 'హడావుడిగా ఏర్పాటుచేసిన అలాస్కా చర్చలు ట్రంప్‌నకు ఎలాంటి ప్రయోజనం కలిగించలేదు. పుతిన్ మాత్రం తాను కోరుకున్నవాటిలో చాలావరకు పొందగలిగారు' అని రష్యాలో బ్రిటన్ మాజీ రాయబారి లారీ బ్రిస్టో విశ్లేషించారు.

పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి

అమెరికాకు పుతిన్ వెళ్లడం గత పదేళ్లలో ఇదే తొలిసారి. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించాక పాశ్చాత్య దేశానికి వెళ్లడం కూడా ఇదే ప్రథమం. యుద్ధ నేరాభియోగాలపై పుతిన్‌కు 2023లో అంతర్జాతీయ నేర న్యాయస్థానం అరెస్టు వారెంటు జారీచేసింది. దాంతో ఆయన చేపట్టే విదేశీ పర్యటనలు, ప్రపంచ నేతలతో ఒప్పందాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎర్రతివాచీ పరిచి ఆయన్ని ట్రంప్ స్వాగతించడంతోపాటు, ఆ సమయంలో యుద్ధవిమానాలు వారి మీదుగా వెళ్లడం చూస్తుంటే పుతిన్‌ను ట్రంప్ ఒక స్నేహితుడిగా భావిస్తున్నట్లు చెప్పవచ్చని విశ్రాంత కర్నల్ పీర్ డి జోంగ్ చెప్పారు. 'పుతిన్, లార్డ్ ఆఫ్ వార్' అనే పుస్తకాన్ని రచించిన ఆయన ఫ్రాన్స్ అధ్యక్షులకు సహాయకునిగా రెండుసార్లు వ్యవహరించారు. అలాస్కాలో పుతిన్‌కు లభించిన స్వాగతాన్ని రష్యా మీడియా ప్రముఖంగా ప్రచురించింది.

రష్యా లక్ష్యం నెరవేరినట్లే

రష్యాపై ఎలాంటి ఒత్తిడి లేకుండా అడ్డుకోవడం ప్రధాన లక్ష్యంగా అలాస్కాకు వచ్చిన పుతిన్ ఆ లక్ష్యం నెరవేర్చుకున్నట్లేనని లండన్‌లోని రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ అంతర్జాతీయ భద్రత డైరెక్టర్ నీల్ మెల్విన్ చెప్పారు. శాంతిచర్చల తుది దశలో మాత్రమే జెలెన్‌స్కీతో పుతిన్ భేటీ అవుతారని క్రెమ్లిన్ ఎప్పటినుంచో చెబుతోందని, ఇప్పుడు అదే జరగబోతోందని మరో విశ్లేషకుడు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు తన పాత్రను పదిలపరచుకుంటూనే బాధ్యతను ఉక్రెయిన్, ఐరోపాలపై నెట్టేసినట్లు కనిపిస్తోందన్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య భారీ రియల్ ఎస్టేట్ ఒప్పందానికి మధ్యవర్తిగా ఉండాలని ట్రంప్ అనుకున్నా నిజానికి ఆయన ఉక్రెయిన్‌పై మాత్రమే ఒత్తిడి తీసుకురాగలిగారని సీనియర్ సలహాదారుడు పియోనా హిల్ చెప్పారు. సైనికపరంగా గెలవలేమని పుతిన్ పూర్తిగా భావిస్తే తప్ప యుద్ధం ఆగదని మాజీ రాయబారి బ్రిస్టో అంచనా వేస్తున్నారు.

సివిల్ వ్యవహారంలో క్రిమినల్ చర్య

- రాజస్థాన్ హైకోర్టును తప్పుపట్టిన సుప్రీం

దిల్లీ: ఒక సివిల్ వివాదంలో ముందస్తు బెయిలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను రాజస్థాన్ హైకోర్టు కొట్టివేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలు సివిల్ వ్యవహారాలుగా పరిగణిస్తారు. అలాంటి వివాదాల పరిష్కారానికి సివిల్ చట్టాలనే ఉపయోగించాలన్నది న్యాయ నిబంధన. ఈ కేసులో ముందస్తు బెయిలు నిరాకరించడం ద్వారా హైకోర్టు వ్యవస్థితమైన న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ప్రవర్తించిందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాజస్థాన్‌లో ఓ భార్యాభర్తల జంట ప్లైవుడ్ కొనుగోలుకు సంబంధించి ఫిర్యాదుదారుకు రూ.3.5 లక్షలు చెల్లించారు. మిగిలిన రూ.12.59 లక్షల మొత్తం చెల్లించడంలో వారు విఫలమయ్యారని ఫిర్యాదుదారు తన పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్థిక చెల్లింపులో విఫలమైనందుకు వారు చీటింగ్, నేరపూరిత విశ్వాస ఘాతుకం, నేర పూరిత కుట్రలకు పాల్పడ్డారనేది ఫిర్యాదుదారు ఆరోపణ. "ఈ కేసు నమోదు చేయడం ద్వారా బకాయిల వసూలుకు ప్రభుత్వ యంత్రాంగమైన పోలీసుల సాయం అవసరమని ప్రభుత్వమే చెప్పినట్లైంది. హైకోర్టు ప్రభుత్వ వాదనను ఆమోదించింది" అంటూ జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడుకున్న ధర్మాసనం ఆక్షేపించింది. "సాధారణంగా బెయిలుకు సంబంధించిన విషయాల్లో హైకోర్టు వెలువరించిన ఆదేశాలను మేం గౌరవించి ఆ ఆదేశాలను కొట్టివేయడానికి నిరాకరిస్తుంటాం. కానీ ఈ కేసులో హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయాల్సి వస్తోంది" అంటూ ధర్మాసనం రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టింది. సివిల్ వ్యవహారంలో క్రిమినల్ చర్యలకు ఆమోదం తెలిపినందుకు ఇటీవల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే.





కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా గుజరాత్ రాజ్‌కోట్‌లోని రేస్‌కోర్స్ మైదానంలో శనివారం జరిగిన జాతర చిత్రమిది. రాత్రివేళ విద్యుద్దీపాలంకరణతో మిరుమిట్లు గొలుపుతూ సందర్శకులను ఆకట్టుకుంది

మయన్మార్ రత్నాల నగరంపై బాంబు దాడి

- 21 మంది మృతి, ఏడుగురికి గాయాలు

బ్యాంకాక్: మయన్మార్‌లో రత్నాల పరిశ్రమలకు పేరుగాంచిన మోగోక్ నగరంపై దేశ సైన్యం బాంబును జార విడిచింది. ఈ దుర్ఘటనలో గర్భిణి సహా 21 మంది మృతిచెందారు. మరో ఏడుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. 15 పౌర నివాసాలు సహా బౌద్ధ ఆరామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అంతర్యుద్ధం జరుగుతున్న మయన్మార్‌లో తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న భూభాగాల్ని తిరిగి స్వాధీనం చేసుకునే యత్నాల్లో భాగంగా ఈ దాడి జరిగింది. మోగోక్ నగరంలోని శ్వేగూ వార్డుపై గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో సైన్యం ఓ యుద్ధ విమానం నుంచి బాంబును జార విడిచినట్లు స్థానిక తిరుగుబాటు దళం టీఎన్‌ఎల్‌ఏ శనివారం ప్రకటించింది. దీనిపై సైన్యం నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు.



పాకిస్థాన్‌లోని మింగోరా పట్టణంలో వరద కారణంగా మునిగిపోయిన భవనాలు, అగ్నిమాపక వాహనం

పాక్‌లో ఆకస్మిక వరదలు.. 327కు చేరిన మృతుల సంఖ్య

పెషావర్: పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 327కు చేరింది. ముఖ్యంగా ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని బజౌర్, బునేర్, స్వాత్, మనేహ్రా, షాంగ్లా, తోర్‌ఘర్, బటాగ్రామ్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించడం వల్లే చాలా మంది మృతి చెందారని ప్రాంతీయ విపత్తు నిర్వహణ అధికారి వెల్లడించారు. ప్రభావిత ప్రాంతాల్లో చాలా మంది తప్పిపోయినందున మరణించిన, లేదా గాయపడిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు.

నీట్‌-ఎండీఎస్‌ కటాఫ్‌ స్కోర్లు తగ్గింపు

ఈనాడు, అమరావతి: నీట్‌-ఎండీఎస్‌-2025లో కటాఫ్‌ శాతాన్ని తగ్గించారు. జాతీయ వైద్య విజ్ఞాన పరీక్షల మండలి(ఎన్‌బీఈఎంఎస్‌) కొత్త కటాఫ్‌ స్కోర్లు ఈనెల 14న విడుదల చేసింది. జనరల్‌ కేటగిరీకి పాత కటాఫ్‌ 261 మార్కులు ఉండే.. 197కు, జనరల్‌ పీడబ్ల్యూబీడీ కేటగిరీకి 244 నుంచి 182కు, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ (పీడబ్ల్యూబీడీతో సహా) కేటగిరీకి 227 నుంచి 168కి తగ్గించారు. అభ్యర్థుల ర్యాంకుల్లో ఎలాంటి మార్పులేదని ఎన్‌బీఈఎంఎస్‌ స్పష్టంచేసింది.

బీఎస్సీ ఆనర్స్‌ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

గుంటూరు (జిల్లా పరిషత్తు), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్‌.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి బీఎస్సీ (ఆనర్స్‌) కమ్యూనిటీ సైన్స్‌, ఎన్‌ఆర్‌ఐ కోటాలో బీఎస్సీ (ఆనర్స్‌) అగ్రికల్చర్‌ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పొడిగించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్‌ జి.రామచంద్రరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ angrau.ac.in ని చూడాలని పేర్కొన్నారు.

ఎఫ్‌ఎంజీఈ పరీక్షల్లో 18.61శాతం ఉత్తీర్ణత

ఈనాడు, అమరావతి: విదేశీ వైద్యవిద్య గ్రాడ్యుయేట్‌ పరీక్ష(ఎఫ్‌ఎంజీఈ) ఫలితాల్లో కేవలం 18.61 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది జులై 26న నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను జాతీయ వైద్య విజ్ఞాన పరీక్షల మండలి(ఎన్‌బీఈఎంఎస్‌) ఇటీవల విడుదల చేసింది. ఫలితాలను వెబ్‌సైట్‌ https:natboard.edu.in లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు మార్కుల జాబితాలు ఈనెల 21 నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చని పేర్కొంది. ఈ పరీక్షకు 37,207 మంది దరఖాస్తు చేసుకోగా.. 36,039 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,707 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

అందరూ చూస్తుండగానే గల్లంతు



నీటి మధ్యలో బండరాయిపై నిలబడిన గంగాధర్



గల్లంతైన గంగాధర్

తెలంగాణలోని నిర్మల్‌ జిల్లా కడెం జలాశయానికి దిగువన వరద ప్రవాహంలో ఓ వ్యక్తి అందరూ చూస్తుండగానే కొట్టుకుపోయాడు. ప్రాజెక్టుకు వస్తున్న వరద ప్రవాహానికి అనుగుణంగా అధికారులు శనివారం సాయంత్రం వరకు క్రమేణా 18 గేట్లు ఎత్తారు. జలాశయాన్ని సందర్శించేందుకు ఎవరినీ అనుమతించలేదు. కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన తిప్పిరెడ్డి గంగాధర్‌ (42).. సమీపంలోని రైతులు వారిస్తున్నా వినకుండా ఉద్ధృతంగా పారుతున్న నదిలోకి వెళ్లాడు. అదే సమయంలో మరిన్ని గేట్లు ఎత్తడంతో వరద పెరిగింది. దీంతో నీటిమధ్యలోని ఓ బండరాయిపై చాలాసేపు నిల్చున్నాడు. విషయం తెలిసి పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది అక్కడికి పరుగుతీశారు. ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందం అతని వద్దకు వెళ్లబోతుండగానే గంగాధర్‌ నీటిలో దూకి.. ఈదడానికి ప్రయత్నిస్తూ గల్లంతయ్యాడు.

- న్యూస్‌టుడే, కడెం

గోదావరి జల వివాదాల పరిష్కారంపై

కమిటీ ఏర్పాటుకు కేంద్రం అడుగులు

- సమగ్ర వివరాలు సిద్ధం చేసిన ఏపీ జలవనరుల శాఖ
- 444 టీఎంసీల వినియోగంతో తెలంగాణలో ప్రాజెక్టులు
- చివరి రాష్ట్రంగా వరద జలాలు వాడుకుంటే నష్టమేంటని ప్రశ్న

ఈనాడు, అమరావతి: తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించుకునేందుకు కమిటీ ఏర్పాటును ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్‌.. ఈ విషయంలో సామరస్యంగా అడుగులు వేయాలని భావిస్తోంది. కమిటీ ఏర్పాటు దిశగా కేంద్రం కూడా స్పందించింది. సభ్యుల పేర్లను ప్రతిపాదించాలని రెండు రాష్ట్రాలను తాజాగా కోరింది. ఈ నేపథ్యంలో గోదావరిపై తెలంగాణలో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదిత ప్రాజెక్టులపై ఏపీ జలవనరుల శాఖ సమాచారం క్రోడీకరించింది. గత నెలలో దిల్లీలో జరిగిన సమావేశంలోనే ఇరు రాష్ట్రాల పరస్పర సహకారాన్ని ప్రతిపాదించిన సీఎం చంద్రబాబు.. ఏపీ నిర్మించే ప్రాజెక్టులతో తెలంగాణ ఏ రకంగానూ నష్టపోదన్న సంగతిని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచిస్తున్నారు.

ఇదీ ఏపీ వాదన

- ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం రాష్ట్ర విభజన తర్వాత గోదావరిపై ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఇప్పటికే పోలవరం నిర్మాణంలోనే ఉంది. విభజనకు ముందు ప్రారంభించిన చింతలపూడి ఎత్తిపోతల కూడా పూర్తి కాలేదు. దీనికి అనుమతులూ సాధించలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పాలనామోదం ఇచ్చినా, ఒక్క శాతం పని కూడా చేయలేదు.
- తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర జలసంఘం, సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ఆమోదం పొందకుండానే పలు ప్రాజెక్టులు చేపట్టింది. వాటిలో కొన్నింటికి నిర్మాణం ప్రారంభించిన తర్వాత టీఏసీ అనుమతులు తీసుకుంది. ఇలా 296 టీఎంసీల నీటిని వినియోగించేలా ప్రాజెక్టులు చేపట్టి, దాదాపు కొలిక్కి తెచ్చింది.
- తెలంగాణ మరో 5 ప్రాజెక్టులను 148.33 టీఎంసీల వినియోగించేలా చేపట్టి, ఇప్పటికే 40-90% వరకు నిర్మాణాలు పూర్తి చేసింది. వాటికి ఇంకా అనుమతులు లేవు.
- రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ చేపట్టిన ఒక్క ప్రాజెక్టు డీపీఆర్‌ను గోదావరి బోర్డుకు సమర్పించలేదని, అపెక్స్‌ కౌన్సిల్‌ అనుమతులు తీసుకోలేదని ఏపీ చెబుతోంది. తాను ప్రాజెక్టులు నిర్మిస్తూ దిగువ రాష్ట్రమైన ఏపీ ప్రతిపాదిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు అడ్డుతగలడమేంటని ప్రశ్నిస్తోంది.

విభజన నాటికి గోదావరిపై ఇలా...

ప్రాజెక్టులు	ఆంధ్రప్రదేశ్‌	తెలంగాణ
అనుమతులతో నిర్మించిన ప్రాజెక్టులు	10	39
వినియోగించే నీళ్లు (టీఎంసీల్లో)	271.51	503.91
అనుమతులతో నిర్మాణంలో ఉన్నవి	1	4
ప్రతిపాదిత వినియోగం (టీఎంసీల్లో)	260.4	15.9
అనుమతి లేకుండా నిర్మాణంలో ఉన్నవి	2	-
ప్రతిపాదిత వినియోగం (టీఎంసీల్లో)	78	-
మొత్తం నీటి వినియోగం (టీఎంసీల్లో)	609.91	519.10

- ఏపీలో చింతలపూడి ఎత్తిపోతల, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రాష్ట్ర విభజన నాటికి అనుమతి లేకుండా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు.

ఏపీ జలవనరుల శాఖ రూపొందించిన నివేదిక ప్రకారం.. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టుల స్థితి..

ప్రాజెక్టు	నీటి వినియోగం (టీఎంసీల్లో)	నిర్మాణం ప్రారంభ తేదీ	టీఏసీ అనుమతి పొందింది	ఎంత % నిర్మాణం
1. కాళేశ్వరం ఎత్తిపోతల	215	2016	2018 జూన్‌ 6	90 %
2. సీతారామ ఎత్తిపోతల	67.05	2016	2025 ఏప్రిల్‌ 24	76 %
3. ఇతర చిన్న పథకాలు	13.95	2016-19	2016-2022	90 % పైగా
మొత్తం	296			
అనుమతుల్లేకుండా తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులు				
1. సమ్మక్క సాగర్‌	50	2016	లేదు	60 %
2. గురువెల్లి ఎత్తిపోతల	6.83	2018	లేదు	90 %
3. బసవేశ్వర్‌- సంగమేశ్వర్‌ ఎత్తిపోతల	20	2022	లేదు	60 % పైగా
4. అంబేడ్కర్‌-వార్ధా	11.5	2024	లేదు	40 %
5. ఎస్సారెస్పీ పునరుద్ధరణ	60	2017	లేదు	85 %
మొత్తం	148.33			

ప్రతి ప్రాంతం.. ఓ అద్భుతం!

- డిజిటల్‌ మీడియాలో పర్యాటక ప్రచారం
- పర్యాటకులను ఆకట్టుకునేలా ఏపీటీడీసీ చర్యలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పర్యాటక, చారిత్రక, వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన ప్రదేశాల వైపు పర్యాటకులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్‌ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. డిజిటల్‌ మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ అంతర్జాతీయ పర్యాటకులనూ ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతలపై వేర్వేరుగా రూపొందించి వీడియోలతో ప్రచారం చేస్తోంది. వీటిని అందరూ లైక్‌, షేర్‌ చేసి మన ప్రాంతాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్పాలని ఏపీటీడీసీ ఒక ప్రకటనలో కోరింది.

- కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని పెడన కలంకారీ ప్రత్యేకతను వివరిస్తూ రూపొందించిన వీడియోలో.. సహజ రంగులతో కూడిన అద్దకం, భారతీయ హస్తకళల్లో ప్రాచీనమైన కలంకారీ చిత్రకళను, కళాకారుల నైపుణ్యాన్ని వివరించింది.
- బాపట్ల జిల్లాలోని ప్రాచీన భట్టిప్రోలు బౌద్ధ స్తూపం నిర్మాణం క్రీ.పూ. 3వ శతాబ్దంలో జరిగిందని, తెలుగులో లభ్యమైన తొలి శాసనంగా ఇక్కడి శాసనాలకు పేరుందని మరో వీడియోలో పేర్కొంది. అలనాడు వాణిజ్య, విద్యా కేంద్రంగా విరాజిల్లిన భట్టిప్రోలును సందర్శించాలని కోరింది.
- గుంటూరు జిల్లా మంగళగిరిలో జాతీయస్థాయిలో పేరున్న మంగళగిరి చేనేత, ఫ్యాబ్రిక్‌ ఉత్పత్తుల గొప్పతనాన్ని.. పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రాశస్త్యాన్ని ఓ వీడియోలో వివరించింది. చీరల అల్లిక, నిజాం డిజైన్‌ బోర్డర్‌, నాణ్యమైన రంగుల అద్దకం తదితర అంశాలు ఇందులో పొందుపరిచింది. ఇక్కడి చేనేతకు జాతీయస్థాయిలో భౌగోళిక గుర్తింపు (జీఐ) దక్కిందని పేర్కొంది. మానవ కృషి, కళానైపుణ్యం కలిసి తయారయ్యే ఈ చీరలు వస్త్రాలు మాత్రమే కావని.. జ్ఞాపకాలు, భావోద్వేగానికి ప్రతీకలని పేర్కొన్నారు.
- గుంటూరు జిల్లా ఉండవల్లి గుహల గొప్పతనం వివరిస్తూ.. ఉండవల్లిలో ఉలితో చెక్కిన గుహలను తప్పక సందర్శించాలని పర్యాటకులను మరో వీడియోలో ఆహ్వానించింది. విజయవాడ సమీపంలోని ఈ ప్రాంతంలో విష్ణుకుండినుల కాలానికి చెందిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆలయాలతో పాటు.. 20 అడుగుల ఏకశిల అనంత పద్మనాభస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ అని పేర్కొంది. జాతీయ ప్రాముఖ్యత కలిగిన కేంద్ర రక్షిత స్మారక కట్టడాల్లో ఇది ఒకటని ఏపీటీడీసీ తెలిపింది.

పస్తులుంటూ.. పైపుల్లో తలదాచుకుంటూ!

- దుబాయ్‌లో తెలంగాణ వాసి దైన్యం



బాధితుడు కిరణ్‌

వెల్గటూరు, న్యూస్‌టుడే: జీవనోపాధి కోసం దుబాయ్‌కు వెళ్లిన ఓ యువకుడు అక్కడ ఓ ముఠా చేతిలో మోసపోయి దీనంగా కాలం వెళ్లదీస్తూ... సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపించారు. బాధితుడు, కుటుంబ సభ్యుల కథనం మేరకు... తెలంగాణలోని జగిత్యాల జిల్లా ఎండపల్లికి చెందిన మంతెన కిరణ్‌ సహా తెలంగాణకు చెందిన ఆరుగురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు ఐదు నెలల క్రితం ఓ ఏజెంటు ద్వారా దుబాయ్‌కు వెళ్లారు. అక్కడ ఒక సంస్థలో పనిలో చేరారు. సరిగా వేతనం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడేవారు. మూడు నెలల అనంతరం వీరికి ఓ వ్యక్తి పరిచయమై... వేరే సంస్థలో చేరితే ఎక్కువ జీతం వస్తుందని నమ్మబలికాడు. తీరా ఓ ప్రదేశానికి వెళ్లిన తర్వాత ఓ ముఠాలోని సభ్యులు వీరి గుర్తింపు కార్డులు లాక్కున్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకుని, సంతకాలు చేయించుకున్నారు. 15 రోజులపాటు నిర్బంధించి... ఈ నెల 5న వదిలిపెట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కిరణ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరొకరిని విచారించి వదిలిపెట్టారు. అప్పటి నుంచి అక్కడే ఓ ప్రాంతంలోని పైపుల్లో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆహారం దొరికినప్పుడు తింటూ.. లేనప్పుడు పస్తులుంటున్నారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను కిరణ్‌ కుటుంబ సభ్యులు కలిసి పరిస్థితి వివరించారు. భారత రాయబార కార్యాలయంతో సంప్రదించి సురక్షితంగా వచ్చేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు.

‘ఆర్ట్‌, క్రాఫ్ట్‌, పీఈటీల సమస్యలు పరిష్కరించాలి’

ఈనాడు, అమరావతి: సమగ్రశిక్షా అభియాన్‌ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఆర్ట్‌, క్రాఫ్ట్‌, పీఈటీల సమస్యలు పరిష్కరించాలని ఆర్ట్‌, వర్క్‌, హెల్త్‌, పీఈ పార్ట్‌టైమ్‌ కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్స్‌ సమాఖ్య గౌరవాధ్యక్షుడు సీహెచ్‌ఎన్‌ దేవేంద్రరావు కోరారు. విజయవాడలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘ఆర్ట్‌, క్రాఫ్ట్‌, పీఈటీ టీచర్ల సేవలను క్రమబద్ధీకరించాలి. ఎన్నికల ముందు కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌ కల్యాణ్‌, లోకేశ్‌లకు వినతిపత్రం ఇస్తే రెగ్యులర్‌ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇంతవరకు అమలు కాలేదు. మినిమం టైంస్కేల్‌ ప్రకారం రూ.32,670 చెల్లించాలి. ఉద్యోగ భద్రత, కారుణ్య నియామకాలు చేపట్టాలి. రిటైర్మెంట్‌ వయసు 62 ఏళ్లు చేసి, పదవీ విరమణ ప్రయోజనాలు అందజేయాలి’ అని డిమాండ్‌ చేశారు.



స్వాతంత్ర్య దిన వేడుకల్లో కూన రవికుమార్‌, మన్నవ సుబ్బారావు, భాను మాగులూరి తదితరులు

వాషింగ్టన్‌ డీసీలో భారత స్వాతంత్ర్య వేడుకలు

ఈనాడు, అమరావతి: అమెరికా రాజధాని వాషింగ్టన్‌ డీసీలో తానా ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య దిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్‌, అమెరికా జాతీయ పతాకాల్ని ఎగురవేశారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి తెదేపా ఎమ్మెల్యే కూన రవికుమార్‌, గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్‌ మన్నవ సుబ్బారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. “ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో భారత్‌, అమెరికా ముందు వరుసలో నిలుస్తాయి. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణలో తానా కృషి ఎనలేనిది” అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంత అసహనం ఉంటే మాత్రం.. జాతీయ పండుగను మర్చిపోతారా?

- జగన్‌పై ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల ఫలితంతో ఎంత అసహనంతో ఉంటే మాత్రం...జాతీయ పండుగనే మర్చిపోతారా? అని వైకాపా అధినేత జగన్‌ను సర్వేపల్లి తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. లక్షల మంది ప్రాణత్యాగంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన రోజు కూడా మీకు గుర్తులేదా? అని ఎక్స్‌ వేదికగా శనివారం నిలదీశారు. “జగన్‌రెడ్డీ...ఎందుకింత అహంకారం. మీరు ఓ పార్టీ అధ్యక్షులు.. మాజీ సీఎం అనే విషయమైనా గుర్తుందా? మీ రాజకీయ జీవితంలో ఇదో బ్లాక్‌ మార్క్‌” అని సోమిరెడ్డి దుయ్యబట్టారు.

దేశాన్ని పాకిస్థాన్‌లా చూసే వ్యక్తి జగన్‌: ఎంపీ కలిశెట్టి

స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ జెండా ఎగరవేయకపోవడం జగన్‌ అహంకార పూరిత వైఖరికి నిదర్శనమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. “జగన్‌కు దేశభక్తి లేదు. ఎప్పుడు చూసినా కుట్రలు, కుతంత్రాలు, విధ్వంసమే కావాలి. దేశాన్ని పాకిస్థాన్‌లా చూసే వ్యక్తి జగన్‌” అని కలిశెట్టి దుయ్యబట్టారు.

అక్రమ పద్ధతులపై ప్రేక్షకపాత్ర పోషించలేం

- కోర్టును అడ్డుపెట్టుకుని ఉత్తర్వులు పొందాలంటే అనుమతించబోం
- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ సమర్పిస్తేనే విద్యుత్తు సరఫరా: తెలంగాణ హైకోర్టు



ఈనాడు, హైదరాబాద్‌: ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌(ఓసీ) తర్వాత సమర్పిస్తామంటూ కోర్టుకు హామీ ఇచ్చి విద్యుత్తు కనెక్షన్‌ పొందాక హామీని గాలికొదిలేస్తున్నారని, ఇలాంటి అక్రమ పద్ధతులపై ప్రేక్షక పాత్ర పోషించలేమని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. జీహెచ్‌ఎంసీ అనుమతులతో సిల్ట్‌తోపాటు ఐదంతస్తుల భవనానికి విద్యుత్తు కనెక్షన్‌ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ నాంపల్లికి చెందిన మహమ్మద్‌ ఆరిఫ్‌ రిజ్వాన్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్‌ నగేశ్‌ భీమపాక ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్‌ న్యాయవాది వాదనలు వినిపిస్తూ జీహెచ్‌ఎంసీ అనుమతుల ప్రకారం భవనాన్ని నిర్మించామని, విద్యుత్తు కనెక్షన్‌ కోసం అన్ని ఛార్జీలు చెల్లించగా కనెక్షన్‌ మంజూరు చేశారన్నారు. అయితే ఓసీ సమర్పిస్తేనే కనెక్షన్‌ ఇస్తామంటున్నారన్నారు. నిర్దిష్ట గడువులోగా ఓసీ సమర్పిస్తామని, కనెక్షన్‌ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. టీజీఎస్పీడీసీఎల్‌ న్యాయవాది ఎన్‌.శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గతంలో ఇలా చాలా మంది కోర్టు ముందు హామీ ఇచ్చి కనెక్షన్లు తీసుకున్నారని, తర్వాత సర్టిఫికెట్‌ సమర్పించలేదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి గతంలో ఇదే హైకోర్టు నుంచి ఇలా ఉత్తర్వులు పొంది దుర్వినియోగం చేసిన ఉదంతాలు చాలా తన దృష్టికి వచ్చాయని, వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఓసీ తర్వాత సమర్పిస్తామన్న హామీపై విద్యుత్తు కనెక్షన్‌ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయలేమన్నారు. పిటిషనర్‌ జీహెచ్‌ఎంసీని సంప్రదించి ఓసీ పొందాలని, అది సమర్పించాక నిబంధనల ప్రకారం విద్యుత్తు కనెక్షన్‌ ఇవ్వాలని ఎస్పీడీసీఎల్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

> “అక్రమ నిర్మాణాలకు విద్యుత్తు కనెక్షన్లను పొందడానికి కోర్టులను అడ్డుపెట్టుకుంటున్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ లేకుండా ఎస్పీడీసీఎల్‌ కనెక్షన్‌ నిరాకరిస్తే నిర్మాణదారులు కోర్టును ఆశ్రయించి తర్వాత సమర్పిస్తామన్న హామీ ఇవ్వడంతో కోర్టులు ఉత్తర్వులిస్తున్నాయి. కనెక్షన్‌ పొందిన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ సమర్పించరు. అటు అధికారులూ నిర్మాణాలను తనిఖీచేయరు. తర్వాత నిర్మాణదారులు వాటిని ఇతరులకు విక్రయించేసి చేతులు దులిపేసుకుంటున్నారు. కొనుగోలు చేసినవారు ఇబ్బందులెదుర్కొంటున్నారు. కోర్టు భుజంపై తుపాకీ పెట్టి ఉత్తర్వులు పొందుతామంటే అనుమతించబోం. ఇలాంటి పిటిషన్లు 1,500కు పైగా ఉన్నాయి. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ సమర్పిస్తేనే విద్యుత్తు కనెక్షన్‌ ఇవ్వాలి. హామీలపై ఆదేశాలు ఇవ్వలేం”
>
> – జస్టిస్‌ నగేశ్‌ భీమపాక

రివర్స్‌ ఇంజినీరింగ్‌తో చిక్కిన ‘ఖజానా’ దోపిడీ ముఠా

- నిందితులంతా బిహార్‌ వారే



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలు

ఈనాడు, హైదరాబాద్‌-గచ్చిబౌలి, న్యూస్‌టుడే: ‘సెల్‌ఫోన్లు వాడొద్దు.. వాహనాలకు నంబరు ప్లేటు ఉండొద్దు.. సీసీ కెమెరాలకు ముఖాలు చిక్కొద్దు.. సొత్తు దొరికాక వాహనాల్ని వదిలేసి పోలీసుల్ని ఏమార్చి ఒక్కొక్కరూ ఒక్కో దారిలో పరారవ్వాలి’.. ఇదీ హైదరాబాద్‌ చందానగర్‌ ఖజానా జ్యుయెలరీలో దోపిడీకి పాల్పడిన ముఠా పథకం..! ఈ ముఠా ఎన్ని ఎత్తులు వేసినా సైబరాబాద్‌ పోలీసులు రివర్స్‌ ఇంజినీరింగ్‌ పద్ధతిలో దోపిడీకి పాల్పడిన ఇద్దర్ని అరెస్టు చేశారు. గ్యాంగ్‌లో మొత్తం ఏడుగురు ఉండగా.. మిగతా ఐదుగురి వివరాలూ చిక్కాయి. వారి కోసం గాలిస్తున్నారు. అరెస్టయిన వారి నుంచి 900 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్‌ డీసీపీ వినీత్‌.. సైబరాబాద్‌ క్రైమ్‌ డీసీపీ ముత్యంరెడ్డి, ఎస్‌వోటీ డీసీపీ శోభన్‌, మియాపూర్‌ ఏసీపీ శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి శనివారం గచ్చిబౌలిలోని కార్యాలయంలో వివరాలు వెల్లడించారు.

20 రోజుల కిందటే రాక..

బిహార్‌లోని సారణ్‌ జిల్లాకు చెందిన ఆశీష్‌కుమార్‌ సింగ్‌(22), దీపక్‌ కుమార్‌ సాహ్‌(22) చిన్నతనంలోనే నేరాల బాటపట్టారు. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌ వచ్చారు. ఆశీష్‌కుమార్‌ జగద్గిరిగుట్టలో, దీపక్‌ నానక్‌రాంగూడలో ఉంటూ దొరికిన పనిచేసుకుంటున్నారు. వీరిని బిహార్‌లోని సీవాన్‌ జిల్లాకు చెందిన ఐదుగురు సంప్రదించారు. వీరంతా బిహార్‌, రాజస్థాన్‌, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌ తదితర రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా చాలాచోట్ల ఆభరణాల దుకాణాల్లో చోరీలు చేశారు. హైదరాబాద్‌లో దోపిడీకి పథకం వేసిన వీరు... 20 రోజుల క్రితం నాలుగు తుపాకులతో నగరానికి వచ్చారు. జగద్గిరిగుట్టలో ఆశీష్‌ గదిలో ఉంటూ ఆభరణాల దుకాణాల వద్ద రెక్కీ నిర్వహించి భద్రత తక్కువగా, పారిపోవడానికి అనువుగా ఓఆర్‌ఆర్‌ సమీపంలో ఉండటంతో చందానగర్‌లోని ఖజానా జ్యుయెలరీని ఎంచుకున్నారు. ఈ నెల 12న పథకం అమలు చేశారు. మిగిలిన ఐదుగురితో కలిసి ఆశీష్‌ దోపిడీలో పాల్గొనగా.. దీపక్‌ గదిలోనే ఉన్నాడు. దోపిడీ అనంతరం నాలుగు బ్యాగుల్లో 10 కిలోల వెండి వస్తువులతో రెండు ద్విచక్రవాహనాల మీద వేర్వేరు మార్గాల్లో నగర శివారుకు పరారయ్యారు. వాహనాలను వదిలేసి అందరూ విడిపోయారు. వెండి వస్తువులకు బంగారు పూత ఉండడంతో బంగారమనుకున్నారు. ఆశీష్‌ బీదర్‌ మీదుగా పుణెకు వెళ్లాడు. ఈ ముఠాను పట్టుకునేందుకు పోలీసులు రివర్స్‌ ఇంజినీరింగ్‌ పద్ధతి అనుసరించారు. దోపిడీ చేశాక వెళ్లిన మార్గాలతోపాటు ఖజానా జ్యుయెలరీకి వచ్చిన మార్గాలను విశ్లేషించారు. ఈ క్రమంలోనే నిందితులు తాము ఉపయోగించిన రెండు సెకండ్‌ హ్యాండ్‌ ద్విచక్ర వాహనాలను జగద్గిరిగుట్టలో కొన్నట్లు గుర్తించారు. ఆ వివరాలతో దీపక్‌ను పట్టుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో ఆశీష్‌ను అరెస్టు చేశారు.

కుటుంబాల్లో గ్రూపుల లొల్లి

- సమాచార స్రవంతిగా సాగాల్సిన సోషల్‌ మీడియా పోస్టులు అక్కడక్కడా వివాదాస్పదం
- బంధాలు.. అనుబంధాలపైనా నీలినీడలు



కుటుంబాలు, బంధువులు, స్నేహితుల మధ్య గొడవలకు చాలావరకు ఆస్తులే కారణమవుతుంటాయి. ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీతో కొత్త కారణాలూ తెరపైకి వస్తున్నాయి. వాట్సప్‌, ఫేస్‌బుక్‌, ఇన్‌స్టా వంటి సోషల్‌ మీడియాల్లో పెడుతున్న పోస్టులు బంధాల మధ్య చిచ్చురేపుతున్నాయి. ఈ వివాదాలు ఒక్కోసారి దాడులు, హత్యల వరకూ పోతున్నాయి. సమాచారయుక్తంగా ఉంటుందని ఇటీవల వాట్సప్‌, టెలిగ్రాంలలో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వేర్వేరు గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటిలో తమకు నచ్చని పోస్టు పెట్టినప్పుడు కొందరు మాటలు నిలిచిపోయేంతగా గొడవపడుతున్నారు. ‘అందరూ సానుకూలంగా మాట్లాడుకున్నంత కాలం అంతా బాగానే ఉంటోంది. ఎవరైనా పోస్టులపై అభ్యంతరం వ్యక్తం చేస్తే ఇక గొడవలు మొదలవుతున్నాయి’ అని 12 వాట్సప్‌ గ్రూపులున్న శంకర్‌ అనే వ్యక్తి ‘ఈనాడు’కు చెప్పారు. ఎవరైనా పుట్టినరోజు, పెళ్లిరోజు వంటివి పెడితే వాటికి శుభాకాంక్షలు పెట్టకపోయినా కొందరు బంధువులు నొచ్చుకుంటున్నారని ఆయన వాపోయారు. ఒకరికి శుభాకాంక్షలు చెప్పిన తర్వాత పనుల ఒత్తిడిలో ఉన్నందున మరొకరికి చెప్పకపోతే ఫోన్‌ చేసి మరీ తిడుతున్నారని తెలిపారు. డబ్బున్న వారికే శుభాకాంక్షలు చెబుతావు.. మాకెందుకు చెబుతావులే అంటూ నిష్ఠూరమాడుతున్నారని ఆయన వివరించారు.

ఎమోజీ పెడితే ప్రాణమే పోయింది

ఇటీవల సూర్యాపేటలో ఒక సామాజిక వర్గానికి చెందిన వాట్సప్‌ గ్రూపులో ఒక వ్యక్తి పోస్టు పెట్టారు. దానికి మద్దతిస్తూ మరో వ్యక్తి ‘చప్పట్ల’ ఎమోజీతో రిప్లై ఇచ్చారు. అలా ఎందుకు మద్దతిచ్చావంటూ గ్రూపులోని మరో వ్యక్తి బయట గొడవకు దిగారు. ఇది పెద్దదై చివరికి ఒక నిండు ప్రాణం పోయింది. మృతుడు చిరు వ్యాపారి. ప్రస్తుతం ఆయన కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతోంది.

కుటుంబాల మధ్య గొడవ

ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన ఒక కుటుంబానికి చెందిన బంధువులు వాట్సప్‌ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. ఒక వ్యక్తి తన అక్క పిల్లల పుట్టినరోజులకు శుభాకాంక్షలు చెబుతూ పోస్టులు పెట్టారు. కొద్దిరోజులకు తన అన్న, తమ్ముడి పిల్లల పుట్టినరోజులు వచ్చాయి. వాటికి ఏమీ పెట్టలేదు. దానిపై గ్రూపులో విమర్శలు వచ్చాయి. పలువురు ఫోన్లు చేసి తిట్టుకున్నారు.

‘టెన్త్‌ ఫ్రెండ్స్‌’లో వివాదం

ములుగు జిల్లాలోని ఒక చిన్న అటవీ గ్రామ పాఠశాలలో 20 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఇటీవల వాట్సప్‌లో ‘టెన్త్‌ ఫ్రెండ్స్‌’ అనే గ్రూపు పెట్టుకున్నారు. వారికి చదువు చెప్పిన టీచర్లను కూడా అందులో చేర్చారు. ఇటీవల ఒక టీచర్‌ ఇతర గ్రూపులో ఉన్న ఒక వర్గానికి చెందిన పోస్టును ‘టెన్త్‌ ఫ్రెండ్స్‌’కు ఫార్వర్డ్‌ చేశారు. దాన్ని వ్యతిరేకిస్తూ ఒక విద్యార్థి ఆ టీచర్‌ను దుర్భాషలాడటం వివాదమైంది. ఆ పాత విద్యార్థి వయసు 45 ఏళ్లకుపైనే ఉండటం గమనార్హం.



చెలరేగిన హింస...

మహారాష్ట్రలోని పుణె జిల్లా యావత్‌ గ్రామంలో 17 ఏళ్ల కుర్రాడు వాట్సప్‌ గ్రూపులో పెట్టిన పోస్టుతో వివాదం చెలరేగి హింసకు దారితీసింది. వాహనాలు, దుకాణాలు తగులబెట్టారు. చివరికి పోలీసులు జోక్యం చేసుకుని 500 మందిపై 5 కేసులు పెట్టి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు.

ఇవీ జాగ్రత్తలు

- పోస్టులు పెట్టేటప్పుడు సంయమనం చాలా ముఖ్యం. ఎదుటివారి మనసు గాయపడే అంశాల జోలికి వెళ్లకూడదు.
- కుటుంబాలు, బంధువుల గ్రూపుల్లో అందరి పట్ల ఒకే భావన ఉండేలా పోస్టులు పెట్టాలి. ఒక పోస్టు పెడితే దాన్ని ఎవరికి వారు వారి కోణంలోనే చూస్తారు తప్ప పెట్టినవారి కోణంలో చూడరని గుర్తుంచుకోవాలి.
- సమాచారం పంచుకోవడానికి ప్రాధాన్యమివ్వాలి. వివాదాలకు ఆస్కారం లేకుండా గ్రూపు అడ్మిన్‌ బాధ్యత తీసుకోవాలి.

- ఈనాడు, హైదరాబాద్‌